


సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 12+12 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 84

గురువారం 15-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ మన శ్రీచైతన్య విద్యార్థిదే
దాదాపు 4,700 లకు పైగా డాక్టర్ సీట్లు సాధించబోతున్న
శ్రీచైతన్య హైదరాబాద్ జోన్
Smt. Sushma
Academic Director
ఆలిండియా టాప్ 10 లోపు ఆల్ కేటగిరీ ర్యాంకులు
1 MUDEJYOTHILAL CHAVAN
2 KANI YASASRI
3 LAVUDI MADHU BALAJI
5 TELLA VARUN REDDY
7 K. PRITHAM SIDDHARTH
9 VARUN S
10 SHASHANK KUMAR
ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 2000 లోపు ర్యాంకులు
215 RANK | 216 RANK | 218 RANK | 227 RANK | 228 RANK | 231 RANK | 236 RANK | 237 RANK | 240 RANK | 241 RANK | 246 RANK
251 RANK | 252 RANK | 260 RANK | 274 RANK | 288 RANK | 293 RANK | 298 RANK | 299 RANK | 318 RANK | 322 RANK | 323 RANK
332 RANK | 349 RANK | 357 RANK | 358 RANK | 366 RANK | 386 RANK | 410 RANK | 413 RANK | 418 RANK | 424 RANK | 432 RANK
435 RANK | 445 RANK | 446 RANK | 475 RANK | 491 RANK | 510 RANK | 511 RANK | 523 RANK | 547 RANK | 568 RANK | 570 RANK
581 RANK | 586 RANK | 592 RANK | 600 RANK | 618 RANK | 649 RANK | 650 RANK | 682 RANK | 683 RANK | 692 RANK | 698 RANK
700 RANK | 701 RANK | 706 RANK | 707 RANK | 709 RANK | 723 RANK | 728 RANK | 738 RANK | 752 RANK | 768 RANK | 770 RANK
772 RANK | 793 RANK | 807 RANK | 809 RANK | 844 RANK | 862 RANK | 873 RANK | 879 RANK | 921 RANK | 962 RANK | 963 RANK
976 RANK | 982 RANK | 1001 RANK | 1013 RANK | 1045 RANK | 1046 RANK | 1087 RANK | 1103 RANK | 1105 RANK | 1122 RANK | 1125 RANK
1151 RANK | 1161 RANK | 1179 RANK | 1185 RANK | 1196 RANK | 1242 RANK | 1244 RANK | 1250 RANK | 1262 RANK | 1300 RANK | 1330 RANK
1342 RANK | 1343 RANK | 1356 RANK | 1357 RANK | 1382 RANK | 1407 RANK | 1437 RANK | 1444 RANK | 1449 RANK | 1472 RANK | 1503 RANK
1509 RANK | 1519 RANK | 1520 RANK | 1524 RANK | 1529 RANK | 1530 RANK | 1549 RANK | 1552 RANK | 1553 RANK | 1562 RANK | 1580 RANK
1582 RANK | 1586 RANK | 1588 RANK | 1608 RANK | 1609 RANK | 1672 RANK | 1677 RANK | 1690 RANK | 1755 RANK | 1764 RANK | 1806 RANK
1826 RANK | 1874 RANK | 1891 RANK | 1910 RANK | 1930 RANK
సరికొత్త శిక్షణా విధానంతో ర్యాంకు సాధనే లక్ష్యంగా సృష్టించిన లాంగ్‌టర్మ్ ప్రోగ్రాంతో
మీ డాక్టర్ కలని నిజం చేసుకోండి
Extraordinary Performance from Longterm Students in 2023

Student Name	Marks in 2022	Marks in 2023	Increse in Marks in NEET- 2023
SIDDI LAKSHMI SRINIVAS	251	630	379
G.A. KRISHNA REDDY	262	633	371
C MANOHAR	389	677	288
DIVIKESAVA KUMAR	356	642	286
MANDAVASAGAR	380	651	271
GADDAMHIMA SIDDHARTH	344	607	263
BALIDEEXITH SAI	364	620	256
KAKI LIKHITHA	364	619	255
EGUTURIKARTHIK REDDY	364	614	250
SK. MD. ZAHEERUDDIN	355	602	247
PARINITA PANDIARAJAN	369	611	242
VIJAY VARDHAN NAIDU	379	613	234
ULLIRAMULAMANOJ RAO	392	625	233
CHENNA NITYA SRI	424	646	222
NARISETTY SAI PRANAV	420	638	218
MATCHAKRANTI KIRAN	407	625	218
B K NITHISH B K	451	665	214
GAJU VAISHNAVI	415	621	206
SAMBANGILIKHITHA	402	606	204
VADLA SAIKUMAR	421	621	200
GOWTHAM S	413	611	198

Knowledge Hub
NEET | IIT JEE | FOUNDATION
Sri Chaitanya Educational Institutions
NEET 2024 COACHING CENTERS
www.srichaitanyaknowledgehub.com
KUKATPALLY : 91774 44352 | DILSUKHNAGAR : 91774 44326
AMEERPET : 91774 44350 | HIMAYATNAGAR : 91774 44341
KONDAPUR : 95151 11428 | KARKHANA : 91774 44837
VISAKHAPATNAM: 91774 44307 | 95151 11047
VAIDYAH-24
NEET LONGTERM PROGRAM
ADMISSIONS OPEN
Sri Chaitanya
Scan QR Code for Website
మెరిట్ విద్యార్థులు Fee Concession కోసం Campus లో సంప్రదించగలరు
HYDERABAD: HAYATHNAGAR GIRLS IIT - 91775 22984 | NAGOLE-HERITAGE BUILDING: 82478 45513 | BANDLAGUDA: 82470 08202 | RV HOUSE: 91776 09421 | PANANIYA BOYS: 72070 64484 | MEDIPALLY BOYS: 94923 52617 | DSNR DAYS ZONAL: 91776 29216 | NARAYANAGUDA NEW LTC CAMPUS: 91541 37370 | SAISOWDAM GIRLS AMEENPUR: 91775 07382 | AGASTYA SRI BHAVAN AC-2 BOYS: 91770 55933 | MALLAMPET VYAS BHVAN BOYS: 91773 45533 | LAND MARK GIRLS: 91772 14578, 91774 17654, 91773 11233 | SIDDARTHA BOYS SEMI A/C: 99634 28531, | KPHP RAMAN BHAVAN: 96769 90309 | KUKATPALLY DAYS: 91771 11845 | S R NAGAR AKSARA BHAVAN: 80992 87694
శ్రీచైతన్య విద్యాసంస్థలు

గురువారం 15-6-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+12 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 84



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'


ఇప్పుడు ఆప్షన్ ఇచ్చినా..
అధిక వేతనం పొందుతున్న చందా దారులకు ఈపీఎఫ్‌ఓ వెసులుబాటు - 8లో


లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు
ఈ ఏడాదే జరిగినా ఆశ్చర్యం లేదు బిహార్ సీఎం నితీశ్ కుమార్ -6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


సాక్షులతో మాట్లాడొద్దు
ప్రభుత్వ రహస్య పత్రాల కేసులో సాక్షులు, ఇతరులెవరితోనూ ట్రంప్ నేరుగా మాట్లాడ వద్దని మియామీ కోర్టు ఆదేశించింది.
- వివరాలు 6లో


ధనవంతుల వలసబాట
భద్రమైన జీవితాన్ని వెతుక్కుంటూ ఎంతోమంది భారతీయ సంపన్నులు విదేశాలకు పయనమవుతున్నారు. అక్కడే స్థిరపడుతున్నారు.
- వివరాలు 6లో


గ్రీస్‌లో వలసదారుల పడవ మునక
దక్షిణగ్రీస్ సముద్రజలాల్లో వలసదారులతో వెళ్తున్న పడవ బోల్తాపడటంతో కనీసం 78 మంది జలసమాధి అయ్యారు.
- వివరాలు 6లో


తమిళనాడు మంత్రి అరెస్టు
'క్యాష్ ఫర్ జాబ్స్' కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి వి.సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేసింది.
- వివరాలు 6లో

ఏ వైరస్ వచ్చినా ఎదుర్కొనేలా..

ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా సర్కారు చర్యలు: సీఎం కేసీఆర్

భవిష్యత్తులో కరోనాను మించిన వైరస్‌లు రావచ్చు

ఇద్దరు ఎంటమాలజిస్టులు నాతో ఈ విషయం చెప్పారు

- ఎలాంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితి వచ్చినా ఎదుర్కోవాలి
- అందుకే రాష్ట్రంలో వైద్యారోగ్య వ్యవస్థను పటిష్టం చేస్తున్నాం
- ఆస్పత్రుల నిర్మాణాలే కాదు.. సేవలు కూడా పెరగాలి
- ప్రజల బాగుకు ఇంకా ఏం చేద్దామనే తపన ఉండాలని సూచన
- నిమ్స్ దశాబ్ది బ్లాక్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన
- అదనంగా అందుబాటులోకి రానున్న 2 వేల పడకలు

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో కరోనాను మించిన వైరస్‌లు రావొచ్చని ఇద్దరు ఎంటమాలజిస్టులు తనతో చెప్పారని.. వైద్యారోగ్య వ్యవస్థ పటిష్టంగా ఉంటే అలాంటి వాటిని ధైర్యంగా ఎదుర్కోవచ్చని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేలా వైద్యారోగ్య శాఖను తీర్చిదిద్దాలని నిర్ణయించామని చెప్పారు. బడ్జెట్‌లో వైద్యారోగ్య రంగానికి కేటాయింపులు భారీగా పెంచామని.. 2014లో రూ.2,100 కోట్లు కేటాయించగా, 2023–24 నాటికి ఏకంగా రూ.12,365 కోట్లకు పెరిగాయని వివరించారు. ఆస్పత్రుల్లో బెడ్ల సంఖ్యను 17 వేల నుంచి 50 వేలకు పెంచామని, అలాగే 50 వేల ఆక్సిజన్ బెడ్లు కూడా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిమ్స్ ఆస్పత్రిలో కొత్తగా 2 వేల పడకలతో మరో బ్లాక్ నిర్మాణ పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడారు. సీఎం చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

అది వైద్యారోగ్య శాఖ ప్రాధాన్యత!

"మన రాష్ట్రంలో మిడతల బెడద లేదు. కానీ మిడతల దండు మిగతా 2వ పేజీలో ▶

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ప్రారంభం

➤ నిమ్స్ కార్యక్రమం సందర్భంగా.. హైదరాబాద్‌లో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీని కూడా సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. తన చేతుల మీదుగా ఆరుగురికి న్యూట్రిషన్ కిట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని, ఎంపీ కె.కేశవరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాతా మధు, మహిళా కమిషన్ చైర్మన్ సునీతా లక్ష్మారెడ్డి, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


న్యూట్రిషన్ కిట్‌ను పంపిణీ చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో కేకే, మహమూద్ అలీ, విజయలక్ష్మి, శాంతికుమారి, సునీతా లక్ష్మారెడ్డి, దానం నాగేందర్, హరీశ్‌రావు తదితరులు

లండన్‌లో హైదరాబాద్ యువతి హత్య

- కత్తితో దాడి చేసిన బ్రెజిల్ యువకుడు
- అక్కడికక్కడే మృతి చెందిన బ్రాహ్మణపల్లికి చెందిన తేజస్విని రెడ్డి
- ఎమ్మెస్ కోసం యూకే వెళ్లిన తేజస్విని.. రెండు నెలల్లో రావాల్సి ఉండగా దారుణం
- జనగామ యువతికి గాయాలు


తేజస్విని రెడ్డి (ఫైల్)

తుర్కయాంజాల్ (హైదరాబాద్)/లండన్: ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లికి చెందిన తేజస్విని రెడ్డి (27) హత్యకు గురైంది. ఆమె అద్దెకు ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోనే ఈ దారుణం జరిగింది. బ్రెజిల్ దేశానికి చెందిన యువకుడు కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. కాగా తేజస్విని స్నేహితురాలు జనగామకు చెందిన అఖిల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది. ఆమెకు ప్రాణాపాయం లేదని సమాచారం.

రాగానే పెళ్లి జరిపించాలనుకున్నారు..

బ్రాహ్మణపల్లికి చెందిన కొంతం శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవిల కుమార్తె తేజస్విని మూడేళ్ల క్రితం ఎంఎస్ చదివేందుకు లండన్ వెళ్లింది. వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్ అయిన శ్రీనివాస్‌రెడ్డి పిల్లలు ఇద్దరిని ఉన్నత చదువులు చదివించాలనే ఉద్దేశంతో తేజస్వినిని లండన్‌కు, కుమారుడు పవన్‌కుమార్ రెడ్డిని ఆస్ట్రేలియా పంపించాడు. 2022 ఆగస్టులో ఒకసారి ఇంటికి వచ్చిన తేజస్విని సెప్టెంబర్‌లో తిరిగి లండన్ వెళ్లింది. గత మే నెల చివరి వారంలోనే మరోసారి ఇండియాకు తిరిగిరావాల్సి ఉండగా మరో రెండు నెలలు ఉండి వస్తానని చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కాగా తేజస్విని ప్రతిరోజూ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తల్లిదండ్రులకు ఫోన్ చేసేదని, మంగళవారం కూడా తల్లితో మాట్లాడినట్లు తెలిసింది. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగంలో స్థిరపడుతున్న తేజస్వినికి ఇంటికి రాగానే పెళ్లి జరిపించాలని తల్లిదండ్రులు అనుకున్నారు. పెళ్లి సంబంధం కుదిరితే వెంటనే వస్తానని కూడా తేజ స్విని చెప్పింది. ఇంతలోనే హత్యకు గురైంది. ఇందుకు కారణాలపై లండన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం ఉదయం అందిన మిగతా 8వ పేజీలో ▶

ఇంగ్లండ్‌లో కత్తితో దుండగుడి వీరంగం
భారతీయ సంతతి విద్యార్థినిసహా ముగ్గురు దుర్మరణం - 6లో

న్యూస్‌రీల్

భయానకంగా బిపర్‌జోయ్



బిపర్‌జోయ్ తుపాను అత్యంత తీవ్ర స్థాయిలో విరుచుకుపడనుంది. తీరం దాటక ముందే తుపాను ధాటికి గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర–కచ్ ప్రాంతాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఇప్పటికే తీరప్రాంతాలు, తుపాను ప్రభావిత జిల్లాల్లో 50,000 మందికిపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- వివరాలు 6లో

2 లక్షల ర్యాంకు దాటినా.. కన్వీనర్ సీటు



నీట్ ఫలితాలు వెలువడ్డాయి. ఇక త్వరలో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర వైద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. గతేడాది లెక్క ప్రకారం చూసినా 2 లక్షల ర్యాంకు దాటినా రిజర్వు కేటగిరీలో సీటు వచ్చే అవకాశముంది. అలాగే అన్ రిజర్వుడు కేటగిరీలోనూ 1.25 లక్షల ర్యాంకుకూ కన్వీనర్ సీటు వచ్చే అవకాశం ఉంది.
- వివరాలు 3లో

బ్యాటరీ బండి దూకుడు
గ్రేటర్‌లో మూడేళ్లలో 50 వేలు దాటిన ఎలక్ట్రిక్ వాహనాలు
- వివరాలు 5లో

బీఆర్‌ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేలపై ఐటీ దాడులు

ఇళ్లు, ఆఫీసులు, వ్యాపార సంస్థల్లో ఏకకాలంలో తనిఖీలు

- 12 ప్రాంతాల్లో, 70 బృందాలతో సీఆర్‌పీఎఫ్, ఆర్‌ఏఎఫ్ భద్రత మధ్య సోదాలు
- జాబితాలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి
- ముషీరాబాద్ నేత కొండపల్లి మాధవ్ నివాసంలోనూ..
- అధికార పక్షంలో అలజడి.. బీజేపీ రాజకీయ దురుద్దేశంతోనే దాడులనే ఆరోపణలు

- వివరాలు 2లో



అమిత్ షా రాష్ట్ర పర్యటన రద్దు!

- పెను తుపాను నేడు గుజరాత్ తీరం దాటనుండడంతో నిర్ణయం
- ఖమ్మం సభ రద్దుతో పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం
- వెనక్కి వెళ్లిన కేంద్రబలగాలు

- వివరాలు 2లో

25 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

'బండి' మార్పు లేదు

- కమలంలో విభేదాలు లేవు
- బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్ స్పష్టీకరణ

- వివరాలు 2లో

కరెంట్ సర్దు'బాదుడు' వాయిదా!

- రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు చార్జీల(ఎఫ్ఎస్‌ఏ) వసూళ్లను డిస్కంలు వాయిదా వేసుకున్నట్టు తెలిసింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో.. విరమించుకున్నట్టు సమాచారం.

- వివరాలు 8లో

క్లుప్తంగా...

లోక్‌సభలోనూ ఇకపై బీఆర్‌ఎస్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్)ని ఇకపై లోక్‌సభలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)గా గుర్తించనున్నట్లు లోక్‌సభ సచివాలయం పేర్కొంది. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు అభ్యర్థన, ఎన్నికల సంఘం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ మేరకు ఈ ఉత్తర్వులు ఇస్తున్నట్లు డిప్యూటీ సెక్రటరీ ఉత్తమ్ చంద్ర రే బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం 17వ లోక్‌సభలో ఇకపై టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా పిలవడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో పాటు లోక్‌సభలో ఆయా పార్టీల తాజా పరిస్థితిని వివరిస్తూ.. తొమ్మిది మంది సభ్యులున్న బీఆర్‌ఎస్‌కు ఎంపీ నామా నాగేశ్వరరావు ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తున్నట్లు లోక్‌సభ సచివాలయం పేర్కొంది.

రాయగిరి రైతులకు డీసీపీ క్షమాపణ చెప్పాలి

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, యాదాద్రి: ఆర్ఆర్ఆర్ భూముల విషయంలో ఆందోళన చేసి జైలుకు వెళ్లిన వారు రైతులే కారని భువనగిరి జోన్ డీసీపీ మాట్లాడడం సరైన పద్ధతి కాదని, ఆయన వెంటనే రాయగిరి రైతులకు క్షమాపణ చెప్పాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జైలునుంచి విడుదలైన రైతులను బుధవారం ఆయన యాదాద్రి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, డీసీపీ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. జైలుకు వెళ్లిన రైతులందరికీ భూములు ఉన్నాయన్నారు. ప్రభుత్వం చెప్పినట్లు డీసీపీ మాట్లాడటం సరికాదన్నారు. అధికార పార్టీ నాయకులు రేపటి నుంచి ఈ ప్రాంతంలో ఎలా తిరుగుతారో చూస్తామని హెచ్చరించారు. ఓఆర్ఆర్‌లో సీఎం కేసీఆర్ లక్షల కోట్ల స్కామ్ చేశారని ఆరోపించారు. రాయగిరి రైతులకు సంకెళ్లు వేయడంతో రాష్ట్రంలోని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారన్నారు. పోలీసులు, అధికారులు.. ప్రభుత్వం మాటలు వినవద్దని, కేసీఆర్ ప్రభుత్వం ఉండేది ఇంకా ఆరునెలలు మాత్రమే అని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యేల్లో గెలిచేవారు లేరని, ఈ ప్రభుత్వం వచ్చేది లేదని అన్నారు.

కాంగ్రెస్‌లో పొంగులేటి చేరిక ఖాయమే: వీహెచ్



సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక ఖాయమైందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు చెప్పారు. ఎలాంటి షరతులు లేకుండానే ఆయన పార్టీలోకి వస్తున్నారని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తన వర్గానికి సీట్లు ఖరారు చేయించుకుని మరీ కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్న వార్తల్లో నిజం లేదని తెలిపారు. టికెట్లు ఎవరికివ్వాలన్నది అధిష్టానం చూసుకుంటుందన్నారు.

అబ్‌కి బార్.. కిసాన్ సర్కార్ అంటే ఇదేనా దొర!

ట్విట్టర్‌లో వైఎస్ షర్మిల ఆగ్రహం



సాక్షి,హైదరాబాద్: కేసీఆర్ పాలనలో న్యాయమడిగిన అన్నదాతకు సంకెళ్లు తప్పడం లేదని, దేశ చరిత్రలో రైతులను మూడుసార్లు జైలుకి పంపిన చరిత్ర ఆయనదేనని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల మండిపడ్డారు. ''అబ్ కి బార్ కిసాన్ సర్కార్ ''అంటే ఇదేనా దొర అని బుధవారం ట్విట్టర్ వేదికగా షర్మిల నిలదీశారు. మద్దతు ధర అడిగినా, భూములు పోయాయని అడిగినా, భూములు ఇవ్వలేమని చెప్పినా రైతులకు సంకెళ్లను కేసీఆర్ బహుమతిగా ఇస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌ది భరోసానిచ్చే సర్కార్ కాదు రైతుకు బేడీలు వేసే సర్కార్ అని వ్యాఖ్యానించారు. న్యాయమని అడిగిన రైతులకు బేడీలు వేస్తున్న కేసీఆర్ నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని వైఎస్ షర్మిల అన్నారు.



...అవన్నీ 'పిట్ట' కథలు నమ్మకండీ!!

బీఆర్‌ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేలపై ఐటీ దాడులు

ఇళ్లు, ఆఫీసులు, వ్యాపార సంస్థల్లో ఏకకాలంలో తనిఖీలు

- 12 ప్రాంతాల్లో, 70 బృందాలతో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ భద్రత మధ్య సోదాలు


పైళ్ల శేఖర్‌రెడ్డి నివాసం నుంచి ఎమ్మెల్యేతో పాటు కుటుంబ సభ్యులను వాహనంలో బయటకు తీసుకువెళ్తున్న ఐటీ అధికారులు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలువురు బీఆర్‌ఎస్ ముఖ్య ప్రజాప్రతినిధులు, నేతలపై ఆదాయ పన్ను (ఐటీ) శాఖ మెరుపు దాడులు చేసింది. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి (భువనగిరి), మర్రి జనార్దనరెడ్డి (నాగర్‌కర్నూల్) తోపాటు మరికొందరి ఇళ్లు, కార్యాలయాలు, సంస్థల్లో తనిఖీలు చేపట్టింది. కేంద్ర భద్రతా బలగాల బందోబస్తు మధ్య 12 ప్రాంతాల్లో 70 బృందాలు బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి ఏకకాలంలో సోదాలు మొదలుపెట్టాయి. రాత్రి వరకూ ఈ తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదాయ పన్ను ఎగవేతకు పాల్పడుతున్నట్టు అందిన ఫిర్యాదుల నేపథ్యంలోనే ఈ దాడులు నిర్వహించినట్టు ఐటీవర్గాల సమాచారం. ఈ సందర్భంగా బ్యాంకుల్లోని లాకర్లను కూడా తనిఖీ చేశారని.. కీలక డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులను అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది.

మర్రి నివాసం, షాపింగ్ మాల్స్‌లో..

ఐటీ అధికారులు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 62లోని ఎమ్మెల్యే మర్రి జనార్దనరెడ్డి నివాసంతోపాటు వారి కుటుంబానికి చెందిన జేసీ బ్రదర్స్ షాపింగ్ మాల్‌లలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. షాపింగ్ మాల్ వ్యాపారం, లావాదేవీలపై ఆరా తీశారు. ఈ సమయంలో ఎవరినీ లోపలికి అనుమతించలేదు. మర్రి జనార్దనరెడ్డి కుటుంబ సభ్యులను బ్యాంకులకు తీసుకెళ్లి లాకర్లను సోదా చేసినట్టు తెలిసింది. మర్రి జనార్దనరెడ్డి షాపింగ్ మాల్స్‌తో వచ్చిన ఆదాయాన్ని రియల్‌ఎస్టేట్ సంస్థలకు మళ్లించారని.. ఆయన ఆదాయానికి, చెల్లిస్తున్న పన్నులకు పొంతన లేదని అధికారుల తనిఖీల్లో వెల్లడైందని, దాడుల నేపథ్యంలో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నామని ఐటీ వర్గాల సమాచారం. ఐటీ సోదాల సమయంలో మర్రి జనార్దనరెడ్డి తల్లి ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. ఆమెను వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

పైళ్ల పెట్టుబడులపై ఆరా..

హైదరాబాద్ గ్రీన్‌హిల్స్ కాలనీతోపాటు భువనగిరిలోని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆయన వ్యక్తిగత సిబ్బంది నివాసాల్లోనూ ఐటీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శేఖర్‌రెడ్డితోపాటు ఆయన భార్య వనితలను ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడులపై విచారించారు. వారు మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్, హిల్ ల్యాండ్ టెక్నాలజీస్ తోపాటు తీర్థ గ్రూప్ పేరిట రియల్ ఎస్టేట్, మైనింగ్, సోలార్ ఎనర్జీ, లిథియం బ్యాటరీ వ్యాపారాలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ సంస్థ హైదరాబాద్‌తో పాటు కర్ణాటకలో రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులను నిర్మించింది. దక్షిణాఫ్రికాలోనూ మైనింగ్ వ్యాపారం చేస్తోంది. వీటితోపాటు మరికొన్ని కంపెనీల్లో శేఖర్‌రెడ్డి, ఆయన భార్య డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. లార్వెన్ సిండికేట్ ప్రైవేట్ లిమిటెడ్‌లోనూ ఐటీ సోదాలు కొనసాగాయి. శేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను తీసుకెళ్లి బ్యాంక్ లాకర్లను తనిఖీ చేసినట్టు సమాచారం. పలు కంపెనీల్లో శేఖర్‌రెడ్డి భారీగా పెట్టుబడులు పెట్టినట్టు ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు.

ఎంపీ ట్రావెల్స్ సంస్థల లావాదేవీలపై..

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ స్ప్రింగ్స్ విల్లాస్‌లో ఉన్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నివాసంలోనూ ఐటీ అధికారులు సోదాలు చేశారు. ఆయన నిర్వహిస్తున్న ట్రావెల్స్ సంస్థలకు సంబంధించిన లావాదేవీలపై ఆరా తీశారు. మరోవైపు అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్‌లోని ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేత కొండపల్లి మాధవ్ నివాసంలోనూ ఐటీ అధికారులు సోదాలు చేశారు. ఈ సందర్భంగా పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

రాజకీయ దురుద్దేశంతోనే దాడులు: కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే ఐటీ దాడుల పేరిట భయపెట్టే ప్రయత్నం చేస్తోందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఎవరో ఒత్తిడి చేస్తే సోదాలు చేస్తున్నారని, ఎన్నికల ముందు బద్నాం చేయడానికి తప్ప మరేమీ కాదని పేర్కొన్నారు. ఐటీ సోదాల నేపథ్యంలో దుబ్బాకలో ఆయన మీడియాతో మాట్లాడారు. 1986 నుంచి తమ కుటుంబం వ్యాపార రంగంలోనే ఉందని, అంతా పారదర్శకంగానే కొనసాగుతోందని ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కనుసైగల్లో ఎన్నికలకు ముందు అలజడి సృష్టించే లక్ష్యంతో.. అనునిత్యం ప్రజల్లో ఉండే నేతలపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు. ఐటీ దాడులకు భయపడేది లేదని, ఎందాకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో అలజడి

ఒకేరోజు ముగ్గురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై ఐటీ దాడులు జరగడం ఆ పార్టీ శ్రేణుల్లో అలజడి రేపింది. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలోనే బీజేపీ కనుసన్నల్లో ఈ దాడులు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇంతకుముందు మంత్రి మల్లారెడ్డి, ఆయన బంధువులు, మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసాలు, సంస్థల్లోనూ ఐటీ దాడులు జరిగాయి. గత రెండేళ్లలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ పి.వెంకట్రామ్‌రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరులు, మంత్రి జగదీశ్‌రెడ్డి సహాయకుడి ఇళ్లలోనూ కేంద్ర సంస్థలు తనిఖీలు చేశాయి.

ఐటీ దాడులు బీజేపీ ప్రేరేపితమే

సూర్యాపేట: ఐటీ దాడులు బీజేపీ ప్రభుత్వ ప్రేరేపితమేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. ఎన్ని దాడులు చేసినా తాము ప్రజల పక్షమేనన్నారు. దాడులతో ప్రతిపక్షాలను అణచివేయాలనుకోవడం మూర్ఖత్వం అవుతుందని హితవు పలికారు. బీఆర్‌ఎస్ నేతల జీవితం తెరిచిన పుస్తకమని, పార్టీలోకి రాకముందే వారికి వ్యాపారాలు ఉన్నాయని తెలిపారు. లెక్క ప్రకారమే పన్నులు చెల్లిస్తున్నారని వెల్లడించారు. విచారణ సంస్థలను అడ్డు పెట్టుకుని బీజేపీ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇటువంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదని మంత్రి జగదీష్‌రెడ్డి స్పష్టం చేశారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల నేతలతో ముఖ్యమంత్రి కేసీఆర్

భారత్ పరివర్తనతోనే కష్టాల నుంచి విముక్తి

- మహారాష్ట్ర నేతలతో సీఎం కేసీఆర్
- రైతులు, బలహీన వర్గాలు కేంద్రంగా ప్రభుత్వాలు ప్రాధమ్యాలు ఖరారు చేసుకోవాలి
- అలా చేసుకోగలిగాం కాబట్టే రాష్ట్రం దేశానికి రోల్ మోడలయ్యింది
- బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు నేతలు

సాక్షి, హైదరాబాద్: పరివర్తన చెందిన భారతదేశంతో మాత్రమే రైతులు, దళిత, బహుజన ఆదివాసీలు సహా సకల జనుల కష్టాలు తొలగిపోతాయని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. సాంప్రదాయ పార్టీలు తమ చిత్తశుద్ధి లేని కార్యాచరణతో, మూస పద్ధతితో కూడిన పాలనారీతులు కొనసాగించినంత కాలం దేశాభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు. మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల నేతలు బుధవారం ప్రగతిభవన్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

వనరులను ఉపయోగించుకోవాలనే తపన ఉండాలి..

'దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి రాకెట్ సైన్స్ నేర్చుకోవాల్సిన అవసరం లేదు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవాలనే తపన, మనసు పాలకులకు ఉండాలి. ప్రజల కోసం సృజనాత్మకంగా పనిచేసే ఆలోచనా విధానాలు ఏడు దశాబ్దాలుగా పాలకులకు లేకపోవడం ఈ దేశ ప్రజల దురదృష్టం. భూగోళం మీద ఏ దేశానికి లేనన్ని సహజ వనరులు భారత్ సొంతం. అయినప్పటికీ, ఇన్ని దశాబ్దాలైనా.. రైతులు, బడుగు బలహీన వర్గాలు కనీస అవసరాలైన నీరు విద్యుత్ కోసం తపిస్తున్నారు. ప్రభుత్వాలు రైతు కేంద్రంగా, దళిత ఆదివాసీ బలహీన వర్గాలు కేంద్రంగా పాలనా ప్రాధమ్యాలను ఖరారు చేసుకోవాలి. మేం అలా చేసుకోగలిగాం కాబట్టే నేడు తెలంగాణ దేశానికే రోల్ మోడలయ్యింది..'అని సీఎం తెలిపారు.

మనసుంటే మార్గం ఉంటుందని తెలంగాణ నిరూపించింది..

'ఈ దేశంలోని పెద్ద పెద్ద రాష్ట్రాల కంటే అతి పిన్న వయసున్న తెలంగాణ అత్యంత తక్కువ కాలంలో ఎట్లా ఓ రోల్ మోడల్ కాగలిగింది? నేడు అన్ని రాష్ట్రాల ప్రజలు తెలంగాణ మోడల్‌నే కోరుకోవడానికి కారణమేంటి?'అనే విషయాలను కేసీఆర్ వివరించారు. 'తెలంగాణను అభివృద్ధి చేసుకున్న పద్ధతిలో ఈ దేశంలో పాలన సాగటం లేదు. దేశంలో పరివర్తన తీసుకువచ్చే ఆలోచన కేంద్రంలోని పాలకులకు లేదు. ప్రజా సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలనే మనసు లేనే లేదు..' అని విమర్శించారు. మనసుంటే తప్పకుండా మార్గం ఉంటుందనే విషయాన్ని తొమ్మిదేళ్ల తెలంగాణ నిరూపించిందని అన్నారు. అభివృద్ధి దిశగా భారతదేశంలో సమూల మార్పును తీసుకువచ్చేందుకు పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అని, అందుకు ముందడుగు మహారాష్ట్ర నుంచి పడుతున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు. రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా రైతులు, మహిళలు, యువత చైతన్యమై కలిసికట్టుగా నిలబడి పార్టీలను కాకుండా ప్రజా ఆకాంక్షలను గెలిపించుకునేందుకు కృషి కొనసాగించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో..

ఎన్‌సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనశ్యామ్ షెలార్‌తో పాటు ఆ పార్టీ ఓబీసీ సెల్ అహ్మద్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సంజయ్ ఆనంద్కర్, దర్శకుడు ప్రకాష్ నింబ్‌ఓర్, కుక్డి చెక్కెర కర్మాగారం సభ్యుడు అబాసాహెబ్ షిండే, మాజీ చైర్మన్ విలాస్ భైలుమే, సర్పంచ్‌లు కేశవ్ జెండే, షాహాజీ ఇతాపే, శరద్‌పవార్‌తో పాటు చంద్రకాంత్ పవార్, ప్రకాష్ పోతే, ప్రశాంత్ షెలార్, సిద్దేష్ ఆనంద్కర్, ప్రవీణ్ షెలార్, సంజయ్ వాగాస్కర్, వహతుక్ సేన అధ్యక్షుడు సందీప్ దహతోండే, సేవాదళ్‌కు చెందిన షామ్ జారే తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్ మహారాష్ట్ర నేతలు ఖదీర్ మౌలానా, హిమాన్షు తివారీ తదితరులు పాల్గొన్నారు.

'బండి' మార్పు లేదు

- కమలంలో విభేదాలు లేవు
- సంజయ్ ఆధ్వర్యంలోనే కార్యవర్గసభ్యుల నియామకం
- బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ స్పష్టం చేశారు. నాయకులందరూ ఒకే తాటిపై ఉన్నారనీ తామంతా కలిసికట్టుగానే ఉన్నామని తెలిపారు. బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ మార్పు ఉంటుందా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. సంజయ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులను నియమించామని, ఇక అధ్యక్షుడి మార్పు ఎక్కడిదని ఎదురు ప్రశ్నించారు. తుపాను ప్రభావం అనేక రాష్ట్రాలపై పడే అవకాశాలుండడంతో గురువారం కేంద్రమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన వాయిదా పడిందని చెప్పారు. ఖమ్మంలో అమిత్ షా బహిరంగ సభను కూడా వాయిదా వేశామన్నారు. మళ్లీ అమిత్ షా రాష్ట్ర పర్యటన ఖరారు చేసి, ఖమ్మం సభకు సంబంధించిన వివరాలు కూడా త్వరలోనే ప్రకటిస్తామని తరుణ్‌చుగ్ తెలిపారు.

త్వరలో ఖమ్మంలోనే అమిత్ షా సభ: బండి సంజయ్

త్వరలోనే ఖమ్మంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బహిరంగ సభ నిర్వహించడం ఖాయమని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. బుధవారం సంజయ్ మీడియాతో మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల ఈ సభ రద్దుతో కార్యకర్తలెవరూ నిరాశ పడొద్దని చెప్పారు. గుజరాత్, మహారాష్ట్రలలో తుపాను పరిస్థితుల కారణంగా అమిత్ షా 24 గంటలూ పర్యవేక్షించాల్సి ఉన్నందున ఈ సభకు రాలేకపోయారని తెలిపారు.

25 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



కుత్బుల్లాపూర్: అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని, తమ పార్టీలో చేరేందుకు మంతనాలు జరుపుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో బుధవారం గాజులరామారంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర ఇంచార్జి తరుణ్‌చుగ్, బండి సంజయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు మిలాఖత్ అయ్యాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో 30 మంది బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు గెలవరని తెలుసుకున్న కేసీఆర్... కాంగ్రెస్ పార్టీకి చెందిన 30 మంది అభ్యర్థులకు డబ్బులు వెచ్చించాలని భావిస్తూ ఇప్పుడే కుట్రలకు తెర లేపారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను కూకటి వేళ్లతో పెకిలించే సత్తా ఒక్క బీజేపీకే ఉందన్నారు. కేసీఆర్ ఎలాగైనా రాష్ట్రంలో తిరిగి అధికారం చేపట్టేందుకు మోసపూరిత హామీలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. దేశం కోసం.. ధర్మం కోసం.. సమాజం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ అని, తెలంగాణ రాష్ట్రంలో నిజాం, రజాకార్ల పాలనను అంతమొందించేందుకు రాష్ట్ర ప్రజలు బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. బహిరంగ సభలో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, మేడ్చల్ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షులు హరీష్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాష్ట్ర పర్యటన రద్దు!

- పెను తుపాను నేడు గుజరాత్ తీరం దాటనుండడంతో నిర్ణయం
- ఖమ్మం సభ రద్దుతో పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం



సాక్షి, హైదరాబాద్, సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన రద్దయింది. మోదీ సర్కార్ తొమ్మిదేళ్ల పాలనపూర్తి సందర్భంగా దేశవ్యాప్తంగా చేపడుతున్న 'మహా జన సంపర్క్ అభియాన్'లో భాగంగా తెలంగాణలో ఒకరోజు పర్యటన ఉండగా అది రద్దయింది. ఖమ్మం పట్టణంలో బహిరంగసభ రద్దుతో పాటు హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, ఇతర రంగాల ప్రముఖులను కలుసుకోవడం, రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో కోర్‌కమిటీ సమావేశం వంటివి కూడా రద్దయ్యాయి. గుజరాత్‌తో సహా తొమ్మిది రాష్ట్రాలపై బిపోర్‌జాయ్ తుపాన్ ప్రభావం తీవ్రంగా పడి వివిధ రూపాల్లో నష్టం చేకూర్చవచ్చుననే వాతావరణశాఖ అంచనాల మధ్య ఈ పర్యటన రద్దయినట్టు ప్రభుత్వవర్గాల సమాచారం.

డీలా పడిన పార్టీ శ్రేణులు

అమిత్ షా రాష్ట్ర పర్యటనతో పాటు ఖమ్మం సభ కూడా రద్దు కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కొంత నిరాశ వ్యక్తమైంది. రాష్ట్ర పర్యటన కోసం కాకపోయినా కనీసం ఖమ్మం సభలోనైనా అమిత్‌షా పాల్గొని దిశానిర్దేశం చేసి ఉంటే కేడర్‌లో నూతనోత్సాహం వెల్లివిరిసేదని అంటున్నారు. ఇటీవల కర్ణాటకలో బీజేపీ ఓటమి ప్రభావం రాష్ట్ర పార్టీపై, నాయకులపై కనిపిస్తోందనే వాదనలున్నాయి. అప్పటి నుంచి రాష్ట్ర పార్టీలో ఒకింత స్తబ్దత వాతావరణం ఏర్పడడంతో అమిత్ షా పర్యటనతో దానిని అధిగమించొచ్చుననే ఆశాభావం వ్యక్తమైంది. చివరకు ఈ పర్యటన రద్దు కావడంతో ఖమ్మం సభ ఏర్పాట్ల కోసం నియమించిన ఇన్‌చార్జీలు, ఇతర నాయకులను వెనక్కు రావాలంటూ నాయకత్వం సూచనలు పంపింది. త్వరలోనే మళ్లీ అమిత్‌షా పర్యటనతో పాటు ఖమ్మం సభ ఉంటుందని పార్టీ శ్రేణులు ఏ మాత్రం నిరాశ చెందొద్దని పార్టీ ముఖ్య నేతలు చెప్పుకొస్తున్నారు.

వెనక్కి వెళ్లిన కేంద్రబలగాలు

అమిత్ షా పర్యటన రద్దుతో ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో గత వారం రోజులుగా సభ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు నిలిచిపోయాయి. పార్టీ నేతలు ఏర్పాటు చేసిన కటౌట్లు, ఫ్లెక్సీలను తొలగించారు. బందోబస్తుకు సంబంధించి సీఆర్‌పీఎఫ్ బలగాలు ఢిల్లీ నుంచి బుధవారం హెలికాప్టర్‌లో ఖమ్మం చేరుకున్నాయి. కేంద్ర హోంమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించాయి. అమిత్‌షా పూలమాలలు వేయనున్న ఎన్‌టీఆర్ విగ్రహాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. అనంతరం సీఆర్‌పీఎఫ్ అధికారులు కలెక్టరేట్‌లో కలెక్టర్, సీపీలతో సమావేశం అయ్యారు. అయితే పర్యటన వాయిదా పడటంతో వీరంతా తిరిగి వెళ్లిపోయారు.

ఏ వైరస్ వచ్చినా ఎదుర్కొనేలా..

▶ మొదటి పేజీ తరువాయి

హరియాణాలోకి వచ్చి అక్కడి నుంచి మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోకి ప్రవేశించి ఆదిలాబాద్ సరిహద్దు దాకా వచ్చాయి. ఆ సమయంలో కేంద్రం ఇద్దరు ఎంటామాలజిస్టులను పంపింది. అయితే మహారాష్ట్రలోనే మిడతలను మట్టుపెట్టడంతో మన వరకు రాలేదు. తర్వాత ఆ ఇద్దరు ఎంటమాలజిస్టులు నన్ను కలిశారు. సైన్స్ ఇంత అభివృద్ధి చెందిన ఈ కాలంలోనూ మిడతల సమస్యకు పరిష్కారం కనుక్కోలేరా? అని నేను ప్రశ్నించాను. మనిషి 4 లక్షల ఏళ్ల క్రితం పుడితే.. మిడతలు, బ్యాక్టీరియాలు అంతకన్నా ముందు 8 లక్షల ఏళ్ల క్రితమే పుట్టాయి. వాటికి వ్యతిరేకంగా మనిషి చర్యలు చేపడితే ప్రకోపం చెంది ఇబ్బందులు కలిగిస్తాయి. అందుకే మిడతలను చంపలేమని, పూర్తిగా నిర్మూలించలేమని ఎంటమాలజిస్టులు వివరించారు. కరోనా కూడా అలాంటిదేనని, భవిష్యత్తులో దానిని మించిన వైరస్‌లు రావొచ్చని నాతో అన్నారు. వైద్యారోగ్య వ్యవస్థ పటిష్టంగా ఉంటే.. నష్టం తక్కువగా ఉంటుందని, లేకుంటే నష్టాలు భారీగా ఉంటాయని హెచ్చరించారు. వైద్యారోగ్య శాఖ ప్రాధాన్యతను దీని ద్వారా అర్థం చేసుకోవచ్చు. మానవ జీవనం ఉన్నంత కాలం వైద్యం కూడా కొనసాగుతూనే ఉంటుంది.

భారీగా ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటు

నిమ్స్ ఆస్పత్రి భారీ విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడం దేశ వైద్యారోగ్య రంగంలోనే చారిత్రక సందర్భం. కేంద్రాన్ని ప్రాధేయపడకుండా సొంతంగా 550 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయగల ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నాం. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందించాం. పుట్టే బిడ్డలు ఒడ్డూ పొడుగు బాగుండాలంటే వాళ్ల గర్భంలో ఎదిగే కాలంలో ఎలాంటి ఆటంకం ఉండకూడదు. ఒకసారి స్టంటింగ్ సమస్య ఏర్పడితే.. మళ్లీ ఎదుగుదల చూడాలంటే వంద సంవత్సరాల కాలం పడుతుంది. చాలా మందికి ఈ విషయం తెలియదు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇస్తున్నవే న్యూట్రిషన్ కిట్లు.


నిమ్స్ ఆస్పత్రి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు తలసాని, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు

గాంధీ ఆస్పత్రి సేవలు అమోఘం

కరోనా కాలంలో తెలంగాణ వైద్యారోగ్య శాఖ గొప్పగా పని చేసింది. ఆ సమయంలో రోగులకు ధైర్యంగా సేవలు అందించిన గాంధీ ఆస్పత్రి వైద్యులను అభినందిస్తున్నా. అయితే ఎంత చేసినా వైద్యశాఖకు పలు దిక్కుల నుంచి విమర్శలు వస్తుంటాయి. నిరుపేదలు వైద్యం కోసం వస్తే.. బెడ్లు అందుబాటులో లేనప్పుడు వైద్యులు ఉదార హృదయంతో ఒక అరగంట ఎక్కువ పనిచేసైనా, కింద బెడ్లు వేసి అయినా వైద్యం అందిస్తారు. కానీ ఆస్పత్రిలో బెడ్లు లేవని, పేషెంట్లను కింద పడుకోబెడుతున్నారని ప్రచారం జరుగుతుంది. అందువల్ల ప్రజా సంబంధాల వ్యవస్థను మరింతగా మెరుగుపరుకోవాలి.

సేవలు మరింత పెరగాలి

వైద్యారోగ్య రంగంలో చాలా మార్పులు రావాలి. ఆస్పత్రుల నిర్మాణాలే కాదు.. ఆస్పత్రుల్లో సేవలు కూడా పెరగాలి. ఈ రోజు మనం ఏ స్టేజీలో ఉన్నాం , ఇంకా ఎంత ముందుకు పోవాల్సి ఉంది? జరగాల్సిన కొత్త ఆవిష్కరణలు ఏంటి? చేపట్టాల్సిన చర్యలేమిటన్న ప్రణాళికల కోసం సమయం కేటాయించాలి. ప్రజల బాగు కోసం ఇంకా ఏం చేయాలనే తపన వైద్యాధికారులకు ఉండాలి. అపవాదులను తొలగించుకొని రాష్ట్రంలో వైద్యశాఖనే నంబర్ వన్ అని పేరొచ్చేలా కృషి చేయాలి.

భారీగా ఆస్పత్రుల నిర్మాణం

రాష్ట్రంలో గొప్పగా ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. వరంగల్‌లో ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అందుబాటులోకి రానుంది. ఒకప్పుడు నిమ్స్‌లో 900 పడకలుంటే.. తెలంగాణ వచ్చాక 1,500 పడకలకు పెంచాం. మరో 2 వేల పడకల సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాం. హైదరాబాద్‌లో టిమ్స్ కింద నాలుగువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు కడుతున్నాం. విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అద్భుతమైన వైద్య సేవలు, టెలీ మెడిసిన్ సేవలు అందుతాయి..'' అని కేసీఆర్ చెప్పారు.

నేడు నాగ్‌పూర్‌కు కేసీఆర్

బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించనున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గురువారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్తున్నారు. ఆయన హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12 గంటల సమయంలో నాగ్‌పూర్‌కు చేరుకుంటారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మహారాష్ట్రకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో భేటీ అవుతారు. అనంతరం మీడియా సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణమవుతారు. సాయంత్రం 4 గంటల సమయంలో హైదరాబాద్‌కు చేరుకుంటారు.

హైదరాబాద్ బయట మూడో కార్యాలయం

నాగ్‌పూర్ కార్యాలయం బీఆర్‌ఎస్ పార్టీకి హైదరాబాద్ వెలుపల మూడో కార్యాలయం కానుంది. ఇప్పటికే ఢిల్లీలోని వసంత్ విహార్‌లో పార్టీ కేంద్ర శాశ్వత కార్యాలయాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఏపీలోనూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ ఓ అద్దె భవనంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. తాజాగా నాగ్‌పూర్‌లో ఏర్పాటు చేశారు. త్వరలో ఔరంగాబాద్, పుణేలోనూ బీఆర్‌ఎస్ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోంది.

2 లక్షల ర్యాంకు దాటినా.. కన్వీనర్ సీటు

రాష్ట్రంలో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీటు గ్యారంటీ

- గతేడాది ఓ ప్రైవేట్ కాలేజీలో 2.28 లక్షల ర్యాంకుకు బీసీ–ఏకు సీటు
- జనరల్ కేటగిరీలో 1.25 లక్షల ర్యాంకుకు కూడా కన్వీనర్ సీటు
- బీ కేటగిరీలో 9 లక్షల ర్యాంకుకూ సీటు వచ్చే అవకాశం
- కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వెల్లడి
- రాష్ట్రంలో 56 మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లు



సాక్షి, హైదరాబాద్: నీట్ ఫలితాలు వెలువడ్డాయి. ఇక త్వరలో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర వైద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఎంత ర్యాంకుకు ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటాలో సీటు వస్తుందన్న దానిపై విద్యార్థుల్లో చర్చ జరుగుతోంది. పైగా గతేడాది కంటే ఈసారి ప్రభుత్వ కాలేజీలో 9 కొత్తగా వస్తున్నాయి. అంటే 900 ఎంబీబీఎస్ సీట్లు పెరుగుతాయి. అలాగే కొన్ని ప్రైవేట్ కాలేజీల్లోనూ సీట్లు పెరుగుతాయి. గతేడాది లెక్క ప్రకారం చూసినా 2 లక్షల ర్యాంకు దాటినా రిజర్వు కేటగిరీలో సీటు వచ్చే అవకాశముంది. అలాగే అన్‌రిజర్వుడు కేటగిరీలోనూ 1.25 లక్షల ర్యాంకుకూ కన్వీనర్ సీటు వచ్చే అవకాశం ఉంది. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నిపుణుల అంచనా ప్రకారం జాతీయస్థాయిలో రెండు లక్షలకుపైగా ర్యాంకులు వచ్చిన వారికి కూడా కన్వీనర్ కోటాలో సీట్లు వస్తాయని చెబుతున్నారు. అలాగే జాతీయ స్థాయిలో 8 లక్షల నుంచి 9 లక్షల వరకు ర్యాంకులు వచ్చిన వారికి మన దగ్గర ప్రైవేటు కాలేజీల్లోనూ బీ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు వస్తుందని అంటున్నారు.

గతేడాది రాష్ట్రంలో వివిధ కేటగిరీల్లో కన్వీనర్ కోటాలో ఎంత ర్యాంకుకు సీటు వచ్చిందంటే...

కేటగిరీ	గరిష్ట ర్యాంకు
జనరల్	125070
ఎస్సీ	210919
ఎస్టీ	207157
బీసీ ఏ	228059
బీసీ బీ	137970
బీసీ సీ	198227
బీసీ డీ	128729
బీసీ ఈ	143603

రాష్ట్రంలోని 56 మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లు

రాష్ట్రంలో 2023–24 వైద్య విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ కాలేజీల్లో మొత్తం 8,490 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ప్రకటించింది. 27 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,790 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అలాగే 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. మంగళవారం 'నీట్' ఫలితాలు వెలువడిన నేపథ్యంలో రాష్ట్రంలో సీట్లపై స్పష్టత వచ్చింది. ఇక నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నుంచి నీట్‌లో అర్హత సాధించిన రాష్ట్రానికి చెందిన అభ్యర్థుల వివరాల డేటా రాగానే అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీచేస్తామని విశ్వవిద్యాలయం వెల్లడించింది. 'నీట్' ర్యాంకుల ప్రకటన అనంతరం రాష్ట్రస్థాయిలో తమకెంత ర్యాంకు వస్తుందోనన్న ఆసక్తి, ఆందోళన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొంది.

15 శాతం సీట్లు అఖిల భారత కోటాకు కేటాయింపు...

ప్రభుత్వంలోని అన్ని సీట్లను, ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లల్లో 15 శాతం అఖిల భారత కోటా కింద భర్తీ చేస్తారు. వాటిల్లో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే తిరిగి వాటిని మన రాష్ట్రానికే ఇస్తారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల్లో ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ మేరకు సీట్ల కేటాయింపు జరిగింది.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల వివరాలు

మెడికల్ కాలేజీ పేరు	సీట్లు
1) ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్	250
2) గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాద్	250
3) కాకతీయ మెడికల్ కాలేజీ, వరంగల్	250
4) మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ	175
5) నల్లగొండ మెడికల్ కాలేజీ	150
6) నిజామాబాద్ మెడికల్ కాలేజీ	120
7) సిద్దిపేట మెడికల్ కాలేజీ	175
8) సూర్యాపేట మెడికల్ కాలేజీ	150
9) రాజీవ్‌గాంధీ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్	120
10) రాజన్న సిరిసిల్ల మెడికల్ కాలేజీ	100
11) నిర్మల్ మెడికల్ కాలేజీ	100
12) ఖమ్మం మెడికల్ కాలేజీ	100
13) జనగాం మెడికల్ కాలేజీ	100
14) వికారాబాద్ మెడికల్ కాలేజీ	100
15) జయశంకర్ భూపాలపల్లి మెడికల్ కాలేజీ	100
16) కామారెడ్డి మెడికల్ కాలేజీ	100
17) కొమురంభీం ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ	100
18) మంచిర్యాల మెడికల్ కాలేజీ	100
19) రామగుండం మెడికల్ కాలేజీ	150
20) జగిత్యాల మెడికల్ కాలేజీ	150
21) మహబూబాబాద్ మెడికల్ కాలేజీ	150
22) భద్రాద్రి కొత్తగూడెం మెడికల్ కాలేజీ	150
23) నాగర్‌కర్నూలు మెడికల్ కాలేజీ	150
24) వనపర్తి మెడికల్ కాలేజీ	150
25) సంగారెడ్డి మెడికల్ కాలేజీ	150
26) కరీంనగర్ మెడికల్ కాలేజీ	100
27) ఈఎస్ఐసీ, హైదరాబాద్	100
మొత్తం	3,790

ప్రైవేటు, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల వివరాలు

మెడికల్ కాలేజీ పేరు	సీట్లు
1) అపోలో, హైదరాబాద్	150
2) అయాన్, రంగారెడ్డి జిల్లా	150
3) భాస్కర్ మెడికల్ కాలేజీ, ఎంకపల్లి	150
4) చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీ, కరీంనగర్	200
5) డెక్కన్ మెడికల్ కాలేజీ, హైదరాబాద్	150
6) డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, చేవెళ్ల	150
7) డాక్టర్ వీఆర్‌కే ఉమెన్స్ మెడికల్ కాలేజీ, అజీజ్‌నగర్	100
8) కామినేని అకాడమీ, హైదరాబాద్	150
9) కామినేని మెడికల్ కాలేజీ, నార్కట్‌పల్లి	200
10) మహవీర్ మెడికల్ కాలేజీ, వికారాబాద్	150
11) మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, హైదరాబాద్	200
12) మల్లారెడ్డి ఉమెన్స్ మెడికల్ కాలేజీ, హైదరాబాద్	200
13) మమత మెడికల్ కాలేజీ, బాచుపల్లి	150
14) మమత మెడికల్ కాలేజీ, ఖమ్మం	200
15) మెడిసిటీ మెడికల్ కాలేజీ, ఘన్‌పూర్	150
16) ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ, సంగారెడ్డి	150
17) ప్రతిమ మెడికల్ కాలేజీ, కరీంనగర్	200
18) ఆర్వీఎం మెడికల్ కాలేజీ, మెదక్	150
19) షాదన్ మెడికల్ కాలేజీ, పటాన్‌చెరు	150
20) సురభి మెడికల్ కాలేజీ, సిద్దిపేట	150
21) ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, మహబూబ్‌నగర్	150
22) మహేశ్వర మెడికల్ కాలేజీ, మెదక్	150
23) నీలిమ మెడికల్ కాలేజీ, మేడ్చల్	150
24) సీఎంఆర్ మెడికల్ కాలేజీ	150
25) ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ, వరంగల్	150
26) అరుంధతి మెడికల్ కాలేజీ, హైదరాబాద్	150
27) టీఆర్ఆర్ మెడికల్ కాలేజీ, పటాన్‌చెరు	150
28) ఆర్వీఎం మెడికల్ కాలేజీ, సిద్దిపేట	250
29) ప్రతిమ రిలీఫ్ కాలేజీ, వరంగల్	150
మొత్తం	4,700

వైద్యం.. నాడు దైన్యం, నేడు ధైర్యం..

- వైద్యరంగంలో మార్పులపై మంత్రి కేటీఆర్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య రంగంలో తెలంగాణ ప్రస్థానం దేశంలోనే సరికొత్త అధ్యాయమని ఐటీశాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో ప్రజారోగ్యం అంటే గాలిలో దీపంలా ఉండేదని, కానీ స్వరాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగం కొత్త రూపం దాల్చిందని అన్నారు. నాడు సర్కారు దవాఖానా అంటే దైన్యం అని, నేడు అది ఓ ధైర్యం అయిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. రాష్ట్రంలో వైద్యరంగంలో సంతరించుకున్న మార్పులను కేటీఆర్ సుదీర్ఘ ట్వీట్ ద్వారా వివరించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బడ్జెట్‌లో వైద్య రంగానికి పెద్ద పీట వేశామని, కార్పొరేట్‌కు దీటుగా వైద్య రంగానికి బంగారు బాటలు వేశామని తెలిపారు. కేసీఆర్ కిట్లనుంచి న్యూట్రీషన్ కిట్ల దాకా, డయాలసిస్ సెంటర్ల నుంచి డయాగ్నొస్టిక్ కేంద్రాల దాకా ప్రతి ఆలోచన, నిర్ణయం చరిత్రాత్మకమని కవితా ధోరణిలో వివరించారు. ''నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానాకు''అనే దశాబ్దాల దుస్థితి నుంచి ''చలో పోదాం పదరో.. సర్కారు దవాఖానాకు''అనే ధీమానిచ్చిన ధీరోదాత్తమైన నాయకత్వం తెలంగాణ సొంతం అని పేర్కొన్నారు. హైదరాబాద్ నలుదిశలా ఒకేసారి ప్రభుత్వరంగంలో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం దేశ చరిత్రలోనే ఒక సరికొత్త విప్లవం అని చెప్పారు. జిల్లాకో మెడికల్ కాలేజీ సంకల్పం.. డాక్టర్ కావాలన్న విద్యార్థుల కలలను సాకారం చేసే మహాయజ్ఞం అని పేర్కొన్నారు.



కుర్చుని గమనించడం సులభం, కష్టతరమైనది ఏమిటంటే, లేచి చర్య తీసుకోవడం.

– హొనొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 15 జూన్ 2023

ఆలోచన రేపుతున్న ఆరోపణలు

నూరుపూలు వికసించనీ... వేయి భావాలు సంఘర్షించనీ అంటారు. కానీ, మనమిప్పుడు ఏ చిన్న వ్యతిరేక వ్యాఖ్యనైనా సహించలేని స్థితికి వచ్చేశామా? డిజిటల్, సోషల్ మీడియా విప్లవంతో జనం సమాచారం పంచుకోవడం నుంచి స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తీకరణ దాకా – సమస్తం మారిపోయిన వేళ ప్రభుత్వాల నియంత్రణ ఎంత? ప్రతి ఒక్కరికీ అందుబాటుతో మీడియా ప్రజాస్వామికీకరణతో పాటు విచ్చలవిడితనమూ పెరిగే ప్రమాదం ఉన్నందున ఈ భారీ టెక్ సంస్థల బాధ్యత ఎంత? కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ట్విట్టర్ మాజీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడైన జాక్ డోర్సీ సోమవారం చేసిన సంచలన ఆరోపణలు ఇలాంటి ఎన్నో ప్రశ్నల్ని మరోసారి లేవనెత్తాయి.

అమెరికన్ యూట్యూబ్ షో 'బ్రేకింగ్ పాయింట్స్'కు డోర్సీ ఇచ్చిన ఇంటర్వ్యూ భారత ప్రభుత్వానికీ, పాపులర్ సోషల్ మెసేజింగ్ వేదికకూ మధ్య కొనసాగుతున్న పోరులో కొత్త సంగతులను సోమవారం రాత్రి బయటపెట్టింది. రైతుల ఉద్యమ సమయంలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న పలు ట్విట్టర్ ఖాతాలను స్తంభింపజేయాల్సిందిగా భారత ప్రభుత్వం నుంచి పలు అభ్యర్థనలు వచ్చాయనేది ఆయన కథనం. అంతకన్నా ఆందోళనకరమైనవి ఏమిటంటే – ప్రభుత్వ డిమాండ్లకు తలొగ్గకపోతే, భారత్‌లో ట్విట్టర్‌ను మూసివేయిస్తామనీ, దేశంలోని సంస్థ ఆఫీసులపైన, ఉద్యోగుల ఇళ్ళపైన దాడులు చేయిస్తామనీ గద్దె మీది పెద్దలు బెదిరించారట. డోర్సీ చేసిన ఈ ఆరోపణలు తీవ్రమైనవి. సహజంగానే ప్రభుత్వం ఆ ఆరోపణల్ని పూర్తిగా తోసిపుచ్చింది.

అంతమాత్రాన కేంద్రంలో గడచిన తొమ్మిదేళ్ళ పైచిలుకు బీజేపీ హయాం సంప్రదాయ మీడియాకైనా, సోషల్ మీడియాకైనా సవ్యంగా ఉందనుకోలేం. పత్రికలు, టీవీ ఛానళ్ళ నుంచి వెబ్‌సైట్లు, సోషల్ మీడియా దాకా అన్నిటినీ నయానో, భయానో తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి పాలకులు ప్రయత్నిస్తున్న తీరు కొత్తేమీ కాదు. కొన్ని జాతీయ టీవీ ఛానళ్ళను బీజేపీ పెద్దలు, వారి మిత్రులు, ఆశ్రితులు హస్తగతం చేసుకోవడమూ బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో ట్విట్టర్ మాజీ పెద్ద చేసిన ఆరోపణలు అసత్యమో, సత్యమో కానీ... అసహజమని మాత్రం అనిపించట్లేదు. తొమ్మిదేళ్ళ చరిత్ర చూస్తే నమ్మశక్యంగానే ఉన్నాయి. అదే సమయంలో ట్విట్టర్ సారథ్యం వదిలేసిన ఇంతకాలానికి డోర్సీ ఇప్పుడు ఈ అంశాలను ఎందుకు లేవనెత్తుతున్నారన్నదీ ఆలోచించాల్సినదే!


ట్విట్టర్ పులు కడిగిన ముత్యం అనుకోలేం. పలు సందర్భాల్లో ఏకపక్షంగా వ్యవహరించిన చరిత్ర దానిది. పారదర్శకత లేకుండా ఈ తోక లేని పిట్ట తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలు కూడా సవాలక్ష. స్వయంగా డోర్సీ సైతం వివాదాలకు అతీతులేమీ కాదు. 2018లో భారత్‌లో పర్యటించినప్పుడు ఆయన వివాదాస్పద పోస్టర్‌ను చేత ధరించిన ఘటన ఇప్పటికీ విశ్లేషకులకు గుర్తే. అలాగే, ఆయన హయాంలో ట్విట్టర్ తన అల్గారిథమ్ ద్వారా నచ్చినవారిని పెంచుతూ, నచ్చనివారిని తుంచుతూ నడిచిందన్న ఆరోపణలూ ఉన్నాయి. ట్విట్టర్ కొత్త యజమాని ఎలాన్ మస్క్ సైతం అలాంటి కొన్ని అంతర్గత పత్రాలను బయటపెట్టారు. కొన్ని వార్తా కథనాలను నిరోధిస్తూ, కొన్ని ఖాతాలను స్తంభింపజేశాక ఇలాంటి వేదికలకు ఇక తటస్థత ఎక్కడున్నట్టు? పారదర్శకత, జవాబుదారీతనం లేనప్పుడు ట్విట్టరే కాదు... ఏ సోషల్ మీడియా వేదికకైనా పవిత్రత, గౌరవం ఏం ఉంటాయి? పాలకులను అవి వేలెత్తి చూపితే, మూడు వేళ్ళు వాటినే వెక్కిరిస్తాయి.

అలాగని ఆ లోపాలే సందుగా... పాలక పక్షాలు, ప్రభుత్వాలు సోషల్ మీడియా సహా సమస్త భావప్రసార వేదికల పైనా స్వారీ చేస్తుంటే సమర్థించలేం. సోమవారం ఒకపక్కన 'కోవిన్' పోర్టల్ లోని పౌరుల సమాచారం అంగట్లో లభిస్తున్నట్టు బయటపడ్డ కొద్ది గంటల్లోనే, డోర్సీ సంచలన ఆరోపణలూ రావడం యాదృచ్ఛికమే కావచ్చు. కానీ, వార్తలనైనా, వ్యాఖ్యలనైనా... నోటితో ఖండించడమే తప్ప సర్కార్ తన సమర్థత, నిర్దోషిత్వాలను నిరూపించుకొనేందుకు ప్రయత్నించడం లేదు. నిజానికి, 2021 ఫిబ్రవరిలో సైతం దాదాపు 250 ఖాతాలనూ, ట్వీట్లనూ తొలగించమంటూ పాలకుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు ట్విట్టర్ ప్రతిఘటించింది. బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు చేసిన వివాదాస్పద ట్వీట్‌కు 'మ్యానిప్యులేటెడ్ మీడియా' అని ట్యాగ్ తగిలించేసరికి, 2021 మే నెలలో తన కార్యాలయాలపై ఢిల్లీ పోలీసు దాడులను ఎదుర్కోవాల్సి వచ్చింది. చివరకు ఇలా రహస్యంగా, అడ్డగోలుగా సాగుతున్న ఈ సెన్సార్‌షిప్ డిమాండ్లపై కర్ణాటక హైకోర్ట్‌లో రిట్ పిటిషన్ వేసింది. అప్పుడైనా, ఇప్పుడైనా ప్రభుత్వం ఆరోపణల్ని తోసిపుచ్చడానికే పరిమితమైంది.

ధ్రువీకృత జర్నలిస్టులు, వార్తా సంస్థల ఖాతాలు పోస్టలను సైతం స్తంభింపజేయమంటూ మన దేశం నుంచి ట్విట్టర్‌కు వస్తున్న డిమాండ్లే ఎక్కువట. 2021 ద్వితీయార్ధంలో మొత్తం 326 లీగల్ డిమాండ్లొస్తే, అందులో 114 మన దేశానివే. మొత్తం మీద పాలకులకు ప్రజా ఉద్యమాలు, ప్రతికూల వ్యాఖ్యలంటే దడ పుడుతున్నట్టుంది. రైతు ఉద్యమమైనా, రెజ్లర్ల నిరసనైనా సర్కార్ శైలి ఒకటే– ముందు ఉదాసీనత, తర్వాత అణచివేత. ప్రజాక్షేత్రంలో వ్యవహారం బెడిసి కొడుతోందనిపిస్తే – ఆఖరికి అత్యవసర కంటి తుడుపు కార్యాచరణ. ఏ రకంగా చూసినా ఇది సరి కాదు. ట్విట్టర్ సహా అన్నీ జవాబుదారీతనంతో, స్థానిక చట్టాలకు కట్టుబడాలి. అదెంత ముఖ్యమో, బెదిరింపు ధోరణులు ప్రజాస్వామ్య విలువలకే మచ్చ అని పాలకులు గ్రహించడం అంత కీలకం. ఆ రెండూ జరగనంత కాలం ఇవాళ డోర్సీ... రేపు మరొకరు... పేరు మారవచ్చేమో కానీ, ఆరోపణల తీరు, సారం మారవు.

ప్రపంచ ఆరోగ్యమే లక్ష్యంగా...

సందర్భం



డాక్టర్ మన్‌సుఖ్ మండావియా

ప్రజారోగ్య రంగంలో డిజిటల్ సాధనాల వినియోగాన్ని భారతదేశం ప్రోత్సహిస్తోంది. కోవిడ్–19 సమయంలో అభివృద్ధి చేసి అమలు చేసిన కో–విన్, ఈ–సంజీవని వంటివి లక్ష్యాల సాధన కోసం ఎంతగానో ఉపయోగపడ్డాయి. అయితే ఒకరితో సంబంధం లేకుండా మరొకరు పనిచేసినప్పుడు ప్రపంచంలో ఒక ప్రాంతంలో సంవత్సరాల తరబడి వినియోగంలో ఉన్న వ్యవస్థ మరో ప్రాంతంలో మళ్లీ మొదటి నుంచి వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలో జరుగుతున్నది ఇదే. డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా అమలు జరగడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రామాణిక వ్యవస్థ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. జీ–20 అధ్యక్ష హోదాలో ఏకాభిప్రాయం సాధించడానికి భారతదేశం పని చేస్తోంది.

ఇంటర్నెట్ లేని ప్రపంచాన్ని ఒకసారి ఊహించుకోండి. ఇంటర్నెట్ సౌకర్యం లేక ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా విడివిడిగా పనిచేస్తున్న కంప్యూటర్ నెట్‌వర్క్‌ల పనితీరు ఎలా ఉంటుంది? ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా కంప్యూటర్ నెట్‌వర్క్ పనిచేసినప్పుడు ప్రపంచంలో ఒక ప్రాంతంలో సంవత్సరాల తరబడి వినియోగంలో ఉన్న వ్యవస్థ మరో ప్రాంతంలో నూతన వ్యవస్థగా వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ప్రామాణిక ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) అమలులో లేకపోతే పరిస్థితి అసంబద్ధంగా ఉండేది. ఇది ప్రస్తుతం డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలో నెలకొని ఉన్న పరిస్థితిని గుర్తు చేస్తోంది. వివిధ సాంకేతిక అంశాల ఆధారంగా, వివిధ ప్రాంతాల్లో వివిధ విధాలుగా డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ సాగుతోంది. సరైన విధంగా అమలు జరిగి ఆశించిన ఫలితాలు ఇవ్వడానికి ఆ వ్యవస్థ మార్గనిర్దేశకుల కోసం ఎదురు చూస్తోంది. డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా అమలు జరగడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రామాణిక వ్యవస్థ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయడానికి అంతర్జాతీయ నాయకత్వం అవసరం ఉంటుంది.



డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ పరిమాణం చిన్నదిగా కనిపించవచ్చు. అయితే, ఈ రంగం అనేక రంగాల్లో అవకాశాలను అందిస్తుంది. స్మార్ట్ వేరియబుల్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ కేర్, రిమోట్ మానిటరింగ్, కృత్రిమ మేధస్సు, డేటా అనలిటిక్స్, బ్లాక్–చైన్, రిమోట్ డేటా లాంటి రంగాల్లో అపారమైన అవకాశాలు వస్తాయి. డిజిటల్ పరికరాల సామర్థ్యం, అవసరం కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రపంచ దేశాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధికి అంతర్జాతీయ స్థాయిలో జరగాల్సిన చర్యల ప్రాధాన్యాన్ని గుర్తించాల్సి ఉంటుంది.

డిజిటల్ సాధనాల వినియోగం

ఇటీవలి కాలంలో ప్రజారోగ్య రంగంలో డిజిటల్ సాధనాల వినియోగాన్ని భారతదేశం ప్రోత్సహిస్తోంది. కోవిడ్–19 సమయంలో అభివృద్ధి చేసి అమలు చేసిన కో–విన్, ఈ–సంజీవని వంటివి లక్ష్యాల సాధన కోసం ఉపయోగపడ్డాయి. టీకా కార్యక్రమం, ఆరోగ్య సంరక్షణ చర్యల అమలులో సమూల మార్పులు వచ్చాయి. డిజిటల్ సాధనాల ద్వారా మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే అంశంలో ప్రభుత్వం విజయం సాధించింది. భారతదేశంలో అమలు జరిగిన అతిపెద్ద టీకా కార్యక్రమానికి కో–విన్ వెన్నెముకగా నిలిచింది. కో–విన్ ద్వారా వ్యాక్సిన్ రవాణా కార్యక్రమం అమలు జరిగిన తీరును ప్రభుత్వం పర్యవేక్షించింది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ టీకా కోసం నమోదు చేసుకోవడం, డిజిటల్ సర్టిఫికెట్లు జారీ చేయడం లాంటి ముఖ్యమైన కార్యక్రమాలు కో–విన్ సహకారంతో జరిగాయి.

ఇక్కడ మరో డిజిటల్ సాధనం ఈ– సంజీవని గురించి ప్రస్తావించాలి. ఈ–సంజీవని ద్వారా ప్రజలు ఆన్‌లైన్ ద్వారా ఆరోగ్య సంప్రదింపులను పొందుతున్నారు. తమ ఇళ్ల నుంచే నిపుణులను సంప్రదించి సలహాలు పొందే అవకాశాన్ని ఈ–సంజీవని అందుబాటులోకి తెచ్చింది. 10 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ–సంజీవని ద్వారా ప్రయోజనం పొందారు. గరిష్ఠ స్థాయిలో ఈ–సంజీవని ద్వారా రోజుకు 5 లక్షల సంప్రదింపులు జరిగాయి.

డిజిటల్ విధానంలో నిర్వహించిన కోవిడ్ వార్ రూమ్ వల్ల ఎప్పటికప్పుడు ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవడానికి అవకాశం కలిగింది. దీని ద్వారా జాతీయ, రాష్ట్ర , జిల్లా స్థాయిలో వ్యాధి తీవ్రత తెలుసుకుని అవసరమైన సామగ్రి సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి అవకాశం కలిగింది. ఆరోగ్య సేతు, ఆర్టీ–పీసీఆర్ యాప్, ఇతర డిజిటల్ సాధనాలను విధాన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగించిన ప్రభుత్వం కోవిడ్–19 మహమ్మారి రూపంలో వచ్చిన భారీ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొని విజయం సాధించగలిగింది.

ప్రజారోగ్య రంగంలో డిజిటల్ సాధనాలను పూర్తి సామర్థ్యం మేరకు ఉపయోగించుకోవడానికి పటిష్ఠమైన వ్యవస్థ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే జాతీయ డిజిటల్ ఆరోగ్య పర్యావరణ వ్యవస్థ– ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎమ్) పని చేయడం ప్రారంభించింది. దీని ద్వారా ప్రజలు వారి వైద్య రికార్డులు నిల్వ చేయడానికి, అవసరమైన సమయంలో చూసి అవసరమైన ఆరోగ్య సంరక్షణ పొందడానికి నిపుణులకు పంపడానికి అవకాశం కలుగుతుంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వంలో భారతదేశం డిజిటల్ ఆరోగ్య వ్యవస్థకు సంబంధించి సాధించిన విజయాలు, ప్రణాళికలను ప్రపంచ దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉంది.

ముఖ్యంగా తక్కువ, మధ్య–ఆదాయ దేశాలు భారతదేశం అనుసరించిన విధానాలు అనుసరించి తమ దేశ ప్రజలకు డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి వీలవుతుంది. దీనివల్ల సార్వత్రిక ఆరోగ్య కల సాకారం అవుతుంది.

ఎదుర్కొంటున్న సవాళ్లు

కాపీరైట్, ఇతర నిర్వహణ యాజమాన్య వ్యవస్థల వల్ల డిజిటల్ పరిష్కార వేదికలు అందరికీ అందుబాటులోకి రావడం లేదు. కొన్ని డిజిటల్ సాధనాలు లేదా ఓపెన్ సోర్స్ పరిష్కార మార్గాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటి వినియోగం పరిమితంగానే ఉంది. దీనికి ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ లేకపోవడం అని చెప్పుకోవచ్చు.

ప్రపంచ స్థాయిలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, ఈ ప్రయత్నాలు విడివిడిగా ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా దేశాల మధ్య సహకారం లేకుండా సాగుతున్నాయి. దీనికోసం ప్రపంచ దేశాలు ఒక వేదిక పైకి వచ్చి సంఘటిత ప్రయత్నాలు సాగించాలి. దీనికి జీ–20 ఒక సమగ్ర, పటిష్ఠ వేదికగా పనిచేస్తుంది. ఈ ప్రయత్నాలు భవిష్యత్తు అవసరాలకు అవసరమైన డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధికి దారి తీస్తాయి.

జీ–20 అధ్యక్ష హోదాలో...

ప్రపంచ ప్రజల సంక్షేమం కోసం పటిష్ఠమైన డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయగల సామర్థ్యం భారతదేశానికి ఉంది. దీనికి అవసరమైన ప్రణాళిక కూడా భారతదేశం వద్ద సిద్ధంగా ఉంది.

ముందుగా విడివిడిగా జరుగుతున్న ప్రయత్నాలను సంఘటితం చేయాల్సి ఉంటుంది. అందరికీ ఆమోదయోగ్యంగా, అందరికీ ప్రయోజనం కలిగించేలా ఈ చర్యలు అమలు జరగాలి. దశాబ్దాల క్రితం ఇంటర్నెట్ అభివృద్ధి కోసం జరిగిన ప్రయత్నం, కృషి మరోసారి డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధి కోసం జరగాల్సి ఉంటుంది. ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సమాచార మార్పిడిపై దేశాల మధ్య నమ్మకం పెరిగేలా చూసి, అవసరమైన నిధులు సమకూర్చడానికి ప్రపంచ స్థాయిలో ప్రయత్నాలు జరగాలి.

జీ–20 అధ్యక్ష హోదాలో కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం సాధించడానికి భారతదేశం పని చేస్తోంది. ఆచరణ సాధ్యమైన వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలు ముఖ్యంగా దక్షిణ దేశాలు ప్రయోజనం పొందేలా చూసేందుకు భారతదేశం కృషి చేస్తోంది. స్వప్రయోజనాలను పక్కన పెట్టి సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం ప్రపంచ దేశాలు నడుం బిగించాలి. 'వసుధైక కుటుంబం' స్ఫూర్తితో ప్రపంచ ఆరోగ్యం కోసం కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమయింది.

వ్యాసకర్త కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు – ఎరువుల శాఖ మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

లెజెండ్ వెళ్లిపోయారు!



నా జీవిత కాలంలో బహుశా అత్యంత గొప్ప అమెరికన్ రచయిత కార్మాక్ మెక్‌కార్తీ తన 89వ ఏట వెళ్లిపోయారు. ఆయన సంపూర్ణ జీవితం అనుభవించారు. అయినా దుఃఖంచకుండా ఉండలేక పోతున్నాను. ('నో కంట్రీ ఫర్ ఓల్డ్ మెన్', 'ద రోడ్' లాంటి నవలలు రాశారు మెక్‌కార్తీ.)

– స్టీఫెన్ కింగ్, రచయిత

అక్కర్లేని గొప్పతనం



మేము గడ్డి తినాల్సి వచ్చినా సరే అణు బాంబు తయారు చేస్తాం అన్నది పాకిస్తాన్. అన్నట్టే చేయగలిగింది. నిజంగానే ఇప్పుడు గడ్డి మీదే బతుకుతోంది. కానీ ఆ గడ్డి కూడా అయిపోతే?

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

అంతా మానసికం!



ఏ సెలవు నుంచో రాగానే అప్పటి దాకా ఫ్రిజ్‌లో ఉన్న సీసాల్లోని నీటిని పారబోసి, వాటర్ ఫిల్టర్ లోంచి 'ఫ్రెష్ వాటర్' నింపిపెడుతుంటారు కొందరు. అవి ఫ్రెష్షా? అవి ఎప్పటి నుంచో అక్కడే ఉన్న నీళ్లు కదా? పోనీ, మున్సిపాలిటీ నీళ్లు కూడా ఎప్పటివో కదా!

– సౌమిత్ర పఠారే, సైకియాట్రిస్ట్

ఇంకానా?



ఆరు ఆఫ్రికా దేశాలు తమ అధికార భాషగా పోర్చుగీస్ మాట్లాడుతాయి. 29 ఫ్రెంచ్ మాట్లాడుతాయి. 24 ఇంగ్లీష్ మాట్లాడుతాయి. ఇంకొక మనిషి భాష మాట్లాడటం, వారి దేవుళ్లను పూజించడం, వాళ్ల పేరు మన పిల్లలకు పెట్టుకోవడం అనేది స్వేచ్ఛా కాదు, స్వాతంత్ర్యమూ కాదు. ఆఫ్రికా అనేది వలసవాద వారసత్వం!

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్టు

పీచు తినాలి



మధుమేహం ఉన్నవాళ్లు తమ భోజనంలోకి అత్యధిక పీచు ఉన్న పదార్థాలను చేర్చుకోవడం అనేది ఎంతో లాభదాయకం. ఈ ఆహార పదార్థాలు తక్కువ కేలరీలు, చక్కెర కలిగి ఉంటాయి. మధుమేహ నియంత్రణకు చక్కగా ఉపకరిస్తాయి.

– వి.మోహన్, మధుమేహ స్పెషలిస్ట్

సారాంశం

సరికొండ చలపతి

సంఘం చెక్కుతున్న 'కసి'ల్పాలు

ఓ రాజుగారికి బావమరిది అంటే గిట్టదు. ఆ రాజుగారు మంచాన పడ్డారు. చివరి ఘడియల్లో మతాచార్యులవారు ధైర్యం చెబుతూ 'నీ శత్రువులందరినీ క్షమిస్తే గానీ స్వర్గానికి వెళ్లే అవకాశం లేదు'అన్నాడట. రాజుగారు వెంటనే భార్యను పిలిచి 'నీ ముద్దుల సోదరుడిని క్షమించానని రాయి.. నే చనిపోయింతర్వాత ఆ ఉత్తరం పోస్టు చెయ్యి..' అని చివరి సందేశం వినిపించి కళ్లు మూశాడు.
చివరి ఘడియల్లోనూ అదే కసి..

.....

ఫ్రెడరిక్ చక్రవర్తి సైన్యాన్ని కఠోర నియమాలతో అదుపులోకి తెచ్చే శిక్షణలో పేరు పడ్డాడు. రాత్రుళ్లు పదకొండు దాటాక గుడారాల్లో ఎవ్వరూ దీపం వెలిగించి ఉంచకూడదని, ఉంచితే ఉరిశిక్షేనని ఉత్తర్వు జారీ చేశాట్ట. ఓ రోజు తనిఖీకి వెళ్లి కెప్టెన్ టెంట్ హౌస్‌లో ప్రవేశించి ఆయన దీపం వెలుతురులో ఉత్తరం రాస్తున్న దృశ్యం చూశాడట. ఆ ఉత్తరం ఎవరికి? అని అడిగాడు. ' నా భార్యకి..' అని కెప్టెన్ భయంగా సమాధానం చెప్పాడు. అయితే.. నేను చెబుతాను మరో వాక్యం రాయి.. అని 'నేను రేపు చచ్చిపోతున్నాను.' అన్న వాక్యం రాయించాడట. తెల్లారి ఆ కెప్టెన్‌ను ఉరి తీశారని చెప్పక్కర్లేదుగా.. ఇదోరకం కసి..

.....

ప్రముఖ రచయిత బుచ్చిబాబు 'కసి' పై రాసిన వ్యాసంలో చరిత్రలోంచి చెప్పిన ఉదాహరణలు. దాన్ని ఆయన 'కసిత్వం'గా పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న, పేరుకుపోయిన కసిని కాస్త తీవ్రంగా, కాస్త విశ్లేషణగా, కాసింత వెటకారంగా, మరింత ఆందోళనతో, ఆ వ్యాసంలో చర్చించారు. కసిత్వం, అచ్చంగా ద్వేషం మాత్రమే కాదు. ప్రపంచంపై రేగి ప్రసారమైన కోపం, ఆవేశం అంటారాయన. ఇది చాలా ఏళ్ల కిందటి మాట. ఇవాళ అదే కసిత్వంపై వ్యాసం రాస్తే ఒళ్లు గగుర్పొడిచే ఉదాహరణలు కనిపిస్తాయి.. ద్వేషం, అసూయ, ఆవేశం కలగలిపిన కసిత్వం తాలూకు పరాకాష్ట రోజూ వివిధ సంఘటనల రూపంలో మనల్ని కలవర పరుస్తూనే ఉంది.

- తనతో సహజీవనం చేసి ఆనందం, దుఃఖం పంచుకున్న ఒక అమ్మాయిని చంపి, ముక్కలుగా చేసి, కొన్ని ముక్కలు కుక్కర్లో ఉడికించి, కొన్ని మిక్సీలో వేసి.. – **మనసు చాలా రోజులపాటు వేటాడే కసిత్వం.**
- తాను ఇష్టపడ్డ, తనను ప్రేమించిన అమ్మాయి మరో యువకుడిని ఇష్టపడుతుందని, అతనివైపు మరలుతుందేమోనన్న అనుమానంతో అందరూ చూస్తుండగానే..20 సార్లు కత్తితో పొడిచి.. మళ్లీ వెనక్కు వచ్చి..బండరాయితో తలపై బాది.. **నిన్నటిదాకా ప్రేమగా ఉన్న అమ్మాయిపై ఈ స్థాయి కసిత్వం.. ఊహకు అందనిది.**
- ఒక అమ్మాయితో సంబంధం నెరపి, తనను పెళ్లి చేసుకోవాల్సి వస్తుందని.. ఆమెను చంపి ఉప్పు పాతర వేసి..దానితోపాటు నిన్నటి సంతోషాలు, స్నేహాలను కూడా పాతరేసి.. **ఇలా రోజుకో సంఘటన.. రోజుకో షాక్.. ఎంత కసిత్వంతో సమాజం నడుస్తుందో.. మనుషులకు మృగాలకు అంతరం ఎలా తరిగిపోతోందో.. అన్నీ ఉదాహరణలే.**

.....

ప్రేమ ద్వేషం పుట్టుపూర్వోత్తరాలు (Origin of Love and Hate)అనే గ్రంథంలో 'అయన్ సట్టి' అనే మానసిక శాస్త్రజ్ఞుడు ఇలా రాశారు.. "**ద్వేషంగా మారిన ప్రేమను మించిన ద్వేషం భూ ప్రపంచంలో లేదు...**' పై సంఘటనలు చూస్తే ఆయన మాట నిజం అనిపిస్తోంది.
ఇవన్నీ ఎప్పుడో అరుదుగా సంఘటనలైతే వ్యక్తిగతంగా వారి ప్రవర్తన లోపం కింద సర్దుకోవచ్చు గానీ.. తరచుగా జరుగుతున్న సందర్భం ఇది. మనం ఉంటున్న సమాజాన్నే దీనికి కారణంగా చెప్పాల్సి ఉంటుంది.

.....

ఇవన్నీ ఉన్మాద సంఘటనలు గానే మనం సరిపెట్టుకుని బాధ్యత నుంచి సమాజం తప్పుకున్నా.. మనం పైన చెప్పుకున్న 'అయన్ సట్టి' చెప్పిన మరోమాట మాత్రం అనుక్షణం గుర్తుపెట్టుకోవాల్సిందే. – ఎందుకంటే ఇప్పుడు సమాజంలో జరుగుతున్నదిదే కనుక. "**నిందించబడిన శిశువుని మించిన కాఠిన్యం నరకంలో కూడా లేదు. తద్వారా బాల్యంలో ప్రబలిన 'కసి' అత్యంత ప్రమాదకరం...**'..

ఆ మధ్య విద్యారంగంపై జరుగుతున్న చర్చల్లో ఒక మానసిక నిపుణుడు చెప్పిన మాట చూడండి.
'తన ర్యాంకు కార్డుతో ఆనందంగా మీ దగ్గరకు పరుగెత్తుకు వచ్చిన చిన్నారి మొహంలో సంతోషంతో పాటు.. చిన్నారి కళ్లలో 'కసి'ని చూశారా..' మీరు గమనిస్తే అది పిల్లల్లో మనం ఇంజెక్ట్ చేస్తున్నదే, దయ, జాలి, స్నేహం, సాన్నిహిత్యం, పరస్పర మద్దతు స్థానంలో నిర్దయగా సమాజం పిల్లలో పోటీ, మంచి లైఫ్ పేరుతో ప్రవేశ పెడుతున్న రుగ్మత.. అది సమాజానికి శాపం.' – అని కుండబద్దలు కొట్టేశాడు.
పైన చెప్పిన 'అయన్ సట్టి' మాటలతో సరిపోల్చుకోవాల్సిన విషయం ఇది. సమాజం రూపురేఖలను నిర్ధారించే ఓ తరం కళ్లలో కసితో పెరుగుతోంది. ఆయన చెప్పినట్టు అత్యంత ప్రమాదకరంగా...
లైఫ్ రేసు లాంటిది.. నువ్వు పరుగెత్తకపోతే వెనుకబడిపోతావ్.. అని పోటీ ప్రపంచంలోకి పిల్లలను, బాల్యాన్ని నెట్టి పక్క వారిని స్నేహితులుగా, సహోద్యోగులుగా, తోటి మానవులుగా కాక ..పోటీ దారుల్లాగా చేస్తోంది ఈ విద్యావ్యవస్థ అంటారు బెర్ట్రాండ్ రస్సెల్. ఆయన ఇది చెప్పి పోయి దశాబ్దాలైనా.. ఇంకా అదే ఒరవడి, ఇంకాస్త బలంగా, స్పీడ్‌గా కొనసాగిస్తున్నాం.

.....

పోటీ అనేది సొంత అభివృద్ధికి, సొసైటీ బెటర్‌మెంట్‌కు అవసరమే. కానీ ఎవరితో పోటీ పడుతున్నాం, ఎందుకు పోటీ పడుతున్నాం అనేది కూడా చూసుకోవాల్సిందే. లేకుంటే పోటీ పడుతున్న తీరు సొసైటీ మానసిక ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని మానసిక శాస్త్రజ్ఞులు ప్రతి సందర్భంలో హెచ్చరిస్తూనే ఉన్నారు. సమాజంలో అనేక జాడ్యాలకు ఇది కారణం అవుతుందని చెబుతూనే ఉన్నారు. పోటీ అనివార్యమైతే ఎలాగోలా.. గెలవడమే మార్గం. టీఎస్‌పీఎస్సీ స్కామ్ దీనికి ఉదాహరణ. దీని మూలం పైన మానసిక శాస్త్రజ్ఞులు చెప్పిన దాంట్లోనే ఉంది. జేఈఈ పరీక్షల్లో స్మార్ట్ కాపీయింగ్, జామర్లు పెట్టి పరీక్షలు నిర్వహించాలన్న మేధావుల సూచన పరాకాష్ఠ. లక్షలాది యువకులు.. పిడికెడు అవకాశాలు పోటీలో పరుగెత్తాలన్న సొసైటీ ప్రోద్బలం... తద్వారా పెరుగుతున్న కసిత్వం.. ఎక్కడికి దారి తీస్తుందో చెప్పడానికి ఇది ఉదాహరణ

.....

ఐఐటీయన్ అయిన తన పిల్లాడిని కోల్పోయిన ఓ తండ్రి మాట వినండి.
''పొరుగు వారి కన్నా బాగుండాలని నేర్పించే సమాజంలో ఉన్నాం.. విద్యావ్యవస్థ, ఉద్యోగాల అవస్థ.. మన పిల్లలను పక్కోడితో ఎప్పుడూ పోటీలోనే ఉంచుతుంది.. తోటివారికన్నా మంచిర్యాంకు, మంచి డిగ్రీ, మంచి ఉద్యోగం, మంచి ఇల్లు, మంచి కారు.. మంచి కంఫర్ట్.. పోటీయే జీవితం.. ఎల్‌కేజీ అయినా, ఐఐటీ అయినా, ఐఏఎస్ అయినా., అంతే. గెలుపు తప్ప ఓటమికి వీలులేని లైఫ్. ఎలాగోలా గెలవడం.. ఎలాగోలా కంఫర్ట్ సాధించడం.. ఎలాగోలా.. ఇవన్నీ వ్యక్తుల్లో, సమాజంలో అలజడికే దారి తీస్తాయి కదా..? చివరికి వారి ఆత్మహత్య కూడా సమాజంపై వారు చూపించే నిరసనే..''

.....

.. ఈసారి మంచి ర్యాంకుతో, ఉద్యోగంతో మీ దగ్గరకు వచ్చిన పిల్లల కళ్లలోకి చూడండి. పైన పెద్ద మనిషి హెచ్చరించిన 'కసి' కనిపిస్తుందేమో.
ఒక వేళ కనిపిస్తే.. మంచి ర్యాంకు రాని నాడు, మంచి ఉద్యోగం రాని నాడు, ఓటమి అనివార్యమైననాడు.. అంతటి 'కసిత్వం' పిల్లలను ఎటువైపు నడిపిస్తుందో ఊహించండి. పైన చెప్పుకున్న అనేక అమానవీయ సంఘటనలకు, లేదా ఆత్మహత్యలకు బీజం పడకుండా ఆపగలుగుతాం.

• ఈ ఫ్యామిలీ 'పాస్'



అత్యధిక మార్కులు, ర్యాంకులు, తోటివారితో పోటీలకు భిన్నమైన, ఆనందకరమైన చిత్రమిది. పదోతరగతి బోర్డు పరీక్షలలో తమ కుమారుడు 35 శాతం మార్కులు సాధించినందుకు ముంబైలో ఓ కుటుంబం చేసుకుంటున్న సంబరం.. నెటిజన్లనుంచి ప్రశంసలందుకుంది.

బహుజన హితం

త్రిపిటకాల్లో రెండవదీ, అత్యంత ప్రాధాన్యత గలదీ సుత్తపిటకం. బహుజనుల హితం కొరకు, బహుజనుల సుఖం కొరకు బుద్ధ భగవానుడు ప్రవచించిన అన్ని సందేశాలను సమగ్ర రూపంలో ఈ పిటకంలో సంకలన పరిచారు. బుద్ధుని ముఖ్య శిష్యులైన సారిపుత్ర, మౌద్గల్యాయన, ఆనందుల సందేశాలను కూడా కొన్నింటిని ఇందులో చేర్చారు. బుద్ధుని మహాపరినిర్వాణం తర్వాత మూడు నెలలకు రాజగృహంలో బుద్ధుని ముఖ్య శిష్యులైన మహాకాశ్యపుడు, ఆనందుడు, ఉపాలి వంటి వారితో ఒక సభ ఏర్పాటయింది. ఆ సభలోనే మొట్టమొదటిసారిగా బుద్ధుని ఉపదేశాలను సంగ్రహ పరిచారు. సుత్తపిటకంలోని బుద్ధుని అన్ని సందేశాలు ఆనందుడు విని చెప్పినట్లుగా ఉంటాయి. అన్ని సందేశాలు 'ఏవం మే సుతం' –'నేను ఈ విధంగా వినటం జరిగింది' – అని



మొదలవుతాయి. ప్రవచనాలన్నీ సందర్భానికి తగినట్లుగా, వినే జనుల స్థాయిని దృష్టిలో పెట్టుకుని చెప్పినట్లుగా ఉంటాయి. బుద్ధుడు తన ప్రవచనాలను కేవలం భిక్షువులనే కాకుండా, సామాన్య ప్రజానీకాన్నీ, రాజులను, వివిధ మత శాఖల వారినీ ఉద్దేశించి చేశాడు. పువ్వుల్ని ఒక దారం ఎలా మాలగా కలిపి ఉంచుతుందో, బుద్ధవచనాల్ని సుత్తపిటకం అలా సంకలన రూపంలో కలిపి ఉంచింది.

సుత్తపిటకం ఐదు నికాయాలుగా విభజింపబడింది. అవి దీర్ఘనికాయం, మధ్యమ నికాయం, సంయుక్త నికాయం, అంగుత్తర నికాయం, ఖుద్దక నికాయం, నికాయం అంటే సమూహం.

సుత్తపిటకాన్ని అధ్యయనం చేయటం వల్ల బుద్ధుడు ప్రవచించిన ధార్మిక బోధలు, ఆయన కాలం నాటి తాత్వికులు, వారి తాత్విక సిద్ధాంతాలు తెలుస్తాయి. జ్ఞాన సముపార్జనకు బుద్ధుడు ఏవిధంగా శ్రమించిందీ, ఎవరెవరిని కలిసిందీ, చివరి రోజులు ఏవిధంగా గడిపిందీ తెలుస్తుంది. ధ్యానానికి సంబంధించి బుద్ధుడు ప్రవచించిన 'ఆనా పాన సతి' సుత్తం, 'మహాసతి పఠాన' సుత్తం ఇందులోనే ఉన్నాయి. ఇవేకాక 'ధర్మచక్ర ప్రవర్తన' సుత్తం, 'మహాపరినిర్వాణ' సుత్తం కూడా సుత్త పిటకంలోనే ఉన్నాయి.

సుత్తపిటకంలో బుద్ధుడు ప్రతిపాదించిన ధర్మాన్ని గురించి సంక్షిప్తంగా చెప్పమంటే ఇలా చెప్పవచ్చు. ప్రపంచంలో, జీవితంలో దుఃఖం ఉంది. ఆ దుఃఖానికి కారణం ఉంది. దుఃఖం నుండి విముక్తి పొందే వీలు ఉంది. దుఃఖం నిరోధానికి మార్గం ఉంది. ఇవే నాలుగు ఆర్య సత్యాలు. విముక్తి మార్గాన్ని అష్టాంగ మార్గం అంటారు. ఈ మార్గమే బౌద్ధులకు శిరోధార్యం.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.9.10 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** భరణి ప.3.11 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.3.17 నుండి 4.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.43 వరకు తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.23 నుండి 11.54 వరకు, **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.31.

బ్యాటరీ బండి దూకుడు

గ్రేటర్‌లో మూడేళ్లలో 50 వేలు దాటిన ఎలక్ట్రిక్ వాహనాలు

- టాప్‌గేర్‌లో బైక్‌ల అమ్మకాలు
- గతేడాది 22 వేలకుపైగా రోడ్డెక్కిన ద్విచక్రవాహనాలు
- సుమారు రూ.220 కోట్లకుపైగా పన్ను రాయితీ



సాక్షి, హైదరాబాద్: బ్యాటరీ బండి పరుగులు పెడుతోంది. పర్యావరణ హితమైన వాహనాల పట్ల నగర వాసులు క్రమంగా ఆసక్తి చూపుతున్నారు. పెరుగుతున్న పెట్రోల్ ధరలతో చాలా మంది ఇంధన భారాన్ని తగ్గించుకొనేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లుతున్నారు. వాటిలో రవాణా వాహనాల కంటే ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో అమ్ముడవుతున్నాయి. గతేడాది 23 వేలకు పైగా ద్విచక్ర వాహనాలు రోడ్డెక్కాయి. ఈ సంవత్సరం మే చివరి నాటికి 12 వేలకు పైగా కొనుగోళ్లు నమోదయ్యాయి. ఈ లెక్కన ఈ ఏడాది చివరి నాటికి ఈ సంఖ్య 25 వేలు దాటవచ్చునని అధికారులు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మొదటి లక్ష వాహనాలకు జీవితకాల పన్ను నుంచి రాయితీ కల్పించిన సంగతి తెలిసిందే. వ్యక్తిగత కేటగిరీకి చెందిన సుమారు 47 వేలకు పైగా కార్లు, బైక్‌లపైన ఇప్పటి వరకు రూ.220 కోట్ల వరకు రాయితీని అందజేశారు. మరో 53 వేల వాహనాలకు ఈ రాయితీ సదుపాయం వర్తించనుంది. రానున్న రెండేళ్ల వరకు ఈ అవకాశం ఉండవచ్చునని రవాణా అధికారులు అంచనా వేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలే టాప్....

మొదట్లో చాలా మంది ఎలక్ట్రిక్ వాహనాల పట్ల విముఖత చూపారు. నాణ్యత లేని బ్యాటరీల వల్ల ప్రమాదాలు జరిగాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా సికింద్రాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఉదంతంతో చాలా మంది వెనుకడుగు వేశారు. దీంతో వాహన తయారీ సంస్థలు బ్యాటరీల నాణ్యతపైన ప్రధానంగా దృష్టి సారించాయి. ప్రముఖ వాహన తయారీ సంస్థలు ఎలక్ట్రిక్ వాహనరంగంలోకి ప్రవేశించడంతో సమర్థవంతమైన బ్యాటరీలు కలిగిన బండ్లు మార్కెట్‌లోకి వచ్చాయి. దీంతో వాహనదారుల్లో వాటిపైన నమ్మకం కలిగింది. ఫలితంగా వీటి కొనుగోళ్లు పెరిగాయి. 2021 నుంచి ఇప్పటి వరకు అన్ని రకాల వాహనాలు కలిపి సుమారు 50 వేలకు పైగా నమోదు కాగా, గతేడాది అనూహ్యంగా 27 వేలకు పైగా రోడ్డెక్కాయి. వీటిలో 23 వేలకుపైగా ద్విచక్ర వాహనాలే కావడం గమనార్హం.

భారీగా వెయిటింగ్ లిస్టు...

ప్రస్తుతం డిమాండ్ మేరకు వాహనాలు లభించడం లేదు. కొన్ని బ్రాండ్‌లకు చెందిన వాహనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని కనీసం 3 నెలల పాటు ఎదురు చూడవలసి వస్తోంది. పెట్రోల్ వాహనాల కంటే ధర కొద్దిగా ఎక్కువే అయినా ఇంధన భారాన్ని దృష్టిలో ఉంచుకొని చాలా మంది ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ఒకసారి చార్జింగ్ చేస్తే 50 నుంచి 60 కిలోమీటర్ల వరకు మాత్రమే బండి నడిచేది. ఇప్పుడు వంద కిలోమీటర్ల వరకు పరుగులు పెట్టే వాహనాలు అందుబాటులోకి వచ్చాయి.

మూడేళ్లుగా గ్రేటర్ హైదరాబాద్‌లో నమోదైన ఎలక్ట్రిక్ వాహనాల వివరాలు...

వాహనాలు	2021	2022	2023 (మే వరకు)
కార్లు	899	2,495	2,638
క్యాబ్‌లు	39	362	227
ఆటోరిక్షాలు	43	267	196
గూడ్స్ వాహనాలు	529	1,018	371
ద్విచక్రవాహనాలు	5,904	23,511	12,281
మొత్తం వాహనాలు	7,414	27,653	15,713

నిస్సందేహంగా కొనొచ్చు



ఎలక్ట్రిక్ వాహనాల నాణ్యత చాలా బాగుంది. ఎలాంటి సందేహం లేకుండా వాహనాలు కొనుగోలు చేయవచ్చు. నాణ్యమైన బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉన్న వాహనాలే ఇప్పుడు మార్కెట్‌లోకి వస్తున్నాయి. దీంతో భద్రతా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. – సంధ్య గద్దె, ఎలక్ట్రిక్ వాహన డీలర్, లింగంపల్లి

పెట్రో 'బాదుడు' నుంచి ఊరట



పెట్రోల్ ధరల దృష్ట్యా బండి బయటకు తీయాలంటేనే వెనుకడుగు వేయాల్సి వస్తోంది. బ్యాటరీ బండితో చాలా వరకు ఈ భారం తగ్గుతుంది. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం చేయవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ చార్జింగ్ అయ్యే వాహనాలు వస్తే బాగుంటుంది. – కోల రవికుమార్ గౌడ్

ధరలు కాస్త ఎక్కువే



లైఫ్ ట్యాక్స్ నుంచి మినహాయింపునిచ్చినప్పటికీ ధరలు ఎక్కువగానే ఉన్నాయి. మధ్యతరగతి వర్గాలకు భారంగానే ఉంది. పెట్రోల్, డీజిల్ భారాన్ని దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రిక్ వాహనాల వైపు వస్తున్నారు. కానీ ధరలు చూడగానే వెనుకడుగు వేయాల్సి వస్తోంది. – సుధాకర్‌రెడ్డి

రక్తదానం జీవన దానమే!

- అపోహలను తొలగించి అవగాహన కల్పించాలి
- ఏటా ఒక్కసారైనా రక్తదానం చేయాలి
- అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవంలో గవర్నర్ తమిళిసై



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: రక్తదానాన్ని ప్రోత్సహించడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, దీనిపై అపోహలను తొలగించి సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. రక్తదానం అంటే జీవన దానమే అని స్పష్టం చేశారు. కృత్రిమ శ్వాస పరిజ్ఞానం (సీపీఆర్) పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఏటా ఒకసారైనా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె 50సార్లకుపైగా రక్తదానం చేసిన దాతలు, అత్యధిక యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకు గాను టీసీఎస్, ఎస్‌బీఐ స్టాఫ్ కళాశాల, ఉస్మానియావర్సిటీ, ఐసీఐసీఐ బ్యాంకులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ, నిజామాబాద్ యూనిట్లు ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను పొందడాన్ని అభినందిస్తూ ఇందుకు కృషి చేసిన స్థానిక ప్రతినిధులు డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి, ఈవీ శ్రీనివాస్, బుస్సా అంజన్నకు సైతం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇప్పటి వరకు 139 సార్లు రక్తదానం చేసిన అంజయ్య, 50 సార్లు రక్తదానం చేసిన అతడి భార్య పి.మనోరమతో పాటు కొత్తగా పెళ్లైన దంపతులు కుద్రె సిద్ధార్థ్, శ్రీలేఖ, మరో పీజీ వైద్య విద్యార్థిని ఈ కార్యక్రమంలో రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ తెలంగాణ చైర్మన్ అజయ్‌మిశ్రా, వైస్ చైర్మన్ సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను పటిష్టంగా అమలు చేయాలి

రాష్ట్రంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. బుధవారం ఆమె రాజ్‌భవన్‌లో ఎన్ఐఆర్‌డీ, పీఆర్ సీనియర్ అధికారులతో కేంద్ర ప్రాయోజిత పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నీటివనరుల మ్యాపింగ్‌తోపాటు వాటి నిర్వహణ, పునరుజ్జీవనానికి ప్రాధాన్యతతో పాటు పునరుత్పాదక ఇంధన వనరుల ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్వయం సహాయక బృందాల మహిళలు తయారు చేసే వస్తువులకు మార్కెటింగ్ కష్టసాధ్యంగా మారుతున్నందున ప్రపంచస్థాయిలో ప్రత్యేకంగా ఈ–మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించే దిశలో చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

డిగ్రీ చేస్తే జాక్‌పాట్

సంప్రదాయ డిగ్రీలకు ఆధునిక హంగులు..

- సాంకేతిక విద్యతో తీసిపోని కోర్సులు
- హానర్స్ డిగ్రీల జోరు... మార్పులతో హుషార్
- డిగ్రీ విద్యార్థుల కోసం ఐటీ కంపెనీల క్యూ...
- ప్రధాన కాలేజీల్లో క్యాంపస్ నియామకాలు



సంవత్సరం	మొత్తం ప్రవేశాలు	బీకాం	బీఎస్సీ	బీబీఏ	బీసీఏ
2017–18	2,00,806	80,776	91,937	1,765	336
2018–19	2,01,866	78,842	90,786	3,147	334
2019–20	2,02,342	80,891	83,209	7,131	656
2020–21	2,22,620	90,267	90,423	7,564	1,070
2021–22	2,55,132	1,07,137	94,809	12,066	1,564
2022–23	2,10,970	87,480	75,896	11,823	3,100

సాక్షి, హైదరాబాద్: డిగ్రీనా... అనే చులకన భావం ఇక నుంచి ఉండదంతే. దేశవ్యాప్తంగా డిగ్రీ కోర్సులకు భవిష్యత్‌లో డిమాండ్ పెరగబోతోంది. ఇంతకాలం కొనసాగిన సంప్రదాయ కోర్సుల్లో అనేక మార్పులు తెస్తున్నారు. సాంకేతిక విద్యకు తీసిపోని రీతిలో సాన పడుతున్నారు. దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలుండేలా తీర్చి దిద్దుతున్నారు. అనేక కొత్త కోర్సుల మేళవింపు, కంప్యూటర్ అప్లికేషన్ల గుభాళింపు డిగ్రీ కోర్సుల తీరు తెన్నులనే మార్చబోతోంది.

హానర్స్ కోర్సులకు ప్రాధాన్యం

తెలంగాణ సహా దేశంలో అన్ని రాష్ట్రాలూ మూడేళ్ళ డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగేళ్ళ హానర్స్ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించింది. ఈ ఏడాది నుంచే తెలంగాణలో నాలుగేళ్ళ బీఎస్సీ (హానర్స్) కంప్యూటర్స్‌ను 50కి పైగా కాలేజీల్లో అందుబాటులోకి తెస్తున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి అతి ముఖ్యమైన అంశాలు హానర్స్‌లో చోటు చేసుకోబోతున్నాయి. నూతన జాతీయ విద్యావిధానం –2020కి అనుగుణంగా ఎగ్జిట్ ఆప్షన్ కూడా ఇచ్చారు. నాలుగేళ్ళు చదివితే హానర్స్ డిగ్రీ ఇస్తారు. మూడేళ్ళకే మానుకుంటే సాధారణ డిగ్రీ సర్టిఫికెట్ ఇస్తారు. దీంతో పాటు ఏ తరహా డిగ్రీ చేసినా, ఇష్టమైన ఓ సబ్జెక్టును చేసే సరికొత్త విధానం అందుబాటులోకి తెచ్చారు. అంటే బీఏ కోర్సు చేస్తున్న విద్యార్థి కూడా కంప్యూటర్ కోర్సుకు సంబంధించిన ఓ సబ్జెక్టు చేసే వీలుంది.

వాణిజ్య విప్లవంలో డిగ్రీకి ప్రాధాన్యత

గత దశాబ్ద కాలంగా ప్రపంచవ్యాప్తంగా ఈ–కామర్స్ రాజ్యమేలుతోంది. దీంతో కామర్స్ డిగ్రీ నేపథ్యం ఉన్న వారికి మంచి డిమాండ్ వచ్చింది. కంప్యూటర్స్ పరిజ్ఞానంతో కూడిన అనలిస్టులు, అకౌంటెంట్లకు మంచి వేతనాలతో కూడిన ఉపాధి లభిస్తోంది. ఈ కారణంగా డిగ్రీ కోర్సుల్లో కామర్స్‌ను ఎంచుకునే వారి సంఖ్య 36 శాతం నుంచి 41 శాతానికి పెరిగింది. బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ)లో చేరికలు కూడా ఆరేళ్ళల్లోనే ఏడు రెట్లు పెరిగాయి. బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ)లో ప్రవేశాలు 9 రెట్లు పెరిగాయి. దీంతో బీకాం కోర్సులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. బీకాం జనరల్‌తో పాటు, కంప్యూటర్స్, టాక్సేషన్, హానర్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి కొత్త స్పెషలైజేషన్‌ను తీసుకొచ్చారు. బీమా, స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెరగడం, జీఎస్టీ తీసుకురావడంతో టాక్స్ నిపుణుల అవసరం రెట్టింపయింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఈ–కామర్స్, రిటైల్ సంస్థల పెరుగుదల కూడా కలిసివచ్చింది.

కొన్నేళ్ళుగా డిగ్రీలో ప్రవేశాలు ఇలా

సంవత్సరం	డిగ్రీలో చేరిన వారు
2017–18	2,00,806
2018–19	2,33,946
2019–20	2,15,467
2020–21	2,47,601
2021–22	2,55,132
2022–23	2,12,818

పెరుగుతున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

కేవలం ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్ళే ఐటీ కంపెనీలు ఇప్పుడు నాణ్యమైన విద్యను అందించే డిగ్రీ కాలేజీల్లోనూ నియామకాలు చేపడుతున్నాయి. నాన్–ఇంజనీరింగ్‌గా పిలిచే డిగ్రీ విద్యార్థులను గత రెండేళ్ళుగా పెద్ద ఎత్తున తమ కంపెనీల్లో చేర్చుకుంటున్నాయి. రాష్ట్రంలో 110 వరకూ ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీలున్నాయి. ఇందులో హైదరాబాద్‌లోనే దాదాపు 300 కాలేజీలున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు వంద కాలేజీల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ చేపడుతున్నారు. ఫార్మా, బ్యాంకింగ్, రిటైల్, మార్కెటింగ్ కంపెనీలతో పాటు టీసీఎస్, కాగ్నిజెంట్, విప్రో, సీజీఎల్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ కోసం వస్తున్నాయి. ప్రతీ ఏటా ఈ కంపెనీలు 10 నుంచి 20 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. రూ. 3 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకూ వార్షిక వేతనం ఇస్తున్నాయి.

అద్దెకు ఎంజీబీఎస్, జేబీఎస్ కార్యాలయాల ప్రాంగణం

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్‌స్టేషన్ల పైఅంతస్తుల్లో ఉన్న ప్రాంగణాలను వాణిజ్య అవసరాలకు అద్దెకు ఇచ్చేందుకు ఆర్టీసీ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఆయా బస్టాండ్ల పైఅంతస్తుల్లో అధికారుల కార్యాలయాలు కొనసాగుతున్నాయి. వాటిని దశలవారీగా తరలించి ప్రైవేటు సంస్థలకు అద్దెకివ్వాలని ఆర్టీసీ నిర్ణయించింది. గతంలో హైదరాబాద్‌తోపాటు కొన్ని ప్రధాన పట్టణాల్లో బస్టాండ్లను వాణిజ్య అవసరాలకు వీలుగా నిర్మించింది. నగరంలో కోఠి, కాచిగూడ, కూకట్‌పల్లి, మిధాని తదితర ప్రాంతాల్లో ఇలాంటి ప్రాంగణాలు నిర్మించింది. కానీ అవి అనుకున్నంతగా సక్సెస్ కాలేదు. అవి ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇప్పుడు ఎంజీబీఎస్, జేబీఎస్‌లోని అధికారుల కార్యాలయాలను వీటిల్లోకి మార్చి ప్రధాన బస్టాండ్ల పైఅంతస్తుల్లోని స్థలాలను అద్దెకివ్వబోతోంది. ఈ మేరకు ప్రస్తుతం జేబీఎస్ మొదటి అంతస్తులో ఉన్న గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ కార్యాలయాన్ని మిధానిలోని ఆర్టీసీ వాణిజ్య సముదాయంలోకి, ఎంజీబీఎస్ పైఅంతస్తులో ఉన్న హైదరాబాద్ జోన్ ఈడీ కార్యాలయాన్ని కాచిగూడలోని ఆర్టీసీ వాణిజ్య సముదాయ ప్రాంగణంలోకి మారుస్తూ బస్‌భవన్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. త్వరలో మిగతా కార్యాలయాలు కూడా మార్చే అవకాశం ఉంది.

భాటి మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్ర పోలీసు శాఖలో గ్రేహౌండ్స్ దళాల సృష్టికర్త, శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతగానో కృషిచేసిన పద్మశ్రీ నారాయణ సింగ్ భాటి (ఎస్.ఎస్.భాటి) మృతి పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బుధవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్లుప్తంగా...

నో నైటీ, నో లుంగీ




నోయిడా: గ్రేటర్ నోయిడాలో ఒక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) ప్రవేశపెట్టిన రూల్స్ అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేస్తున్నాయి. మహిళలు నైటీలు , మగవారు లుంగీలు కట్టుకుంటే చూడలేకపోతున్నామని అసోసియేషన్ ప్రతినిధులు మొత్తుకుంటున్నారు. కామన్ ఏరియాలు, పార్కింగ్‌ల దగ్గరకి నైటీలు, లుంగీలో రావొద్దంటూ కొత్త నిబంధనలు విధించారు. ఈ మేరకు హిమ్‌సాగర్ అనే అపార్ట్‌మెంట్ అసోసియేషన్ జారీ చేసిన సర్క్యులర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నైటీలు, లుంగీలు అనేవి ఇంటిపట్టున ఉన్నప్పుడు ధరించేవి తప్ప బయటకు వచ్చినప్పుడు కాదని ఆ సర్క్యులర్ పేర్కొంది సొసైటీలో తిరగాలనుకున్నప్పుడు వస్త్రధారణ సరిగా ఉంటేనే ఎవరైనా గౌరవిస్తారని పేర్కొంది. దీనిపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆ అసోసియేషన్ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఉంటే, మరి కొందరు నచ్చిన బట్టలు ధరించే స్వేచ్ఛ లేదా అని ప్రశ్నిస్తున్నారు.

మరణించాడనుకుంటే, మోమోలు తింటూ కనిపించాడు

భాగల్పూర్: బిహార్‌లో భాగల్పూర్‌కు చెందిన నిశాంత్ కుమార్ అనే వ్యక్తి గత ఆరు నెలలుగా కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులందరూ ఆయన మరణించాడనే భావించారు. అయితే హఠాత్తుగా ఒక రోజు నోయిడాలో మోమోలు తింటూ ఆయన బావమరిదికే దొరకడం విశేషం. భాగల్పూర్‌లోని నౌగాచికి చెందిన నిశాంత్ కుమార్ ఒక పెళ్లి కోసం తన అత్త మామల ఇంటికి ఈ ఏడాది జనవరిలో వెళ్లాడు. ఆ తర్వాత కనిపించకుండా వెళ్లిపోయాడు. దీంతో సుశాంత్ తండ్రి తన కుమారుడిని అతని అత్తింటి సభ్యులే హత్య చేశాడని ఆరోపించారు. రెండు కుటుంబాల మధ్య రచ్చ వీధికెక్కింది. సుశాంత్ బావమరిది ఒక రోజు నోయిడా వెళితే అక్కడ మోమోలు అమ్మే దుకాణం దగ్గర ఒక బిచ్చగాడు కనిపించాడు. అతను ఆకలేస్తోందని మోమోలు అడిగితే దుకాణం దారుడు అతనిని పొమ్మని కసురుకుంటున్నాడు. దీంతో జాలిపడ్డ రవిశంకరే డబ్బులు ఇచ్చి అతనికి మోమోలు ఇమ్మని చెప్పాడు. ఆ తర్వాత అతని పేరేంటని అడగ్గా నిశాంత్ కుమార్ అని తమది బిహార్ అని చెప్పడంతో నిర్ఘాంత పోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిశాంత్ నోయిడాకి ఎలా చేరాడో, ఎందుకు రోడ్లు పట్టుకొని తిరుగుతున్నాడో పోలీసులు విచారణలో తేలాల్సి ఉంది.

సంపన్నుల వలసబాట

భద్రమైన జీవితాన్ని వెతుక్కుంటూ ఎంతోమంది భారతీయ సంపన్నులు విదేశాలకు పయనమవుతున్నారు. అక్కడే స్థిరపడుతున్నారు. మెరుగైన శాంతిభద్రతలు, కాలుష్యానికి తావులేని చక్కటి వాతావరణం, సంపదపై తక్కువ పన్నులు వారిని ఆకర్శిస్తున్నాయి. ఈ ఏడాది భారత్ నుంచి 6,500 మంది అత్యంత సంపన్నులు విదేశాలకు వెళ్లిపోయే అవకాశం ఉందని ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు, సంపన్నుల కదలికల తీరును విశ్లేషించే హెన్లీ ప్రైవేట్ వెల్త్ మైగ్రేషన్ రిపోర్ట్–2023 తాజాగా వెల్లడించింది. 2022లో భారత్ నుంచి 7,500 మంది ధనవంతులు విదేశాలకు వెళ్లి స్థిరపడినట్లు అంచనా.



ఈ ఏడాది 6,500 మందివిదేశాలకు వెళ్లిపోయే అవకాశం

గత ఏడాది 7,500 మంది పయనం	ఆస్ట్రేలియా, యూఏఈ, సింగపూర్, అమెరికా, స్విట్జర్లాండ్ వైపు మొగ్గు

వలసలు ఆ దేశాలకే ఎందుకు?

- విదేశాలకు వలస వెళ్లడానికి సంపన్నులు ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. రాజకీయ స్థిరత్వం, తక్కువ పన్నుల విధానం, వ్యక్తిగత స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.
- ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు అనువైన దేశం కోసం అన్వేషిస్తున్నారు.
- పిల్లలకు నాణ్యమైన చదువులు, వైద్య సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలు అందాలని కోరుకుంటున్నారు.
- తమ సంపదకు, ఆస్తులకు రక్షణ కల్పించే దేశాన్ని ఎంచుకుంటున్నారు.
- చట్టబద్ధ పాలన ఉండడంతోపాటు ఆర్థిక స్వేచ్ఛకు హామీ ఇచ్చే దేశాలకు వలస వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- ప్రైవేట్ సంపద వెళ్లిపోవడం దేశాలకు నష్టదాయకమేనని నిపుణులు చెబుతున్నారు.
- భారత్‌లో పన్ను నిబంధనలు కఠినంగా ఉండడంతో ధనవంతులు తమ డబ్బును విదేశాల్లో పెట్టుబడి పెట్టేందుకు మొగ్గు చూపుతున్నారని అంటున్నారు.

- మిలియన్ డాలర్లు(రూ.8.2 కోట్లు), అంతకంటే ఎక్కువ పెట్టుబడి పెట్టగల సంపద ఉన్నవారిని అల్ట్రా రిచ్(హెచ్‌ఎన్‌డబ్ల్యూఐ)గా పరిగణిస్తారు.
- శాశ్వతంగా స్థిరపడడానికి సంపన్నులను విశేషంగా ఆకర్షిస్తున్న దేశాల్లో ఆ్రస్టేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), సింగపూర్, అమెరికా, స్విట్జర్లాండ్ మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- ఇక 2023లో చైనా, ఇండియా, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), రష్యా, బ్రెజిల్ నుంచి ఎక్కువ మంది ధనవంతులు విదేశాలకు వెళ్తారని అంచనా వేస్తున్నట్లు న్యూ వరల్డ్ వెల్త్ పరిశోధక సంస్థ చీఫ్ ఆండ్రూ ఆమోయిల్స్ చెప్పారు.
- భారత్ నుంచి మిలియనీర్లు వెళ్లిపోతున్నా పెద్దగా నష్టం లేదని, దేశంలో అంతకంటే ఎక్కువ మంది మిలియనీర్లు తయారవుతారని ఆమోయిల్స్ తెలిపారు.
- ఈ ఏడాది చైనా నుంచి 13,500 మంది ధనికులు వలస వెళ్తారని అంచనా.
- 2022 ఆఖరు నాటికి టాప్–10 ధనిక దేశాల జాబితాలో భారత్ 10వ స్థానంలో నిలిచింది. అమెరికా, జపాన్, చైనా, జర్మనీ, యూకే, స్విట్జర్లాండ్, ఆ్రస్టేలియా, కెనడా, ఫ్రాన్స్ దేశాలు మొదటి 9 స్థానాల్లో ఉన్నాయి.
- భారత్‌లో మొత్తం జనాభా 142 కోట్లు కాగా, వీరిలో 3,44,600 మంది అల్ట్రా రిచ్(మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆస్తి), 1,078 మంది సెంటి–మిలియనీర్లు(100 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆస్తి), 123 మంది బిలియనీర్లు(బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆస్తి) ఉన్నారు.
- చైనా జనాభా 141 కోట్లు కాగా, వీరిలో 7,80,000 మంది అల్ట్రా రిచ్, 285 మంది బిలియనీర్లు ఉన్నారు. అమెరికా జనాభా 34 కోట్లు కాగా, వీరిలో 52,70,000 మంది అల్ట్రా రిచ్, 770 మంది బిలియనీర్లు ఉన్నారు.

2023లో ఏ దేశానికి ఎంతమంది వస్తారు?

దేశం	వలస వచ్చే సంపన్నులు
ఆస్ట్రేలియా	5,200
యూఏఈ	4,500
సింగపూర్	3,200
అమెరికా	2,100
స్విట్జర్లాండ్	1,800
కెనడా	1,600

ఈ ఏడాది ఏ దేశం నుంచి ఎంతమంది?

దేశం	వలస వెళ్లే ధనవంతులు
చైనా	13,500
భారత్	6,500
యూకే	3,200
రష్యా	3,000
బ్రెజిల్	1,200
హాంకాంగ్	1,000

– సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు

- ఈ ఏడాదే జరిగినా ఆశ్చర్యం లేదు
- బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్



పాట్నా: లోక్‌సభకు ముందస్తుగానే ఎన్నికలు జరుగుతాయని, ఈ ఏడాదే జరిగినా ఆశ్చర్యం లేదని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024 జనవరి కంటే ముందే ఈ పనులు పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులను ఆదేశించానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో ఎవరికీ తెలియదని, కచ్చితంగా వచ్చే ఏడాదే జరగాలన్న నియమం ఏమీ లేదని, ముందుగానే జరిగే అవకాశాలున్నాయని, ఈ ఏడాదే జరగొచ్చని, అలా జరగడం సాధ్యమేనని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత మంచిదని అధికారులకు నితీశ్ సూచించారు. పనులన్నీ సాధ్యమైనంత త్వరగా పూర్తయితే తాను సంతోషిస్తానని పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మించారని, ఇప్పుడు దాన్ని 60 శాతానికి తగ్గించారని ఆక్షేపించారు. 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపుతున్నారని చెప్పారు. 'ప్రధానమంత్రి సడక్ యోజన' అని పేరుపెట్టిన పథకానికి కేంద్రం 60 శాతం నిధులే ఇస్తోందన్నారు. ఈ నెల 23న పాట్నాలో జరగబోయే ప్రతిపక్షాల కీలక సమావేశంలో ముందస్తు ఎన్నికలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం ముందస్తు ఎన్నికలు వస్తాయన్న నితీశ్ కుమార్ వ్యాఖ్యలను బిహార్ బీజేపీ అధికార ప్రతినిధి నిఖిల్ ఆనంద్ కొట్టిపారేశారు. నితీశ్ ప్రధానమంత్రి కావాలని కలలు కంటున్నారని, ఊహాగానాల్లో జీవిస్తున్నారని ఎద్దేవా చేశారు.

గ్రీస్‌లో వలసదారుల పడవ మునక

79 మంది జలసమాధి



రక్షించిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఏథెన్స్: బతుకుదెరువు కోసం వలసపోతున్న డజన్లకొద్దీ శరణార్థుల ప్రాణాలు సముద్రంలో కలిసిపోయాయి. దక్షిణగ్రీస్ సముద్రజలాల్లో వలసదారులతో వెళ్తున్న పడవ బోల్తాపడటంతో కనీసం 79 మంది జలసమాధి అయ్యారు. డజన్లకొద్దీ జనం జాడ గల్లంతయ్యింది. పెలోపొన్నీస్ ప్రాంతం నుంచి తీరానికి 75 కిలోమీటర్లదూరంలో సముద్రంలో మంగళవారం రాత్రివేళ జరిగిన ఈ దుర్ఘటనలో ఇప్పటికే 104 మంది కాపాడామని అధికారులు తెలిపారు. విషయం తెల్సుకున్న అధికారులు పెద్ద ఎత్తున గాలింపు కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. కాపాడిన వారిలో ఆరోగ్యం విషమంగా ఉన్న వారిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. 78 మంది మరణించారని అధికారులు చెబుతున్నా ఇంకా ఎంతమంది మరణించి ఉంటారనేది తెలియట్లేదు. ఆరు తీర గస్తీ నౌకలు, ఒక నావికాదళ యుద్ధనౌక, ఒక సైనిక రవాణా విమానం, వాయుసేన హెలికాప్టర్, ఇంకా కొన్ని ప్రైవేట్ పడవలు, డ్రోన్ల సాయంతో గాలింపు చర్యలను భారీ ఎత్తున కొనసాగిస్తున్నారు. తూర్పు లిబియా దేశంలోని తోబ్రుక్ ప్రాంతం నుంచి ఈ శరణార్థుల పడవ బయల్దేరి ఇటలీకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. తమ దేశానికి ఇలా ఒక వలసదారుల పడవ వస్తోందని ముందే గ్రీక్ అధికారులకు ఇటలీ అధికారులు సమాచారం ఇచ్చారు. వలసదారులను కలామటా నౌకాశ్రయానికి తరలించి అక్కడ ఐక్యరాజ్యసమితి శరణార్థి ఏజెన్సీ ఏర్పాటుచేసిన శిబిరాల్లో ప్రథమ చికిత్స అందించారు.

లిబియా అదుపులో వేలాది మంది శరణార్థులు

అక్రమంగా ఇలా ప్రయాణం సాగిస్తున్న వారిపై గతంలోనే లిబియా సర్కార్ తన అప్రమత్తతను కనబరిచింది. ఈజిప్ట్, పాకిస్తాన్, సిరియా, సూడాన్ తదితర దేశాలకు వేలాది మంది శరణార్థులు సముద్ర జలాల్లో అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకుంది. ఈజిప్టుకు చెందిన వారిని వెంటనే భూమార్గంలో తిరిగి వారి దేశానికి పంపేసింది. లిబియా దక్షిణ ప్రాంతంలో చూస్తే రాజధాని ట్రిపోలీసహా పలు ప్రాంతాల్లోని శరణార్థి హబ్‌లలో సోదాలు చేసి దాదాపు 1,800 మందిని అదుపులోకి తీసుకుందని ఐక్యరాజ్యసమితి శరణార్థి ఏజెన్సీ తెలిపింది. మధ్యధరా సముద్ర జలాల్లో స్థానిక తీర గస్తీ పెట్రోలియం దళాల కంటపడకుండా ఉండేందుకు చాలా మంది స్మగ్లర్లు పెద్ద సైజు పడవలను సమకూర్చుకుని అంతర్జాతీయ జలాల వెంట అక్రమంగా శరణార్థులను తరలిస్తున్నారు. ఆదివారం ఇదే మధ్యధరా సముద్ర జలాల్లో తమను కాపాడండంటూ అమెరికా తయారీ పడవలో వెళ్తున్న 90 మంది శరణార్థులు అత్యవసర సందేశం ఇచ్చారు.

తమిళ మంత్రి అరెస్టు

పీఎంఎల్‌ఏ చట్టం కింద బాలాజీని అదుపులోకి తీసుకున్న ఈడీ

'క్యాష్ ఫర్ జాబ్స్' కేసులో దర్యాప్తు



సెంథిల్ బాలాజీని పరామర్శిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై:'క్యాష్ ఫర్ జాబ్స్' కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తమిళనాడు విద్యుత్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ(47)ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు బుధవారం అరెస్టు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద ఆయనను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ మంత్రివర్గంలో ఈ చట్టం కింద అరెస్టయిన తొలి మంత్రి సెంథిల్ కావడం విశేషం. సుదీర్ఘంగా ప్రశ్నించిన అనంతరం అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అనంతరం హైడ్రామా చోటుచేసుకుంది. తనకు అనారోగ్యంగా ఉందని చెప్పడంతో సెంథిల్‌ను సిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో చేర్పించారు. ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో సెంథిల్ బాలాజీ బిగ్గరగా రోదిస్తున్న దృశ్యాలు టీవీల్లో ప్రసారమయ్యాయి. గుండెకు సంబంధించిన కరోనరీ యాంజియోగ్రామ్ పరీక్ష వైద్యులు నిర్వహించారు. గుండె నాళంలో మూడు చోట్ల బ్లాక్‌లు ఉన్నట్టు గుర్తించారు. అత్యవసరంగా బైపాస్ సర్జరీకి సిఫారసు చేశారు.

బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్న కేంద్రం: స్టాలిన్

మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సెంథిల్ బాలాజీ నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. చెన్నై, కరూర్, ఈరోడ్‌లో ఈ సోదాలు జరిగాయి. తదుపరి విచారణ కోసం ఆయనను అరెస్టు చేసినట్లు సమాచారం. అరెస్టుపై తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన కేబినెట్ సహచరుడిని పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

ఈ నెల 28 దాకా జ్యుడీషియల్ కస్టడీ

బాలాజీని ఈ నెల 28 దాకా జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ సెషన్స్ కోర్టు జడ్జి ఆదేశాలు జారీ చేసింది. తన భర్తను ఎందుకు అరెస్టు చేశారో, ఏ కేసులో అరెస్టు చేశారో చెప్పాలని ఈడీని ప్రశ్నిస్తూ సెంథిల్ బాలాజీ సతీమణి మేఘల హైకోర్టులో అత్యవసర పిటిషన్ వేశారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఇంఫాల్: జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో శాంతి స్థాపన కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. మంగళవారం అర్ధరాత్రి ఖమెన్‌లోక్ ప్రాంతంలో మరోసారి హింస రాజుకుంది. ఈ ఘనటలో తొమ్మిది మంది మరణించగా మరో 10 మందికి గాయాలయ్యాయి. ఖమెన్‌లోక్ ప్రాంతంలోకి కుకి గ్రామాన్ని చుట్టుముట్టిన సాయుధులైన దుండగులు, గ్రామస్తుల మధ్య కాల్పులతో ఆ ప్రాంతమంతా రక్తమోడింది. ఒక మహిళ సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో పది మందికి గాయాలైతే ముగ్గురి జాడ తెలియడం లేదు. నెల రోజుల క్రితం ఎస్టీ హోదా కోరుతూ మెయిటీ తెగకు చెందిన వారు ర్యాలీ తీయడంతో జాతుల మధ్య మొదలైన హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని 16 జిల్లాలకు గాను ఇంకా 11 జిల్లాల్లో ఇంకా కర్ఫ్యూ కొనసాగుతోంది.

ఇంగ్లండ్‌లో కత్తితో దుండగుడు వీరంగం

భారతీయ సంతతికి విద్యార్థినిసహా ముగ్గురు దుర్మరణం

లండన్: సెంట్రల్ ఇంగ్లండ్‌లోని నాటింగ్‌హామ్ వీధుల్లో దారుణం చోటు చేసుకుంది. ఒక దుండగుడు మంగళవారం తెల్లవారుజామున కత్తి చేత పట్టుకొని కనిపించిన వారందరినీ పొడుస్తూ బీభత్సం సృష్టించాడు. ఈ ఘటనలో భారతీయ సంతతికి చెందిన టీనేజర్ సహా ముగ్గురు మరణించారు. గ్రేస్ ఒ మలే కుమార్ (19) అనే భారతీయ విద్యార్థికి క్రికెట్, హాకీ క్రీడలంటే ప్రాణం. కుమార్‌తో పాటు క్రికెట్ ఆడే అతని స్నేహితుడు బార్నబి వెబ్బర్ కత్తి పోట్లకు గురై ప్రాణాలు విడిచాడు. మరో 60 ఏళ్ల వ్యక్తిపై దాడి చేయడంతో అతనూ మృతి చెందాడు. ఆ వ్యక్తి దగ్గర నుంచి వ్యాన్‌ను దొంగలించిన దుండగుడు మరో ముగ్గురుపై నుంచి వాహనాన్ని తోలుకుంటూ వెళ్లాడు. దుండగుడిని పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. హౌస్ ఆఫ్ కామన్స్ సమావేశంలో బుధవారం ప్రధాని సునాక్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

ఢిల్లీలో తీవ్ర ఉక్కబోత!



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతోంది. చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీ సెల్సియస్‌కుపైగా నమోదవుతుండటంతో జనం ఉక్కపోతతో ఉడికి పోతున్నారు. పొరుగున ఉన్న పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో తీవ్రమైన వడగాలుల కారణంగా ఢిల్లీలో వేడి భయంకరంగా ఎక్కువైంది. బుధవారం ఢిల్లీలో 42 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదుకాగా, అవి ఈ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ విభాగం చెబుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రత కారణంగా ఢిల్లీలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. జూన్ ఒకటో తేదీన 4,390 మెగావాట్లుగా నమోదైన విద్యుత్ డిమాండ్ బుధవారానికి 7,190 మెగావాట్లకు ఎగసింది.

ఒడెసాపై ఆగని రష్యా క్రూయిజ్ దాడులు

కీవ్: రణనినాదంతో రంకెలేస్తూ ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దూకిన రష్యా సైన్యం ఒడెసా నగరంపై క్రూయిజ్ క్షిపణి దాడులతో దండెత్తింది. డజన్లకొద్దీ భవనాలను ధ్వంసం చేసింది. వీటిలో పలు క్షిపణులను ఉక్రెయిన్ దళాలు విజయవంతంగా అడ్డుకుని నేలకూల్చాయి. కానీ రష్యా దాడిలో ఒడెసాలో గిడ్డంగి కూలడంతో అందులో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కొన్ని ఇళ్లు, దుకాణాలు, కేఫ్‌లు ధ్వంసమయ్యాయి. 13 మందికి గాయాలయ్యాయి. కుప్పకూలిన గిడ్డంగి శిథిలాల కింద ఎవరైనా బతికిఉంటారనే ఆశతో అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్రమటోర్క్స్, కోస్టియాన్‌టినీవ్కా సిటీలపైనా రష్యా దాడులు చేసింది. క్రమటోర్క్స్‌లో ఇద్దరు పౌరులు చనిపోగా 29 ఇళ్లు కూలిపోయాయని అధ్యక్ష కార్యాలయం తెలిపింది. కోస్టియాన్‌టినీవ్కాలో ఒకరు చనిపోయారు. 57 ఇళ్లు నేలమట్టమయ్యాయి. దాదాపు 16 నెలలుగా కొనసాగుతున్న యుద్ధంలో రష్యా మళ్లీ వైమానిక దాడులను పెంచిందని ఉక్రెయిన్ సైన్యం అధికార ప్రతినిధి బుధవారం చెప్పారు.

'ఉమ్మడి'పై న్యాయ కమిషన్ సంప్రదింపులు

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)పై 22వ న్యాయ కమిషన్ బుధవారం భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభించింది. ప్రజలతోపాటు గుర్తింపు పొందిన మత సంస్థల అభిప్రాయాలను సేకరిస్తోంది. 21వ న్యాయ కమిషన్ గతంలో సంప్రదింపులు జరిపింది. ఈ కమిషన్ కాలపరిమితి 2018 ఆగస్టులో ముగిసింది. ఉమ్మడి పౌర స్మృతి అనేది అత్యంత సున్నితమైన అంశం కావడంతో తాజాగా మరోసారి అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్న నిర్ణయానికి 22వ న్యాయ కమిషన్ వచ్చింది.

భయానకంగా బిపర్‌జోయ్

- తుపాను ప్రభావంతో 74 వేల మందిని తరలింపు
- గుజరాత్‌లో సౌరాష్ట్ర–కచ్ ప్రాంతంలో భారీ వర్షాలు
- గురువారం జఖౌ పోర్ట్ సమీపంలో తీరం దాటనున్న తుపాను



గునావూ గ్రామంలో బీఎస్ఎఫ్ సిబ్బంది సాయం

మండ్వీ/అహ్మదాబాద్: బిపర్‌జోయ్ తుపాను అత్యంత తీవ్ర స్థాయిలో విరుచుకుపడనుంది. తీరం దాటక ముందే తుపాను ధాటికి గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర–కచ్ ప్రాంతాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఇప్పటికే తీరప్రాంతాలు, తుపాను ప్రభావిత జిల్లాల్లో 74వేల మందికిపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కచ్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్‌లో కుంభవృష్టి ఖాయమని భారత వాతావరణ శాఖ తెలిపింది. దేవభూమి ద్వారక, జామ్‌నగర్, జునాగఢ్, పోరుబందర్, రాజ్‌కోట్ జిల్లాల్లో బుధవారం ఉదయంకల్లా 24 గంటల్లో 50 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం పడింది. ఒకటి రెండు చోట్ల ఏకంగా 121 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అరేబియా సముద్రంలో తుపాను కేంద్రబిందువు కాస్తంత దిశ మార్చుకుని ఈశాన్య వైపుగా కదులుతూ కచ్, సౌరాష్ట్రల మధ్య జఖౌ పోర్ట్ సమీపంలో గురువారం సాయంత్రం తీరం దాటి బీభత్సం సృష్టించనుందని వెల్లడించింది. పోరుబందర్, రాజ్‌కోట్, మోర్బీ, జునాగఢ్‌సహా ఇతర సౌరాష్ట్ర, ఉత్తర గుజరాత్ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆ శాఖ అహ్మదాబాద్ డైరెక్టర్ మనోరమ మొహంతీ అంచనావేశారు. తీరం దాటేటపుడు గంటకు 150 కి.మీ.ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. తుపాను విలయం ఊహించని రీతిలో ఉంటే దానికి తగ్గ సహాయక కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని త్రివిధ దళాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆదేశించారు.

వందల కొద్దీ సహాయక బృందాలు

'ప్రస్తుతం తుపాను కేంద్రబిందువు కచ్ తీరానికి 290 కి.మీ.ల దూరంలో ఉంది. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు 18, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు 12, రోడ్డు, భవనాల శాఖకు చెందిన 115 బృందాలు, విద్యుత్ శాఖకు చెందిన దాదాపు 400 బృందాలను రంగంలోకి దింపాం ' అని స్టేట్ రిలీఫ్ కమిషనర్ అలోక్ కుమార్ పాండే చెప్పారు. మరోవైపు సిబ్బంది సన్నద్ధతపై గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సమీక్షా సమావేశం నిర్వహించి తాజా పరిస్థితిని తెల్సుకున్నారు. తీరానికి దూరంగా ఉన్న పాఠశాలలు, కార్యాలయాలను సహాయక శిబిరాలుగా మార్చారు. ఆహారం, తాగునీరు, వైద్యసదుపాయాలు కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిలో తగినంత మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు పంపారు. భుజ్ చేరుకొని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సైతం తుపాను వేళ వైద్యసేవలపై సమీక్ష జరిపారు. అరేబియా సముద్రంలో ఆరో తేదీన చిన్నదిగా మొదలైన తుపాను నెమ్మదిగా ఉత్తర దిశగా కదులుతూ శక్తిని పెంచుకుంటూ 11వ తేదీనాటికి భీకరంగా మారింది. ప్రచండ శక్తితో గుజరాత్, పాకిస్తాన్ తీరాల వైపు దూసుకొస్తోంది. జఖౌ పోర్టు సమీపంలో తీరాన్ని దాటి జనావాసాలపై తన పెనుప్రతాపం చూపనుంది.

సాక్షులతో మాట్లాడొద్దు

- ట్రంప్‌కు కోర్టు షరతులు
- తనకే పాపం తెలీదని కోర్టుకు ట్రంప్ విన్నపం



మయామీలో ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో ప్రభుత్వ రహస్య పత్రాలను తన నివాసంలో దాచిన కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మంగళవారం ఉదయం మయామీ కోర్టులో దాదాపుగా 45 నిముషాల సేపు విచారణ కొనసాగింది. ఈ కేసులో తన తప్పేమీ లేదని ట్రంప్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. న్యాయ విచారణ ప్రారంభం కావడానికి 15 నిముషాల ముందే కోర్టుకు హాజరయ్యారు. ట్రంప్‌కు తోడుగా ఆయన వెంట కుమారుడు ఎరిక్ ట్రంప్ కూడా న్యాయస్థానానికి వచ్చారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం శ్రమిస్తున్న ట్రంప్‌కు ఈ కేసు పెద్ద ఎదురు దెబ్బగా మారింది. కోర్టులో కేసు విచారణ సాగినంత సేపు ట్రంప్ మౌనంగా తలవంచుకొని చూస్తూ కూర్చున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు రాసింది. దేశ భద్రతకు సంబంధించిన రహస్య పత్రాలను ట్రంప్ తనతో పాటు ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌కు తీసుకువెళ్లి ఉంచారని, దేశానికి చెందిన అణు రహస్యాలు ప్రైవేటు వ్యక్తులతో పంచుకున్నారంటూ ఆయనపై అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. గూఢచర్యం చట్టం కింద 31 నిబంధనల్ని అతిక్రమించారంటూ ట్రంప్‌పై 37 అభియోగాలు నమోదయ్యాయి. దేశానికి చెందిన ఒక మాజీ అధ్యక్షుడు క్రిమినల్ కేసులో ఈ స్థాయిలో అభియోగాలు ఎదుర్కోవడం ఇదే తొలిసారి. కోర్టులో విచారణ సమయంలో ట్రంప్ అమాయకుడని, ఆయనకే పాపం తెలీదని ఆయన తరపు లాయర్ టాస్ బ్లాంచ్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు కేసుని విచారించిన న్యాయమూర్తి జోనథాన్ గూడ్‌మ్యాన్ ట్రంప్ ఈ కేసుకు సంబంధించిన సాక్షులు, ఇతరులెవరితోనూ నేరుగా మాట్లాడవద్దని షరతు విధించారు.

అధ్యక్ష పదవిలో అవినీతి పరుడు: ట్రంప్

కోర్టులో విచారణ ముగిసిన అనంతరం ట్రంప్ నిధుల సమీకరణ కోసం న్యూజెర్సీలోని గోల్ఫ్ కోర్టుకు మంగళవారం రాత్రి వెళ్లారు. ఆయనకు అక్కడ ఘనంగా స్వాగతం లభించింది. జూన్ 14 బుధవారం ట్రంప్ పుట్టిన రోజు కావడంతో ఆయనకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. హ్యాపీ బర్త్ డే అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ట్రంప్ తన అభిమానులతో మాట్లాడుతూ తనపై మోపిన ఈ కేసు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ఆరోపించారు. అధ్యక్ష పీఠంపై ఒక అవినీతి పరుడు కూర్చొని , తన రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని తీవ్రమైన ఆరోపణలు చేశారు.

ఏటా వంద మిలియన్ టన్నులు..

సింగరేణిలో ఉత్పత్తి పెంపునకు ప్రణాళికలు

- ఈ ఏడాది ఐదు ప్రాజెక్టులు ప్రారంభం
- వచ్చే ఏడాది మరో రెండు ప్రాజెక్టులు..

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఏటా వంద మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే 78 మిలియన్ టన్నుల ఉత్పత్తికి ప్రణాళికలను రూపొందించిన సంస్థ, నూతన ప్రాజెక్టుల్లో ఉత్పత్తి ప్రారంభిస్తూ.. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులను విస్తరించేందుకు సన్నాహాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఐదు ప్రాజెక్టుల ద్వారా సుమారు 26 మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయాలని భావిస్తోంది. ఈ ఐదు ప్రాజెక్టుల్లో నైనీ బ్లాక్ కొత్త ప్రాజెక్టు కాగా, మిగతా నాలుగు ప్రాజెక్టుల జీవితకాలం పొడిగింపునకు వెళ్తున్నాయి. దీంతో ఒక్కో ప్రాజెక్టుకు 11నుంచి 43 ఏళ్ల వరకు జీవితకాలం పెరుగుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలని యాజమాన్యం కృత నిశ్చయంతో ఉంది. ఈ మేరకు శనివారం సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వర్ రెడ్డి, ఎన్వీకే శ్రీనివాస్ సంస్థ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్ని ఏరియాల నుంచి ప్రాజెక్టు నివేదికలు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు.



ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి

కాగా, ఒడిశాలోని నైనీబ్లాక్ కోల్‌మైన్ ద్వారా ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అదనంగా పెరగనుంది. నాలుగు పాత ప్రాజెక్టుల విస్తరణ వల్ల మరో 16.60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందని చెపుతున్నారు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరంలో మరో 4.50 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా ముందుకు



విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం బొగ్గు నిల్వలు ముగిసిన ప్రాజెక్టులకు ఎక్స్‌టెన్షన్ పేరుతో అనుమతులు పొందాం. వచ్చే ఏడాది మరో రెండు ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నాం. పర్యావరణ, అటవీ శాఖ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్, సింగరేణి సంస్థ

2023-24లో ప్రారంభిస్తున్న ప్రాజెక్టుల ఉత్పత్తి వివరాలు (మిలియన్ టన్నుల్లో)

ప్రాజెక్టు పేరు	ఏటా ఉత్పత్తి	బొగ్గు నిల్వలు	జీవితకాలం
నైనీ బ్లాక్	10.00	340	33 ఏళ్లు
వీకే ఓసీపీ	5.30	183	43 ఏళ్లు
జేకే ఓసీపీ	2.50	22.5	12 ఏళ్లు
గోలేటి ఓసీపీ	3.50	38.48	11 ఏళ్లు
ఆర్జీ ఓసీపీ-1	5.30	113	23 ఏళ్లు
2024-25 ఆర్థిక సంవత్సరంలో..			
ఎంవీకే ఓసీపీ	2.0	30	18 ఏళ్లు
పీవీఎన్ఆర్ ఓసీ	2.50	40	20 ఏళ్లు



క్లుప్తంగా...

నీట్‌లో నారాయణ విజయకేతనం

సాక్షి, హైదరాబాద్: నీట్ –2023 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు విజయకేతనాన్ని ఎగురవేశాయి. వైద్య విద్య ప్రవేశాలకోసం నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో ఆలిండియా ఆల్ కేటగిరీలలో నారాయణ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు శంశాక్ సిన్హా 4వ ర్యాంకుతో పాటు అన్ని కేటగిరీల్లో 4,7,8,8,12,12,15,19,19,19,20,24,25,31, 35,37,38,47,51,51,52,53,55,56,57,62,68,69,79,80,85,89,93,97 ర్యాంకులు లభించాయి. అదేవిధంగా తమ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు 500 లోపు 112 ర్యాంకులు, 1000లోపు 169 ర్యాంకులు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

నీట్ ఫలితాల్లో నంబర్‌వన్ శ్రీ చైతన్య

నీట్ –2023 ఫలితాల్లో జాతీయస్థాయితో పాటు తెలుగురాష్ట్రాల్లో తొలిస్థానం సాధించి శ్రీ చైతన్య విద్యా సంస్థలు అగ్రపీఠం దక్కించుకుంది. ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 1,9,14,15, ర్యాంకులతోపాటు అన్ని కేటగిరీల్లోనూ 1,1,1,2,3,3,5,7,7,9,10 ర్యాంకులను శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులకు లభించాయి. 720 కు 720 మార్కులతో జాతీయస్థాయిలో తమ విద్యార్థి బోర వరుణ్ చక్రవర్తి 1వ ర్యాంకు సాధించగా..715 మార్కులతో ఎస్.వరుణ్ జాతీయ స్థాయిలో 9వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా శంశాక్ కుమార్ 14వ ర్యాంకు, కంచని రఘురామ్‌రెడ్డి 15వ ర్యాంకును సాధించారు. ఈ మేరకు చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావు, అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్–డైరెక్టర్ సుష్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నీట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: నీట్ (జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష)లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన జి.వర్షిణి జాతీయస్థాయిలో 226వ ర్యాంకు సాధించారు. వివేక్‌రాయ్ 257వ ర్యాంకు, ఇ.సాయి 257వ ర్యాంకు సాధించి ఎస్ఆర్ ప్రతిష్టను నిలబెట్టారన్నారు. అదేవిధంగా 720 మార్కులకుగాను జి.బాలరాజ్ 657మార్కులు, మాధురిరెడ్డి 638 మార్కులు, వివేక్‌రాయ్ 636 మార్కులు, ఎం.సింధు 631మార్కులు, వి.సాయి సిద్ధార్థ 630 మార్కులు, డి.శ్రీవర్ష 615 మార్కులు, కె.వీరేశ్ 604 మార్కులు సాధించారని తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలోని ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన 210 మంది విద్యార్థులు మెడిసిన్‌లో సీటు పొందే ర్యాంకులు సాధించారని వివరించారు.

'నీట్'లో సత్తాచాటిన ఆల్ఫోర్స్ విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): ఈ ఏడాది నీట్ ఫలితాల్లో ఆల్ఫోర్స్ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చాటారని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. నీట్‌లో అకాడమీకి చెందిన జి.సంతోషిని 619 మార్కులు, డి.ఆదిత్య చంద్రకాంత్ రెడ్డి 615, ఎస్.ధిరణ్ కుమార్ 610, కె.ప్రణీతారెడ్డి 610, జి.జ్యోతి 600, బి.శ్రీగోధ 594, డి.అక్షితరెడ్డి 588, సయ్యద్ అతిభవుర్ రెహమాన్ 583, టి.దీపిక 571, సాయిసదిష్ట 570, కె.అలేఖ్యరెడ్డి 564, నబిహా 558, బి.విద్యాలక్ష్మి 550, స్నేహమాలిక్ 550, బి.ప్రణయ్ 549 మార్కులు వచ్చినట్లు వివరించారు.

నీట్‌లో ఆదిత్య విద్యాసంస్థల జయభేరి

నీట్ –2023లో ఆదిత్య విద్యా సంస్థలు జయభేరి మోగించాయి. ఆదిత్య విద్యాసంస్థలకు చెందిన టి.ఎస్.సాయి తేజస్విని 210, ఎమ్.జానకి శ్రీ వైష్ణవి 365, ఎస్.వెంకటేశ్ 646, షణ్ముఖ్ సాత్విక్ 677, ఎ.లిఖిత్‌లకు 710వ ర్యాంకు లభించినట్లు ఆ సంస్థ చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.కె.దీపక్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

'కె.కె.ఆర్.గౌతమ్'కు ర్యాంకుల పంట

ఆలిండియా నీట్–2023 ప్రవేశ పరీక్షా ఫలితాల్లో డాక్టర్ కె.కె.ఆర్.గౌతమ్ స్కూల్స్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో కె.కె.ఆర్. గౌతమ్ స్కూల్స్‌కు చెందిన వై.లక్ష్మీ ప్రవర్ధన్‌రెడ్డి 25వర్యాంకు, జి.లక్ష్మీ రష్మితకు 52వ ర్యాంకు లభించినట్లు ఆ సంస్థ యాజమాన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఏపీ ఈఏపీసెట్‌లో 'ప్రకాష్ ఎడ్యుకేషనల్' హవా

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈఏపీ సెట్) –2023 ఫలితాల్లో విశాఖ జిల్లాకు చెందిన శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో యు.వెంకటేశ్ 497వ ర్యాంక్, ఇంజనీరింగ్ విభాగంలో ఎస్.సూర్యచరణ్ 767 వ ర్యాంక్, ఎస్.అశోక్ 1258 ర్యాంకు లభించాయి. 10000 లోపు 23 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత సీహెచ్ వీకే నరసింహారావు, యూనిట్ కార్యదర్శి విజయ్ ప్రకాష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాబు పాలనలో జర్నలిస్టులకు జరిగిన మేలేంటి?

- జగన్ ప్రభుత్వంపై ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు
- చంద్రబాబు హయాంలో 'సాక్షి'ని అణిచివేసే కుట్రలు కనిపించలేదా?
- బాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నా గజం ఇంటి స్థలం ఇవ్వలేదు
- ఏపీలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే దశలో ఉన్నాయి
- ఏపీలో పత్రికా స్వేచ్ఛ లేకపోతే ఆ పత్రికలు, చానెళ్లు సీఎం జగన్‌పై దూషణలతో చర్చలెలా చేస్తాయి?
- ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్



సాక్షి, హైదరాబాద్: నల్ల చట్టాలతో పత్రికా స్వేచ్ఛను అణిచివేసి అరాచక పాలన సాగించిన చంద్రబాబు ఏ విధంగా జగన్‌కన్నా మెరుగైన ముఖ్యమంత్రో ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి చెప్పాలని ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ డిమాండ్ చేశారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు జర్నలిస్టులకు చేసిన మేలేమిటని ప్రశ్నించారు. జర్నలిస్టులకు గజం జాగా ఇవ్వకపోగా యాజమాన్యాలను గుప్పిట్లో పెట్టుకొని జర్నలిస్టులపై జులుం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. అమర్ బుధవారం హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంపై విజయవాడలో శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. జర్నలిస్టులు ఇప్పటివరకు ప్రభుత్వాలతో సత్సంబంధాలతోనే హక్కులు సాధించుకున్నారని చెప్పారు. చంద్రబాబు, కేసీఆర్‌లతో సఖ్యతగా ఉన్న యూనియన్ జగన్ విషయంలో ఎందుకు వ్యతిరేకత కనబరుస్తోందని ప్రశ్నించారు. ఏపీలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే దశలో ఉన్నాయని, ఈ సమయంలో ప్రభుత్వంపై విషం కక్కేలా మాట్లాడటం సరైన విధానం కాదని, పాత్రికేయులు ఇలాంటి మాటలను పట్టించుకోవద్దని హితవు చెప్పారు.

25 పాత చట్టాలతో చంద్రబాబు కొత్త చట్టం

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు జర్నలిస్టులను అణిచివేసేందుకు 1998లో 25 పాత చట్టాలను కలిపి ఏపీ ప్రివెన్షన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్టివిటీస్ యాక్ట్–1998 తీసుకొచ్చారని చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరం ప్రాజెక్టు, పునరావాస కల్పనలో అక్రమాలపై వార్తలు రాసిన 'సాక్షి'ని అణిచివేసేందుకు ఏపీ స్పెషల్ కోర్ట్స్ యాక్ట్–2016 తెచ్చారన్నారు. సాక్షిని స్వాధీనం చేసుకుంటామని అప్పటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారన్నారు. ఇన్ని చేసినా అప్పుడు శ్రీనివాస్‌రెడ్డి ఎందుకు గొంతు విప్పలేదని ప్రశ్నించారు. ప్రభుత్వంపై వ్యతిరేక వార్తలు రాస్తున్నాననే కారణంగా తాను ఏపీలోకి రాకుండా అప్పట్లో ఆంక్షలు విధించారని అమర్ గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే జర్నలిస్టులకు స్వర్ణయుగం వచ్చిందని, వారి సమస్యలు పరిష్కారమయ్యాయని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ కింద 1,100 మంది జర్నలిస్టులకు హైదరాబాద్‌లో ఇళ్ల స్థలాలు ఇచ్చింది వైఎస్ హయాంలోనేనని చెప్పారు. సుప్రీం కోర్టు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం భూమి అప్పగించలేదని చెప్పారు. ఈ సొసైటీలోని 50 మంది సభ్యులు చనిపోయినా, శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని నిలదీయకుండా జగన్‌ను విమర్శించడం సమంజసం కాదన్నారు. ఏపీలో పత్రికా స్వేచ్ఛ లేకపోతే రెండు దినపత్రికలు, మూడు టీవీ ఛానెళ్లు ముఖ్యమంత్రి అనే గౌరవం లేకుండా జగన్ మీద, ప్రభుత్వం మీద దూషణలు చేస్తూ గంటలకు గంటలు చర్చలు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

నేడు పల్లెకు పట్టాభిషేకం

దశాబ్ది ఉత్సవాల్లో గ్రామాలకు పెద్దపీట



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌తో పాటు, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం పల్లె ప్రగతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉత్తమ మండలాల ఎంపీపీలకు సన్మానం చేస్తారు. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో పల్లె ప్రగతిపై ఉత్సవాలు నిర్వహిస్తారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. పల్లె ప్రగతితో పాటు ఇతర కార్యక్రమాలతో రాష్ట్రం అనేక అవార్డులతో పాటు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును పొందింది. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. వివరాలు ఇవీ..

- అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా ప్రకటించిన ఒకే రాష్ట్రం
- 4,383 నూతన జీపీల ఏర్పాటు.
- 5441 నూతన గ్రామపంచాయతీ భవనాలు రూ.1,088.20 కోట్ల వ్యయంతో మంజూరు
- ప్రతి గ్రామ పంచాయతీకి కార్యదర్శులను నియమించిన తొలి రాష్ట్రం
- ప్రతి జీపీలో ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీ ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం
- ప్రతి జీపీలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రం
- ప్రతి జీపీలో వైకుంఠధామం, డంపింగ్ యార్డ్
- ప్రతి ఇంటికి నల్లా ద్వారా శుద్ధి చేసిన మంచినీటి సరఫరా
- పల్లె ప్రగతి కింద ఇప్పటిదాకా రూ. 11,162 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి పథకాల అమలు

పరిపాలన సంస్కరణలు:

గతంలో తెలంగాణలో 8,690 గ్రామపంచాయతీలు ఉంటే, వాటి సంఖ్యను 12,769కు పెంచింది. 3,146 ఆదివాసీలు, గిరిజనుల గూడాలు తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చింది. గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాన్ని రూ.9,500 పెంచింది. స్థానిక ప్రజా ప్రతినిధుల గౌరవ వేతనాలు పెంచింది. గ్రామాల అభివృద్ధిలో జీపీల పాత్రను ప్రభుత్వం క్రియాశీలం చేసింది.

జీపీ భవనాలకు నేడు భూమిపూజ : సీఎస్ శాంతి కుమారి



సాక్షి, హైదరాబాద్: పల్లె ప్రగతిలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మంజూరైన గ్రామ పంచాయతీ భవననిర్మాణాలకు గురువారం భూమిపూజ చేయనున్నట్టు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాబోయే మూడు రోజుల కార్యక్రమాలకు చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. 15న పల్లె ప్రగతి, 16న పట్టణ ప్రగతి, 17న గిరిజనోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురువారం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో, హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహిచాలని ఆదేశించారు. గ్రామాలు నాడు–నేడు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్పు, ఓడీఎఫ్ ప్లస్, ఆసరా పింఛన్లు, గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రగతి నివేదిక, రాష్ట్ర స్థాయిలో ప్రగతి నివేదికలు తెలిపే ఆరు బ్యానర్లను ఇప్పటికే పంపిణీ చేసినట్టు తెలిపారు. గ్రామస్తులతో ర్యాలీ, గ్రామపంచాయతీలో సమావేశం, సఫాయి కార్మికులకు సన్మానం చేయాలన్నారు. సాయంత్రం రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న ప్రధాన కార్యక్రమంలో ఉత్తమ సర్పంచులను సన్మానిస్తామని సీఎస్ వెల్లడించారు.

క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఇతరులను అనుమతించొద్దు

- కమిషనర్‌ను ఆదేశించిన హైకోర్టు
- 'ధర్మపురి'ఎన్నికల పిటిషన్‌లో వాదనలు

సాక్షి, హైదరాబాద్: 'ధర్మపురి ఎన్నికల'కేసులో జగిత్యాల జిల్లా రిటర్నింగ్ అధికారిని మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని, క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో ఇతరుల(థర్డ్ పార్టీ)ను అనుమతించవద్దని సాక్షుల నమోదు కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. అలాగే ఎన్నికలకు సంబంధించి ఈసీ సమర్పించిన నివేదిక ప్రతిని అడ్లూరి లక్ష్మణ్‌కూ ఇవ్వాలని రిజిస్ట్రీని ఆదేశించింది. అడ్లూరి లక్ష్మణ్ వేసిన మధ్యంతర అప్లికేషన్లను అనుమతించింది. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా గెలుపొందడాన్ని సవాల్ చేస్తూ ఆయనపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన అడ్లూరి లక్ష్మణ్ హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. రీకౌంటింగ్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈ కేసును విచారిస్తున్న హైకోర్టు.. సాక్ష్యాల రికార్డు కోసం హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్వీవీ నాతారెడ్డిని కమిషనర్‌గా నియమించింది. రిటర్నింగ్ అధికారి భిక్షపతి నుంచి సమాచారం సేకరించకుండానే నాతారెడ్డి రికార్డింగ్ ముగించారని, తన నుంచి ఎలాంటి డాక్యుమెంట్లు తీసుకోకుండా, కొప్పుల నుంచి మాత్రం డాక్యుమెంట్లు తీసుకుని మార్కింగ్ చేశారని, క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో రిటర్నింగ్ అధికారి కుమారుడు సమాధానాలను మార్చే ప్రయత్నం చేసినా నాతారెడ్డి అభ్యంతరం చెప్పలేదని పేర్కొంటూ అడ్లూరి మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారిని మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేసేలా నాతారెడ్డిని ఆదేశించాలని, కొప్పుల నుంచి తీసుకుని మార్కింగ్ చేసిన డాక్యుమెంట్లను తిరస్కరించాలని కోరారు. ఈ అప్లికేషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. వాటిని అనుమతించింది.

ఒక తాళమే వేశారు: ఈసీ నివేదిక

కోర్టుకు సమర్పించిన నివేదికలో ఎన్నికల కమిషన్.. 2018 ఎన్నికల నాటి అధికారుల తీరును తప్పుబట్టింది. ఎన్నికల సామగ్రిని భద్రపర్చడంలో విధానపరమైన లోపాలున్నాయని చెప్పింది. జిల్లా ఎన్నికల అధికారి శరత్, ధర్మపురి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భిక్షపతి, డిప్యూటీ ఎన్నికల అధి కారి రాజేశం లు.. ఈసీ సూచనలను పాటించలేదని పే ర్కొంది. స్ట్రాంగ్ రూంలకు రెండు తాళాలు వేయా ల్సి ఉండగా, ఒక్క తాళం మాత్రమే వేశారని, తాళం చెవిలను సేకరించడంలో అధికారి రాజేశం నిర్లక్ష్యం వహించారని, తనకు రాతపూర్వక ఆదేశాలు లేవంటూ తా ళాలు తీసుకోలేదంది. ఎన్నికల రికార్డులను భద్రపర్చడంలోనూ ఈసీ మార్గదర్శకాలను నాటి జిల్లా ఎన్ని కల అధికారి పాటించలేదంది. ఆ తర్వాత వచ్చిన జి ల్లా ఎన్నికల అధికారులు కూడా ఎన్నికల సంబంధిత మెటీరియల్‌ను స్వాధీనం చేసుకోవడంలో క్రియాశీలక పాత్ర పోషించలేదని పేర్కొంది.

కౌంటర్ వేయడానికి ఎన్నాళ్లు?

- ఆలయ భూముల అన్యాక్రాంతంపై హైకోర్టు సీరియస్
- 6 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌కు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆలయ భూముల అన్యాక్రాంతంపై గతంలోనే కౌంటర్ దాఖలు చేయమని చెప్పినా.. ఇంతవరకు ఎందుకు వేయలేదని సర్కార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణ నాటికి తప్పకుండా కౌంటర్ దాఖలు చేయాల్సిందేనని ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను ఆగస్టు 10కి వాయిదా వేసింది. ఆలయ భూముల ఆక్రమణపై మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సి.అనిల్‌కుమార్ రాసిన లేఖను హైకోర్టులో టెకెన్ అప్ పిల్‌గా విచారణకు స్వీకరించింది. మహబూబ్‌నగర్ జిల్లాలో వందల ఎకరాల ఆలయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటున్నారని లేఖలో పేర్కొన్నారు. దీనికి రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారని వెల్లడించారు. ప్రాథమికంగా ఎండోమెంట్స్ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో గ్రౌండ్ లెవెల్లో రికార్డుల పరిశీలనలో ఐదు జిల్లాల్లో కలిపి 1,776 ఎకరాల ఆలయ భూమి ఆక్రమణకు గురైనట్లు అంచనా వేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

ఆలయ భూముల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. గతంలో కౌంటర్ వేయాలని ఆదేశించినా వేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆరు వారాలు గడువు ఇస్తున్నామని, ఆ లోగా కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

క్లుప్తంగా...

1969 ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామరాజు

భానుపురి (సూర్యాపేట): ప్రత్యేక రాష్ట్రం కోసం 1969లో పోరాడిన ఉద్యమకారులను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి పెన్షన్ అందించాలని 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కిరాణా ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అందరి పోరాటంతోనే తెలంగాణ వచ్చిందని, నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని, ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి నాటి ఉద్యమకారులకు పెన్షన్, ఉచిత వైద్యం, ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూలై 10న ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 1969 ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, దేవత్ కిషన్, ఉన్నం సత్యనారాయణ, నంద్యాల భిక్షా రెడ్డి, దయానందం, కోయ వెంకటనారాయణ, తాప్సి లింగయ్య, చింత నరసింహ, భద్రమ్మ, రుద్రమ్మ, మిట్టపల్లి శంకరయ్య, కంది సూర్యనారాయణ పాల్గొన్నారు.

నూతన పీఆర్‌సీని ఏర్పాటు చేయాలి

- సీఎస్‌కు టీఎన్జీఓల బృందం వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన నూతన వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరారు. టీఎన్జీఓ ప్రతినిధి బృందం బుధవారం సచివాలయంలో సీఎస్‌తో భేటీ అయ్యింది. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమలు జరిగేలా నూతన పే రివిజన్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించింది. కాగా అదే రోజు నుంచి ఐఆర్‌ను ప్రకటించాలని సీఎస్‌ను రాజేందర్ కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని, ఈహెచ్‌ఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖలలో ప్రమోషన్ల ప్రక్రియ, ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలని కోరారు.

డీసీహెచ్‌ఎల్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి అరెస్టు..బెయిల్

సాక్షి, హైదరాబాద్: డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (డీసీహెచ్‌ఎల్) చైర్మన్ టి.వెంకట్రామిరెడ్డి, ప్రమోటర్, డైరెక్టర్ పీకే అయ్యర్, ఆడిటర్ మణి ఊమెన్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం అరెస్టు చేసింది. బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని కారణంగా మనీల్యాండరింగ్ చట్టం–2022 కింద వారిని అరెస్టు చేసినట్లు ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ అభియోగాలతో డీసీహెచ్‌ఎల్ ప్రమోటర్, డైరెక్టర్లపై బెంగళూరు సీబీఐ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పోలీసులు వివిధ ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేసిన నేపథ్యంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో అరెస్టు చేసిన వెంకట్రామిరెడ్డి, పీకే అయ్యర్‌లకు ఈడీ అధికారులు బుధవారం గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అయితే వారి రిమాండ్‌కు న్యాయమూర్తి నిరాకరించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న కేసులో ఉన్న పళంగా అరెస్టు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. 41ఏ నోటీసులు కూడా ఇవ్వకుండా అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. రిమాండ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ, లక్ష రూపాయల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు.

ట్రాన్స్‌జెండర్‌ను పెళ్లి చేసుకున్న యువకుడు



గార్ల: ఓ యువకుడు.. ట్రాన్స్‌జెండర్ మూడు ముళ్లతో ఒక్కటయ్యారు. ఈ వివాహ వేడుక మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో బుధవారం జరిగింది. మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన బానోత్ రాధిక, డోర్నకల్ మండలం సిగ్నల్‌తండాకు చెందిన ధరావత్ వీరుకు రైలులో పరిచయమైంది. కొంతకాలంగా ఇద్దరు ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.బుధవారం గార్లమండలంలోని వేట వేంకటేశ్వర దేవాలయంలో వేదమంత్రోచ్చరణల మధ్య పెళ్లి చేసుకున్నారు. వీరి పెళ్లికి హాజరైన ట్రాన్స్‌జెండర్లు మాట్లాడుతూ.. ఇలాంటి ఆదర్శ వివాహాలు మరిన్ని జరగాలని వేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమను గుర్తించి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను వర్తింపజేసి ఆదుకోవాలని వారు కోరారు.

ఇప్పుడు ఆప్షన్ ఇచ్చినా ‘అధిక పెన్షన్’!

- అధిక వేతనం పొందుతున్న చందాదారులకు ఈపీఎఫ్‌ఓ వెసులుబాటు

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) తమ అధిక పెన్షన్ పథకానికి పెట్టిన కఠిన నిబంధనల నుంచి సడలింపు ఇచ్చింది. 2014 సెప్టెంబర్ నాటికే అధిక పెన్షన్‌కు దరఖాస్తు చేసుకుని, 26(6) నిబంధన ప్రకారం ఉమ్మడి ఆప్షన్ ఇచ్చినవారికే వర్తింపజేస్తామన్న నిబంధనపై వెనక్కి తగ్గింది. ఇప్పుడు ఉమ్మడి ఆప్షన్, దరఖాస్తులను సమర్పించినా పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఈపీఎఫ్‌ఓ పెన్షన్ విభాగం రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అపరాజిత జగ్గి ఆదేశాలు జారీ చేశారు. జోనల్ కార్యాలయాల్లోని అదనపు చీఫ్ పీఎఫ్ కమిషనర్లు, ప్రాంతీయ కార్యాలయాల్లోని రీజనల్ పీఎఫ్ కమిషనర్లకు తగిన సూచనలు చేశారు. అధిక పెన్షన్ కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఎలాంటి పత్రాలను పరిగణించి పరిశీలించాలి? ఏయే పత్రాల ఆధారంగా అధిక పెన్షన్ మంజూరు చేయాలి? ఇప్పటివరకు ఉన్న నిబంధనల్లో మినహాయింపు వేటిపై అనే అంశాలపై స్పష్టత ఇచ్చారు.

అధిక వేతనంపై అధిక పెన్షన్..

ఎంప్లాయీస్ పెన్షన్ పథకం (ఈపీఎస్) నిబంధనల ప్రకారం ఉద్యోగుల వేతనంపై పరిమితులున్నాయి. 2014 సెప్టెంబర్‌కు ముందు గరిష్ట వేతన పరిమితి రూ.6,500గా ఉంది. తర్వాత దానిని రూ.15 వేలకు పెంచారు. ఉద్యోగి వేతనం ఎంత ఉన్నా.. ఈ పరిమితి మేరకే పథకాన్ని వర్తింపజేస్తూ, దానికి తగినట్టే పెన్షన్ అందేలా నిబంధన పెట్టారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గరిష్ట వేతన పరిమితి కంటే ఎక్కువ వేతనాలను పొందుతున్న వారికి అధిక పెన్షన్ పొందేందుకు ఈపీఎఫ్‌ఓ ఇటీవల అవకాశం కల్పించింది. సదరు అధిక వేతనానికి అనుగుణంగా ఉద్యోగులు, యాజమాన్యం వాటాలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ 2014 సెప్టెంబర్ 1 నాటికి అధిక పెన్షన్‌కు ఆప్షన్ ఇచ్చుకుని, 26(6) నిబంధన ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికే అధిక పెన్షన్‌ను వర్తింపజేస్తామని కొర్రీ పెట్టింది. అయితే లబ్ధిదారుల విజ్ఞప్తుల మేరకు తాజాగా దీనిని సడలించింది. ఇప్పుడు కొత్తగా ఉమ్మడి ఆప్షన్ ఇస్తూ, 26(6) నిబంధన ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. దీనికి సంబంధించి ఏమేం పత్రాలు సమర్పించాల్సి ఉంటుందనే దానిపై స్పష్టత ఇచ్చింది. ఆయా పత్రాలకు సంబంధించిన ప్రొఫార్మాలను ఈపీఎఫ్‌ఓ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పూరించవచ్చని తెలిపింది.

ఏమేం పత్రాలు కావాలి?

- పేరా 6, పేరా 7లకు సంబంధించి ఈపీఎస్ కింద యాజమాన్యం ధ్రువీకరించిన జాయింట్ ఆప్షన్ ఆధారాన్ని సమర్పించాలి.
- తర్వాత 26 (6) అనుమతి పత్రాన్ని జత చేయాలి.
- యాజమాన్యంతో ఉద్యోగి అండర్‌టేకింగ్ పత్రాన్ని పూరించి.. యాజమాన్యం నుంచి ధ్రువీకరణ చేయించాలి.
- ఉద్యోగి తన పేస్లిప్‌ను లేదా యాజమాన్యం జారీ చేసిన అధికారిక వేతన పత్రాన్ని సమర్పించాలి.
- యాజమాన్యం ఇస్తున్న వేతన వివరాలతో పాటు దరఖాస్తు, ఉమ్మడి ఆప్షన్, ఇతర పత్రాలను జత చేసి అందజేయాలి.
- అధిక వేతనానికి సంబంధించి 2022 నవంబర్ 4కు ముందు పీఎఫ్ కార్యాలయం నుంచి జారీచేసిన పత్రాన్ని జత చేయాలి
- అండర్‌టేకింగ్ పత్రాన్ని ఇప్పుడు లేదా క్లెయిమ్ సెటిల్మెంట్ సమయంలో అయినా సమర్పించవచ్చు.

కరెంట్ సర్దు‘బాదుడు’ వాయిదా!

- ఎన్నికల నేపథ్యంలో చివరి క్షణంలో నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు చార్జీల(ఎఫ్‌ఎస్‌ఏ) వసూళ్లను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు వాయిదా వేసుకున్నట్టు తెలిసింది. వాస్తవానికి ఏప్రిల్‌లో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన ఎఫ్‌ఎస్‌ఏ చార్జీలను ఈనెల 15లోగా ప్రకటించాల్సి ఉంది. కానీ త్వరలో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో.. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో చివరి క్షణంలో విరమించుకున్నట్టు సమాచారం.

రూ.250 కోట్లుగా నిర్ధారించి..: ఏప్రిల్‌లో వినియోగదారులకు జారీ చేసిన బిల్లులతో పోల్చితే.. డిస్కంలు విద్యుత్ కొనుగోళ్ల కోసం చేసిన వ్యయం ప్రతి యూనిట్‌పై ఒక రూపాయి వరకు అదనంగా ఉందని తేల్చినట్టు సమాచారం. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ ఎస్పీడీసీఎల్) రూ.150 కోట్లు, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) రూ. 100 కోట్లు కలిపి మొత్తం రూ.250 కోట్లు వసూలు చేయాల్సి ఉందని నిర్ధారించినట్టు తెలిసింది. దీనికి సంబంధించి జూన్ నెల బిల్లుల్లో యూనిట్‌కు 30 పైసల చొప్పున అదనపు చార్జీ విధించేందుకు రంగం సిద్ధం చేసినా.. ఉన్నట్టుండి విరమించుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ చార్జీలను వసూలు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి.

దీపిక కుటుంబానికి రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా

- ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ ప్రకటన
- విద్యా మంత్రి ఆదేశాల మేరకు అందిస్తున్నట్టు వెల్లడి
- స్వగ్రామంలో దీపిక మృతదేహానికి ముగిసిన అంత్యక్రియలు


దీపిక (ఫైల్)

భైంసా టౌన్: బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యకు పాల్పడిన పీయూసీ–1 విద్యార్థిని దీపిక కుటుంబానికి రూ.లక్ష ఎక్స్‌గ్రేషియాగా అందిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. బుధవారం ట్రిపుల్ ఐటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో దీపిక మృతిపట్ల ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్, అధ్యాపకులు సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. తర్వాత ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మీడియాతో మాట్లాడారు. దీపిక మృతి ఘటన తీవ్రంగా కలచివేసిందని.. ఆమె కుటుంబానికి వర్సిటీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా మని చెప్పారు. విద్యా శాఖ మంత్రి ఆదేశాల మేరకు దీపిక కుటుంబానికి రూ. లక్ష ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్టు తెలిపారు.

స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి

పోలీసులు నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం దీపిక మృతదేహాన్ని బుధవారం ఉదయం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు అక్కడి నుంచి స్వగ్రామం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గొర్రెకల్‌కు దీపిక మృతదేహాన్ని తీసుకెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి.

లండన్‌లో హైదరాబాద్ యువతి హత్య


విలపిస్తున్న తల్లి రమాదేవి

▶ మొదటి పేజీ తరువాయి

తేజ స్విని మరణవార్త తల్లిదండ్రులను షాక్‌కు గురిచేసింది. తల్లి రమాదేవి స్పృహతప్పి పడిపోగా, తండ్రి బోరు న విలపించాడు. హత్య ఎప్పుడు జరిగిందో తెలియదని, ఆమె మీద దాడి జరిగిందని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తొలుత తమకు సమాచారం అందిందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపాడు. సోదరి మృతి విషయం తెలుసుకున్న పవన్ కుమార్‌రెడ్డి ఆస్ట్రేలియా నుంచి నగరానికి బయలుదేరాడు.

పోలీసుల అదుపులో హంతకుడు!

యూకే మెట్రోపాలిటన్ పోలీసుల కథనం ప్రకారం .. లండన్ వెంబ్లీలోని నీల్డ్ క్రిసెంట్ నివాస సముదాయంలో ఈ హత్య జరిగింది. ఈ ఘటనకు సంబంధించి హంతకుడిగా అనుమానిస్తున్న 23 ఏళ్ల కెవిన్ ఆంటోనియో లారెన్సో డి మొరాయిస్‌తో పాటు మరో యువతిని అదుపులోకి తీసుకున్నా, తర్వాత యువతిని వదిలిపెట్టినట్లు వారు తెలిపారు. హత్యకు గురైన యువతిని అధికారికంగా గుర్తించాల్సి ఉందని, పోస్టుమార్టమ్ నివేదిక తర్వాతే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కత్తిపోట్లకు గురై చికిత్స పొందుతున్న మరో యువతికి ఎలాంటి ప్రాణాపాయం లేదని తేలినట్లు తెలిపారు. తేజస్విని మరణ వార్తతో తుర్కయంజాల్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తేజస్విని తల్లిదండ్రులను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరామర్శించారు.

22న హైదరాబాద్‌కు ఈసీ బృందం

- శాసనసభ ఎన్నికల సన్నద్ధత పరిశీలన
- మూడు రోజుల పాటు పలు కీలక సమావేశాలు
- కలెక్టర్లు, ఎస్పీలతో సన్నాహక సమావేశం నిర్వహించిన సీఈఓ, డీజీపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించిసన్నద్ధతను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ నేతృత్వంలో డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు, ఇతర అధికారుల బృందం ఈ నెల 22న హైదరాబాద్‌కు రానుంది. 24 వరకు మూడు రోజుల పాటు నగరంలో పలు కీలక సమావేశాలు నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో ఎన్నికలకు సన్నద్ధతను సమీక్షించేందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ బుధవారం డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈసీఐ బృందం తొలి రోజు సీఈఓ, స్పెషల్ పోలీసు నోడల్ అధికారి, కేంద్ర సాయుధ బలగాల నోడల్ అధికారితో తొలి సమావేశం నిర్వహించి ఎన్నికలకు భద్రత, బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించనుందని వికాస్‌రాజ్ తెలిపారు.


ఐటీ, ఈడీలతో ఇతర నిఘా విభాగాలతో భేటీ

అనంతరం ఐటీ, ఎస్ఎల్‌సీబీ, ఎక్సైజ్, జీఎస్టీ, సీజీఎస్టీ, ఈడీ, ఎస్ఎల్‌బీసీ, డీఆర్ఐ, ఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, కమర్షియల్ ట్యాక్స్ వంటి విభాగాలతో కూడా సీఈఓ, డీజీపీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ...స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈసీ బృందం దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో జిల్లా పోలీసుల పాత్ర అత్యంత కీలకమని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను గుర్తించాలని, ఐటీ, జీఎస్టీ వంటి విభాగాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని ఎస్పీలను ఆదేశించారు. సమావేశంలో అదనపు డీజీలు సంజయ్‌జైన్, స్వాతి లక్రా, ఐజీ షానవాజ్ ఖాన్ పాల్గొన్నారు.

గాజు ముక్కతో కళ్లలో పొడిచి..

బురదలో తొక్కి చంపి..

- అక్క మొగుడే యముడు
- కోరిక తీర్చడం లేదని మరదలిని హత్య చేసిన బావ
- వీడిన శిరీష మృతి కేసు మిస్టరీ
- కేసు వివరాలను వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి


అనిల్

పరిగి: కలకలం రేపిన శిరీష మృతి మిస్టరీ కేసు వీడింది. సొంత అక్క భర్తే హత్య చేసినట్లు విచారణలో తేలిందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. బుధవారం పరిగిలో మీడియాతో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని కాళ్లాపూర్ గ్రామానికి చెందిన జుట్టు యాదమ్మ, జంగయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుమార్తె శ్రీలతను పరిగి పట్టణానికి చెందిన ఎర్రగడ్డపల్లి అనిల్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. అనిల్‌కు వికారాబాద్‌లో నర్సింగ్ చేస్తున్న మరదలు శిరీష(18)పై కన్ను పడింది. ఈ క్రమంలో శిరీష ఫోన్‌లో వేరే యువకుడితో మాట్లాడుతోందని ఆమెపై కోపం పెంచుకున్నాడు. కాగా, ఇటీవల శిరీష తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆమెను నగరంలోని ఆసుపత్రిలో చేర్పించారు. దీంతో ఇంట్లో ఉంటున్న శిరీష ఈనెల 10న ఫోన్‌లో మాట్లాడుతుండటంతో తండ్రి జంగయ్య, తమ్ముడు శ్రీనివాస్ మందలించారు. ఇదే అదనుగా అనిల్ కూడా శిరీషను ఫోన్‌లో మందలించడంతో పాటు జంగయ్యతో కలిసి ఆమెపై దాడికి పాల్పడ్డాడు.

ఇంట్లో నుంచి పారిపోయిన శిరీష

తీవ్ర మనస్తాపం చెందిన శిరీష ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పారిపోయింది. ఆమెను వెతికే క్రమంలో గోనె మైసమ్మ గుడివద్ద శిరీష ఉందన్న సమాచారం మేరకు అనిల్ అక్కడికి వెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఇన్ని రోజులూ తనతో కలవడానికి నిరాకరించి వేరే వ్యక్తితో ఫోన్లో మాట్లాడతావా అంటూ కత్రతో విచక్షణారహితంగా దాడి చేశాడు. పగిలిన బీరు సీసా ముక్కతో కళ్లలో పొడిచాడు. పడిపోయిన శిరీషను పక్కనే ఉన్న నీటి కుంటలోకి లాక్కెళ్లి బురదలో తొక్కి.. చనిపోయిందని నిర్ధారించుకున్నాక అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన పోలీసులు.. నిందితుడిని అరెస్ట్ చేశారు. తొందరగా శిక్ష పడేట్టు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

పాస్‌పోర్టు కౌంటర్ ప్రారంభించిన కేంద్రమంత్రి మురళీధరన్

- హిందీలో ముద్రించిన బతుకమ్మ పుస్తకం మూడో ఎడిషన్ ఆవిష్కరణ

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో పాస్‌పోర్టు దరఖాస్తుల స్వీకరణ కోసం కొత్త కౌంటర్‌ను కేంద్ర విదేశీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి వి.మురళీధరన్ ప్రారంభించారు. బుధవారం నగరానికి వచ్చిన ఆయన పాస్‌పోర్టు కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్యతో కలిసి నూతన కౌంటర్‌ను ప్రారంభించారు. అనంతరం హిందీలో ముద్రించిన బతుకమ్మ పుస్తకం 3వ ఎడిషన్‌ను విడుదల చేశారు. 2022 సంవత్సరంలో రీజినల్ పాస్‌పోర్టు ఆఫీస్ (ఆర్పీవో) హైదరాబాద్ 6.21 లక్షల పాస్‌పోర్టులను అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. జూన్ 11వ తేదీ వరకు 3.5లక్షల పాస్‌పోర్టు జారీ చేయడంపై అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ ఏడాది 7 లక్షల పాస్‌పోర్టులు జారీ చేసి రికార్డు సృష్టించాలని ఆయన ఉద్యోగులకు సూచించారు. అలాగే ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు నిర్వహించిన సృజనాత్మక పోటీలు, పెయింటింగ్స్, వ్యాసరచనలను, అందుబాటులో ఉన్న వ్యర్థాలతో తయారు చేసిన జీ–20 కళా ఖండాన్ని తిలకించారు.

కాళ్లు మొక్కుతాం..

మా డబ్బులు మాకివ్వండి

- తెయూ వీసీ కాళ్లపై పడి వేడుకున్న బాధితులు
- రెండు రోజుల్లో ఫోన్‌పే చేస్తానన్న వీసీ


తెయూ వీసీ రవీందర్ కాళ్లపై పడి తమ డబ్బులు తిరిగివ్వాలని వేడుకుంటున్న బాధితులు

తెయూ(డిచ్‌పల్లి): ‘ఏదో పని దొరుకుతుందని ఆశ పడి అప్పు చేసి మరీ డబ్బులు తీసుకొచ్చి మీ చేతుల్లో పెట్టాం. కాళ్లు మొక్కుతాం.. కనికరించి మా డబ్బులు మాకివ్వండి సారూ’అంటూ తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి.రవీందర్‌గుప్తా కాళ్లపై పడి బాధితులు వేడుకున్నారు. వీసీ రవీందర్ బుధవారం క్యాంపస్‌కు వచ్చినట్లు తెలియడంతో భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన 15 మంది బాధితులు మెయిన్ క్యాంపస్‌కు చేరుకున్నారు. ఉద్యోగాల పేరుతో డెయిలీవేజ్ కింద తమను పనిలోకి చేర్చుకున్నారని, ఇందుకోసం వీసీ రవీందర్ ఒక్కొక్కరి వద్ద రూ. 40 వేల నుంచి రూ. 50వేలు తీసుకున్నారని బాధితులు సుభద్ర, ప్రశాంత్, ప్రభాకర్‌గౌడ్, రాహుల్ తదితరులు తెలిపారు. మూడు నెలలు పనిచేసిన తర్వాత ప్రభుత్వం, ఈసీ ఆమోదం లేదని తమను పనిలోకి రావద్దని చెప్పారని బాధితులు వివరించారు. పనిచేసిన కాలానికి కూడా ఒక్కరూపాయి జీతం ఇవ్వలేదని, తాము ఇచ్చిన డబ్బులన్నా తిరిగి ఇవ్వాలని వీసీని ఘెరావ్ చేశారు. వీరికి విద్యార్థులు అండగా నిలిచారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో క్యాంపస్‌లో ఉద్రిక్తత నెలకొంది. బాధితులు చివరకు వీసీ కాళ్లపై పడి తమ డబ్బులు ఇవ్వాలని వేడుకున్నారు. దీంతో వీసీ.. బాధితులందరూ పేర్లు, అమౌంట్, ఫోన్ నంబర్లు రాసి ఇవ్వాలని, రెండు రోజుల్లో ఎవరి డబ్బులు వారికి ఫోన్‌పే చేస్తానని హామీ ఇచ్చారు.

ఎన్‌ఐఏ అదుపులో పీఎఫ్‌ఐ నేత

- ఏపీ, తెలంగాణ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న మహమ్మద్
- యువతను ఉగ్రవాదంవైపు మళ్లించడానికి ఆయుధాల శిక్షణ

ఖలీల్‌వాడి (నిజామాబాద్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) ఇన్‌చార్జిగా ఉన్న మహమ్మద్‌ను కర్ణాటకలో బుధవారం ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ గతంలో నిజామాబాద్‌లోని శిక్షణా కేంద్రాల్లో యువతకు ఆయుధ శిక్షణ ఇచ్చాడు. 2022, జూలై 4న నిజామాబాద్ నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పీఎఫ్ఐకి సంబంధించి కేసు నమోదైన విషయం తెలిసిందే. అనంతరం ఈ కేసును జిల్లా పోలీసులు ఆగస్టు 26న ఎన్ఐఏకు అప్పగించారు. దీంతో విచారణ జరిపిన అధికారులు జిల్లా కేంద్రంలోని అబ్దుల్‌ఖాదర్, షేక్ ఇమ్రాన్, షేక్ సాదుల్లా, అబ్దుల్ అహ్మద్, మహమ్మద్ అబ్దుల్ ముబీన్‌లను గతంలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆరో టౌన్ పోలీసులు పీఎఫ్ఐ సభ్యులను అరెస్ట్ చేసిన తర్వాత నగరంలోని మాలపల్లికి చెందిన పీఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ అహద్ పరారీలో ఉన్నాడు. ఇతనిపై ఎన్ఐఏ రూ. 2లక్షల రివార్డు ప్రకటించింది. అయినా ఇప్పటి వరకు అతని ఆచూకీ లభించలేదు. నగరంలోని ఆటోనగర్‌లో ప్రస్తుతం జైలులో ఉన్న అబ్దుల్‌ఖాదర్ గతంలో నిర్వహించిన శిక్షణ కేంద్రంలో మహమ్మద్ ఆయుధాల శిక్షణ ఇచ్చినట్లు తెలిసింది. యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడానికి శిక్షణ ఇచ్చి ప్రేరేపించినట్లు అభియోగాలు ఉన్నాయి. యువత ఉగ్రవాదం వైపు మొగ్గు చూపించిన తర్వాత ఆయుధాలతో హింసాత్మక చర్యలకు పాల్పడేందుకు పీఎఫ్ఐ ప్రణాళికలు రూపొందించినట్లు ఎన్ఐఏ గుర్తించింది. నిజామాబాద్‌లో కేసు కాగానే ఏపీలో ఎన్ఐఏ దాడులు చేయడంతో మహమ్మద్ తన మకాం కర్ణాటకకు మార్చారు. దీంతో ఎన్ఐఏ అధికారులు పక్కా సమాచారంతో మహమ్మద్‌ను బుధవారం కర్ణాటకలో అరెస్ట్ చేశారు. అయితే అతను నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎంత మందికి ఆయుధ శిక్షణ ఇచ్చారనేది తెలియాల్సి ఉంది.

దైవదర్శనానికి వచ్చి అనంతలోకాలకు..

- వాగులో పడ్డ ట్రాలీ ఆటో
- నలుగురు ఏలూరు జిల్లా వాసుల మృతి
- భద్రాద్రి జిల్లా బూర్గంపాడు వద్ద దుర్ఘటన


లోయలో పడిన ట్రాలీ ఆటో

బూర్గంపాడు: భద్రాచలం దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన సమీప బంధువులైన మూడు కుటుంబాలకు చెందిన 12 మంది బుధవారం తెల్లవారుజామున భద్రాచలం రామయ్య దర్శనానికి ట్రాలీ ఆటోలో వచ్చారు. దర్శనం చేసుకున్న తరువాత భోజనం చేసి తిరుగు పయనమయ్యారు. బూర్గంపాడు సమీపంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద ట్రాలీ ఆటో అదుపుతప్పి సుమారు 70 అడుగుల లోతులో ఉన్న వాగులో పడిపోయింది ఈ ప్రమాదంలో ఏలూరు జిల్లా తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన జట్ల దుర్గారావు (36), అతని తోడల్లుడు పచ్చిపాల శ్రీనివాసరావు(40) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ సహా ఆటోలో ఉన్న మిగిలిన పదిమందిలో మరో ఏడుగురు కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా దుర్గారావు ఇద్దరు కుమారులు జట్ల సందీప్(12), జట్ల ప్రదీప్(10) కూడా మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసరావు కుమార్తె రవిత్రేణి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ తరలించాలని వైద్యులు సూచించారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లే ఆటో అదుపుతప్పి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

మిర్యాలగూడలో అమానవీయ ఘటన

- ఆసుపత్రి నుంచి భార్య మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించిన భర్త


శ్రీలతారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: అనారోగ్యంతో మహిళ మృతిచెందగా, ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు భర్త, పిల్లలు నిరాకరించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం ఈ అమానవీయ ఘటన జరిగింది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన పైళ్ల గోపాల్‌రెడ్డి, శ్రీలతారెడ్డి (45) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. 14 సంవత్సరాల క్రితం వీరి కుటుంబంలో గొడవలు జరిగాయి. దీంతో శ్రీలతను ఇంటినుంచి వెళ్లగొట్టడంతో ఆమె తల్లిగారి గ్రామమైన నేరేడుచర్ల మండలం పత్తెపురం గ్రామంలో ఉంటోంది. కాగా, కొంత కాలంగా శ్రీలత అనారోగ్యంతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న శ్రీలతారెడ్డి బుధవారం మృతిచెందింది. ఈ విషయం ఆమె భర్త గోపాల్‌రెడ్డికి తెలియచేసినా మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించాడు.

పద్నాలుగేళ్లుగా పిల్లల కోసం తాపత్రయం

భర్త నుంచి విడిగా ఉంటున్న శ్రీలతారెడ్డి పద్నాలుగేళ్లుగా తన పిల్లలను చూసేందుకు పరితపించినట్లు ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు. పిల్లలు చదువుకునే స్కూల్‌కు వెళ్లినా వారిని కలవనీయకుండా గోపాల్‌రెడ్డి తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడని, దీంతో ఆమె తీవ్ర మనోవేదనకు గురైందని తెలిపారు. చివరకు భార్య చనిపోయిందని చెప్పినా పట్టించుకోకుండా ఇంటికి తాళం వేసి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఎక్కడికో వెళ్లిపోవడం దారుణమని మహిళా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇద్దరు చిన్నారులను మింగిన మానేరు

- ఈత కోసం వెళ్లి మృత్యువాత
- చూస్తుండగానే నీటిలో గల్లంతు
- పెద్దపల్లి జిల్లా పొత్కపల్లిలో ఘటన


నిత్య, సాత్విక్ మృతదేహాలు

ఓదెల: ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలిగొంది. వేసవిసెలవుల కోసం తల్లిదండ్రులతో కలసి మామయ్య ఇంటికొచ్చిన చిన్నారులు సరదాగా మానేరులో ఈత కొట్టేందుకు వెళ్లి మృత్యువాత పడ్డారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లిలో ఈ ఘటన జరిగింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన జూపాక భాగ్యలక్ష్మి, కాసర్ల వందన అక్కాచెల్లెళ్లు. వీరిద్దరూ పిల్లలతో కలసి కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కొండపాక గ్రామానికి చెందిన సోదరుడు కొలగూరి సంపత్ ఇంటికి వేసవి సెలవుల కోసం వచ్చారు. బుధవారం ఎండవేడిమి అధికంగా ఉండడంతో ఉపశమనం కోసం సంపత్ తన ఇద్దరు పిల్లలతోపాటు సోదరి భాగ్యలక్ష్మి, ఆమె పిల్లలు సాత్విక్, సింధు, మరో సోదరి వందన పిల్లలు నిత్య, మున్నతో కలసి మొత్తం ఎనిమిది మంది పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి వద్ద మానేరు వద్దకు వెళ్లారు. పిల్లలు నీటిలో దిగి ఆడుకుంటుండగా.. సంపత్, భాగ్యలక్ష్మి ఒడ్డున కూర్చున్నారు. ఇంతలో సాత్విక్ (13), నిత్య (12) లోతైన ప్రాంతానికి వెళ్లి మునిగిపోయారు. వారిని గమనించిన సంపత్ వెంటనే కాపాడేందుకు నీటిలోకి దూకగా.. అప్పటికే పిల్లలిద్దరూ మునిగిపోయారు. భాగ్యలక్ష్మి పెద్దగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి పిల్లల కోసం గాలించారు. చివరకు స్థానికులు పెద్దపల్లి ఫైర్ సిబ్బందితోపాటు వీణవంక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి నీటిలో వెతికి సాత్విక్, నిత్యను బయటకు తీశారు. సాత్విక్, నిత్యను బయటకు తీసిన వెంటనే సుల్తానాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే పిల్లలు అప్పటికే చనిపోయారని వైద్యులు తెలపడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సంఘటన స్థలాన్ని పొత్కపల్లి, వీణవంక ఎస్సైలు రామకృష్ణ, శేఖర్ సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ఏదిఏమైనా.. అసెంబ్లీలో అడుగుపెట్టాల్సిందే

- అందుకోసం ఎన్ని వ్యూహాలైనా పన్నుతాం
- ఇస్తే ముఖ్యమంత్రి పదవినైనా తీసుకుంటాం
- కత్తిపూడి సభలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'ఏదిఏమైనా ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టాల్సిందే. అందుకోసం ఎన్ని వ్యూహాలైనా పన్నుతాం' అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. బుధవారం కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యనారాయణస్వామిని దర్శించుకున్న ఆయన వారాహి వాహనంపై యాత్ర ప్రారంభించారు. అనంతరం శంఖవరం మండలం కత్తిపూడికి ర్యాలీగా చేరుకున్నారు. కత్తిపూడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టడమే తమ లక్ష్యమని, ఇందుకు ఎన్ని వ్యూహాలైనా పన్నుతామని.. ఎవరు ఆపుతారో చూస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ పథకాలను తీసెయ్యమని ఎవరూ చెప్పడం లేదన్నారు. సంక్షేమాన్ని కొనసాగించాల్సిందేనని.. అదే సందర్భంలో సంపద కూడా సృష్టించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి, ఈ ముఖ్యమంత్రికి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇతర పార్టీలతో కలిసి వెళ్దామా.. విడివిడిగా పోటీ చేస్తామా అనేది ఇంకా నిర్ణయించుకోలేదని పవన్ స్పష్టం చేశారు. అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామంటూనే.. ఇస్తే ముఖ్యమంత్రి పదవినైనా తీసుకుంటామని చెప్పడం గమనార్హం.



జనసేనకు సింబలైనా ఉందా!

- చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ పని చేస్తున్నారు
- ప్రజలను, నమ్ముకున్న వారిని మోసం చేస్తున్నారు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: జనసేన పార్టీకి సంస్థాగతమైన నిర్మాణమే కాదు.. పార్టీ సింబల్ కూడా లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. విజయవాడలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పవన్ వారాహితో ప్రచారం సినిమా షూటింగ్‌లా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యమని పవన్ అంటున్నారని, చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ పనిచేస్తున్నారని చిన్నపిల్లలకైనా అర్థమవుతోందని పేర్కొన్నారు. సినిమాల్లో షూటింగ్ తరహాలోనే పవన్ మాట్లాడుతున్నారని, కచ్చితమైన ఆలోచనతో ఆయన మాట్లాడటం లేదని సజ్జల విమర్శించారు.పవన్ మాట్లాడే మాటల్ని చూస్తే పగటి కలలు, సినిమా డైలాగుల్లా ఉన్నాయన్నారు. జనసేనకు గుర్తు కూడా లేదని, గాజు గ్లాసు గుర్తును ఎవరూ తీసుకోకపోతే ఇస్తారేమోనని ఆయన వ్యాఖ్యానించారు. చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యమని పవన్ అంటున్నారని, తద్వారా రాష్ట్ర ప్రజలను, తనను నమ్ముకున్న వారిని మోసం చేస్తున్నారని అన్నారు.

ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌లా ఉంది

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై సజ్జల రామకృష్ణారెడ్డి స్పందిస్తూ.. ఎవరో స్క్రిప్టు రాసిస్తే దానిని వారు చదివినట్టుగా ఉందన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రతి పనిలో పారదర్శకత, సోషల్ ఆడిట్ ఉందని తెలిపారు. ఏపీలో సాగుతున్న పరిపాలన దేశానికే రోల్ మోడల్‌గా ఉందని కేంద్రం నుంచి వచ్చిన మంత్రులే అంటున్నారని సజ్జల గుర్తు చేశారు. రాష్ట్రంలో అవినీతి జరిగిందంటున్న ఆ నాయకులు అదెలా జరిగిందో చెప్పాలన్నారు. నిజానికి జగన్ పరిపాలనలో నిధులన్నీ డీబీటీ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులకు అందుతున్నాయని వివరించారు. దేశంలో ఏపీ భాగం కాదన్నట్టు బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, రాష్ట్రం నుంచి పన్నులు కేంద్రానికి వెళ్లి అక్కడి నుంచి తిరిగి ఇక్కడకు వస్తాయని, కానీ కేంద్రం ఇస్తున్న నిధులు వారి జేబుల్లోంచి ఇస్తున్నట్టు మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు పెత్తందారులు, కొన్ని అగ్రకులాల పక్షమని.. జగన్ పేదల పక్షమనే విషయాన్ని అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీని వ్యతిరేకించడం ద్వారా చంద్రబాబు స్పష్టం చేశారన్నారు.

ఆ ఊళ్లో చెప్పులేసుకోరు

ఆ ఊరికి కలెక్టర్ వెళ్లినా చెప్పులు వదిలేయాల్సిందే

- ఎంత ఆకలి వేసినా బయట తిండి తినరు
- జబ్బొచ్చినా ఆస్పత్రికి వెళ్లరు
- మేమింతే అంటున్న 'వేమన ఇండ్లు' వాసులు





సాక్షి, తిరుపతి: ఇంట్లో సైతం పాదరక్షలు ధరించి తిరుగుతున్న ఈ రోజుల్లో.. ఆ ఊరి వాసులు ఎక్కడికి వెళ్లినా చెప్పులు ధరించరు. ఆకలేస్తే ఏదో ఒకటి తిని కడుపు నింపుకుంటున్న ప్రస్తుత తరంలో.. ఆ ఊరి వాళ్లు బయటి ప్రాంతాలకు వెళితే మంచినీళ్లు కూడా ముట్టరు. ఆచారాలు, సంప్రదాయాలకు విలువనిచ్చే ఆ గ్రామం పేరు 'వేమన ఇండ్లు'. తిరుపతి జిల్లా పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలో ఉంది. వేమన ఇండ్లు గ్రామంలో ఉంటున్న వారంతా 'పాలవేకరి' కులస్తులుగా, దొరవార్లుగా చెప్పుకుంటున్నారు. వీరంతా బీసీ జాబితాలో ఉన్నారు. వీరి ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామి. గ్రామంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో రోజుకో కుటుంబం పూజలు చేస్తుంది. గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి, గంగమ్మను కూడా పూజిస్తారు.

విలువలు.. కట్టుబాట్లకు పెద్దపీట

ఈ ఊళ్లో ఉన్న అందరూ ఒకే వంశం వారు. తమ కులం వారితో మాత్రమే వీరు సంబంధాలు కలుపుకుంటున్నారు. వేమన ఇండ్లు గ్రామానికి ఎవరొచ్చినా.. ఊరి బయటే చెప్పులు విడిచి గ్రామంలోకి అడుగుపెట్టాలి. ఇంట్లోకి వెళ్లాలంటే తప్పనిసరిగా స్నానం చేయాల్సిందే. లేదంటే ఇంటి బయటే ఉండాలి. కలెక్టర్ అయినా గ్రామ ఆచార సంప్రదాయాలు పాటించాల్సిందేనని స్థానికులు తేల్చిచెబుతున్నారు. ఈ గ్రామస్తులు ఎన్ని వందల కిలోమీటర్ల దూరం వెళ్లినా చెప్పులు మాత్రం ధరించరు. శ్రీ వెంకటేశ్వరుడిపై భక్తితో పాదరక్షలు ధరించడం మానేశామని గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే వారు సైతం చెప్పులు లేకుండానే వెళ్లివస్తారు. ఒకరిద్దరు ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న వారు కూడా గ్రామ ఆచార సంప్రదాయాలను తప్పక పాటిస్తున్నారు.

బయట తిండి ముట్టరు

వేమన ఇండ్లకు చెందిన వారు ఏదైనా పనిమీద వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వస్తే.. బయట తిండి ముట్టరు. మంచినీరు కూడా తీసుకోరు. ఇంటి నుంచే క్యారియర్‌లో భోజనం, బాటిల్లో మంచినీరు తీసుకెళ్తారు. విద్యార్థులు స్కూల్లో పెట్టే మధ్యాహ్న భోజనం కూడా ముట్టరు. బయటి నుంచి ఇంటికి వచ్చినా.. స్నానం చేసి బట్టలు మార్చుకోనిదే గడప తొక్కరు. అది కూడా చన్నీళ్ల స్నానమే. చిన్నారులకైనా చన్నీటితోనే స్నానం చేయిస్తారు. బంధువులు ఇంటికి వచ్చినా.. గ్రామంలో ఈ ఆచార సంప్రదాయాలు పాటించాల్సిందే.

ఆ వారం రోజులు మహిళలు ఊరి బయటే

నెలసరి మహిళల కోసం ఊరికి అవతల ప్రత్యేకంగా రెండు పక్కా గృహాలు నిర్మించారు. పీరియడ్స్ వచ్చిన మహిళలు వారంపాటు వాటిలోనే ఉండాలి. అప్పటివరకు ఇంటి యజమానే వంటా వార్పు చేస్తారు. వంటచేసి భార్యకు ఇచ్చి వచ్చేస్తారు.

ఆస్పత్రుల ముఖం చూడలేదు

గ్రామస్తులకు జబ్బు చేసినా.. చివరకు పాము కరచినా ఆస్పత్రికి వెళ్లరు. పాము కరిస్తే పుట్టచుట్టూ తిరిగితే నయం అవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లిన దాఖలాలు లేవని అంటున్నారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలోనూ వీరెవరూ ఆసుపత్రికి వెళ్లలేదు. కోవిడ్ వ్యాక్సిన్ కూడా వేసుకోలేదని చెబుతున్నారు.

23 నుంచి 'జగనన్న సురక్షా'

- 'జగనన్నకు చెబుదాం'కి అనుబంధంగా నెల రోజులు నిర్వహణ
- మిగిలిపోయిన అర్హులు, సమస్యలను గుర్తించేందుకు ప్రతి ఇల్లూ జల్లెడ
- స్పందన సమీక్షలో అధికారులకు సీఎం జగన్ దిశా నిర్దేశం



సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం, అర్హులెవరూ మిగిలిపోకుండా పథకాలను అందించడమే లక్ష్యంగా ఈనెల 23వ తేదీ నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా, పటిష్టంగా అమలు చేసేందుకు దీన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం తొలిదశలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్షా గురించి వివరిస్తారు. ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి అక్కడ ఇంకా ఎవరికైనా అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందడం లేదా? ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా? వివిధ రకాల సర్టిఫికెట్లను పొందడంలో ఏమైనా ఇబ్బందులున్నాయా? అనే అంశాలను నిశితంగా పరిశీలిస్తారు. ఆ వివరాలను నమోదు చేసుకుంటారు. ఆ తరువాత వెంటనే రెండో దశ కింద నిర్దేశిత తేదీల్లో మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో సచివాలయాలను సందర్శిస్తారు. అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అదే రోజు అందచేస్తారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటారు. జగనన్న సురక్షా ద్వారా అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు 1వతేదీన లబ్ధి చేకూర్చనున్నారు. ఈమేరకు స్పందనలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్షా కార్యక్రమం, గడప గడపకూ మన ప్రభుత్వంపై అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు.

ఇంటింటికీ వెళ్లి జల్లెడ: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్షా కార్యక్రమం గురించి వివరిస్తారు. ఆ ఇంటికి సంబంధించి ఇన్‌కమ్, మ్యారేజీ, డెత్ సర్టిఫికెట్ల నుంచి ప్రభుత్వ పథకాలను పొందడం దాకా ఏమైనా సమస్యలున్నాయా? అనే అంశంపై జల్లెడ పడతారు. ఒక్కరు కూడా మిస్ కాకుండా అన్ని వినతులు పరిష్కారం కావాలి. సమస్యలేమీ లేకుంటే కుశల ప్రశ్నలు వేసి వారి ఆశీస్సులు తీసుకుని మరో ఇంటికి వెళతారు. ఇంటింటికి వెళ్లిన సమయంలో ఎవరైనా సర్టిఫికెట్ల సమస్య లేదా ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నా, అర్హత ఉన్నా పథకాలు అందడం లేదని గుర్తించినా వివరాలు నమోదు చేసుకుంటారు. అనంతరం నిర్దేశిత తేదీల్లో గ్రామ సచివాలయాలకు వచ్చే మండల స్థాయి బృందాలు, వార్డు సచివాలయాలకు వచ్చే మున్సిపల్ స్థాయి బృందాలు అక్కడికక్కడే సర్టిఫికెట్లను ఇచ్చేస్తాయి.

పోలవరం అడవిలో... బంగారు బల్లి

బుట్టాయగూడెం: అరుదైన జాతికి చెందని బంగారు బల్లి అంతరించిపోతున్న జీవుల్లో ముఖ్యమైనది. ఇప్పుడివి పోలవరం అడవిగా పిలిచే పాపికొండలు అభయారణ్యంలోని కొండ గుహల్లో సందడి చేస్తున్నాయి. బంగారు బల్లి శాస్త్రీయ నామం కాలొడాక్టి లోడస్ అరీస్. సాధారణంగా ఇవి రాత్రిపూట మాత్రమే సంచరిస్తాయి. బంగారు వర్ణం పోలిన ముదురు పసుపు, లేత పసుపు రంగులో 150 మిల్లీమీటర్ల నుంచి 180 మిల్లీమీటర్ల పొడవు ఉంటాయి. సూర్యరశ్మి పడని, వేడి తగలని ప్రదేశాల్లో మాత్రమే సంచరిస్తాయి. రాతి గుహలు, వాటి సందు మధ్య ఉండే తేమ ప్రాంతాలంటే బంగారు బల్లులకు మహా ఇష్టం.

- సూర్యరశ్మి తగలని ప్రదేశాల్లో నివసించే జీవి
- వింత శబ్దంతో అరిచే నిశాచర జీవి



40 నుంచి 150 వరకు గుడ్లు పెడతాయి

ఇవి ఒకేసారి సుమారు 40 నుంచి 150 వరకు గుడ్లు పెడతాయ. ఇవి గుడ్లను విచిత్రంగా కిందకి వేలాడే విధంగా పెడతాయి. ఈ గుడ్లను పాములు, క్రిమి కీటకాలు తినేస్తుండటంతో ఇవి అంతరించిపోయే జాతుల్లోకి చేరుతున్నాయని అంటున్నారు. పాపికొండలు అభయారణ్య గోదావరి పరీవాహక రాతి ప్రాంతాల్లో సుమారు 250 వరకు బంగారు బల్లులు ఉన్నట్టు అటవీ శాఖ అంచనా వేశారు. బంగారు బల్లుల్లోనూ రెండు జాతులుగా ఉన్నట్టు అటవీ అధికారులు చెబుతున్నారు. వాటిలో ఒకటి కాలొడాక్టి లోడస్ అరీస్. ఇవి సాధారణ బల్లుల కంటే పెద్దగా అరుస్తూ వింత శబ్దం చేస్తాయని చెబుతున్నారు.

పాపికొండలు అభయారణ్యంలో బంగారు బల్లుల సంచారం ఉంది

పాపికొండలు అభయారణ్యంలో బంగారు బల్లుల జాడ ఉంది. రెండేళ్ల క్రితం నేను, విశాఖపట్నానికి చెందిన శాస్త్రవేత్త కలిసి పోలవరం మండలం సిరివాక గ్రామంలోని గోదావరి సమీపంలో గల రాతి ప్రదేశాల్లో అధిక సంఖ్యలో బంగారు బల్లులు పెట్టిన గుడ్లు గుర్తించాం. 250కి పైగా బంగారు బల్లులు ఉండవచ్చని అంచనా వేస్తున్నాం.

– దావీదురాజు నాయుడు, ఇన్‌వార్డ్ ఫారెస్ట్ అధికారి, పోలవరం

ఫొటోలు తీశా

పాపికొండలు అభయారణ్యంలో అరుదైన పక్షులను, జంతువులను ఫొటోలు తీశాను. బంగారు బల్లి కూడా నా కెమెరాకు చిక్కింది. అభయారణ్యం రాతి ప్రాంతాల్లో ఈ బల్లుల సంచారం ఉంది. శాస్త్రవేత్తలు కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు.

– కె.బాలాజీ, ఫొటోగ్రాఫర్, రాజమండ్రి

ఇటు పీఎఫ్.. అటు సీసీఎస్

బకాయిలు చెల్లించలేక ఆర్టీసీ గిలగిల

- తాజాగా పీఎఫ్‌కు రూ.200 కోట్లు చెల్లింపు
- సీసీఎస్‌కి చెల్లించకపోవడంపై ఆ సంస్థ సీరియస్..

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి భవిష్య నిధి (ప్రావిడెంట్ ఫండ్) బకాయిల చెల్లింపు ఇప్పుడు ఆర్టీసీ– ఆర్టీసీ సహకార పరపతి సంఘం మధ్య మళ్లీ వివాదానికి కారణమైంది. ఉద్యోగులకు పీఎఫ్ ఎంతో కీలకమైంది. కానీ చాలా కాలంగా ఆర్టీసీ పీఎఫ్ వాటా చెల్లింపుల్లో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వస్తోంది. నిధులు లేకపోవటంతో ఆ చెల్లింపులు ఆపి ఇతర పనులపై దృష్టి సారించింది. ఫలితంగా దాదాపు రూ.వేయి కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. కొంతకాలంగా నోటీసులు జారీ చేస్తూ వచ్చిన భవిష్య నిధి కమిషనరేట్ తాజాగా నోటీసులు జారీ చేయటమే కాకుండా ఆర్టీసీ బాధ్యులను పిలిపించుకుని చర్చించినట్టు తెలిసింది. ఇక బకాయిలు చెల్లించని పక్షంలో పరిణామాలు చేయిదాటిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించినట్టు సమాచారం. హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్లు ఇవ్వాల్సి ఉండగా, ఇటీవలే ఆర్టీసీ తమ సంస్థ ఉద్యోగుల నుంచి పత్రాలు సేకరించి పీఎఫ్‌కు అందించింది. కానీ బకాయిలు భారీగా పేరుకుపోవటాన్ని కారణంగా చూపి వాటిని పీఎఫ్ కమిషనరేట్‌లో పెండింగులో పెట్టినట్టు ఆర్టీసీకి తెలిపింది. దీనిపై వాకబు చేయగా, బకాయిల అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఇక గత్యంతరం లేని పరిస్థితిలో ఆర్టీసీ తాజాగా రూ.200 కోట్లను బకాయిల కింద జమ కట్టినట్టు తెలిసింది. ఇదే విషయం ఇప్పుడు ఆర్టీసీ సహకార పరపతి సంఘం(సీసీఎస్) ఆగ్రహానికి కారణమైంది.

సీసీఎస్‌కు రూ.800 కోట్ల బకాయిలు

–ఆర్టీసీ ఉద్యోగుల జీతాల నుంచి ప్రతినెలా 7 శాతం మొత్తం మినహాయించి సీసీఎస్‌కు చెల్లించాల్సి ఉన్న విషయం తెలిసిందే. అలా వచ్చే మొత్తం నుంచి ఉద్యోగులకు రుణాలు ఇవ్వటంతోపాటు, రిటైర్డ్ ఉద్యోగులు దాచుకున్న మొత్తానికి వడ్డీ చెల్లిస్తూ వస్తోంది. కొంతకాలంగా, దాని వాటా చెల్లించకుండా ఎగవేస్తూ ఇతర అవసరాలకు ఆ మొత్తాన్ని ఆర్టీసీ మళ్లిస్తోంది. అలా దాదాపు రూ.800 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఎన్ని సార్లు వాటిని చెల్లించాలని కోరినా ఆర్టీసీ పట్టించుకోకపోవటంతో, సీసీఎస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇటీవల వేసవి సెలవులకు ముందు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతినెలా సీసీఎస్‌కు చెల్లించాల్సిన రూ.18 కోట్లను కచ్చితంగా నిర్ధారిత సమయానికి చెల్లించటంతోపాటు, బకాయిలకు సంబంధించి మే చివరి నాటికి రెండు విడతల్లో రూ.200 కోట్లు జమ చేయాల్సిందిగా ఆదేశించింది. కానీ మే ముగిసినా, బకాయిల మొత్తం రాలేదని సీసీఎస్ పేర్కొంటోంది. 3 నెలల పాటు నెలవారీ మొత్తం నుంచి రూ.50 కోట్లు మాత్రం చెల్లించినట్టు తెలిసింది. నిధులు లేనందున చెల్లించటం లేదని ఆర్టీసీ పేర్కొంటూ వస్తోంది. ఇలాంటి తరుణంలో పీఎఫ్‌కు రూ.200 కోట్లు చెల్లించి తనను నిర్లక్ష్యం చేసిందని గుర్తించిన సీసీఎస్ పాలకమండలి హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది. వచ్చే రెండు రోజుల్లో పిటిషన్ వేయనున్నట్టు సమాచారం. కోర్టు ధిక్కార కేసును ఎదుర్కోవాల్సి రావటంతో హైకోర్టు ఎలా స్పందిస్తుందోనన్న ఆందోళన ఆర్టీసీలో మొదలైంది.

బడ్జెట్ కేటాయింపులు రాకపోవడంతో..

ఇటీవల పలు సంస్కరణలు, సెస్‌ల విధింపు, ఉన్న సెస్‌ల పెంపు తదితరాలతో ఆర్టీసీ రోజువారీ ఆదాయం పెరిగింది. దీన్ని కారణంగా చూపుతూ, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను ఆర్థిక శాఖ ఇవ్వటం లేదు. బడ్జెట్‌లో ఆర్టీసీకి కేటాయించిన నిధులు రాకపోవటంతో పెద్ద బకాయిల చెల్లింపు ఆర్టీసీకి సాధ్యం కావటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.400 కోట్ల వరకు నిధులు ఆర్టీసీకి అందలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల నిధులూ అందలేదు. రోజువారీ ఆదాయం జీతాలు, డీజిల్ ఖర్చు, ఇతర నిర్వహణ వ్యయానికే సరిపోతోంది. బకాయిలు చెల్లించాలంటూ కచ్చితంగా ప్రభుత్వం బడ్జెట్ నిధులు ఇవ్వాల్సిన పరిస్థితిలో ఇప్పుడు ఆర్టీసీ మరోసారి హైకోర్టుమెట్లెక్కాల్సి వస్తోంది.

ఏపీలో తొలి మహిళా సహకార డెయిరీ ప్రారంభం

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో ఏర్పాటు
- 'అమ్మ డెయిరీ'ని ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



డెయిరీని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తదితరులు

రాప్తాడు రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో తొలి 'మహిళా సహకార డెయిరీ' అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఏర్పాటైంది. స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత నిధులు రూ.20 కోట్లు ఖర్చు చేసి నియోజకవర్గంలోని 10 వేల మంది మహిళా పాడి రైతుల కోసం ఈ డెయిరీ ఏర్పాటు చేశారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన నిర్మించిన ఈ డెయిరీకి 'అమ్మ డెయిరీ'గా నామకరణం చేశారు. ఈ డెయిరీని బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. దీని వల్ల ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. ప్రారంభంలో రోజూ లక్ష లీటర్ల పాలను సేకరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ డెయిరీకి పాలు పోసే రైతులందరూ యజమానులేనని స్పష్టం చేశారు.మంత్రి ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని ఆస్వాదించేలా జంగిల్ సఫారీలు

ప్రకృతిని, పచ్చదనాన్ని పర్యాటకులు ఆస్వాదించేందుకు 'జంగిల్ సఫారీ'లు దోహదపడుతున్నాయి. అటవీ ప్రాంతాల వీక్షణ, అందులోని జంతువులు, వన్యప్రాణులు, చెట్లు, పచ్చదనం, నీటి వనరులు, గుట్టలు, కొండలతో కూడిన ఆహ్లాదభరిత అనుభవాన్ని అందుబాటులోకి తెచ్చేలా అటవీ శాఖ చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలోని పట్టణాలు, నగరాలకు సమీపంలోని అటవీ ప్రాంతాల్లో హరిత వనాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నిర్మల్, మహబూబ్‌నగర్ తదితర చోట్ల ఇవి ప్రారంభం కాగా, ఆమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల పరిధిలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు.

- అడవుల్లో పర్యటించిన అనుభూతి కలిగించేలా హరితవనాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో ఏర్పాట్లు
- ఇప్పటికే నిర్మల్, మహబూబ్‌నగర్‌లో ప్రారంభం... త్వరలో మరిన్ని ప్రాంతాల్లో
- ఎకోటూరిజం ప్రాజెక్ట్‌లో భాగంగా చర్యలు
- ఏటూరునాగారం, పోచారం, కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ శాంక్చురీల్లోనూ ఏర్పాటుకు అటవీశాఖ కసరత్తు



సాక్షి, హైదరాబాద్: పర్యాటకులకు అడవుల్లో పర్యటించిన అనుభూతులు కలిగించడంతోపాటు ఆమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల్లో ఇప్పటికే ఉన్న టైగర్ సఫారీల మాదిరి అనుభూతిని కల్పించేలా ఓపెన్‌టాప్ జీప్‌లు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ చోట్ల అటవీ ప్రాంతాల ప్రత్యేకతను కాపాడుతూనే ఎకో టూరిజం ప్రాజెక్టులో భాగంగా వీటిని చేపడుతున్నారు. అలాగే, మరిన్ని ప్రాంతాల్లో 'జంగిల్ సఫారీ'ల ద్వారా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటూరునాగారం, పోచారం, కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ శాంక్చురీల్లోనూ సఫారీల ఏర్పాటు దిశగా అటవీశాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. తాజాగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని చించోలి–బి.గండిరామన్న హరితవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఇక్కడ రెండు ప్రత్యేక ఓపెన్‌టాప్ సఫారీ వాహనాలతో పాటు పెట్రోలింగ్ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. అలాగే, ఈ అర్బన్ పార్కులో పెద్దలు, పిల్లలకు వినోదం కలిగించేలా అడ్వెంచర్ కార్యక్రమాలు సైతం ఉన్నాయి. కోతుల సంరక్షణ, పునరావాస కేంద్రం, మూషిక జింకల పార్కు, చైన్ లింక్, ఎకో హట్స్, సైక్లింగ్, వాచ్ టవర్స్ చిన్న పిల్లల ఆట స్థలం లాంటి సౌకర్యాలను కల్పించారు.

ఎకో టూరిజం ప్రాజెక్ట్‌లో భాగంగా..

- ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీలో తాడ్వాయి వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో క్యాంపింగ్ సౌకర్యాలు, కాటేజీలు
- తాడ్వాయ్ కాంప్లెక్స్‌లో ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్. ఈ శాంక్చురీలో డ్రైవ్‌కు వెళ్లడంతోపాటు దామర్‌వాయి గుహలు వీక్షించవచ్చు
- లక్నవరం, రామప్ప, బోగత జలపాతం, పాకాల్ వైల్డ్‌లైఫ్ శాంక్చురీ, మేడారం, మల్లూరు దేవాలయ ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి

కాటేజీల నిర్మాణం

జంగిల్, టైగర్ సఫారీల విస్తరణతోపాటు ఇప్పటికే ఉన్న ఆమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ల్లో మరిన్ని కొత్తరూట్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. ఈ సఫారీల్లో నీటి వనరులు, గడ్డిభూములు, చెట్లు, జింకలు, ఇతర శాఖాహార జంతువులను అందుబాటులోకి తెచ్చే ఆలోచనలున్నాయి. జన్నారం తదితర చోట్ల మరిన్ని కాటేజీల నిర్మాణంతోపాటు పిల్లలకు ఎడ్యుకేషన్ సెంటర్లు, విద్యార్థులకు క్యాంపింగ్ ఏరియా, పర్యాటకుల కోసం లఘుచిత్రాల ప్రదర్శనకు చిన్న ఆడిటోరియం నిర్మించే ప్రణాళికలున్నాయి.

–ఎ.శంకరన్, వైల్డ్‌లైఫ్ విభాగం ఓఎస్‌డీ, అటవీశాఖ

- లక్నవరంలో డీర్ రెస్క్యూ, రిహాబిలిటేషన్ సెంటర్
- కిన్నెరసాని డ్యామ్ వద్ద ఎకో టూరిజం సెంటర్, డీర్‌పార్కు, నేచర్ పార్కు, నేచర్ ట్రెక్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. అక్కడే 312 హెక్టార్లలో బయో డైవర్సిటీ పార్కు అభివృద్ధి.
- మెదక్ ఎకోటూరిజం ప్రాజెక్ట్‌లో భాగంగా పోచారంలో 300 ఎకరాల్లో డీర్ బ్రీడింగ్ సెంటర్. పర్యాటకుల కోసం సఫారీ రైడ్.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

SR - Empowering Future Doctors to Triumph and Excel !

in NEET 2023

MARKS **657**

G. BALRAJ
Ht. No. 230411460989

MARKS **638**

P.MADHURI
Ht. No. 2304105875818

ALL INDIA RANK **226**

G.VARSHINI
Ap. No. 230410699238 (R)

MARKS **636**

VIVEK ROY
Ht. No. 230411658811

MARKS **631**

M.SINDHU
Ht. No. 230410259027

ALL INDIA RANK **257**

VIVEK ROY
Ap. No. 230411658811 (R)

MARKS **615**

D.SRI VARSHA
Ht. No. 230410388967

MARKS **630**

V.SAI SIDDARTH
Ht. No. 230411200538

MARKS **604**

K.VEERESH
Ht. No. 230411396881

ALL INDIA RANK **257**

E.SAI
Ap. No. 230410089983 (R)

తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న మెడికల్ సీట్స్ ను దృష్టిలో ఉంచుకొని డాక్టర్ కావాలనే ప్రతి విద్యార్థి కల ను నెరవేర్చుటకై IPE/NEET మార్కుల ఆధారంగా NEET లాంగ్ టర్మ్ అడ్మిషన్స్‌లో Concessions పై 'SR' సంచలనాత్మక నిర్ణయం.

IPE 2023 MARKS BASED CONCESSIONS

IPE-2023 MARKS	% OF CONCESSION	TOTAL FEE FOR RESIDENTIAL	CONCESSION	NET FEE
980 and above	90	1,50,000/-.	1,35,000/-.	15,000/-.
970 to 979	80	1,50,000/-.	1,20,000/-.	30,000/-.
960 to 969	70	1,50,000/-.	1,05,000/-.	45,000/-.
950 to 959	60	1,50,000/-.	90,000/-.	60,000/-.
950 to 959	50	1,50,000/-.	75,000/-.	75,000/-.

NEET 2023 MARKS BASED CONCESSIONS

NEET-2023 MARKS	% OF CONCESSION	TOTAL FEE FOR RESIDENTIAL	CONCESSION	NET FEE
450 and above	90	1,50,000/-.	1,35,000/-.	15,000/-.
425 to 449	80	1,50,000/-.	1,20,000/-.	30,000/-.
400 to 424	70	1,50,000/-.	1,05,000/-.	45,000/-.
375 to 399	60	1,50,000/-.	90,000/-.	60,000/-.
350 to 379	50	1,50,000/-.	75,000/-.	75,000/-.

NOTE: * DAY SCHOLAR FEE IS 50% OF RESIDENTIAL FEE * ABOVE CONCESSIONS ARE APPLICABLE TO LIMITED SEATS, FOR A LIMITED PERIOD.

LONG TERM 'NEET' COACHING CLASSES STARTS FROM 26th JUNE 2023

HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 9154174318 | **WARANGAL:** 9642117378 | **VIJAYAWADA:** 8142111302 | **VIZAG:** 9052222274, 9154854707 | **GUNTUR:** 9154854694 | **TIRUPATI:** 9154854699 | **NELLORE:** 9154854696 | **ANANTHAPURM:** 9154854691 | **KURNOOL:** 9154854695 | **NIZAMABAD:** 9642117110 | **SRIKAKULAM:** 9154854697 | **BHIMAVARAM:** 9642223762, 7331122579 | **RAJAHMUNDRY:** 9154854693 | **KARIMNAGAR:** 9642117367 | **NALGONDA:** 9573927070 | **ONGOLE:** 8712609156 | **KHAMMAM:** 9121155002 | **ADILABAD:** 9154854690 | **KOTHAGUDEM:** 9154854692 | **NIRMAL:** 9642117835 | **HOSAPETE:** 9154854713.

SR Educational Academy
TELANGANA ● ANDHRA PRADESH ● KARNATAKA

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 12+12 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 84


గురువారం 15-6-2023



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

అన్ని కేటగిరీలలో ఆలిండియా ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థుల మార్కులు





స్థలాభావం వలన మిగిలిన అందరి మార్కులు ప్రకటించలేకపోతున్నాం

తల్లిదండ్రుల్లారా గమనించండి ! నారాయణలో చేరకముందు, నారాయణ లాంగ్‌టర్మ్‌లో చేరిన తరువాత మార్కుల వ్యత్యాసాన్ని గమనించండి

NAME	NEET-2023 నారాయణలో లాంగ్ టర్మ్ తరువాత	NEET-2022 నారాయణలో లాంగ్‌టర్మ్ ముందు	DIFF MARKS
P S KRISHNA AMRUTH	644	241	403
C BORRA CHITRA	600	353	247
TUSHARA REDDY A	542	308	234
A.DURGANANDA REDDY	555	323	232
AKUMALLA.ABHIGNA	553	324	229
MUKKAMALLA DEVI	602	380	222
CHERLAPALLY SANJAY	550	330	220
E.VINOD GOUD	517	306	211
M LAKSHMIKANTH	583	379	204
P.AKSHARA	531	332	199
A.ASHOK KUMARA	627	437	190
PULI.GAUTAMI	503	313	190
B.SRISHARAN	531	345	186
G.TEJA CHANDRA REDDY	521	335	186
GANDHE DEEKSHITHA	512	336	176
BURANI.JAVALI	521	347	174

NAME	NEET-2023 నారాయణలో లాంగ్ టర్మ్ తరువాత	NEET-2022 నారాయణలో లాంగ్‌టర్మ్ ముందు	DIFF MARKS
C SHANMUKH AVINASH	555	387	168
C ROHITH KUMAR	557	391	166
MOIN KHAN MD	576	412	164
PURVA DIXIT	643	481	162
PONNAM.SHRUTHI	532	370	162
MD MUDASSIR	680	520	160
ADE.SAI VARDHAN	519	361	158
T SOUMYA	539	382	157
G.SAHITHI	563	407	156
SHAIK MADIHA T	540	385	155
P.SURYA SRI	540	385	155
CHANDAN REDDY. RAVI	530	377	153
NUTHI ESHWAR	523	370	153
Y RAMYA YEDURURI	652	506	146
DODDAKA JAHNAVI	561	424	137
K KEERTHI CHANDANA	534	420	114

Many More...

నారాయణ విద్యాసంస్థలు-ఇండియా



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+12 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 84

గురువారం 15-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నష్టాల్లోంచి లాభాల్లోకి...

తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ రాణించిన మెటల్, ఇంధన షేర్లు - 9లో



టోకు ధరలు దిగివచ్చాయ్..!

మేలో ఏడున్నర ఏళ్ల కనిష్టానికి డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం - 9లో



డీఆర్‌డీవో సైంటిస్ట్.. నెలకు లక్ష

దేశ రక్షణకు సంబంధించిన కీలక పరిశోధనలు సాగించే.. డీఆర్‌డీఓలో అడుగుపెట్టే అద్భుత అవకాశం!

- వివరాలు 9లో



మండే ఎండలు.. వడగాడ్పులు

రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఇంకా అధికంగా నమోదవుతున్నాయి.

- వివరాలు 6లో



5 కట్టడాలకు 'గ్రీన్ యాపిల్'

రాష్ట్రంలోని ఐదు కట్టడాలకు ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డులు లభించాయి.

- వివరాలు 10లో



ఇక ఓల్వో.. బెంజ్‌లకు టాటా

ఓల్వో.. బెంజ్.. స్కానియా లాంటి బస్సులను గరుడ ప్లస్ కేటగిరీలో వినియోగిస్తున్న ఆర్టీసీ వాటిని వదిలించుకోవాలని నిర్ణయించింది.

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

వాళ్లు నా పంచె గురించి మాట్లాడుతున్నారు



'నీళ్ల గురించి నేను మాట్లాడుతుంటే సుఖేందర్‌రెడ్డి మాత్రం నా పంచె గురించి, నా గోచీ గురించి మాట్లాడుతున్నారు' అని సీఎల్పీనేత భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. నీళ్ల గురించి చెప్పేందుకు వారి దగ్గర సమాధానం లేదన్నారు. - 2లో

కబాలి నిర్మాత కేపీ చౌదరి అరెస్టు



రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన 'కబాలి' తెలుగు సినిమా నిర్మాత సుంకర కృష్ణప్రసాద్ చౌదరి (కేపీ చౌదరి)ని మాదక ద్రవ్యాల విక్రయం కేసులో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు.

- వివరాలు 10లో

ఎయిర్‌పోర్టు మెట్రో ప్రీబిడ్ విజయవంతం



రాయదుర్గం నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించనున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుపై మరో అడుగు ముందుకు పడింది. బుధవారం బేగంపేట్‌లోని హెచ్ఎంఆర్ కార్యాలయంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహించారు. - 4లో

నేటి నుంచి జీ-20 వ్యవసాయ మంత్రుల భేటీ



అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్ మినిస్టీరియల్ సమావేశాలకు హైదరాబాద్ సిద్ధమైంది. గురువారం నుంచి ఈ నెల 17 వరకు జరిగే ఈ సదస్సుకు జీ20 సభ్య దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. - 6లో

• బాల్యంపై చదువు భారం


కేజీల కొద్దీ బరువు

పుస్తకాల బ్యాగులు మోయలేక విద్యార్థుల అవస్థలు

విద్యార్థి పుస్తకాల భారం అతని బరువులో 10% మించి ఉండకూడదన్న నిబంధనకు తిలోదకాలు

సగటున 12 కేజీల వరకూ బరువు మోస్తున్న ప్రాథమిక విద్యార్థులు	తెలంగాణ విద్యాశాఖ క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి	70% విద్యార్థుల మోకాళ్లు, కండరాలపై ఒత్తిడి	22% మందిలో వెన్నెముక నొప్పి సమస్య	చదువుపై దృష్టి పెట్టలేని, తరగతిలో చురుగ్గా ఉండలేని పరిస్థితి	ప్రైవేటు స్కూళ్లలోనే ఎక్కువ సమస్య

సాక్షి, హైదరాబాద్: బడికెళ్ళే చిన్నారులు భుజాలపై బరువుతో అల్లల్లాడిపోతున్నారు. గంపెడు పుస్తకాలున్న సంచిని మోయలేక అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి ఏటా ఈ సమస్య కొనసాగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువ పుస్తకాలతో కూడిన బ్యాగులు మోయడం వల్ల 70% విద్యార్థుల మోకాళ్లు, కండరాలపై ఒత్తిడి పడుతోందని విద్యాశాఖ సేకరించిన డేటాయే వెల్లడించడం గమనార్హం. రాష్ట్రంలోని విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై విద్యాశాఖ సమాచారం సేకరించింది. దీని ప్రకారం చూస్తే.. 22%మంది చిన్నారులు వెన్నెముక నొప్పికి గురవుతున్నారు. చాలా మంది భుజాలు వంగిపోయి నొప్పులు రావడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అనేకమంది స్కూలు ముగిసి ఇంటికి రాగానే నీరసపడిపోతున్నారు. అధిక బరువుతో కూడిన బ్యాగులు మోసి ఇంటికొచ్చిన విద్యార్థులు కాళ్ల నొప్పితో బాధపడుతున్నారని, ఎక్కువగా నిద్రపోతున్నారని, చదువు మీద దృష్టి పెట్టలేని, తరగతి గదిలో చురుకుగా ఉండలేని పరిస్థితి కూడా మిగతా 2వ పేజీలో ▶



పాప 10 కేజీలు.. పుస్తకాలు 6 కేజీలు!



హైదరాబాద్‌కు చెందిన చిన్నారి కృషిక ఓ ప్రైవేటు స్కూల్లో ఎల్‌కేజీ చదువుతోంది. పాప బరువు నిండా పది కేజీలు ఉండదు. దీన్నిబట్టి ఆమె పుస్తకాల బ్యాగ్ ఒక కేజీకి మించి ఉండకూడదు. కానీ అది ఏకంగా 6 కేజీల వరకూ ఉంది. లంచ్ బాక్సు, వాటర్ బాటిల్ బరువు మరో 2 కేజీలు అదనం. స్కూల్ వరకూ రవాణా సదుపాయం ఉన్నా, స్కూల్ బయట నుంచి తరగతి గదికి, తిరిగి వచ్చేటప్పుడు ఈ బరువంతా మోయాల్సిందే. స్కూల్‌కెళ్ళే ముందు ఉండే ఉత్సాహం పాప ఇంటికి తిరిగొచ్చాక ఉండటం లేదని తండ్రి జగదీష్ తెలిపారు.

గుడి నుంచి బడి దాకా.. అభివృద్ధి..

రాష్ట్రంలో ప్రజలు అడగకపోయినా సంక్షేమ పథకాలు: కేటీఆర్

- ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి ప్రభుత్వం నుంచి ప్రయోజనమన్న మంత్రి
- తెలంగాణ, ఏపీగా విడిపోయినా అన్నదమ్ముల్లా కలసి ఉన్నామని వెల్లడి
- సిరిసిల్ల జిల్లాలో 2 ఆలయాల పునర్నిర్మాణానికి రూ. 2కోట్ల చొప్పున టీటీడీ సాయం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలసి పనులు ప్రారంభించిన కేటీఆర్
- సీఎం కేసీఆర్ కోరడంతో టీటీడీ నుంచి నిధులిచ్చాం: వైవీ సుబ్బారెడ్డి

సిరిసిల్ల: ''రాష్ట్రంలో పల్లెల నుంచి పట్టణ ప్రగతి వరకు, తాగునీటి నుంచి సాగునీటి వరకు, వ్యవసాయం నుంచి ఐటీ వరకు, గుడి నుంచి బడి వరకు.. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఎంతో ప్రగతి సాధించాం. అణగారిన వర్గాల నుంచి అగ్రవర్ణాల వరకు ఎవరినీ వదలకుండా ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమం చేరింది. ప్రతిపక్షాలు లొల్లి చేయకున్నా, ప్రజలు రోడ్డెక్కి ఇది కావాలని డిమాండ్ చేయకపోయినా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం..'' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ చెప్పారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఏపీలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఇటీవల సిరిసిల్లలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.2కోట్లు, ఎల్లారెడ్డిపేటలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మరో రూ.2 కోట్లను మంజూరు చేసింది. మంత్రి కేటీఆర్ బుధవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలసి ఈ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసే ఉన్నామని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పారు.

ఎండాకాలంలోనూ నిండుగా చెరువులు

హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సిరిసిల్లకు వస్తూ కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్, మిగతా 2వ పేజీలో ▶



సిరిసిల్లలో ఆలయ పునర్నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తదితరులు

సిద్దిపేటకు 'ఐటీ' హంగు

- నేడు ఐటీ టవర్ ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, హరీశ్
- రూ.62.82 కోట్ల వ్యయంతో నిర్మాణం - 2లో

రాబోయే ఎన్నికల్లో తుపాను రాబోతోంది

- ప్రజలు తిరగబడే టైం వచ్చేసింది
- రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్‌లో చేరిన కూచాడి శ్రీహరి, నోముల ప్రకాశ్‌గౌడ్



బుధవారం మీడియాతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఒక తుపాను రాబోతోందని, నిశ్శబ్ద విప్లవం ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో వెలిబుచ్చేందుకు సిద్ధమవుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ మోసాన్ని భరించే ఓపిక తెలంగాణ ప్రజలకు లేదు. తెలంగాణ సమాజం తిరగబడే సమయం ఆసన్నమైంది. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రేమ ఉంది. వారి తలుపు తడితే చాలు... కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ నేతలు గ్రామాల్లోకి వెళ్లి ప్రతి గుండెకు చేరాలి.' అని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌కు చెందిన బీఆర్ఎస్ నేత కూచాడి శ్రీహరిరావు, సికింద్రాబాద్ బీఆర్ఎస్ నాయకులు నోముల ప్రకాశ్‌గౌడ్ వేలాది మంది అనుచరులతో బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్‌రెడ్డి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించా రు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి, ప్రజల కు మధ్య యుద్ధం జరగబోతోందని, ఈ యుద్ధంలో ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని ఓడిస్తారని చెప్పారు.

కొడంగల్ ఎంతో.. నిర్మల్ కూడా అంతే

నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ నుంచి ఒకరిద్దరు వెళ్లిపోతే అక్కడ పార్టీనే ఉండదేమో అన్నట్టు కొందరు వ్యవహరించారని, ఇప్పుడు అంతకంటే బలమైన నేతలు పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. కచ్చితంగా నిర్మల్‌లో కాంగ్రెస్ జెండా మిగతా 2వ పేజీలో ▶

ఒక ధరణి.. 46 సమస్యలు!

- పోర్టల్ తెచ్చి ఐదేళ్లవుతున్నా పూర్తిస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు
- ప్రజావాణిలో భూసంబంధిత అర్జీలే ఎక్కువగా వస్తున్న వైనం
- పాత రికార్డులు అప్‌లోడ్ చేసే ముందు జాగ్రత్త పడలేదన్న విమర్శలు
- దొర్లిన తప్పులు సవరించేందుకు లేని అవకాశం
- మొత్తం 46 రకాల తప్పులు గుర్తించిన భూ పరిపాలన నిపుణులు
- కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతూనే ఉన్న రైతులు

- వివరాలు 10లో

సబ్జెక్టులు.. సెక్షన్లు ఛేంజ్!

- త్వరలో సీసీఎల్ఏలో పూర్తిస్థాయి ప్రక్షాళన!
- ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని మార్చేందుకు కసరత్తు
- ఇప్పటికే ఇద్దరు సెక్రటరీల బదిలీ.. ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు
- ఇప్పుడు అసిస్టెంట్ సెక్రటరీలు, సూపరింటెండెంట్లపై మిత్తల్ దృష్టి



సాక్షి, హైదరాబాద్: భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయ ప్రక్షాళనకు కసరత్తు ప్రారంభమైంది. రాష్ట్రంలోని భూముల వ్యవహారాల్లో కీలకపాత్ర పోషించే సీసీఎల్ఏలో ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేస్తున్న సిబ్బందిని త్వరలోనే పూర్తిస్థాయిలో మార్చనున్నారు. వారి సబ్జెక్టులు, సెక్షన్లు మారనున్నాయి. ఇప్పటికే ఇద్దరు సెక్రటరీలను బదిలీ చేసి వారి స్థానంలో ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమించగా, ఇప్పుడు సీసీఎల్ఏ పరిధిలోకి వచ్చే పలు విభాగాల్లోనూ మార్పులు చేయాలని సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ నిర్ణయించారు. అసిస్టెంట్ సెక్రటరీలు, సూపరింటెండెంట్లకు కేటాయించిన విభాగాల బాధ్యతలను త్వరలో మార్చనున్నారు.

కీలక విభాగాలపై దృష్టి..

సీసీఎల్ఏలో ఉన్న కీలక విభాగాలపై నవీన్ మిత్తల్ దృష్టి సారించారు. ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల కోసం ఇప్పటికే ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి వాటి పరిష్కారం కోసం మిత్తల్ ప్రయత్నిస్తున్నారు. సర్వే నెంబర్ల మిస్సింగ్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ధరణి పోర్టల్‌లోని టీఎం33 ద్వారా వచ్చిన దరఖాస్తులను జిల్లాల వారీగా క్రోడీకరించి తానే స్వయంగా ఆ దరఖాస్తులను పరిశీలించి, అధికారులతో చర్చించి పరిష్కరిస్తున్నారు. దీంతో పాటు ఎస్టాబ్లిష్‌మెంట్, విజిలెన్స్, ప్రభుత్వ భూములు, మిగతా 2వ పేజీలో ▶

ఎన్ఐటీలో సీటొచ్చినా ఐఐటీలో చదవొచ్చు

స్టూడెంట్స్-ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ విధానానికి శ్రీకారం.. కీలక నిర్ణయం తీసుకున్న ఐఐటీ హైదరాబాద్

- దేశంలోని తొమ్మిది ఎన్ఐటీలతో ఒప్పందాలు
- 8, ఆపై సీజీపీఏతో బీటెక్ పూర్తి చేసినవారికి ప్రవేశపరీక్ష లేకుండానే పీహెచ్‌డీ చాన్స్
- పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలే లక్ష్యమన్న ఐఐటీ వర్గాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: దేశంలో అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీ (భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ)లలో చదువుకోవడం ఎంతో మంది విద్యార్థుల కల. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో మంచి స్కోర్ చేసిన వారికి మాత్రమే ఐఐటీలలో ప్రవేశం దక్కుతుంది. అయితే ఎన్ఐటీ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లలో చేరిన విద్యార్థులు కూడా ఐఐటీలో చదువుకునేందుకు వీలు కలగనుంది. ఈ మేరకు హైదరాబాద్ ఐఐటీ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి స్టూడెంట్- ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ విధానానికి తాజాగా శ్రీకారం చుట్టింది.

చివరి ఏడాది ఐఐటీలో..

స్టూడెంట్-ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ విధానంలో భాగంగా.. ఎన్ఐటీలలో బీటెక్ చదువుతూ 8.5, ఆపై సీజీపీఏ కలిగిన విద్యార్థులు నాలుగో ఏడాది ఐఐటీ



హైదరాబాద్‌లో చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. దీనితోపాటు 8, ఆపై సీజీపీఏతో బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులకు ఎలాంటి ప్రవేశపరీక్ష లేకుండానే నేరుగా పీహెచ్‌డీ చేసేందుకు అనుమతినిస్తూ ఐఐటీ హైదరాబాద్ కీలక నిర్ణయం తీసుకుంది. ఐఐటీలలో చదువుకోలేకపోయామనుకునే విద్యార్థులకు ఇది మంచి అవకాశమని ఐఐటీ వర్గాలు చెప్తున్నాయి.

➤ ఎన్ఐటీలతో పోల్చితే ఐఐటీలలో పరిశోధనలకు సంబంధించి మౌలిక సదుపాయాలు, ఉన్నత స్థాయి గైడెన్స్ ఎక్కువగా ఉంటుంది. ఐఐటీ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ చేసేందుకు అర్హత కలిగిన ఎన్ఐటీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

➤ ఎన్ఐటీ, ఐఐటీహెచ్‌లలోని ఫ్యాకల్టీలు పరస్పరం సహకరించుకుంటారు. ఆయా ఎన్ఐటీల్లో పనిచేసే ప్రొఫెసర్లు, వివిధ విభాగాల అధిపతులు ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించి.. బోధన, పరిశోధన, ఇతర అంశాలను పరిశీలించేందుకు వీలుంటుంది. తద్వారా ఎన్ఐటీలలో చదువుకుంటున్న విద్యార్థులకు మరింత ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందేందుకు వీలు కలుగుతుంది.

ఆ తొమ్మిది ఎన్ఐటీలు ఇవే..

స్టూడెంట్-ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ విధానానికి సంబంధించి హైదరాబాద్ ఐఐటీతో తొమ్మిది ఎన్ఐటీలు భాగస్వామ్య ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఇందులో ఎన్ఐటీ సిక్కిం, ఎన్ఐటీ సిల్‌చార్, ఎన్ఐటీ అగర్తల, ఎన్ఐటీ నాగాలాండ్, ఎన్ఐటీ మేఘాలయ, ఎన్ఐటీ శ్రీనగర్, ఎన్ఐటీ కాలికట్, వీఎన్ఐటీ నాగ్‌పూర్, ఎన్ఐటీ రూర్కేలా ఉన్నాయి.

వినూత్న ఆవిష్కరణలకు ప్రాధాన్యం

ఐఐటీ హైదరాబాద్ వినూత్న ఆవిష్కరణల (ఇన్నోవేషన్స్)కు ప్రాధాన్యం ఇస్తుంది. ఈ అంశంలో ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం మిగతా 2వ పేజీలో ▶



- డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ మినహా మిగతా పోస్టులు పదోన్నతులతో భర్తీ
- ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేసిన గురుకుల సొసైటీలు
- బీసీ గురుకుల సొసైటీలో నెలాఖరుకల్లా పూర్తికి సన్నాహాలు
- మిగతా సొసైటీల్లోనూ వేగంగా పదోన్నతుల ప్రక్రియ పూర్తి

పదోన్నతులకు వేళాయె...

గురుకులాల్లో పీజీటీ, జేఎల్, డీఎల్ పదోన్నతులకు సొసైటీల కసరత్తు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో పదోన్నతుల జాతర మొదలైంది. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ వేగవంతం కాగా... పదోన్నతుల ద్వారా మిగులు పోస్టుల భర్తీకి గురుకుల సొసైటీలు చర్యలు వేగవంతం చేశాయి. ఇందులో భాగంగా ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) నుంచి పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)గా, అర్హత ఉన్న పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లను జూనియర్ లెక్చరర్ లేదా ప్రిన్సిపల్స్‌గా, జూనియర్ లెక్చరర్ నుంచి డిగ్రీ లెక్చరర్‌గా పదోన్నతులకు సొసైటీ అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. రెండ్రోజుల క్రితం మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)లో పదోన్నతులకు సంబంధించి సర్క్యులర్ జారీ చేసింది. మిగతా సొసైటీలు సైతం వీలైనంత త్వరితంగా ఉత్తర్వులు జారీ చేసి పదోన్నతుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే దిశగా చర్యలు మొదలుపెట్టాయి.

వెయ్యికిపైగా ఖాళీలు...

సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో దాదాపు 9 వేల ఉద్యోగాల భర్తీకి ఇటీవల తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందుకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ పూర్తి కాగా, ప్రస్తుతం దరఖాస్తు సవరణకు బోర్డు అవకాశం కల్పించింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి పోస్టులను గురుకుల బోర్డు ద్వారా భర్తీ చేస్తుండగా... పదోన్నతుల కోటాకు సంబంధించి సంబంధిత సొసైటీలు భర్తీ చేయనున్నాయి. ఈక్రమంలో మిగతా 2వ పేజీలో ▶

ఆర్సీఓలకు బాధ్యతలు...

➤ పదోన్నతుల ప్రక్రియలో రీజినల్ కోఆర్డినేటర్ల (ఆర్సీఓ)కు బాధ్యతలు అప్పగించేలా గురుకుల సొసైటీలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా క్షేత్రస్థాయి నుంచి వచ్చే దరఖాస్తులన్నీ ఆర్సీఓల ద్వారా స్వీకరిస్తారు. అనంతరం వాటిని అక్కడే పరిశీలించిన తర్వాత జోనల్, మల్టీజోనల్ వారీగా సీనియార్టీ జాబితాలను గురుకుల సొసైటీ కార్యదర్శి కార్యాలయంలో తయారు చేస్తారు. ఆ తర్వాత అర్హులెవరు, నియామకాలు తదితరాలన్నీ కార్యదర్శి కార్యాలయం ద్వారా జరుగుతాయి. దరఖాస్తు విధానమంతా ఆన్‌లైన్ పద్ధతిలోనే స్వీకరిస్తారు. అనంతరం వాటిని పరిశీలించిన అర్హులతో కూడిన జాబితాను ఆన్‌లైన్లో పొందుపరుస్తారు. పోస్టింగ్ కేటాయింపులు మాత్రం ఆన్‌లైన్‌లోనే ఖరారయ్యేలా గురుకుల సొసైటీలు వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేశాయి.

క్లుప్తంగా...

కుటుంబ సర్వేను ఎందుకు బయటపెట్టడంలేదు: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారానికి రాగానే కేసీఆర్ సర్కారు నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఎందుకు అసెంబ్లీలో పెట్టడం లేదని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. కేబినెట్‌లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం మంత్రి పదవులు ఎందుకు ఇవ్వలేదో సీఎం కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ జనాభా ఉన్న తమ కులానికి మాత్రం నాలుగు మంత్రి పదవులు ఎలా ఇచ్చారని నిలదీశారు. అలాగే తెలంగాణలో బీసీబంధు ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. బుధవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలు హిందువుల్లో బీసీలకు వ్యతిరేకమైనవని నిరూపితమైందన్నారు. మైనారిటీల సంతుష్టీకరణ రాజకీయాలతో ముస్లిం చాంపియన్‌గా నిలవాలని కేసీఆర్ తాపత్రయపడుతున్నారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం వచ్చాకే జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా లభించిందన్నారు. కేంద్ర విద్యాలయాల్లో కూడా బీసీలకు రిజర్వేషన్ ఇచ్చిన ఘనత మోదీదేనన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉంటే కేసీఆర్ 20 శాతానికి కుదించడం బీసీలను మోసం చేయడం కాదా అని లక్ష్మణ్ ప్రశ్నించారు. ఇక్కడ బంగ్లాదేశీలు, రోహింగ్యాలు బీసీ హక్కులు పొందడం కన్నా దారుణం ఉంటుందా అని ఆవేదన వ్యక్తంచేశారు.

‘ఎన్నికల్లో ఓట్ల కోసమే కేసీఆర్ గిమ్మిక్కులు’



సాక్షి, హైదరాబాద్: నిమ్స్ ఆస్పత్రి విస్తరణ మొదలు ఇతర హాస్పిటల్స్ ఏర్పాటు కేవలం ప్రచారానికేనని, ఇవన్నీ కూడా వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేస్తున్న గిమ్మిక్కులని బీజేపీ నేత మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యం వెలుగులు చిమ్మితే పంటి,కంటి నొప్పికి సీఎం కేసీఆర్ ఢిల్లీకి ఎందుకు పరుగెడుతున్నట్లో సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులకు భిన్నంగా బుధవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య, ఆరోగ్య దినోత్సవాన్ని గొప్పలు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. పార్టీ కార్యాలయంలో బూర నర్సయ్య మీడియాతో మాట్లాడుతూ...వైద్యం, విద్యారంగంలోనైనా కేసీఆర్ అవినీతిని దూరం పెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్‌లకు కూడా కేంద్ర ప్రభుత్వమే నిధులిస్తోందని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసదుపాయాలు భేషుగ్గా ఉంటే సీఎంఆర్‌ఎఫ్ కింద ఏడాదికి రూ.6వేల కోట్లు ఎందుకివ్వాల్సి వస్తుందని ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించక పోవడంతో ప్రైవేటు ఆస్పత్రులు పేద రోగులను చేర్చుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తెచ్చిన ‘ఆయుష్మాన్ భారత్’రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలన్నారు.

పదోన్నతులకు వేళాయె...

▶ మొదటి పేజీ తరువాయి


ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ పరిధిలో పదోన్నతులకు ఈనెల 12న సర్క్యులర్ జారీ అయ్యింది. దాదాపు 4వందల ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. వీటితో పాటు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ, తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీల పరిధిలో దాదాపు 6 వందలకు పైబడి పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి అతి త్వరలో ఆదేశాలు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల రెండో వారం నాటికి పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేలా సొసైటీలు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. ఇందులో భాగంగా అతి త్వరలో మిగతా సొసైటీలు సైతం పదోన్నతుల సర్క్యులర్లు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఎన్ఐటీలో సీటొచ్చినా ఐఐటీలో చదవొచ్చు

▶ మొదటి పేజీ తరువాయి

ఐఐటీ హైదరాబాద్ ప్రత్యేకంగా ‘బిల్డ్ (బోల్డ్ అండ్ యూనిక్ ఐడియాస్ లీడింగ్ డెవలప్‌మెంట్)’ప్రోగ్రామ్‌ను అమలు చేస్తోంది కూడా. కేవలం హైదరాబాద్ ఐఐటీలో చదువుకునే విద్యార్థులకే కాకుండా.. ఆవిష్కరణలపై ఆసక్తి ఉన్న ఇతర విద్యార్థులకు కూడా ఈ ప్రోగ్రాం కింద ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఈ క్రమంలో ఎన్ఐటీల విద్యార్థులు ఈ బిల్డ్ ప్రోగ్రాంలో చేరేందుకు వీలు కలుగుతుందని ఐఐటీ వర్గాలు చెప్తున్నాయి.

పరిశోధన, ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి



ఐఐటీ హైదరాబాద్ పరిశోధన, వినూత్న ఆవిష్కరణలపై ప్రత్యేకంగా ఫోకస్ చేసి పనిచేస్తోంది. విద్యార్థులు కేవలం ఉన్నత ఉద్యోగాలు సంపాదించడమే కాకుండా.. ఉన్నత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగేందుకు ఇన్నోవేషన్ ఒక మంత్రదండంలా పనిచేస్తుంది. విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంచడం ద్వారా దేశం ఆత్మనిర్బర్ భారత్‌గా ఎదగడంతోపాటు పరిశోధనలో ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని భావిస్తున్నాం.

– ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఐఐటీహెచ్ డైరెక్టర్

ఇక వోల్వో.. బెంజ్‌లకు టాటా

బహుళజాతి సంస్థల బస్సులను వదిలించుకోనున్న ఆర్టీసీ

- ఆ బస్సులు పాతబడటంతో నిత్యం మొరాయింపు
- వాటి స్థానంలో బ్యాటరీ బస్సులు వినియోగించే యోచన
- అవసరమైతే అశోక్ లేలాండ్ బస్సులే కొనుగోలు చేయాలనే భావన



సాక్షి, హైదరాబాద్: వోల్వో.. బెంజ్.. స్కానియా.. ఇసుజు.. లాంటి బస్సులను గరుడ ప్లస్ కేటగిరీలో వినియోగిస్తూ వచ్చిన తెలంగాణ ఆర్టీసీ ఇక వాటిని వదిలించుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఆర్టీసీ వద్ద ఆయా కంపెనీలకు చెందిన 80 బస్సులున్నాయి. వాటిల్లో పది మినహా మిగతావన్నీ 12 లక్షల కి.మీ. కంటే ఎక్కువ తిరిగాయి. మరికొద్ది నెలలు వాటిని తిప్పి తుక్కుగా మార్చాలని భావిస్తోంది. ఆ తర్వాత వాటి స్థానంలో కొత్తగా ఆయా కంపెనీలకు చెందిన బస్సులు కాకుండా, ప్రస్తుతం హైదరాబాద్–విజయవాడ మధ్య ప్రయోగాత్మకంగా తిప్పుతున్న ఈ–గరుడ బస్సులను వినియోగించాలని భావిస్తోంది. అవసరమైతే, ఆర్టీసీకి బాగా కలిసొచ్చిన అశోక్ లేలాండ్ కంపెనీకి చెందిన కొన్ని ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేసి సర్దుబాటు చేయాలని యోచిస్తోంది.

ఆ బస్సుల సాధారణ నిర్వహణ ఖర్చులే రూ.20 కోట్లు

పెద్ద మరమ్మతులు కాకుండా వీటికి సాధారణ నిర్వహణ పనులకే సాలీనా రూ.20 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇప్పుడు ఈ బస్సులు దాదాపు 13 లక్షల కి.మీ. తిరిగి ఉన్నాయి. దీంతో వాటి జీవిత కాలం ముగియబోతోంది. ఇప్పుడు ఎండల తీవ్రతకు తరచూ ఏసీలు మొరాయించటం, ఇంజిన్ ఫెయిల్ కావటం లాంటి సమస్యలు బాగా పెరిగాయి. దీంతో నిత్యం సగటున రెండు చొప్పున బస్సులు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయి. దూర ప్రాంతాల్లో అవి ఆగిపోతుండటంతో వాటి మరమ్మతు, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పేరుతో సంబంధిత అధికారులు నిద్రలు లేని రాత్రులు గడుపుతున్నారు. ఇలాంటి ఎన్నో సమస్యలు ఆర్టీసీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

బహుళజాతి బస్సులొద్దు.. స్థానిక బస్సులే ముద్దు

ఈ నేపథ్యంలో కొత్తగా అలాంటి బహుళజాతి కంపెనీ బస్సులు కాకుండా, ఆర్టీసీకి అలవాటు పడ్డ స్థానిక బస్సులనే వాడాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఆర్టీసీ కొన్నేళ్లుగా ఎయిర్‌పోర్టుకు బ్యాటరీ బస్సులు తిప్పుతోంది. ఇప్పుడు అదే కంపెనీ నుంచి కొత్తగా 150 బ్యాటరీ బస్సులు సమకూర్చుకుంటోంది. ఇటీవలే పది ఏసీ బ్యాటరీ బస్సులను ఈ–గరుడ పేరుతో విజయవాడకు తిప్పుతున్నారు. బ్యాటరీ చార్జింగ్ పాయింట్లు సమకూర్చుకోవటంతో పాటు ప్రయాణం మధ్యలో రెండోసారి చార్జింగ్ చేసే వెసులుబాటు ఏర్పాటు చేసుకుని ఆ బస్సులనే దూరప్రాంతాలకు కూడా తిప్పాలని నిర్ణయించారు. త్వరలో మరో 40 బస్సులు ఈ–గరుడ కోసం అందుబాటులోకి రాబోతున్నాయి. వాటితోపాటు మరికొన్నింటిని కొత్తగా సమకూర్చుకుని గరుడ ప్లస్ బస్సులను రీప్లేస్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిర్వహణ భారంగా మారడంతో...

దూర ప్రాంతాలకు సుఖవంతమైన ప్రయాణ సాధనంగా కొన్నేళ్లుగా బహుళజాతి కంపెనీలకు చెందిన మల్టీ యాక్సల్ బస్సులను వినియోగిస్తున్నారు. కుదుపులు అతి తక్కువగా ఉండటం, రేర్ ఇంజిన్ కావటంతో బస్సులోకి శబ్దం కూడా తక్కువగా వస్తుండటంతో ప్రయాణికులు కూడా వాటికి బాగా అలవాటు పడ్డారు. కానీ, వాటి నిర్వహణ ఆర్టీసీకి పెద్ద సవాల్‌గా మారింది. సాధారణ డ్రైవర్లు వాటిని నడపలేరు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారు మాత్రమే నడపగలుగుతారు. పూర్తిగా సెన్సార్లపై ఆధారపడి నడిచే ఆ బస్సులు ఏదైనా సాంకేతిక సమస్యతో మొరాయిస్తే, ఆర్టీసీ మెకానిక్ సిబ్బంది బాగు చేసే పరిస్థితి లేదు. మళ్లీ సంబంధిత కంపెనీకి కబురు పెడితే అక్కడి నుంచి వచ్చే నిపుణులు ఆ బస్సును పరిశీలించి బాగు చేయాల్సి వస్తోంది. ఇందుకు కొన్ని సందర్భాల్లో రెండు మూడు రోజుల సమయం పడుతోంది. ఈ బస్సులన్నీ దూరప్రాంతాలకు నడుస్తున్నవే. అన్నీ రాత్రి వేళ తిరిగేవే. అర్ధరాత్రి వేళ బస్సు నిలిచిపోతే మరో బస్సు అందుబాటులో లేక ప్రయాణికులు గంటలతరబడి రోడ్లమీద పడిగాపులు పడాల్సి వస్తోంది.

కేజీల కొద్దీ బరువు

▶ మొదటి పేజీ తరువాయి

నెలకొంటోందని తేలింది. ప్రభుత్వ స్కూళ్ళ కన్నా, ప్రైవేటు స్కూళ్ళ విద్యార్థుల్లో ఇలాంటి సమస్యలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లో ఉండటం, శక్తికి మించిన బరువు భుజాన వేసుకుని మెట్లు ఎక్కడం సమస్యల తీవ్రతను పెంచుతోందని చెబుతున్నారు. అధిక బరువు మోయడం విద్యార్థులకు అనేక అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతోందని అనేక అధ్యయనాలు సైతం స్పష్టం చేస్తుండటం గమనార్హం.

ఎవరికి ఎంత బరువుండాలంటే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండో తరగతి విద్యార్థులకు 1.5 కిలోలు మాత్రమే పుస్తకాల బరువు ఉండాలని కేంద్ర నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. 5 తరగతి వరకూ మూడు కేజీలు, 7వ తరగతి వరకూ 4 కేజీలు, 9వ తరగతి వరకూ 4.5 కేజీలు, పదవ తరగతికి 5 కేజీలకు మించి పుస్తకాల బరువు ఉండకూడదు. కానీ తెలంగాణ విద్యాశాఖ క్షేత్రస్థాయి పరిశీలన ప్రకారం ప్రాథమిక విద్యార్థుల పుస్తకాల బరువే సగటున 12 కేజీల వరకూ ఉంటోంది. ఇక ఉన్నత పాఠశాల విద్యార్థుల పుస్తకాల బరువు ఏకంగా 17 కేజీల వరకూ ఉంటోంది. ఐదవ తరగతి చదివే విద్యార్థులకు కూడా 40 వరకు పుస్తకాలు స్కూలుకు తీసుకెళ్ళాల్సి వస్తోంది. పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, వర్క్‌షీట్స్, నోట్‌బుక్స్.. ఇలా అనేకం బ్యాగులో కుక్కి తీసుకెళ్లాల్సి వస్తోంది. వీటికి లంచ్ బాక్స్, నీళ్ళ బాటిల్ అదనం. ప్రైవేటు స్కూళ్ళు పుస్తకాల ముద్రణ సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాల కారణంగా ప్రతి పుస్తకం కొనాల్సిందేనని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయనే ఆరోపణలున్నాయి. కేవలం ఆదేశాలతో సరిపుచ్చుకోకుండా స్కూలు బ్యాగుల బరువు తగ్గించేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని, సరైన పర్యవేక్షణ ఉండేలా చూడాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. లేకపోతే విద్యార్థుల్లో ప్రాథమిక దశలోనే చదువుపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

సిలబస్ హేతుబద్ధీకరణ జరగాలి



ప్రైవేటు స్కూళ్ళ హంగూ ఆర్భాటాలే పిల్లల స్కూల్ బ్యాగ్ బరువు పెరగడానికి ప్రధాన కారణం. సిలబస్ నిపుణులు ఎవరికి వాళ్ళు ఇష్టానుసారం పుస్తకాలు సిఫార్సు చేశారు. ఇవన్నీ స్కూళ్ళు అనుసరించడం వల్ల ఆ భారం చిన్నారులు మోయాల్సి వస్తోంది. సిలబస్ రూపకల్పనలో హేతుబద్ధీకరణ ద్వారా ఈ సమస్యను పరిష్కరించొచ్చు. కేవలం కాన్సెప్ట్ మాత్రమే విద్యార్థులకు అందించే విధానం తేవాలని అనేక అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. దీనిపై రాష్ట్రాలు మరింత సమగ్రంగా సర్వేలు చేయించాలి.

– తక్కెళ్లపల్లి తిరుపతిరావు
(చాన్స్‌లర్ ఆఫ్ మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీ, ఓయూ మాజీ వీసీ)

ప్రణాళికాబద్ధమైన బోధనా విధానం అవసరం



పాఠశాలలు ప్రణాళికబద్ధమైన బోధనా విధానం అనుసరిస్తే పుస్తకాల బరువు సమస్యను అధిగమించవచ్చు. సిలబస్‌ను జూన్–సెప్టెంబర్, అక్టోబర్–డిసెంబర్, జనవరి– ఏప్రిల్..ఇలా మూడు భాగాలుగా విభజించాలి. ఏ సమయంలో ఏ సిలబస్ ఉందో అంత మేరకే పుస్తకాలు తెమ్మనాలి. ఒక సబ్జెక్టు ఒక రోజు, మరో సబ్జెక్టు ఇంకో రోజు చెప్పాలి. హోం వర్క్ కూడా స్కూల్‌లోనే చేయిస్తే మోత బరువు తగ్గుతుంది. ప్రభుత్వ స్కూళ్ళ కన్నా ప్రైవేటు స్కూళ్ళలోనే పుస్తకాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ప్రైవేటు స్కూళ్ళతోనే ఇది మొదలవ్వాలి.

– యాదగిరి శేఖర్‌రావు
(రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం)

రాబోయే ఎన్నికల్లో తుపాను రాబోతోంది

▶ మొదటి పేజీ తరువాయి



శ్రీహరిరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

ఎగురవేస్తామని, కొడంగల్‌లో గెలుపు ఎంత ముఖ్యమో, నిర్మల్‌లోనూ గెలుపు అంతే ముఖ్యంగా పరిగణిస్తామని రేవంత్ చెప్పారు. నిర్మల్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టించిన వారిని బీఆర్ఎస్ ఓట్లు అడగాలని, ఇందిరమ్మ ఇల్లు పొందిన వారిని కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందని, ఇందుకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు.

‘ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టి కేసీఆర్ పాల్పడుతున్న దోపిడీని చూస్తే ఆయన్ను తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో చెట్టుకు ఉరేసినా తప్పు లేదు. తెలంగాణ రైతులంతా కలిసి రాళ్లతో కొట్టినా తప్పు లేదు.’ అని రేవంత్ వ్యాఖ్యానించారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు దాదాపు 25 లక్షల లావాదేవీలు జరిగాయని, ఈ లావాదేవీలన్నింటిపై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని డిమాండ్ చేశారు. ధరణి లావాదేవీలపై పూర్తిస్థాయిలో ఆడిట్ జరపాలని కోరుతూ కాగ్‌కు తానే లేఖ రాస్తానని, అన్ని ఆధారాలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని, న్యాయం జరగకపోతే కోర్టును కూడా ఆశ్రయిస్తానని చెప్పారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ సైబర్ నేరగాళ్ల తరహాలో ధరణి పేరుతో తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. ధరణిని బంగాళాఖాతంలో పడేయాలని కాగ్ చెప్పిందని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ నేతల్లా దఫ్తా గాడినేమోనని అర్వింద్ అనుకుంటున్నారా?

కాగా, తాను కొందరు బీఆర్ఎస్ నాయకుల్లాగా దఫ్తా గాడినేమోనని ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ అనుకుంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఓఆర్ఆర్ టెండర్ల విషయంలో తాను చేసిన ఆరోపణలపై ఇచ్చిన లీగల్ నోటీసును వ్యక్తిగతంగా తనకు పంపకుండా మీడియాకు ఎలా పంపుతారని ప్రశ్నించారు.

సబ్జెక్టులు.. సెక్షన్లు చేంజ్!

▶ మొదటి పేజీ తరువాయి

పిటిషన్లు, అప్పీళ్లు లాంటి కీలక విభాగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన మిత్తల్.. అక్కడ ఐదేళ్లకు పైగా పాతుకుపోయిన సిబ్బందిని ఇతర సెక్షన్లకు మార్చే కసరత్తు ప్రారంభించారు. వీటితో పాటు భూసేకరణ అథారిటీ, బడ్జెట్ సెక్షన్, ల్యాండ్ ఎలైనేషన్ లాంటి విభాగాలను కూడా ప్రక్షాళన చేయనున్నారు. ధరణి ఆపరేటర్లుగా జిల్లాల్లో పనిచేస్తున్న వారు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనితీరుపై క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుంటూ, వారి సమన్వయంతో రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని అధికారులను ఆదేశిస్తున్నారు. మొత్తం మీద సీసీఎల్ఏ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సెక్షన్లు, సబ్జెక్టుల మార్పు ద్వారా వారి పనితీరులో మార్పు తీసుకువచ్చే కార్యాచరణకు మిత్తల్ శ్రీకారం చుట్టడం గమనార్హం.

నేను నీళ్ల గురించి మాట్లాడుతుంటే.. వాళ్లు నా పంచె గురించి మాట్లాడుతున్నారు

- జగదీశ్‌రెడ్డి, గుత్తాలపై సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం
- నల్లగొండ జిల్లాలో కొనసాగిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



పాదయాత్రలో అభివాదం చేస్తున్న భట్టి

కనగల్: తెలంగాణలో అరాచక పాలన సాగుతోందని సీఎల్పీనేత భట్టి విక్రమార్క ఆరోపించారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రానికి చేరుకుంది. కనగల్ క్రాస్‌రోడ్డులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు గుంజుకుంటున్నదని, గిరిజన భూములను లాక్కుంటున్నారని ధ్వజమెత్తారు. నల్లగొండ జిల్లాకు వచ్చే ముందు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ చూశానని, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నల్లగొండ జిల్లాలోని దాదాపు మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభించారన్నారు. సొరంగం తవ్వేందుకు అన్ని అనుమతులు తీసుకువచ్చి 32 కిలోమీటర్ల పనులను పూర్తిచేసినట్లు తెలిపారు. రాష్ట్రం వచ్చి పదేళ్లవుతున్నా పట్టుమని మూడు కిలోమీటర్లు కూడా తవ్వలేని దౌర్భాగ్య ప్రభుత్వం ఇది అని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం తెచ్చుకుంది నీళ్ల కోసమే కదా.. మరి నిధులు ఎందుకు విడుదల చేయలేదని మంత్రి జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలను ప్రశ్నించారు. ‘నీళ్ల గురించి నేను మాట్లాడుతుంటే సుఖేందర్‌రెడ్డి మాత్రం నా పంచె గురించి, గోచి గురించి మాట్లాడుతున్నారు’అని ఎద్దేవా చేశారు. నీళ్ల గురించి చెప్పేందుకు వారి దగ్గర సమాధానం లేదన్నారు. ‘తెలంగాణ ప్రజలను అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ కుటుంబం, మంత్రి జగదీశ్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డిల కుటుంబాల ఆస్తులు మాత్రం వేల కోట్లు పెరిగాయి’అని ధ్వజమెత్తారు.

పాదయాత్ర తర్వాత అసైన్డ్ భూములపై..

పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగిశాక అసైన్డ్ భూములపై పోరాటం చేపట్టనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు పార్టీలో తీర్మానం చేశామని, అధిష్టానం కూడా ఆమోదం తెలిపిందని వెల్లడించారు. పాదయాత్రలో భాగంగా ఆయన మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీల కోసం, ప్రభుత్వ స్వప్రయోజనాల కోసం పేదలకు పంచిపెట్టిన లక్షల ఎకరాల భూములపై పోరాటం చేయాలని పార్టీ నిర్ణయిందన్నారు.

సిద్దిపేటకు ‘ఐటీ’ హంగు

- నేడు ఐటీ టవర్ ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, హరీశ్
- రూ.62.82 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 12 సంస్థలు కార్యాలయాల ఏర్పాటు
- 718 మంది నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ కొలువుల అవకాశం
- స్థానిక యువత కోసం జాబ్‌మేళా



సిద్దిపేటలో నిర్మించిన ఐటీ టవర్

సాక్షి, సిద్దిపేట: మొన్నటివరకు మెట్రో నగరాలకే పరిమితమైన ఐటీ కంపెనీలు ప్రస్తుతం జిల్లాలకు సైతం విస్తరిస్తున్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో తమ కంపెనీలను ఏర్పాటు చేస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఐటీ టవర్లను ప్రారంభించింది. ఇక కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో తొలిసారిగా సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ఐటీ టవర్ కూడా ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేట పట్టణ శివారులో 2020 డిసెంబర్ 10న సీఎం కేసీఆర్ దీనికి శంకుస్థాపన చేశారు. కాగా టీఎస్ఐఐసీ (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) ఆధ్వర్యంలో రూ.62.82 కోట్ల వ్యయంతో జీ ప్లస్ ఫోర్‌గా ఇది నిర్మితమైంది. అన్ని సదుపాయాలతో సిద్ధమైన ఈ ఐటీ టవర్‌ను గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావుతో కలిసి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు ప్రారంభించనున్నారు.

1.72 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో...

మూడు ఎకరాల స్థలంలో జీ ప్లస్ ఫోర్ భవనాన్ని 1,72,645 చదరపు అడుగుల విస్తీర్ణంతో సకల సౌకర్యాలతో నిర్మించారు. మొదటి అంతస్తులో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ను ఏర్పాటు చేస్తున్నారు. రెండు, మూడు, నాలుగు అంతస్తులను కంపెనీలకు కేటాయించారు. ఒక షిఫ్ట్‌లో 718 మంది ఒకేసారి విధులు నిర్వర్తించే విధంగా సిట్టింగ్ కెపాసిటీ ఏర్పాటు చేశారు. రెండో ఫ్లోర్‌లో 256 మంది, మూడో ఫ్లోర్‌లో 206, నాలుగో ఫ్లోర్‌లో 256 మంది సిట్టింగ్ కెపాసిటీ ఉంది. రెండో ఫ్లోర్‌లో విశాలమైన కేఫ్ట్ ఏరియా ఏర్పాటు చేశారు.

స్థానిక యువతకు ఉపాధి

ఈ టవర్‌లో కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే 12 ఐటీ సంస్థలు ముందుకు వచ్చాయి. ఓఎస్ఐ డిజిటల్, ఫిక్సిటీ టెక్నాలజీస్, అమిదా ఎడ్యుకేషన్, జోలాన్ టెక్, విజన్ టెక్, థోరాన్ టెక్నాలజీస్, బీసీడీసీ, ర్యాంక్ ఐటీ సర్వీస్, కామ్‌సీఎక్స్ ఐటీ, అమృత సిస్టమ్స్, ఇన్నోసోల్, గ్లోబస్‌లు తమ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నాయి. వీటిల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు.

టాస్క్ ద్వారా శిక్షణ

సిద్దిపేట ఐటీ టవర్‌లో ఏర్పాటు చేసిన టాస్క్ ద్వారా ఒక షిఫ్ట్‌లో 52 మందికి, ఇలా రెండు షిఫ్టుల్లో మొత్తం 104 మంది నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. ల్యాబ్ కూడా అందుబాటులో ఉంది. ఈ శిక్షణ 45 రోజుల పాటు ఉంటుంది. శిక్షణ పూర్తయిన వారిని వివిధ ఐటీ కంపెనీలకు ఇంటర్వ్యూల కోసం రెఫర్ చేస్తారు.

10 వేలమందితో సభ

గురువారం ఐటీ టవర్ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రారంభ కార్యక్రమం తర్వాత 10 వేల మందితో సభ నిర్వహించనున్నారు. సిద్దిపేట పట్టణంలో స్లాటర్ హౌస్, రింగ్ మెయిన్ పైప్‌లైన్‌ను మంత్రులు ప్రారంభించనున్నారు. కేటీఆర్ స్వచ్ఛబడిని సందర్శించనున్నారు.

గుడి నుంచి బడిదాకా.. ఎంతో అభివృద్ధి

▶ మొదటి పేజీ తరువాయి

రంగనాయకసాగర్, అన్నపూర్ణ, శ్రీరాజరాజేశ్వరసాగర్ రిజర్వాయర్లను వైవీ సుబ్బారెడ్డికి చూపించాని.. ఎండాకాలంలోనూ చెరువులు, వాగులు, కాల్వల నిండా నీరు ఉండటం సీఎం కేసీఆర్ సాధించిన ఘనత అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే పేదరికం పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా 33 జిల్లాల్లో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్ ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు 73 శాతం పెరిగాయని, ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో ఆలయాలకు టీటీడీ సాయం: వైవీ సుబ్బారెడ్డి

దేశవ్యాప్తంగా హిందూమత ప్రచారంలో భాగంగా కొత్త ఆలయాల నిర్మాణాలకు, పాత ఆలయాల పునర్నిర్మాణం/పునరుద్ధరణకు టీటీడీ నిధులు మంజూరు చేస్తోందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి సాయం చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగానే.. కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. యాదాద్రి ఆలయ నిర్మాణంతో సీఎం కేసీఆర్ ఆధ్యాత్మిక చరిత్రలో నిలిచిపోయారని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు.

ఒకవేళ నేను ఓడిపోతే ఎలా?

సిరిసిల్లలో బుధవారం వస్త్ర వ్యాపార సంఘం భవనంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘‘మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అయ్యాను. కేసీఆర్ దీవెనతో మంత్రిని అయ్యాను. సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు రూ.2,500 కోట్ల బతుకమ్మ చీరల ఆర్డర్లు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చాం. పొరపాటున రేపు నేను ఓడిపోతే ఎలా? నేను ఓడిపోనని మీకు తెలుసు, నాకు తెలుసు.. ఒకవేళ ఏదైనా అయితే.. ఈ పరిస్థితి ఉంటుందా..? ఆలోచించండి..’’అని కేటీఆర్ పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లలో ఏం సాధించుకున్నామో ఆలోచించాలని చెప్పారు.



సిరిసిల్లలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ భూమి పూజా కార్యక్రమ వేదికపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి
హైదరాబాద్
గురువారం । 15 । జూన్ । 2023

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
39.1°	27.0°



నిమ్స్‌లో ధన్వంతరి విగ్రహానికి పూజలు చేస్తున్న సీఎం కేసీఆర్

కేసీఆర్ తవ్వగా.. హరీశ్ ఎత్తగా..





నిమ్స్‌లో 'దశాబ్ది' బ్లాక్‌కు వైభవంగా భూమిపూజ

- ఇక్కడినుంచే 'న్యూట్రిషన్ కిట్' పథకం ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో/లక్డీకాపూల్: ప్రతిష్టాత్మక నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (నిమ్స్) ప్రాంగణంలో 'దశాబ్ది' బ్లాక్ నిర్మాణ పనులకు బుధవారం ఉదయం 11.44 గంటలకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్ గడ్డపారతో తవ్వగా మంత్రి హరీశ్‌రావు పారతో మట్టిని ఎత్తారు. కేసీఆర్ చేతుల మీదుగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పునాదిరాళ్లను వేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన జరిగిన వైద్యారోగ్య దినోత్సవ సభలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారులు రాజీవ్ శర్మ, సోమేష్‌కుమార్, ఎంపీ కేశవరావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, వైద్యారోగ్య ముఖ్య కార్యదర్శి రిజ్వీ, ముఖ్య సంచాలకుడు జి.శ్రీనివాసరావు, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్వేతా మహంతి, డీఎంఈ రమేష్‌రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి, డాక్టర్ మార్త రమేష్ తదితరులు పాల్గొన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల కోసం రూపొందించిన తొమ్మిది రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లను సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం నగరానికి చెందిన గర్భిణులు పార్వతమ్మ (ఉదయ్ నగర్ కాలనీ), పర్వీన్ (బాలా నగర్), శిరీష (ఎస్‌బీటీ నగర్), తేజస్వి (ప్రతాప్‌నగర్), సుజాత (శ్రీరాంనగర్), రేణుక (అంబేడ్కర్ నగర్)లకు కిట్‌లను అందజేశారు.

మేం కిట్లు పంచుతుంటే.. వాళ్లు తిట్లు పంచుతున్నారు: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ నగరం ప్రస్తుతం వ్యాక్సిన్, ఫార్మా హబ్‌గా ఉంది. రాబోయే రోజుల్లో హెల్త్ హబ్‌గా మారబోతోంది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందు వైద్య విద్య కోసం చైనా, రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు వెళ్లేవారు. ప్రస్తుతం జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ వచ్చింది. గతంలో 2,853 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్యను 8,340కి పెంచాం. ఆస్పత్రుల్లో పడకల సంఖ్యను కూడా 50 వేలకు పెంచాం. వచ్చే ఏడాది మరో ఎనిమిది కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించబోతున్నాం. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ సహా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఫార్మా, నర్సింగ్ వంటి అనుబంధ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో బిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు, రక్తహీనతతో బాధపడే గర్భిణులకు మేం కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌లు ఇస్తుంటే.. ప్రతిపక్షాలు మాత్రం తిట్లు పంచుతున్నాయి.

అధునాతన చికిత్సలకు కేరాఫ్ అడ్రస్‌గా నిమ్స్: డైరెక్టర్ బీరప్ప

తెలంగాణ ఉద్యమానికి నిమ్స్‌కు మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, చావు నోట్లో తలపెట్టిన సమయంలో నిమ్స్ తన వంతు సేవలు అందించింది. తెలంగాణ ఏర్పాటు సమయంలో నిమ్స్‌లో 900 పడకలు ఉండేవి. ఆ తర్వాత 1500 పడకలకు చేరాయి. చికిత్సలు 108 శాతం పెరిగాయి బోధన సిబ్బంది సంఖ్య 111 నుంచి 306కు పెరిగింది. పీజీ సీట్లు 82 నుంచి 169కు చేరాయి. కొత్తగా ఆరు విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. ఆరోగ్యశ్రీలో అత్యధిక చికిత్సలు అందిస్తున్న సంస్థ నిమ్సే. అవయవ మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి. గుండె, కిడ్నీ, బోన్‌మ్యారో, ఊపిరితిత్తుల మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి. జీవితకాలం ఉచితంగా మందులు అందజేస్తున్నాం. తుంటి, కీళ్ల చికిత్సలు, గూని వంటి ఆపరేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. దక్షిణాదిలో అత్యధికం. డయాలసిస్ సేవలు 30 వేల నుంచి 1.20 లక్షలకు చేరుకున్నాయి. ఆస్పత్రిలో నెలకు 1.50 లక్షల రోగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. డైరెక్టర్‌గా నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోను.

న్యూస్‌రీల్

సౌదీలో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు నగర విద్యార్థుల దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం

సాక్షి, సిటీబ్యూరో: సౌదీలో జరిగిన కారు ప్రమాదంలో పాతబస్తీకి చెందిన ఇద్దరు విద్యార్థులు మరణించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. దమ్మామ్‌లో మంగళవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. అమ్మార్, ఇబ్రహీం అన్నదమ్ములు. వీరి స్నేహితుడు హసన్. ఈ ముగ్గురు దమ్మామ్‌లోని ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. హసన్ రియాజ్ 11వ తరగతి, ఇబ్రహీం 9వ తరగతి, అమ్మార్ 8వ తరగతి చదువుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి వీరు ముగ్గురు కలిసి కారులో వెళ్తుండగా అది అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. దీంతో ఇబ్రహీం, హసన్ అక్కడికక్కడే మృతి చెందారు. అమ్మార్ పరిస్థితి విషమంగా ఉంది. ఇబ్రహీం గురువారం నగరానికి రావాల్సి ఉండగా.. ఈ ప్రమాదం జరిగింది. ఇబ్రహీం, అమ్మార్‌లు పాతబస్తీలోని హుస్సేనీ ఆలంనకు చెందినవారు కాగా హసన్ మోతీ గల్లికి చెందినవాడు. పాతబస్తీలోని హుస్సేనీ, మోతీగల్లీల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. దమ్మామ్‌లోనే మృతదేహాలను ఖననం చేస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు.

వార్డు పాలనకు ఏర్పాట్లు చేయండి: మంత్రి తలసాని

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల16 నుంచి ప్రారంభమయ్యే వార్డు కార్యాలయాల ద్వారా వార్డు పరిపాలనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సత్వరం పూర్తిచేయాల్సిందిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ లోకేశ్‌కుమార్‌లతో కలిసి వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు కార్యాలయాల ప్రారంభంతో అనేక ఫలితాలుంటాయన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వార్డు ఆఫీసులను మాత్రమే ఈ నెల 16న ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. మిగతా వాటి పనులు పూర్తిచేసి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మంత్రులు, మేయర్, డిప్యూటీమేయర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల చేతులమీదుగా వార్డు కార్యాలయాలను ప్రారంభిస్తామన్నారు. వార్డు కార్యాలయాలను ఉదయం 8.30 గంటలకే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రక్త సేకరణలో 'గాంధీ' బ్లడ్‌బ్యాంక్ నంబర్ వన్

గాంధీఆస్పత్రి: దాతల నుంచి రక్తం సేకరించడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ తెలంగాణలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని డీఎంఈ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీఆస్పత్రి బ్లడ్‌బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని గాంధీ సూపరింటెండెంట్ రాజారావుతో కలిసి ప్రారంభించారు. బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి సత్యరత్న సేవలను కొనియాడారు. బంజారాహిల్స్ అహ్మద్‌కాలేజీ, గాంధీ జూడా వైద్యులు, మాదాపూర్ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో బుధవారం రక్తదాన శిబిరాలు నిర్వహించి 157 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

బడి..మారదండీ!

సగానికి పైగా పాఠశాలలు అద్దె భవనాల్లోనే

- విరిగిన బెంచీలు.. కనీస సౌకర్యాలు కరువు
- నత్తనడకన 'మన బస్తీ-మనబడి' పనులు
- పదోన్నతులు, బదిలీల్లేక టీచర్ల అసంతృప్తి
- ఉపాధ్యాయుల కొరతతో బోధనపై ప్రభావం

"నగరంలోని సీతారామ్‌భాగ్‌లోని ప్రభుత్వ పాఠశాల ఏళ్ల తరబడి అద్దె భవనంలో కొనసాగుతోంది. ఆ భవనం విషయంలో ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. ఇటీవల భవన సముదాయంలోని గోడలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు స్కూల్‌కు రాగా వారిని ఉపాధ్యాయులు వెనక్కి పంపించారు."

సాక్షి ఫోకస్





కూకట్‌పల్లి: వెంకటేశ్వర నగర్‌లోని పాఠశాలలో అస్తవ్యస్తంగా బెంచీలు

సాక్షి, సిటీబ్యూరో: సాక్షాత్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరంలో సర్కారు బడుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా బడిబాట, 'మన బస్తీ.. మన బడి' వంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల స్థితి దయనీయంగా కనిపిస్తోంది. సగానికి పైగా పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, మిగిలిన వాటిలో 25 శాతానికిపైగా సొంత భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొద్దిపాటి వర్షాలకే పాఠశాల భవనాలు కురుస్తున్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. విరిగిన బెంచీలు వెక్కిరిస్తుండగా, తాగునీటితో పాటు విద్యుత్ సరఫరా, కనీస మౌలిక సదుపాయాల కల్పన అంతంత మాత్రంగా తయారయ్యాయి.

అద్దె భవనాలే దిక్కు..

మహానగర పరిధిలో సగానికి పైగా సర్కారు బడులు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రాష్ట్ర మొత్తం మీద 132 ప్రాథమిక, 24 ఉన్నత పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తుండగా. కేవలం జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 92 ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అంటే 70 శాతం బడులు హైదరాబాద్ నగరంలోనే ఉన్నాయి. కొన్నిచోట్ల సకాలంలో అద్దె చెల్లించకపోతుండటంతో భవన యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తుండగా.. తక్కువ అద్దె ఉన్నచోట్ల కొన్నిసార్లు టీచర్లు సర్దుబాటు చేసి ప్రభుత్వం మంజూరు తర్వాత తీసుకుంటున్నా సంఘటనలు లేకపోలేదు.



కూకట్‌పల్లిలోని చెరబండరాజు కాలనీలో పెచ్చులూడుతున్న ప్రభుత్వ పాఠశాల

వెక్కిరిస్తున్న ఖాళీలు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ప్రతి విద్యా సంవత్సరం టీచర్ల కొరతతో బోధనపై తీవ్ర ప్రభావం పడతోంది. నాణ్యమైన విద్య అందక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి యేట ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణలు జరుగుతున్న ఖాళీలు మాత్రం భర్తీకి నోచుకోవడం లేదు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టినా.. ఆంగ్ల బోధన సిబ్బంది లేకుండా పోయారు. కనీస విద్యావలంటీర్ల వ్యవస్థ కూడా గత మూడేళ్లుగా నిలిచిపోయింది. మరోవైపు ఉపాధ్యాయులకు పదోన్నతులు కూడా లేకుండాపోయాయి.

మన బస్తీ-మనబడి అంతంతే

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన బస్తీ-మన బడి' కార్యక్రమం ప్రచారానికే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలల్లో పనులు నత్తలకు నడక నేర్పిస్తోంది. టెండర్లు పూర్తయినా చాలా బడుల్లో పనులే ప్రారంభం కాలేదని సమాచారం. కేవలం పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టి పాఠశాలల్లోనే పనులు పూర్తి చేసి చేతులు దులుపుకొన్నారు. గ్రేటర్ పరిధిలో మన బస్తీ-మన బడి, కార్యక్రమం కింద మొదటి విడతలో కింద సుమారు 845 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టి మొక్కుబడిగా పూర్తి చేశారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 690 పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 239 పాఠశాలల్లో, రంగారెడ్డి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కలిపి 1300పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 464 పాఠశాలల్లో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 505 పాఠశాలలు ఉండగా అందులో 142 పాఠశాలల్లో పనులు చేపట్టి మమ అనిపించారు. ఇదీ నగరంలో ప్రభుత్వ బడుల దయనీయమైన పరిస్థితి.

కటకటాల్లోకి కిలేడీ

ముగ్గురి వ్యక్తులతో ప్రేమాయణం

- పోలీస్ నకిలీ ఐడీ కార్డుతో మోసం
- ఉద్యోగాల పేరుతో పలువురికి బురిడీ
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన యువతి



అశ్వినిరెడ్డి పోలీస్ నకిలీ ఐడీ కార్డు

లంగర్‌హౌస్: పోలీస్ కానిస్టేబుల్ అంటూ ఏకంగా నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం కేంద్రంగా ఓ యువతి అనేక మందిని ఉద్యోగాల పేరుతో మోసం చేసింది. అంతేకాకుండా ముగ్గురిని ప్రేమించి పెళ్లి చేసుకుని వారితో బలవంతంగా చోరీలు చేయిస్తోంది. ఈ మాయలేడీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్‌లో నివాసం ఉండే అశ్విని ఇంటర్ వరకు చదువుకుంది. జల్సాలకు అలవాటు పడిన ఈ యువతి తన పేరును అశ్వినిరెడ్డిగా మార్చుకొని తాను హైదరాబాద్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నట్లు ఫేక్ ఐడీ కార్డును తయారు చేసింది. అనంతరం ఈసీఐఎల్‌లో నివాసముండే రోహిత్‌కిషోర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరిద్దరికి ఒక కూతురు, కుమారుడు సంతానం. నాలుగేళ్ల తర్వాత మరో యువకుడు రోహిత్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. మొదటి భర్తను చంపాలని ప్రయత్నం చేసింది. డబ్బుల కోసం ఈ ఇద్దరినీ చోరీలు చేయాల్సిందిగా బలవంతపెట్టసాగింది. ఈ క్రమంలో చోరీలకు పాల్పడి రోహిత్ జైలు పాలయ్యాడు. ప్రస్తుతం అశ్విని మెహిదీపట్నంలో నివాసం ఉంటూ అభిషేక్‌తో సహజీవనం కొనసాగింది.

పోలీస్ కమిషనర్ కార్యాలయం కేంద్రంగా..

పోలీసు నకిలీ ఐడీ కార్డును తయారు చేయించిన అశ్విని ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అనేక మంది వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసింది. దీనికి రాపిడో ఎంచుకొని ఆ వాహనంపై ప్రయాణిస్తూ యువకులను వలలో వేసుకుంది. వారి వాహనంపై బషీర్‌బాగ్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వద్దకు వెళ్లేది అక్కడ ఆ యువకులను బయట ఉంచి లోపలికి వెళ్లేది. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చి పని పూర్తయియిందని లేదా సార్ బయటకు వెళ్లాడని చెబుతూ వచ్చేది. ఒక్కొక్కరికి వద్ద వేలాది రూపాయలు వసూలు చేసిన ఈ కిలేడీ చివరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కింది. తనకు పెళ్లి కాలేదని అశ్విని మోసం చేసిందంటూ అభిషేక్ కొద్ది రోజుల క్రితం పోలీసుల సమక్షంలో చెప్పి వెళ్లిపోయాడు. ప్రస్తుతం తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని, తనతో ఉండట్లేదు అంటూ అశ్విని అతనిపై ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం.

'సైబర్ చట్టం'.. సవరణకు అధ్యయనం!

- ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన టీఎస్‌సీఎస్‌బీ
- బెయిల్స్‌తో పాటు రిఫండ్ విధానాలు పరిశీలన
- త్వరలోనే ప్రభుత్వానికి చేరనున్న ప్రతిపాదనలు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో రెండేళ్ల కాలంలో సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి రూ.587 కోట్లు స్వాహా చేశారు. వీటిపై ఫిర్యాదులు అందుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాళ్లకు సంబంధించిన వివిధ బ్యాంకు ఖాతాల్లోని రూ.79 కోట్లు ఫ్రీజ్ చేశారు. వీటిలో బాధితులకు తిరిగి ఇచ్చిన మొత్తం మాత్రం కేవలం రూ.12 లక్షలు. ఈ పరిస్థితులను మార్చడంపై తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) దృష్టి పెట్టింది. సైబర్ నేరాల దర్యాప్తునకు చట్టంలో కొన్ని కీలక సవరణలతోనే ఇది సాధ్యమని గుర్తించింది. వీటిపై అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సిఫార్సు చేయడానికి ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. టీఎస్‌సీఎస్‌బీ డైరెక్టర్‌గా ఉన్న సైబరాబాద్ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తోంది.

ప్రాపర్టీ అఫెన్సుల్లో పరిస్థితి వేరు...

బాధితుడు ఆర్థికంగా నష్టపోవడమనేది చోరీ, దోపిడీ, బందిపోటు దొంగతనం వంటి ప్రాపర్టీ అఫెన్సుల్లోనూ జరుగుతుంది. ఆయా కేసుల్లో చోరీ సొత్తు రికవరీ అన్నది దొంగ దొరికిన తర్వాత మాత్రమే అవుతుంది. అత్యంత అరుదైన కేసుల్లో మినహాయిస్తే అన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. చోరుడిని అరెస్టు చేసిన తర్వాత అతడి నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తుతో సహా కోర్టులో హాజరుపరుస్తారు. ఈ కేసుల్లో నేరం నిరూపణకు రికవరీ చేసిన నగదు, డబ్బు తదితరాలు కూడా కీలక పాత్రనే పోషిస్తాయి. ఈ కారణంగానే ప్రాపర్టీ అఫెన్సుల్లో చోరుల నుంచి రికవరీ చేసిన సొత్తు తిరిగి అప్పగించడంలో నిబంధనలు ఉన్నాయి.

సైబర్ నేరాల్లో ఇలా కాదు..

ఈ-నేరగాళ్లు కంటికి కనిపించకుండా, ఏమాత్రం పరిచయం లేకున్నా అందినకాడికి కొల్లగొడతారు. ఈ కేసుల్లో బాధితుల నుంచి నగదు బ్యాంకు ఖాతాలు, ఈ-వాలెట్స్ ద్వారా నేరగాళ్లకు చేరుతుంది. దీంతో పాటు ఈ కేసుల దర్యాప్తులో అవలంబించే విధానాలు, కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సైబర్ క్రైమ్ పోర్టల్, 1930 కాల్ సెంటర్ నెంబర్ కారణంగా నేరగాళ్ల ఆచూకీ లేకపోయినా వాళ్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదు ఫ్రీజ్ అవుతుంది. ఈ కేసుల్లో నిందితులు అరెస్టు అయినప్పుడు, కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు కచ్చితంగా నగదు చూపించాల్సి అవసరం ఉండదు. కేవలం ఆ లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, నివేదికలు న్యాయస్థానానికి అందిస్తే సరిపోతుంది. అయినప్పటికీ ప్రస్తుతం దర్యాప్తు అధికారులు ఫ్రీజ్ చేసిన మొత్తాలు బాధితులకు అందించడానికి ప్రాపర్టీ అఫెన్సుల్లో నిబంధనల్నే పాటించాల్సి వస్తోంది. ఈ కారణంగా నగదు ఫ్రీజ్ అవుతున్నా.. బాధితులకు చేరడానికి చాలా సమయం పడుతోంది.


సంస్కరణలు అమలు చేస్తే ఫలితం...

ఈ పరిస్థితులను మార్చడానికి సైబర్ నేరాల్లో ఫ్రీజ్ చేసిన మొత్తాలు తిరిగి ఇచ్చే విషయంలో చట్ట సవరణ చేయాల్సి ఉందని టీఎస్‌సీఎస్‌బీ గుర్తించింది. కేవలం రికవరీలు, రిఫండ్ విషయంలోనే కాకుండా జైలు నుంచి బయటకు వస్తే మళ్లీ మళ్లీ నేరాలు చేసే, పట్టుబడే అవకాశాలు తక్కువగా ఉన్న ఈ నేరగాళ్ళకు బెయిల్స్ ఇచ్చే అంశంలోనూ ప్రస్తుతం ఉన్న నిబంధనలు మార్చాలని భావిస్తోంది. చట్టంలో దీనికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేసి, అమలు చేయాల్సిన సంస్కరణలు, చట్ట సవరణల్ని ప్రతిపాదించడానికి ప్రత్యేక కమిటీ పని చేస్తోంది. ఇందులో నిపుణులు రూపొందిస్తున్న నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. సొత్తు సంబంధిత నేరాల్లో నేరగాడు దొరికినా, దొరక్కపోయినా బాధితుడు కోల్పోయిన మొత్తాన్ని అతడికి తిరిగి ఇవ్వగలిగితేనే పూర్తి స్థాయిలో ఊరట లభించినట్లు. అలాగని నేరగాళ్లను పట్టుకోకుండా వాళ్లు పదేపదే నేరాలు చేసే ఆస్కారం ఉంటుంది. వీటిని పరిగణనలోకి తీసుకుని టీఎస్‌సీఎస్‌బీ అధ్యయనం చేస్తోంది.

కొనలేం.. తినలేం!

భగ్గుమంటున్న కూరగాయలు ధరలు

- ఎండలకు తగ్గిన దిగుబడులు
- అందుబాటులో లేని అన్ని రకాలు



సాక్షి, సిటీబ్యూరో: ఎండలతో పాటు కూరగాయల ధరలూ మండుతున్నాయి. కూరగాయల ధరలు సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్న ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితికి చేరుతున్నాయి. ఈసారి ఎండ వేడికి కూరగాయల దిగుబడి భారీగా పడిపోయింది. మరోవైపు అకాల వర్షాలతో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

- జంటనగరాల మార్కెట్లలో చాలా రకాల కూరగాయలు కనిపించడం లేదు. ప్రస్తుతం అతి తక్కువ మాత్రమే దర్శనం ఇస్తున్నాయి. వాటి ధరలూ మండిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎండల కారణంగా రైతులు కూరగాయలను పండించ లేదు.
- కొన్నిచోట్ల పండించినా ఆశించిన స్థాయిలో దిగుబడులు లేవు. అకాల వర్షాలతో కూడా కూరగాయల తోటలకు నష్టం జరిగింది.
- శివారుతో పాటు మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల నుంచి భారీ ఎత్తున కూరగాయలు నగరానికి వస్తుంటాయి.
- ఈసారి వేసవిలో ప్రధాన కూరగాయల మార్కెట్లు బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్, ఎల్‌బీ నగర్, మాదన్నపేట, సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లకు కూరగాయల సరఫరా 60 శాతానికి పడిపోయింది. కొన్ని రకాల ఉత్పత్తులు అసలు రావడం లేదు. దీనికి కారణం తెలంగాణ జిల్లాల్లో కూరగాయల దిగుబడులు పడిపోవడమేనని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

పక్క రాష్ట్రాల నుంచే...

- ప్రస్తుతం నగరానికి టమాటా, బీన్స్, చిక్కుడు, గోకరకాయ, క్యాప్సికం, క్యారెట్ వంటివన్నీ పక్క రాష్ట్రాల నుంచే సరఫరా అవుతున్నాయని మార్కెట్ అధికారులు తెలిపారు. దీంతో ధరలు సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి.
- ఇప్పటికే బీన్స్ రిటైల్ మార్కెట్‌లో కిలో రూ. 120 నుంచి రూ. 130 వరకు, చిక్కుడు కిలో రూ. 80 నుంచి వంద, బీరకాయ కిలో రూ. 100, క్యాప్సి కం కిలోకు 60 రూపాయలకు పైనే అమ్ముతున్నారు. టమాటా, వంకాయ, చామగడ్డ, బీన్స్, ఆలుగడ్డ, క్యారెట్ వంటి కొన్నిరకాల ఉత్పత్తులే దర్శనం ఇస్తున్నాయి. తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే కూరగాయలు కనిపించడం లేదు. బీన్స్ సాధారణ రోజుల్లో రోజుకు 15 నుంచి 20 టన్ను ల దిగుమతి అవుతుండేది. ప్రస్తుతం 2 నుంచి 3 టన్నులే వస్తోంది. పచ్చి మిర్చి కూడా రోజుకు 2 నుంచి 4 టన్నులకు మించి రావడం లేదు.
- ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న 90 శాతం కూరగాయలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతున్నవే అని వ్యాపారులు చెబుతున్నారు.

సిటీలో అరకు కాఫీ

రాయదుర్గం మెట్రోస్టేషన్‌లో 'హట్ అరబికా' అవుట్‌లెట్


హట్ అరబికా కాఫీ షాపులో డాక్టర్ శోభ సావతి రాణి, జీసీసీ ఎండీ సురేష్ బాబు, టీవీ నటులు సెల్వరాజ్, రాంప్రసాద్ తదితరులు

గచ్చిబౌలి: నగరవాసులకు అరకు వ్యాలీ కాఫీ రుచి చూసే అవకాశం దక్కింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ (జీసీసీ) 'హట్ అరబికా' పేరిట మాదాపూర్‌లోని రాయదుర్గం మెట్రో స్టేషన్‌లో అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసింది. గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ శోభ సావతి రాణి దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో మొట్టమొదటి కాఫీ అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాఫీతో పాటు గిరిజనులు తయారు చేస్తున్న పలు ఆర్గానిక్ ఉత్పత్తుల విక్రయాలు వుంటాయన్నారు. అరకు కాఫీకి ఆర్గానిక్ కాఫీగా గుర్తింపు లభించిందన్నారు. హట్ అరబికాలో బిజినెస్ బాగా జరిగితే దేశంలోని ఇతర ప్రాంతాలలోను అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పాడేరు, అరకు, చింతపల్లితో పాటు 11 మండలాలలో గిరిజనులు కాఫీ పంటను సాగు చేస్తున్నారని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మెన్, ఎండీ సురేష్ బాబు తెలిపారు. వారి ఉత్పత్తులకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందేలా కృషి చేస్తామని చెప్పారు. హట్ అరబికాలో పిల్టర్‌కాఫీ, క్యాపిచినో, బ్లాక్ కాఫీ, ఎస్‌ప్రెసో, కోల్డ్‌కాఫీ అందుబాటులో ఉంటుంది. కార్యక్రమంలో ట్రైఫెడ్ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ శాంకే, జీఎం యుస్టేస్, దర్శకులు శ్రీనివాస్‌రెడ్డి, కమెడియన్ ఆటో రాంప్రసాద్, టీవీ నటుడు సెల్వరాజ్,టెంపుల్ టూరిజం స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అరదండాలు

- సైబరాబాద్ షీ టీమ్స్‌కు ఫిర్యాదుల వెల్లువ
- 671 మంది పోకిరీలపై పెట్టీ కేసులు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలను వేధించే ఆకతాయిలను సైబరాబాద్ పోలీసులు వదిలిపెట్టడం లేదు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మెట్రో స్టేషన్లు, బహిరంగ ప్రదేశాలలో డెకాయ్ ఆపరేషన్లు చేస్తూ పోకిరీల ఆటకట్టిస్తున్నారు. గత నెలలో సైబరాబాద్ షీ టీమ్స్‌కు వివిధ మాధ్యమాల ద్వారా 138 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. వీటిలో అత్యధికంగా 114 మంది బాధితులు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయగా.. ఇందులో బ్లాక్ మెయిలింగ్ ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి. మొత్తం 32 కేసులు నమోదు చేయగా.. వీటిల్లో 10 క్రిమినల్ కేసులు, 22 పెట్టీ కేసులున్నాయి. కాగా.. డెకాయ్ ఆపరేషన్లలో మహిళలను వేధిస్తున్న 678 మంది పోకిరీలను షీ టీమ్స్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోగా.. ఇందులో 671 మందిపై పెట్టీ కేసులు నమోదు చేశారు. మిగిలిన వారిని కౌన్సిలింగ్‌కు పంపించారు.

ఎయిర్‌పోర్టు మెట్రో ప్రీబిడ్ విజయవంతం

- హాజరైన 13 గ్లోబల్ కంపెనీలు
- ప్రాజెక్టు వివరాలను వెల్లడించిన ఎన్వీఎస్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్వీఎస్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గం నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించనున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుపై మరో అడుగు ముందుకు పడింది. సుమారు రూ.6250 కోట్ల అంచనాలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) ప్రాతిపదికన గ్లోబల్ టెండర్‌లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం బేగంపేట్‌లోని హెచ్ఎంఆర్ కార్యాలయంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్అండ్‌టీ, ఆల్‌స్టామ్, సీమెన్స్, టాటా ప్రాజెక్ట్స్, ఐఆర్‌సిఓఎన్, ఆర్‌వీఎన్ఎల్, బీఈఎంఎల్, పీఏఎస్‌డీఆర్ ఓఎల్ రహీ టెక్నాలజీస్ తదితర జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన 13 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ ప్రాజెక్టు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఈ ప్రాజెక్టు ప్రత్యేకతలను, ఇప్పటి వరకు చేపట్టిన పనులను గురించి వివరించారు. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 31 కిలోమీటర్‌ల దూరం నిర్మించనున్న ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు సర్వే, పెగ్‌మార్కింగ్, అలైన్‌మెంట్ తదితర పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. భూసార పరీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఈ మార్గంలో 29.3 కిలోమీటర్‌ల ఎలివేటెడ్ కారిడార్ కాగా, 1.7 కిలోమీటర్‌ల వరకు అండర్‌గ్రౌండ్ మార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టవలసి ఉంటుంది.ఎయిర్‌పోర్టు టర్మినల్ సమీపంలో ఒక అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్‌తో పాటు మొత్తం 9 మెట్రో స్టేషన్‌లు రానున్నాయి. ఈ సందర్భంగా రోలింగ్‌స్టాక్ (రైళ్లు), మౌలిక సదుపాయాలు, సిగ్నలింగ్ వ్యవస్థ, ట్రైన్ కంట్రోల్ సిస్టమ్, సాంకేతిక ప్రత్యేకతలు తదితర అంశాలపైన వివరంగా చర్చించారు. ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలను ఎండీ నివృత్తి చేశారు. ఈ ప్రాజెక్టు వ్యయంలో హెచ్ఎండీఏ, జీఎమ్మార్ ఎయిర్‌పోర్టు 10 శాతం చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం టెండర్లను దాఖలు చేసేందుకు జూలై 5వ తేదీ వరకు గడువు విధించిన సంగతి తెలిసిందే. టెండర్‌లను దక్కించుకున్న నిర్మాణ సంస్థ సెప్టెంబర్ నుంచి పనులను ప్రారంభించి వచ్చే 3 ఏళ్లలో పూర్తి చేయవలసి ఉంటుందని ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ల పర్యవేక్షణలో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్ సలహాదారు సుభోద్ జైన్, సీఈఈ డీవీఎస్ రాజు, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్‌మోహన్, జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లు ఆశ చూపి.. రూ.75 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే అతి తక్కువ కాలంలో కోటీశ్వరుడిని చేస్తామంటూ వచ్చిన సందేశానికి ఫిదా అయ్యాడు ఓ వైద్యుడు. తొలి రెండు, మూడు పర్యాయాలు లాభాలు ఇచ్చి వైద్యుడికి మరింత నమ్మకం కలిగించిన సైబర్ కేటుగాళ్లు పలు దఫాలుగా లక్షల రూపాయలు దోచుకున్నారు. రూ.3 కోట్లు క్రిప్టో లాభాలు చూపిస్తూ అందినకాడికి దోచుకోవడంతో..అప్రమత్తమైన వైద్యుడు ఎట్టకేలకు బుధవారం సిటీ సైబర్‌క్రైం పోలీసుల్ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సికింద్రాబాద్‌లో నివాసం ఉండే వైద్యుడు(ఫిజియోథెరపిస్టు)కి ఏప్రిల్ నెలలో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల్లోని క్రిప్టో లాభాలు, ఇన్వెస్ట్‌మెంట్‌కు చెందిన గ్రూప్స్‌లో వైద్యుడిని యాడ్ చేశాడు. ప్రతిరోజూ కోట్లు వచ్చాయంటూ చర్చ ప్రారంభిస్తూ వైద్యుడు డబ్బు పెట్టేలా ప్రలోభాలకు గురి చేశారు. మొదట్లో రూ.5 లక్షలు క్రిప్టో ట్రేడింగ్ చేయగా దానికి కొంత లాభాలు ఇచ్చారు. దీంతో వైద్యుడు సైతం ఆశపడ్డాడు. రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టాక రూ.3 కోట్లు లాభాలు వచ్చాయంటూ స్క్రీన్‌పై చూపించి..ట్యాక్సుల రూపేణా రూ.75 లక్షలు స్వాహా చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

జిల్లాకో బీసీ గురుకుల డిగ్రీ కాలేజీ దేశానికే నమూనా

సాక్షి, సిటీబ్యూరో: దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా జిల్లాకు ఒక బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం బీసీ విద్యార్థుల కోసం ఇంత పెద్ద సంఖ్యలో డిగ్రీ కాలేజీలను ప్రారంభించలేదన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ పాఠశాలలు 327కి పైగా నెలకొల్పటం విద్యారంగ చరిత్రలో విప్లవమన్నారు. 33 జిల్లాల్లో 33 బీసీ డిగ్రీ కాలేజీలను నెలకొల్పి తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిపోతుందన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనలను అమలు చేస్తున్న కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. బీసీలు, ఎంబీసీలు, సంచార జాతులకు చెందిన బీసీ బిడ్డలు రేపటి అత్యాధునిక ప్రపంచంలో పోటీ పడడానికి ఈ గురుకులాలు పునాదులుగా నిలుస్తాయని చెప్పారు.

భాటి అంత్యక్రియలు పూర్తి

రాజేంద్రనగర్: గ్రేహౌండ్స్ పితామహుడు నారాయణ సింగ్ భాటి అంత్యక్రియలు బుధవారం మహాప్రస్థానంలో ముగిశాయి. మొదట ఆయన అంతిమయాత్ర ఉదయం రాజేంద్రనగర్ ప్రేమావతిపేట గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం నుంచి ప్రారంభమైంది. 9.30 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో భాటి మృతదేహాన్ని రాజేంద్రనగర్ మీదుగా మహాప్రస్థానానికి గ్రేహౌండ్స్ అధికారులు, సిబ్బంది తరలించారు. దారి పొడవునా స్థానికులు రోడ్డు పొడవునా నిల్చొని నివాళుర్పించారు. మంగళవారం తెల్లవారుజామున భాటి మృతి చెందిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ గ్రేహౌండ్స్‌కు చేరుకొని భాటి మృతదేహాన్ని సందర్శించి నివాళుర్పించారు. అంతిమయాత్రలో ఆయనతో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని 15 స్కూల్ బస్సులు సీజ్



కుత్బుల్లాపూర్: ఫిట్‌నెస్ టెస్టింగ్ లేకుండా తిరుగుతున్న స్కూల్, కళాశాల వాహనాలను మేడ్చల్ జిల్లా రవాణా అధికారులు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి 15 వాహనాలను సీజ్ చేశారు. రెండు రోజుల క్రితం స్కూళ్లు, కళాశాలలు ప్రారంభం కావడంతో జిల్లా రవాణా అధికారి కిషన్ ఆదేశాల మేరకు మేడ్చల్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, సుచిత్ర, పేట్‌బషీరాబాద్, కండ్లకోయ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో బందాలుగా విడిపోయి బుధవారం ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ సరిగాలేని వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్‌వీఎస్ ప్రతాప్ రాజా, రవికుమార్, నేహ, త్రివేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిటిఓ కిషన్ మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా 5828 వాహనాలు ఉన్నాయని వీటిలో ఇప్పటికే 4301 వాహనాలు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ప్లాట్ల పేరుతో రూ. 2 కోట్ల మోసం


పోలీసులను ఆశ్రయించిన బాధితులు

బంజారాహిల్స్: ప్లాట్ల పేరుతో అమాయకులను నిండా ముంచి కోట్ల రూపాయలు మోసగించిన సువర్ణభూమి డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీతో సహా అయిదుగురు ఉద్యోగులపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5లోని సువర్ణభూమి డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో 2017లో షాద్‌నగర్ సమీపంలో సువర్ణ కుటీర్ పేరుతో వెంచర్ ప్రారంభించింది. ఈ వెంచర్‌లో రూ.1900లకు గజం చొప్పున వందలాది ప్లాట్లను విక్రయించారు. కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న కొండల్‌రావు అనే వ్యక్తితో పాటు సినీ పరిశ్రమలో ప్రొడక్షన్ విభాగంలో పని చేసే 21 మంది వ్యక్తులు కూడా ఇదే వెంచర్‌లో రూ.6 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా చెల్లించి ప్లాట్లను కొనుగోలు చేశారు. గంగిరెడ్డి దస్తగిరిరెడ్డి అనే వ్యక్తి వీరందరిని సంస్థ కార్యాలయానికి తీసుకెళ్ళి ప్లాట్ల బుకింగ్ చేయించడంతో పాటు షాద్‌నగర్ తీసుకెళ్లి ఈ వెంచర్‌లోనే ప్లాట్లు చూపించి డబ్బులు కట్టించాడు. ఇదే విషయాన్ని సంస్థ జీఎం ప్రవీణ్ కుమార్‌తో పాటు సంస్థ ఎండీ బొల్లినేని శ్రీధర్, ఈడీ మేకా శ్రీనివాస్ తదితరులతో కూడా మాట్లాడి బాధితులు పలు ఇన్‌స్టాల్‌మెంట్లలో డబ్బులు చెల్లించారు. కాగా 2022లో రిజిస్ట్రేషన్ చేస్తామని నమ్మించిన సంస్థ ప్రతినిధులు పలు కారణాలు సాకు చూపిస్తూ దాటవేస్తూ వచ్చారు. ఇటీవల బాధితులంతా జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయానికి వెళ్ళి నిలదీయగా బాధితులు చెల్లించిన మొత్తంలో కేవలం 20 శాతం మాత్రమే తమ అకౌంట్‌లో జమ అయిందని, మిగతా మొత్తం సంస్థకు రాలేదంటూ చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన బాధితులు తమ వద్ద డబ్బులు తీసుకొని ఇచ్చిన రశీదులను సంస్థ యాజమాన్యానికి చూపించారు. అయితే ఈ రశీదుల్లో కొన్ని మాత్రమే తమ సంస్థవని మిగిలినవి సంబంధం లేదని తేల్చేశారు. దీంతో తమను మోసం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై జూబ్లీహిల్స్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 420, 406, 467, 471, రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాయదారి మోసగాడి అరెస్టు


విలేకరుల సమావేశంలో స్వాధీనం నగలు చూపిస్తున్న డీసీపీ

రాంగోపాల్‌పేట్: ఐఏఎస్ అధికారినంటూ ప్రభుత్వ ఉద్యోగులను..టీటీ నంటూ రైల్వే ప్రయాణికులను.. డాక్టర్‌నంటూ మరోచోట మోసాలకు పాల్పడుతున్న మాయదారి మోసగాడిని గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా నిమ్స్‌లో సర్జన్‌గా పనిచేస్తున్నానని చెప్పి ఓ మహిళ నుంచి బంగారు ఆభరణాలు కాజేసి పోలీసులకు పట్టుబడ్డాడు. బుధవారం ఉత్తర మండలం డీసీపీ కార్యాలయంలో డీసీపీ చందనా దీప్తి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన వాయిలాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీ (28) బీటెక్ పూర్తి చేసి ఆవారాగా తిరుగుతూ విలాసాలకు అలవాటు పడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు వివిధ రకాల వేషాలు కట్టి అమాయకులను బుట్టలో పడేయడం, అలాగే ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడటం చేస్తుంటారు. నగరంలోని జూబ్లీహిల్స్‌తో పాటు కావలి రూరల్, కావలి టౌన్, అల్లూరు, జీఆర్పీ రాజమండ్రి, నెల్లూరులోని శాంతాపేట్ తదితర పోలీస్ స్టేషన్లలో మోసాలతో పాటు స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. నెల్లూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐఏఎస్ అని మోసం చేశాడు. ఇలా జూబ్లీహిల్స్‌తో పాటు నెల్లూరు జిల్లాలో పలు కేసుల్లో జైలుకు వెళ్లివచ్చినా పద్ధతి మారలేదు. అలాగే కేపీహెచ్‌బీ ఎల్లమ్మబండకు చెందిన నూకల సుజాతను మోసం చేసి ఐదు తులాల బంగారు ఆబరణాలు తీసుకుని పరారయ్యాడు. నిందితుడు ఈ నెల 13వ తేదీ సాయంత్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గోపాలపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 4.9 గ్రాముల బంగారాన్ని, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో గోపాలపురం ఏసీపీ సుధీర్, ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎస్ఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా ఇవ్వాలి

- వార్డు కార్యాలయాల్లో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



బంజారాహిల్స్: నగరవాసులకు సుపరిపాలన అందించేందుకు ఈ నెల 16న ప్రారంభిస్తున్న వార్డు కార్యాలయాల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించి..వారికు మేమున్నామనే భరోసా ఇవ్వాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను కోరారు. ఇందుకోసం ఆయా కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె బుధవారం బంజారాహిల్స్ వార్డు కార్యాలయ అధికారులు, సిబ్బంది, సర్కిల్ అధికారులతో కలిసి ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. సుపరిపాలన అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇక్కడ వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలన్నారు. సమస్యల పరిష్కారానికి సిటిజన్ చార్టర్ రూపొందించినందున ప్రతి సమస్యను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి బంజారాహిల్స్ వార్డు ఆదర్శంగా నిలవాలన్నారు. వార్డు కార్యాలయంలో పరిపాలన అధికారిది కీలక పాత్ర అని అన్నారు. మిగతా విభాగాల నుంచి ఇంజనీర్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్యం, పట్టణ సామాజిక అభివృద్ధి విభాగం, జలమండలి, యుబిడి, విద్యుత్ శాఖ సిబ్బందిని సైతంవార్డు కార్యాలయంలో నియమించినందున వారివారి విభాగాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించి ఫిర్యాదుదారునికి సమాచారం అందించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ డీసీ రజనీకాంత్ రెడ్డి, ఏఎంసీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో మారణ హోమం ఆపాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మణిపూర్ రాష్ట్రంలో ట్రైబల్స్‌పై కొనసాగుతున్న మారణ హోమాన్ని ఆపి శాంతి నెలకొల్పాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య డిమాండ్ చేశారు. ట్రైబల్స్‌లో విశ్వాసాన్ని కలిగించే చర్యలను చేపట్టి రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను కాపాడాలని కోరారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం(ఏఐటీఎఫ్) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో మారణ హోమం ప్రారంభమై 42 రోజులు అవుతున్నా దేశప్రధాని నరేంద్రమోదీ ఇప్పటి వరకు ఆ ప్రాంతాన్ని సందర్శించకపోవడం, దానిపైన ఒక ప్రకటన చేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీరికగా 26 రోజుల తరువాత సందర్శించారని, అయితే ట్రైబల్స్‌లో నమ్మకాన్ని కలిగించడానికి అవసరమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మారణహోమానికి మూల విరాట్‌గా ఉన్న బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం కన్వీనర్ ముక్తి సత్యం, సభ్యులు సువేర్ణపాక నాగేశ్వర్‌రావు, గుగులోతు సక్కు, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, కోటేశ్వర్‌రావు, మండల వెంకన్న, ప్రసాదన్న, పిడిఎస్‌యూ రాష్ట్ర నాయకులు మహేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

క్లుప్తంగా...

సర్కిల్‌-18 ఏఎంహెచ్‌వోగా రజినీకాంత్‌



బంజారాహిల్స్‌: జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్‌ సర్కిల్‌-18 ఏఎంహెచ్‌వోగా డాక్టర్‌ రజినీకాంత్‌ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న డాక్టర్‌ ప్రవీణ యూసుఫ్‌గూడ సర్కిల్‌-19కి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రజినీకాంత్‌ను నియమిస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇరువురు అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

వైద్యుల రక్తదానం



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 1లోని విరించి ఆస్పత్రిలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఆస్పత్రి చైర్‌పర్సన్‌ కొంపెల్ల మాధవీలత ప్రారంభించారు. లతామా ఫౌండేషన్‌ వలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఈవో డాక్టర్‌ సాయి రవి శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న బంజారాహిల్స్‌ గర్భిణులు

బంజారాహిల్స్‌: నిమ్స్‌ ఆస్పత్రి విస్తరణ పనులను ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 7లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గుర్తించిన ఆరు మంది గర్భిణులకు సీఎం కేసీఆర్‌ చేతుల మీదుగా పౌష్టికాహార కిట్ల పంపిణీ జరిగింది. బంజారాహిల్స్‌కు చెందిన పార్వతి, తేజస్విని, పర్వీన్‌, సుజాత, శిరీష, రేణుక తదితరులు సీఎం చేతుల మీదుగా కిట్లు అందుకున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్‌ వెంకటి, బంజారాహిల్స్‌ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ డాక్టర్‌ కార్తీక్‌ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం చేతుల మీదుగా ఈ కిట్లను అందుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని మహిళలు తెలిపారు.

అంబేడ్కర్‌ నగర్‌ బస్తీలో చింతల పర్యటన

ఫిలింనగర్‌: బూత్‌ దర్శన్‌ కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్‌ బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం జూబ్లీహిల్స్‌ డివిజన్‌ ఫిలింనగర్‌లోని అంబేడ్కర్‌ నగర్‌ బస్తీలో పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్‌ పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌ ఎస్సీ సెల్‌ అధ్యక్షుల నియామకం



ఎస్సీ సెల్‌ డివిజన్‌ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేస్తున్న రమేష్‌బాబు

బంజారాహిల్స్‌: ఖైరతాబాద్‌ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్‌ పార్టీ అయిదు డివిజన్లకు ఎస్సీ సెల్‌ అధ్యక్షులను నియమించింది. బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్‌ ఎస్సీ సెల్‌ చైర్మన్‌ అచ్యుత రమేష్‌బాబు వీరికి నియామక పత్రాలు అందజేశారు. ఖైరతాబాద్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ ఎస్సీసెల్‌ అధ్యక్షుడిగా రాగం రమేష్‌, సోమాజిగూడ డివిజన్‌కు బి.నర్సింగ్‌రావు, హిమాయత్‌నగర్‌ డివిజన్‌కు నరేష్‌, బంజారాహిల్స్‌ డివిజన్‌కు జి.నర్సింహా, జూబ్లీహిల్స్‌ డివిజన్‌కు కె.రాజులను నియమించారు.

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా

వెంగళరావునగర్‌: వెంగళరావునగర్‌కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపిస్తానని టీ–హోప్‌ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్‌ కె.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. జాగో జూబ్లీహిల్స్‌ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన వెంగళరావునగర్‌కాలనీలో పాదయాత్ర చేపట్టారు. ఈ క్రమంలో కాలనీలోని పలు ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వివిధ రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను విన్న ఉపేందర్‌రెడ్డి సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న హనుమాన్‌ ఆలయాన్ని ఆయన ప్రారంభించారు.

సమస్యల సుడిలో సర్కారు బడులు

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. పాఠశాలల్లో సందడిగా తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల హాజరు శాతం ప్రారంభంలో తక్కువగానే ఉన్నా క్రమేపీ పుంజుకుంది. అయితే గత సంవత్సరంలో నెలకొన్న సమస్యల నడుమే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడం.. పాఠశాలల్లో వసతులు కల్పించే విషయంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. ప్రచార ఆర్భాటమే తప్ప విద్యార్థులకు వసతులు మొదలుకొని.. అధ్యాపకుల ఖాళీల భర్తీ వరకు అన్నింటా మిథ్యే అంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



ఫిలింనగర్‌ రౌండ్‌టేబుల్‌ స్కూల్‌ తరగతి గదిలో విద్యార్థులు



ఫిలింనగర్‌ రౌండ్‌టేబుల్‌ స్కూల్‌లో వేలాడుతున్న విద్యుత్‌ వైర్ల నడుమ విద్యార్థులు

సాక్షి ఫోకస్‌

పాఠశాలల్లో అరకొర వసతులు

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- ఖాళీల భర్తీలో తీవ్ర జాప్యం
- పాత సమస్యలతోనే కొత్త విద్యా సంవత్సరం

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 28 మంది టీచర్లు ఉండాలి... ప్రస్తుతం 13 మంది టీచర్లు మాత్రమే ఉన్నారు. కీలకమైన గణితం పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి. ఫిజికల్‌ సైన్స్‌, ఇంగ్లిష్‌ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. తెలుగు ఉర్దూ పండిట్‌ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

- బంజారాహిల్స్‌ రోడ్‌ నెం 12లోని ఎస్పీటీనగర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 23 మంది టీచర్లకుగాను కేవలం 13 మంది టీచర్లు మాత్రమే పని చేస్తున్నారు. ఇక్కడ హిందీ, తెలుగు, మ్యాథ్స్‌, ఫిజిక్స్‌, సోషల్‌ సైన్స్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఎర్రమంజిల్‌ స్కూల్‌లో టీచర్‌ పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ హిందీ పండిట్‌ పోస్టుతో పాటు బయోసైన్స్‌, సోషల్‌ స్టడీస్‌, గ్రేడ్‌ వన్‌ హిందీ పండిట్‌, గ్రేడ్‌-2 హిందీ పండిట్‌ తెలుగు గ్రేడ్‌-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లాంగ్వేజీ టీచర్‌ ఒక్కరు మాత్రమే పని చేస్తున్నారు.
- రాజ్‌భవన్‌ స్కూల్‌లో మొత్తం 24 మంది టీచర్లు అవసరం ఉండగా ప్రస్తుతం 13 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతి పోస్టుకు ముగ్గురు టీచర్లు అవసరం కాగా ఒక్కొక్కరు మాత్రమే పని చేస్తున్నారు. 15 సెక్షన్లకు ఒకే హిందీ పండింట్‌ పోస్టు కొనసాగుతున్నది.
- ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్‌ హైస్కూల్‌లో 36 మంది టీచర్లు అవసరం కాగా ప్రస్తుతం 21 మంది మాత్రమే పని చేస్తున్నారు.
- సైన్స్‌, తెలుగు, సోషల్‌ స్టడీస్‌ ఇలా కీలకమైన టీచర్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- సర్కారు బడుల్లో ప్రవేశాల కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొని బారులు తీరుతున్నారు. మూడు రోజుల నుంచి దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయి. అయితే అందుకు తగినట్లుగా స్కూళ్లలో మౌలిక సౌకర్యాలు, టీచర్ల సంఖ్య ఉండటం లేదు. ప్రతి పాఠశాలలోనూ టీచర్ల కొరత వేధిస్తున్నది.
- విద్యాశాఖ ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంకా 176 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- 47 ప్రాథమిక పాఠశాలల్లో 136 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- నాలుగైదేళ్లుగా టీచర్‌ పోస్టుల భర్తీ జరగకపోవడంతో ఉన్నవారితోనే పాఠాలు వినిపిస్తున్నారు.
- ఒక్కో పాఠశాలలో పదికిపైగానే పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారిక రికార్డులు వెల్లడిస్తున్నాయి.
- విద్యావలంటీర్లు లేకపోవడంతో ఉన్న టీచర్లే విద్యాసంవత్సరాన్ని కానిచ్చేస్తున్నారు.

మౌలిక సౌకర్యాలేవి?

అన్ని పాఠశాలల్లోనూ మౌలిక సౌకర్యాల కొరత విద్యార్థుల పాలిట శాపంగా మారింది. అరకొర సౌకర్యాల మధ్య స్కూళ్లను కొనసాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం పాఠశాలలు ప్రారంభం కాగా ఆ మేరకు సర్కారు బడుల్లో సౌకర్యాలను కల్పించలేదు. కొన్ని పాఠశాలల్లో మూత్రశాలలు లేకపోగా మరికొన్ని పాఠశాలల్లో మంచినీటి కొరత వేధిస్తున్ని.

- ఫిలింనగర్‌ రౌండ్‌టేబుల్‌ స్కూల్‌లో మన బస్తీ మన బడి స్కూల్‌లో పనులు సాగుతుండగా ప్రమాదాల అంచున విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్తున్నారు. 90 శాతం స్కూళ్లలో మన బస్తీ–మన బడి పథకం కుంటుపడింది.

సీఎం దృష్టికి నిమ్స్‌ కాంట్రాక్ట్‌ ఉద్యోగుల సమస్యలు

వినతిపత్రం సమర్పించిన కాంట్రాక్ట్‌ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు



సీఎం కేసీఆర్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న కార్మిక నేత రాంబాబు తదితరులు

లక్డీకాపూల్‌: నిమ్స్‌ కాంట్రాక్ట్‌ కార్మికులకు జీతాలు పెంచి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నిమ్స్‌ కాంట్రాక్ట్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. బుధవారం దశాబ్ది బ్లాక్‌ భూమి పూజలకు వచ్చిన సీఎంను కార్మిక నాయకుడు రాంబాబు ఆధ్వర్యంలో యూనియన్‌ మాజీ ప్రధాన కార్యదర్శి బాలయ్య తదితరులు కలిశారు. ఈ సందర్భంగా నిమ్స్‌ కాంట్రాక్ట్‌ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాంబాబు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు సమక్షంలో సీఎం కేసీఆర్‌ను కలిసిన వారిలో యూనియన్‌ నాయకులు వెంకటేష్‌, శ్రీనివాస్‌, నర్సింహ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే కాంట్రాక్ట్‌ కార్మికుల సమస్యల విషయంలో నిమ్స్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ నగరి బీరప్ప సానుకూలంగా స్పందించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రిటైరైన కార్మికులకు నిమ్స్‌ ఉచితంగా వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం.

‘ఆరోగ్య మహిళ’ ప్రారంభం



ప్రశాసన్‌నగర్‌ బస్తీ దవాఖానాలో వైద్య బృందం

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ రోడ్‌నెం. 72లోని ప్రశాసన్‌ నగర్‌ బస్తీ దవాఖానాలో ఆరోగ్య మహిళ విభాగాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రతి మంగళవారం మహిళలకు ఇక్కడ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆస్పత్రి వైద్యాధికారిణి అమూల్య మాట్లాడుతూ... ప్రతి మంగళవారం ఇక్కడ చేపట్టనున్న ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కేన్సర్‌ స్క్రీనింగ్‌లో భాగంగా నోటి కేన్సర్‌, రొమ్ము కేన్సర్‌, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌లపై పరీక్ష నిర్వహించి అనుమానితులను ఎంఎన్‌జే కేన్సర్‌ ఆస్పత్రికి సిఫారసు చేస్తామన్నారు. అలాగే హిమోగ్లోబిన్‌ స్థాయి తగ్గడం, తదితర సూక్ష్మ పోషకాల లోపాల పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు. మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, పీఐడీ లక్షణాలు, రుతస్రావ సమస్యల నిర్వహణ, మెనోపాజ్‌, లైంగిక వ్యాధుల నిర్వహణ లక్షణాలు, శరీర బరువు నిర్వహణ ఇక్కడ జరుగుతాయని వెల్లడించారు. మొదటి రోజు 35 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. మహిళా ఆరోగ్యం–ఇంటింటికీ సౌభాగ్యం థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రతి మహిళకూ పేషెంట్‌ రికార్డ్‌ ఉంటుందన్నారు. ఇందులో గత చరిత్ర, కుటుంబ చరిత్ర, ఇతర వ్యాధులు నమోదు చేస్తామని డాక్టర్‌ అమూల్య వివరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

శ్రీనగర్‌కాలనీ: బస్తీల్లో తాగునీటి, సీవరేజీ పనులను సమస్యలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జూబ్లీహిల్స్‌ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ అన్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని ఆనంద్‌ నగర్‌కాలనీలో సుమారు రూ. 54 లక్షల వ్యయంతో వాటర్‌, సీవరేజ్‌ పనులను ఆయన ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్‌ షరీఫ్‌, వాటర్‌వర్క్స్‌ డీజీఎం వాహబ్‌, మేనేజర్‌ శ్రీనివాస్‌, డివిజన్‌ అధ్యక్షులు డి.సంజీవ, సెక్రటరీ షరీఫ్‌ ఖురేషి, కాలనీ అధ్యక్షుడు రొంపి బాలకృష్ణ, గంట మల్లేస్‌, రసూల్‌, రాజు, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

టూరిస్టు హబ్‌గా ఖైరతాబాద్‌

ఎమ్మెల్యే దానం నాగేందర్‌



కిట్స్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్‌

ఖైరతాబాద్‌: ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్‌ నాయకత్వంలోని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే అని ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ అన్నారు. బుధవారం తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఖైరతాబాద్‌ శాఖ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌ వెల్‌నెస్‌ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దానం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగేందర్‌ మాట్లాడుతూ... విద్య, ఆరోగ్యంతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన ముఖ్యమంత్రి ఆ దిశగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఖైరతాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహం, సచివాలయం, అమరవీరుల స్థూపంతో ఖైరతాబాద్‌ టూరిస్టు ప్రాంతంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఖైరతాబాద్‌ ప్రాంత వాసుల కోసం ఐమాక్స్‌ ఎదురుగా రూ. 16 కోట్ల వ్యయంతో మల్టీ లెవల్‌ కమ్యూనిటీ హాల్‌ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్‌ వార్డు కార్యాలయం సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఉత్తమ సేవలందించిన ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, నర్సుల సేవలనూ గుర్తిస్తూ ప్రశంస పత్రాలు, గిఫ్టులను అందజేశారు. కార్పొరేటర్లు నీలం వెంకటేష్‌, మన్నె కవితారెడ్డి, సంగీతా యాదవ్‌, గ్రంథాలయ సంస్థ చైర్‌ పర్సన్‌ ప్రసన్న, నోడల్‌ ఆఫీసర్‌ రజినీకాంత్‌, సూపరింటెండెంట్‌ రేవతి, డాక్టర్లు రేవతి, దీప్తి, సువర్ణ, శైలజ, ఇశాక్‌, కీర్తి, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, నర్సులు పాల్గొన్నారు.

స్టాక్‌ మార్కెట్‌లో చిచ్చరపిడుగు



తేజస్‌ సచిన్‌ కుమార్‌

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో 3వ తరగతి పూర్తి చేసుకున్న తేజస్‌ సచిన్‌ కుమార్‌ సెక్యూరిటీస్‌ అండ్‌ ఎక్స్ఛేంజ్‌ బోర్డు ఆఫ్‌ ఇండియా (సెబి) నిర్వహించిన నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ మార్కెట్‌ డేరివేటిస్‌ కరెన్సీ మార్కెట్‌లో నిర్వహించిన పరీక్షలో తన సత్తా చాటారు. ఈ పరీక్ష పాస్‌ కావడం అనేది చాలా అరుదైన ఘనత. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్‌ చైర్మన్‌ ఎ. మురళీ ముకుంద్‌, ప్రిన్సిపాల్‌ ఎం.వరలక్ష్మి ప్రత్యేకంగా తేజస్‌ను అభినందించారు. మూడో తరగతిలో బాలుడు ఎప్పుడూ ముందుండేవాడని వెల్లడించారు. అతి పిన్న వయసులో ఈ ఘనతను సాధించిన తేజస్‌ భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదగాలని కోరారు. ఈ పరీక్షలు 60 మార్కులకు పాస్‌ కాగా తేజస్‌ 70 మార్కులు తెచ్చుకున్నట్లు వెల్లడించారు.

యువతి అదృశ్యం



నాగలక్ష్మి

రహమత్‌నగర్‌(బోరబండ): బోరబండ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌ సమాచారం మేరకు... ఓంనగర్‌ బస్తీకి చెందిన నాగలక్ష్మి(21) ఈ నెల 12న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా వెళ్లి పోయింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఫలితం లేనందున తండ్రి సుబ్బారావు బోరబండ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట

జూబ్లీహిల్స్‌ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌



కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌

రహమత్‌నగర్‌(బోరబండ): మహిళా సాధికారత, ఆరోగ్యం కోసం బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేస్తోందని బీఆర్‌ఎస్‌ పార్టీ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్‌ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బోరబండ అచార్య జయశంకర్‌ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని ఎర్రగడ్డలో దాదాపు రూ. 900 కోట్ల వ్యయంతో వేయి పడకల ఆస్పత్రి నిర్మితం అవుతోందన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–19 డీఎంసీ రమేష్‌, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్‌, వెంగళరావునగర్‌ కార్పొరేటర్లు రాజ్‌కుమార్‌ పటేల్‌, సి.ఎన్‌.రెడ్డి, దేదీప్య, బోరబండ బీఆర్‌ఎస్‌ పార్టీ ఇన్‌చార్జ్‌ సిరాజ్‌, కో ఆర్డినేటర్‌ విజయసింహా, విజయ్‌కుమార్‌, ధర్మ, సర్దార్‌, షరీఫ్‌, నజీర్‌, సంతోష్‌, వైద్యాధికారులు అనురాధ, సుభాని, ఆశావర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ప్రపంచ శ్రేణి రుచులు



నూతన మెనూతో దీపాదాదు, మహేష్‌ తిబ్రేవాల్‌

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌లోని ఎన్‌చాంటి కేఫ్‌ అండ్‌ కన్‌ఫెక్షనరీలో బుధవారం నోరూరించే వంటకాల రుచులతో ఫుడ్‌ఫెస్టివల్‌ను ప్రారంభించారు. నూతన మెనూ ఆవిష్కరణపై ఎన్‌చాంట్‌ వ్యవస్థాపకురాలు దీపాదాదు, సహ వ్యవస్థాపకుడు మహేష్‌ తిబ్రేవాల్‌ మాట్లాడుతూ ప్రపంచ శ్రేణి వంటకాలను ఇక్కడ రుచి చూడవచ్చన్నారు. ఫ్యూజన్‌ డైనింగ్‌ అనుభవాన్ని అందించేందుకు ఈ కొత్త మెనూ రూపొందించడం జరిగిందన్నారు. క్రీమ్‌ ఆఫ్‌ బ్రోకలి అండ్‌ ఆల్మండ్‌, ఫెటా సలాడ్‌, గ్రీక్‌ సలాడ్‌ వంటి సూప్‌లు ఇక్కడ ప్రత్యేక రుచులను అందిస్తామన్నారు. ఆధునిక సంప్రదాయ రుచులను కోరుకునే వారికి ఇదొక చక్కని వేదిక అని కాంటినెంటల్‌, మెడిటరేనియన్‌ వంటకాలను ఇక్కడ ప్రత్యేకంగా లభిస్తాయన్నారు.

ఆయుర్వేద వైద్యంతో మంచి ఫలితాలు



పంజగుట్ట: మన ప్రాచీన ఆయుర్వేద విద్య గూర్చి ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయని ఆయుర్వేద వైద్యంతో ఎన్నో వ్యాధులకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చీఫ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ పద్మావతి తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రేమ్‌నగర్‌ అంబేద్కర్‌ భవన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల కీళ్లనొప్పులు, వాతము, అలర్జీ, జీర్ణ సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా ఇచ్చారు. ఈ మందులు వినియోగం వల్ల ఎలాంటి సైడ్‌ ఎఫెక్ట్స్‌ ఉండవని డాక్టర్‌ పద్మావతి పేర్కొన్నారు. ప్రేమ్‌నగర్‌ ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని నెలకు ఒకరోజు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 14 మంది సీనియర్‌ వైద్యులను 10 మంది పారామెడికల్‌ సిబ్బందిని ప్రేమ్‌నగర్‌ సంక్షేమ సంఘం, డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ సేవా సంఘం, ప్రేమ్‌నగర్‌ మహిళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డాక్టర్‌ చంద్రశేఖర్‌, ప్రేమ్‌నగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి విశ్వనాథం, ప్రధానకార్యదర్శి కె.భగవాన్‌ దాస్‌, మహేష్‌, మామిడి నర్సింగ్‌, మధురవేణి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం తేవాలి

పంజగుట్ట: గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని గృహ కార్మికుల యూనియన్‌ తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గృహకార్మిక యూనియన్‌ తెలంగాణ, మౌంట్‌ఫోర్ట్‌ సోషల్‌ ఇనిస్టిట్యూట్‌ (ఎంఎస్‌ఐ), వర్కింగ్‌ పీపుల్స్‌ కోయలిషన్‌ (డబ్ల్యూపీసీ), గృహ కార్మికుల జాతీయ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డబ్ల్యూపీసీ కార్యదర్శి వర్గీస్‌ చెకనాథ్‌, గృహకార్మిక యూనియన్‌ అధ్యక్షురాలు స్వాతి, సెక్రటరీ మంజులతో కలిసి ఆయన మాట్లాడుతూ... గృహకార్మికులకు సామాజిక భద్రత లేదని వారికి ముఖ్యంగా ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సదుపాయం కల్పించాలని డిమాండ్‌ చేశారు. చాలా మంది గృహకార్మికులు కనీస వేతనం కన్నా తక్కువ వేతనం అందుకుంటున్నారని వారానికి ఒక రోజు సెలవు లేకుండా పనిచేస్తారని, యజమానుల నుంచి దూషణలు ఎదుర్కొంటారని, ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వం వారికి ఒక సమగ్ర చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. గృహకార్మికులకు కనీస వేతనం కల్పించాలని, యజమాని ఉన్నచోటే వారికి నివాసం కల్పించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సదుపాయం కల్పించాలని డిమాండ్‌ చేశారు. జూన్‌ 16 అంతర్జాతీయ గృహకార్మికుల దినోత్సవం పురస్కరించుకుని 15వ తేదీన ఉప్పల్‌, చర్చ్‌ కాలనీలో గృహకార్మికుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజా యుద్ధనౌక గద్దర్‌, విమలక్కలు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో రేణుకాదేవి, శబానా, సూసై అలంకారం తదితరులు పాల్గొన్నారు.

ఛాతి ఆస్పత్రి మెయిన్‌ ఎంట్రెన్స్‌ మార్పు



ఛాతి ఆస్పత్రి నూతన ప్రధాన ద్వారాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మహబూబ్‌ఖాన్‌

వెంగళరావునగర్‌: ఎర్రగడ్డ ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి మెయిన్‌ గేటును వెంగళరావునగర్‌ కాలనీవైపు మార్చారు. వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా టిమ్స్‌ సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతుండటంతో అక్కడ రహదారి గుంతలమయంగా మారింది. ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్స్‌ వేయడంతోపాటు గుంతలమయంగా మారడం, దుమ్ము ధూళితో ఆ ప్రాంతం నిండిపోవడంతో రోగులు ఆస్పత్రిలోనికి రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాత గేటు మార్గాన్ని మూసివేశారు. ఆస్పత్రిలోకి రావడానికి వెంగళరావునగర్‌కాలనీ ప్రధాన రహదారివైపు మళ్లించారు. ఇందుకోసం ప్రత్యేకంగా రహదారిని నిర్మించి, వీధి దీపాలను కూడా ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ రహదారిని బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మహబూబ్‌ఖాన్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టిమ్స్‌ ఆస్పత్రి నిర్మాణం సందర్భంగా చెస్ట్‌ హాస్పిటల్‌లోని రోగులకు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే రోగుల భద్రత కోసం ఎర్రగడ్డ వైపు ఉన్న మార్గాన్ని వెంగళరావునగర్‌కాలనీ వైపు మళ్లించామన్నారు. ఇటుగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఆ శాఖ అధికారులను కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీనియర్‌ వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్‌ సిబ్బంది, పారా మెడికల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జి-20తో బంధం బలోపేతం

యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్



సాక్షి, హైదరాబాద్: జి–20 అగ్రికల్చరల్ వర్కింగ్ గ్రూప్ సమావేశం అమెరికా–భారత్ ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి గొప్ప అవకాశమని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. ఈ సంవత్సరం జి–20 అధ్యక్ష స్థానంలో భారత్ నాయకత్వాన్ని ఆమె అభినందించారు. భారత సంస్కృతి, వంటకాలు అంతర్జాతీయంగా పేరెన్నికగన్నాయన్నారు. 'టేస్ట్ ఆఫ్ అమెరికా' ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కింద అమెరికాలోని ప్రీమియం వ్యవసాయ ఉత్పత్తులు, బేవరేజెస్‌ను భారతీయులకు రుచికరంగా అందించడానికి వీలవుతోందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో ద్వైపాక్షిక వాణిజ్యం పెరగాలని ఆకాంక్షించారు. అమెరికా ఆహార పదార్థాలపై భారత్‌లోని దక్షిణాది ప్రజల్లో ఆసక్తి కల్పించడానికి వీలుగా బుధవారం నాడు ఓ స్టార్ హోటల్‌లో 'హై టీ సెలబ్రేషన్స్'ను నిర్వహించారు. అమెరికా వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన అండర్ సెక్రటరీ గ్జోచిట్ టర్రెస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిస్టా ల్యాబ్ సందర్శించిన జర్మనీ బృందం

తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థకు చెందిన అంతర్జాతీయ విత్తన ప్రయోగశాల (టిస్టా)ను జర్మనీ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో బృందం సమావేశమయ్యింది.

యూఏఈ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ప్రారంభం



బంజారాహిల్స్ (హైదరాబాద్): బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాయబార కార్యాలయం బుధవారం ప్రారంభమైంది. యూఏఈ మంత్రి అహ్మద్ అలీ అల్ సయేగ్, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, హైదరాబాద్‌లో యూఏఈ కాన్సులేట్ జనరల్ ఆర్ఎఫ్ అల్ నునైని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి జీ-20 వ్యవసాయ మంత్రుల సమావేశం

- 3 రోజులు హైదరాబాద్‌లో నిర్వహణ
- 30 దేశాల వ్యవసాయ మంత్రుల రాక



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్ (ఏడబ్ల్యూజీ) మినిస్టీరియల్ సమావేశాలకు హైదరాబాద్ సిద్ధం అయ్యింది. గురువారం నుంచి ఈ నెల 17 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో వివిధ దేశాల వ్యవసాయ మంత్రులు, అంతర్జాతీయ సంస్థల డైరెక్టర్ జనరల్స్ పాల్గొంటారు. కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కైలాష్ చౌదరి మొదటిరోజు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో భారత్ సాధించిన విజయాలను ఇందులో ప్రదర్శిస్తారు. అనంతరం వ్యవసాయ డిప్యూటీస్ మీటింగ్ (ఏడీఎం) జరుగనుంది. ద్వితీయార్థంలో అగ్రిబిజినెస్ ఫర్ ప్రాఫిట్, పీపుల్ అండ్ ప్లానెట్ నిర్వహణ, 'డిజిటల్లీ డిస్కనెక్ట్: వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవడం' కార్యక్రమాలు జరుగుతాయి. జీ–20 సమావేశంలో పాల్గొనే మంత్రులు, ఇతర ప్రతినిధి బృందాల నాయకులకు కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ స్వాగతం పలకడంతో రెండవరోజు సమావేశం ప్రారంభమవుతుంది. ఆహార భద్రత, పౌష్టికాహారం కోసం సుస్థిర వ్యవసాయం, మహిళల నేతృత్వంలోని వ్యవసాయం, సుస్థిర జీవవైవిధ్యం, వాతావరణ సమస్యల పరిష్కారాలపై మంత్రులు, ఉన్నత స్థాయి అధికారుల చర్చలు మూడు సమాంతర సెషన్లలో జరుగుతాయి. మూడవ రోజు భారత్ అధ్యక్షతన అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్, జీ–20 ఫలితాలను ఆమోదించడంతో మంత్రుల సమావేశం ముగుస్తుంది. అనంతరం హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ –ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్)కు సాంకేతిక విజ్ఞాన యాత్రకు ప్రతినిధి బృందం వెళ్తుంది.

నకిలీ విత్తన ముఠా అరెస్ట్

- వాహనాల తనిఖీలో పట్టుబడిన ముగ్గురు నిందితులు, పరారీలో మరొకరు
- రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం: నల్లగొండ ఎస్పీ



పట్టుబడిన నకిలీ విత్తనాలు, నిందితులతో ఎస్పీ అపూర్వరావు, ఇతర పోలీస్ సిబ్బంది

నార్కట్‌పల్లి: నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్న ఓ ముఠాను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ పరిధిలోని అల్వాల్ హిల్స్ ప్రాంతానికి చెందిన గోరంట్ల నాగార్జున, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పెద్దకూరపాడు గ్రామానికి చెందిన గడ్డం రవీంద్రబాబు, నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మెరిగె వేణు, అన్నమయ్య జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన నర్సింహ ఓ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. ఈ ముఠా సభ్యులు కర్ణాటకలో పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటూరు జిల్లా దాచేపల్లి సమీపంలో స్టోరేజీ చేశారు. అక్కడ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన రైతులకు ఎక్కువ ధరకు అమ్మేందుకు హైదరాబాద్ మీదుగా తరలించాలని నిర్ణయించుకున్నారు. కారులో నాగార్జున, రవీంద్రబాబు, వేణు బయలుదేరారు. పక్కా సమాచారంతో బుధవారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు, టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ ఎర్టిగా కారును తనిఖీ చేయగా రెండు బస్తాల విత్తనాలు బయటపడ్డాయి. వాటిని వ్యవసాయ అధికారులు పరిశీలించి నకిలీ విత్తనాలుగా నిర్ధారించారు. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి మిగతా విత్తనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు నర్సింహ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించనున్నట్లు చెప్పారు.

కొద్దిగంటల్లో పెళ్లి... వడదెబ్బతో వరుడు మృతి



తిరుపతి (ఫైల్)

కౌటాల: ఆనందంగా పెళ్లి జరగాల్సిన ఇంట తీవ్ర విషాదం నెలకొంది. మరి కొద్ది గంటల్లో పెళ్లనగా వరుడు వడదెబ్బతో మృతి చెందాడు. కుమురంభీం జిల్లా కౌటాల మండలం గుడ్లబోరి గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన గుండ్ల శ్యాంరావ్, యశోద దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు గుండ్ల తిరుపతి (32)కి ఇటీవల మంచిర్యాల జిల్లా భీమిని గ్రామానికి చెందిన యువతితో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం మధ్యాహ్నం వివాహ ముహూర్తం నిర్ణయించారు. వరుడి ఇంట్లోనే పెళ్లి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో పెళ్లి పత్రికల పంపిణీ, పెళ్లి ఏర్పాట్ల పనుల్లో వారం రోజులుగా అతను ఎండల్లో తిరుగుతున్నాడు. దీంతో తిరుపతి మంగళవారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పెళ్లి కోసం వేసిన పందిట్లో తిరుపతి మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు రోదించిన తీరు అందరినీ కలచివేసింది.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో 'తెలంగాణ టాప్'

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో తెలంగాణ ముందంజలో ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (డీఏఆర్‌పీజీ) ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రాల పనితీరుపై నెలవారీ నివేదికను బుధవారం విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వం సగటున ఒక్కో ఫిర్యాదు పరిష్కారానికి కేవలం 8 రోజుల సమయం మాత్రమే తీసుకుందని ప్రకటించింది. కాగా మొత్తం నాలుగు కేటగిరీల్లో రాష్ట్రాలను విభజించి ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రాల పనితీరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ర్యాంకింగ్స్ ఇచ్చింది. 72.49 శాతం ఫిర్యాదుల పరిష్కారంతో 15 వేల కంటే తక్కువ ఫిర్యాదుల కేటగిరీలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి మే 31 వరకు తెలంగాణలో 2,633 ఫిర్యాదులు అందాయి. దేశంలోనే అతి తక్కువ సమయంలో 2,524 ఫిర్యాదులను పరిష్కరించిన తెలంగాణ రాష్ట్రం, పరిష్కార కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచిందని నివేదికలో వెల్లడించింది. అంతేగాక 15 వేల కంటే ఎక్కువ ఫిర్యాదుల కేటగిరీలో ఉత్తరప్రదేశ్ 1,16,840 ఫిర్యాదుల్లో 62.07 శాతం పరిష్కరించి ఆ కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచింది.



విత్తిన విత్తనాలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

ఆశలు మొలకెత్తేనా..

చింతపల్లి: వర్షాలు పడగానే విత్తనాలు మొలకెత్తుతాయని పత్తి విత్తనాలను పొడి దుక్కుల్లో వేసేందుకే రైతులు ఆసక్తి చూపుతుంటారు. ఈ ఏడు కూడా అలాగే విత్తిన రైతులు ఇప్పుడు వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పట్లో వానలు పడేట్లు లేవని మరికొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని చిలకరిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ శివ సైతం.. తనకున్న ఐదు ఎకరాల భూమిలో పత్తి విత్తనాలు వేశాడు. వానల జాడ లేక వాటికి ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్నాడు. విత్తనాలు భూమిలో మురిగిపోకుండా, మొలకెత్తాలనే ఆశతో ట్యాంకర్‌తో నీటిని పోస్తున్నట్లు శివ తెలిపాడు.

మండే ఎండలు.. వడగాల్పులు

- రుతుపవనాల రాక ఆలస్యంతో అధిక ఉష్ణోగ్రతలు
- గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు



సాక్షి, హైదరాబాద్: రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఇంకా అధికంగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమ దిశ నుంచి బలమైన గాలులు వీస్తుండడంతో కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. ప్రధానంగా ఆదిలాబాద్, ఖమ్మం, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇక గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి తక్కువ ఎత్తులో బలంగా గాలులు వీస్తున్నాయి. బుధవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత అత్యధికంగా కరీంనగర్ జిల్లా తంగులలో 45.4 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 42.2 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 25.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
తంగుల	కరీంనగర్	45.4
శ్రీరామ్‌పూర్	పెద్దపల్లి	45.1
తక్కళ్లపల్లి	పెద్దపల్లి	44.4
లక్ష్మీదేవిపల్లి	కొత్తగూడెం	44.2
మల్లాపూర్	జగిత్యాల	44.2

రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	41.8	30.4	ఖమ్మం	42.2	30.0
భద్రాచలం	42.8	28.5	మహబూబ్‌నగర్	38.7	27.0
హకీంపేట్	39.0	26.8	మెదక్	40.6	25.2
దుండిగల్	39.0	26.0	నల్లగొండ	41.0	25.4
హనుమకొండ	40.5	29.5	నిజామాబాద్	40.3	27.4
హైదరాబాద్	39.1	27.0	రామగుండం	41.6	31.5

నగర వార్తలు

బీసీ జాబితాలోని అన్ని కులాలకు రూ. లక్ష సాయం ఇవ్వాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేవలం 14 కుల వృత్తుల వారికి ప్రకటించిన రూ. లక్ష ఆర్థిక సాయాన్ని బీసీ జాబితాలోని అన్ని కులాలకు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో జరిగిన బీసీ ప్రతినిధుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన బీసీ బంధు పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ. లక్ష సాయాన్ని బీసీల్లోని పద్మశాలి, ముదిరాజ్, గౌడ, ఇడిగ, గొల్ల, కురుమ, మున్నూరు కాపు, బెస్త, బోయ, వాల్మీకి, బలిజ, లింగాయత్ తదితర అన్ని కులాల వారికి ఇవ్వాలని, లేని పక్షంలో బీసీ జాబితాలోని అన్ని కులాల వారు తిరగబడతారన్నారు. ఎన్నికల సమయంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వానికి బీసీలు గుర్తుకు వస్తారన్నారు. బీసీ కార్పొరేషన్‌కు రూ. వంద కోట్ల బడ్జెట్ వెంటనే విడుదల చేయాలని లేకుంటే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చిటికెల గోవింద్‌ను నియమిస్తూ ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, నీరడి భూపేష్ సాగర్, నందగోపాల్, రాజ్‌కుమార్, జిల్లపల్లి అంజి, సుధాకర్, రాజేందర్, వేముల రామకృష్ణ, రాందేవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో వర్క్‌షాప్‌కు బంగోర్ వర్సిటీ ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ (కార్యశాల)లో పాల్గొనేందుకు విచ్చేసిన బ్రిటన్‌లోని బంగోర్ వర్సిటీ ప్రొఫెసర్లు బుధవారం వీసీ ప్రొఫెసర్ రవీందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. వీసీ చాంబర్‌లో పరిశోధనలు, జీవశాస్త్రాలతో పాటు వివిధ అంశాలపై చర్చించారు. ఓయూలో అందుబాటులో ఉన్న వివిధ పరిశోధన సంస్థల గురించి వీసీ వివరించారు. అనంతరం ఓయూ వీసీ బంగోర్ వర్సిటీ అధ్యాపకురాలు డాక్టర్ అనిత మల్హోత్రకు ఆర్ట్స్ కాలేజీ భవనం ఫొటోను అందజేశారు.

అత్యధిక తలసేమియా బాధితులు భారత్‌లోనే

ఏఐజీ హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



చంద్రకాంత్ అగర్వాల్‌ను సత్కరిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : ప్రపంచంలోనే భారత్‌లోనే అత్యధికంగా తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని ఏఐజీ హస్పటల్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పటల్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు చంద్రకాంత్ అగర్వాల్, ఏఐజీ హస్పటల్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిలు హాజరై ఏఐజీ 'పింట్ ఆఫ్ లైఫ్' ప్రచారంలో భాగంగా రక్తదానం క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కువగా తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులు ఎక్కువగా నిరుపేద చిన్నారులు ఎక్కువగా ఉన్నారన్నారు. వారందరికి తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ వారు అండగా నిలుస్తూ ఉచితంగా రక్త మార్పిడి చేస్తున్నారన్నారు. అందుకుగాను ఏఐజీ హాస్పటల్ యాజమాన్యం ప్రపంచ రక్తదాతల దినోత్సవం రోజు 1000 యూనిట్ల రక్తం సొసైటీకి అందజేసినట్లు చెప్పారు. రక్తదానం చేసిన బయోలాజికల్ ఇ లిమిటెడ్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, హిటోరో సంస్థల ఉద్యోగులు, పుల్లారెడ్డి ఫార్మా కళాశాల విద్యార్థులను అభినందించారు. డాక్టర్ ప్రగతి నాయక్, ఏఐజీ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు.

డీజీపీ అభినందనలు..

ఇటీవల జరిగిన సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా షూటింగ్ క్రీడాంశంలో స్వర్ణ పతకం సాధించిన హైదరాబాద్ అమ్మాయి సయ్యదా ఫహమీనా నాజ్నీన్‌ను అభినందిస్తున్న డీజీపీ అంజనీ కుమార్.



న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలి

- తెలంగాణ న్యాయవాదుల జేఏసీ
- ఇందిరాపార్కు వద్ద రిలే నిరాహార దీక్ష



రిలే దీక్షలో పాల్గొన్న తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ: రాష్ట్రంలో న్యాయవాదులపై రోజు రోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే న్యాయవాదుల పరిరక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు చట్టం మాదిరిగా న్యాయవాదుల రక్షణ కోసం పకడ్బందీగా న్యాయవాదుల చట్టం తీసుకురావాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇందు కోసం తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వేలాది మంది న్యాయవాదులు సంఘటితమై పోరాటం చేసినప్పుడే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ న్యాయవాదుల సురక్ష సమితి (టీఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద సమితి అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు ఎ.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి హిమ్మద్, సంయుక్త కార్యదర్శి రాజేష్ కులకర్ణి, కోశాధికారి దేవేందర్‌తో పాటు సమితి సభ్యులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు గోవర్ధన్‌రెడ్డి, సౌత్ ఇండియా అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్, న్యాయవాదులు నాగుల శ్రీనివాస్‌యాదవ్, సుధీర్, శ్రీవాత్సవ్, యశ్వంత్సింగ్, రంగారెడ్డి జిల్లా బార్ కౌన్సిల్ సభ్యులు రమేష్, నిజాముద్దీన్, పరశురాం, స్వర్ణలత, సమీరాలు హాజరై మాట్లాడారు. ఈ చట్టం తీసుకువచ్చేంత వరకు న్యాయవాదులు చేసే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. దీక్షల్లో కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, పలు బార్ అసోసియేషన్ల సభ్యులు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి న్యాయవాదులు పాల్గొన్నారు.

గోరక్షణ చట్టాలు కఠినంగా అమలు చేసేలా ఒత్తిడి తేవాలి



కవాడిగూడ: సనాతన భారత సంస్కృతిలో గోవును ఆరాధ్య దేవతగా పూజిస్తున్నారని పలువురు స్వామిజీలు పేర్కొన్నారు. గోవును విచ్చలవిడిగా వధించి మాంసాహారంగా వినియోగించడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గోరక్షణ చట్టాలు కఠినంగా అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందు కోసం హిందువులంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భారతీయ గో వంశ రక్షణ వర్ధన పరిషత్ (గోరక్ష విభాగం విశ్వహిందూ పరిషత్ తెలంగాణ) ఆధ్వర్యంలో గోరక్ష చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. స్వామిజీలు సర్వేశ్వర శివయోగి, చైతన్య స్వామి, తమలేశనంద, శేఖర్ స్వామి గోవులకు పూజలు నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న వారితో గోవుల రక్షణకు పాటుపడతామంటూ ప్రమాణం చేయించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 సంవత్సరంలో చట్టాన్ని తీసుకువచ్చిందని ప్రస్తుతం తెలంగాణలో ఈ చట్టం అమలు కాకపోవడం దురదృష్టకరమన్నారు. ఇకనైనా తెలంగాణ ప్రభుత్వం గోవులను రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఈ నెల 17 వరకు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: ట్రాక్ నిర్వహణ పనుల దృష్ట్యా వివిధ మార్గాల్లో ఈ నెల 17వ తేదీ వరకు 22 ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు లింగంపల్లి–సికింద్రాబాద్–ఫలక్‌నుమా, ఉందానగర్–లింగంపల్లి, ఫలక్‌నుమా–లింగంపల్లి, తదితర రూట్లలో నడిచే రైళ్లు రద్దు కానున్నాయి.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: అఖిల భారత విశ్వ విద్యాలయ ఉద్యోగుల మహా సంఘం అధ్యక్షుడు బీఎస్. హోటా వర్కింగ్ ప్రెసిడెంట్ సజ్జన్, సెక్రటరీ జనరల్ అంజన్‌కుమార్ ఘోష్ పిలుపుమేరకు జూబ్లీహిల్స్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో విశ్వ విద్యాలయ ఉద్యోగుల బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ సర్వీస్ ఉద్యోగుల సంయుక్త సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులంతా పెద్ద ఎత్తున పాల్గొని సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు ఉద్యోగుల ఆరోగ్య బీమాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులతో సమానంగా అమలు చేయాలని ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేసి టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ డిమాండ్లను ప్రధాని, కేంద్ర విద్యాశాఖ మంత్రికి ఫ్యాక్స్ ద్వారా మెసేజ్‌లను పంపి ఆ కాపీలను వైస్ చాన్సిలర్‌కు అందజేశారు. నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. మహేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వి.ఎం. శర్మ, డి.కిశోర్‌బాబు, డాక్టర్ యాకేష్, కె. పాండు, జె.వెంకట పిచ్చయ్య, బి. సాంబమూర్తి, జి.రాజు, కె. సత్యనారాయణ, పి.విశ్వనాథ్, షబ్బీర్, కె. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఉద్యోగుల డిమాండ్ డే



మాట్లాడుతున్న ఓయూ ఎన్‌జీవోస్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఉద్యోగులు డిమాండ్ డేను నిర్వహించారు. బుధవారం పాలన భవనం ఎదుట ఓయూ ఎన్‌జీవోస్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ... ఓయూలో దీర్ఘకాలంగా పని చేస్తున్న టింస్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ఈపీఎఫ్‌ను అమలు చేయాలని, వర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను (ఈహెచ్ఎస్) ఉద్యోగులకు అమలు చేయాలని, పాత పింఛన్ విధానాన్ని పునఃప్రారంభించాలని, ఉద్యోగులందరికీ సమాన వేతనాన్ని చెల్లించాలని, జీడీపీలో విద్యారంగానికి 6 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాలక మండలి, అకడమిక్ సెనెట్‌లో సభ్యులుగా నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవోస్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎస్.నాగరాజారావు, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'స్పర్శ్' సామూహిక రక్తదానం



సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా ఉచిత పాలియాటివ్ కేర్ సేవలందిస్తున్న 'స్పర్శ్ హాస్పీస్ అండ్ పాలియాటివ్ కేర్' సెంటర్‌లో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న బృందం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సామూహికంగా రక్తదానం చేసి మరోసారి తమ సేవా నిరతిని చాటుకున్నారు. గచ్చిబౌలిలోని స్పర్శ్ వేదికగా డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్పర్శ్‌లో అకౌంట్స్, నర్స్, వార్డ్‌బాయ్స్, సోషల్ వర్కర్స్‌తో పాటు ఆయా విభాగాల్లో సేవలందిస్తున్న 20 మంది మహిళలు, పురుషులు రక్తదానం చేశారు. సేకరించిన ఈ రక్తాన్ని గర్భిణులు, ఎనీమియా బాధిత మహిళలకు అందిస్తామని డిస్ట్రిక్ట్ హాస్పిటల్ డాక్టర్ మాలతి తెలిపారు. నయం కాని జబ్బులతో అంతిమ దశలో ఇబ్బందులు పడుతున్న వారికి నిత్యం ఉచితంగా ఉపశమన వైద్య సేవలు అందిస్తూనే ఇలాంటి వినూత్న సేవా కార్యక్రమానికి స్పర్శ్ సిబ్బంది ముందుకు రావడం అభినందనీయమని సెంటర్ హెడ్ శశిధర్ అన్నారు.

నివాళి/శారద

'కళ్లల్లో కళ్లు పెట్టి చూడు'...
'మధురాతి మధురం మన ప్రేమ మధురం'...
'కంటి చూపు చెప్తోంది కొంటె నవ్వు చెప్తోంది'...
ఈ పాటలు పాడిన ముచ్చటైన గాయని శారద.
'బత్కమ్మ బత్కమ్మ బత్కమ్మ బత్కమ్మ ఎక్కడ పోతవురా'...
ఈ పాట పాడిందీ శారదే.
శంకర్-జై కిషన్‌లలో మన హైదరాబాదీ అయిన
శంకర్ శారద పాటలకు ఎన్నో అవకాశాలు కల్పించాడు.
'తిత్‌లి ఉడీ ఉడ్‌జో చలీ'... పెద్ద హిట్.
తన 86 ఏళ్ల వయసులో ఆమె
బుధవారం కన్ను మూసింది.
ఒక కాలంలో కొన్ని ముద్దుముద్దు ముచ్చటైన పాటలు
పాడిన శారదకు నివాళి.



ఆమెవి ముచ్చటైన పాటలు

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన సంగీత దర్శకుడు శంకర్ (జైకిషన్)కు తెలుగు జానపదాలంటే ఇష్టం. 'రామయ్యా వస్తావయ్యా ఏమయ్యా వస్తావయ్యా' పాట చేసి దేశమంతా తెలుగు సొగసు వినిపించాడు. ఆ తర్వాత అతనే బతుకమ్మ అనే మాటను కూడా హిట్ సాంగ్‌లా మలిచాడు. రాజేంద్ర కుమార్, వహీదా రెహమాన్ నటించిన 'షత్రంజ్'లో మెహమూద్, హెలెన్ మీద చిత్రించిన పాట- బత్కమ్మ బత్కమ్మ బత్కమ్మ ఎక్కడ పోతవురా... ఎక్కడ పోతవురా... దీనిని పాడింది రఫీ, శారద. ఈ సినిమా తర్వాత ఎన్నో స్టేజ్ షోలలో మెహమూద్, శారదాలు కలిసి ఆ పాట పాడారు. మన తెలంగాణ మాటను శారద అలా తెలుగు తెలియని ఎందరో శ్రోతలకు వినిపించింది.


1966.

రాజేంద్ర కుమార్ 'సూరజ్' విడుదలైంది. ఇందులోనే మొదటిసారిగా శారద సినీ రంగప్రవేశం చేసింది. ఈ సినిమాలో వైజయంతీ మాల మీద తీసిన 'తిత్‌లీ ఉడీ ఉత్‌తి చలీ'... పాట పెద్ద హిట్. అదే సినిమాలో రఫీ పాడిన 'బహారో ఫూల్ బర్‌సావో' కూడా పెద్ద హిట్. రెండు పాటలూ ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ సింగర్‌కు నామినేట్ అయ్యాయి. ఆశ్చర్యం ఏమంటే రెండు పాటలకూ సమానమైన ఓట్లు వచ్చాయి. అప్పట్లో 'బెస్ట్ సింగర్' ట్రోఫీ మాత్రమే ఉండేది. గాయనికి వేరుగా, గాయకులకు వేరుగా ఉండేది కాదు. దాంతో నిర్వాహకులు రఫీకి బెస్ట్ సింగర్ ఇచ్చి శారదకు స్పెషల్ అవార్డు ఇచ్చారు. అంతే కాదు ఆ వచ్చే సంవత్సరం నుంచి ఫిమేల్ సింగర్‌కు ఒక అవార్డు, మేల్ సింగర్‌కు ఒక అవార్డు ప్రవేశపెట్టారు. అలా ఒక పెద్ద మార్పునకు శారద కారణమైంది.

శారద రాజన్ అయ్యంగార్ తమిళనాడులోని కుంభకోణంలో అయ్యంగార్‌ల కుటుంబంలో 1937లో పుట్టింది. తండ్రి ప్రభుత్వ ఉన్నతోద్యోగి. తాత సంస్కృత పండితుడు. బాల్యం నుంచి శారద పాడుతుంటే తల్లి ప్రోత్సహించింది. తండ్రికి ఉద్యోగరీత్యా టెహరాన్‌కు ట్రాన్స్‌ఫర్ అయితే శారద అక్కడి భారతీయ బృందాల్లో గాయనిగా గుర్తింపు పొందింది. 'జిస్ దేశ్ మే గంగా బెహతీ హై' ప్రమోషన్ కోసం టెహరాన్ వెళ్లిన రాజ్‌కపూర్ అక్కడి పార్టీలో శారద పాట విని 'బొంబాయి వచ్చేయి. మంచి సింగర్ అవుతావు' అని పిలిచి శంకర్-జైకిషన్‌లకు పరిచయం చేశాడు. వీరిలో శంకర్ కాలక్రమంలో శారదకు సన్నిహితం అయ్యాడు. శారద తన ఎక్కువ పాటలను శంకర్ కోసమే పాడింది. 1966 నుంచి 69 వరకు శారద ముంబైలో లతా, ఆశాలకు గట్టి పోటీ ఇచ్చింది. శంకర్ ప్రోత్సాహం వల్లే శారదకు పాటలు దక్కుతున్నాయి అని భావించిన లత 'ప్రేమ గుడ్డిదని విన్నాను. ఇప్పుడు చెవిటిది కూడా అని తెలుసుకున్నాను' అని జోక్ చేసింది. అంటే శారద గొంతు అట్టే బాగోలేదని ఆమె అభిప్రాయం. కాని శంకర్ మరణించే వరకూ శారద అతని కోసం పాడుతూనే ఉంది. తెలుగులో శంకర్ 'జీవిత చక్రం' సినిమాకు సంగీతం అందిస్తే అందులో ఎన్.టి.ఆర్, వాణిశ్రీల మీద డ్యూయెట్‌లకు ఘంటసాలతో కలిసి గొంతునిచ్చింది శారద.



శంకర్ జైకిషన్‌లతో శారద



మహమ్మద్ రఫీతో శారద

శారదకు తక్కువ కాలంలో మంచి పాటలే దొరికాయి. 'దునియాంకి సైర్ కర్‌లో' (అరౌండ్ ద వరల్డ్), 'చలే జానా జారా ఠెహరో' (అరౌండ్ ద వరల్డ్), 'జానె చమన్ షోల బదన్ పెహలూమే ఆజావో' (గుమ్‌నామ్)... అయితే ఆ తర్వాత హటాత్తుగా అందరూ ఆమెను ఇండస్ట్రీ దూరం పెట్టింది. ఇందుకు లతా ఒత్తిడి కారణం అంటారు. 'మేరా నామ్ జోకర్', 'కల్ ఆజ్ ఔర్ కల్' సినిమాల్లో పాటలు రికార్డు చేసిన రాజ్ కపూర్ ఆ తర్వాత వాటిని కేన్సిల్ చేయడంతో శారద బాగా హర్ట్ అయ్యింది. ఆ తర్వాత ఆమె మన దేశంలో తొలి పాప్ ఆల్బమ్ 'సిజ్లర్' (1971) విడుదల చేసింది. ఆ తర్వాత కొన్ని లోబడ్జెట్ సినిమాలకు సంగీత దర్శకత్వం వహించింది. ఎక్కువగా స్టేజ్ షోలతోనే శారద వార్తల్లో నిలిచింది. దక్షిణాది నుంచి హిందీకి వెళ్లి ఫిమేల్ సింగర్‌గా రాణించాలనుకుని విఫలమైన వారిలో వాణి జయరామ్‌లాగానే, శారద మరొకరు.

శారద కన్నుమూత

'గోల్డెన్ ఎరా ఆఫ్ ఇండియన్ సినిమా'గా చెప్పుకునే 1960లలో మహిళా గాయనిగా గుర్తింపు పొందిన శారద (86) బుధవారం ముంబైలో కన్ను మూశారు. ఆమె కేన్సర్‌తో పోరాడుతూ మరణించారని కుమార్తె సుధా మద్రైరా, కుమారుడు షమ్మీ రాజన్ సోషల్ మీడియా ద్వారా తెలియ చేశారు. మంచి గొంతుతోపాటు అందచందాలు ఉన్న శారదను తన పక్కన హీరోయిన్‌గా నటించమని షమ్మీ కపూర్ అడిగినా పాటల మీద ఉన్న ఆసక్తితో ఆమె నటించలేదు. వైష్ణవ నేపథ్యం ఉన్న కుటుంబానికి ఇష్టం లేకపోయినా వారితో పోట్లాడి ముంబైలో గాయనిగా స్థిరపడిందామె. 'కాంచ్ కి దీవార్' (1986) ఆమె చివరి సినిమా.

స్టీల్ బ్యాంక్



కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి అని కోరుకునే సాధారణ గృహిణి తులికా సునేజా. 'చుట్టూ ఉన్న వాతావరణం స్వచ్ఛంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది, అప్పుడే భవిష్యత్ తరాల మనుగడకు ఢోకా ఉండదన్న తాపత్రయం తనది. 'వాయు, ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుంది. వీలైనంత వరకు కాలుష్యాన్ని తగ్గిద్దాం' అని చెప్పేవారే కానీ ఆచరించేవారు అరుదు. అందుకే కాలుష్య స్థాయిల్లో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించడం లేదని భావించిన తులికా... పర్యావరణాన్ని కాపాడడానికి నడుం బిగించి 'క్రోకరీ బ్యాంక్' నడుపుతోంది. ఈ బ్యాంక్ ద్వారా డిస్పోజబుల్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి కృషిచేస్తోంది.

ఫరీదాబాద్‌కు చెందిన తులికా సునేజా ఓ రోజు పిల్లలతో బయటకు వెళ్లి ఇంటికి తిరిగొస్తున్నప్పుడు... రోడ్డుమీద కొంతమంది ఉచితంగా అన్నదానం చేస్తుండడం చూసింది. నిరుపేదల ఆకలి తీరుస్తున్నారు అని సంతోష పడేలోపు.. చుట్టుపక్కల చెల్లాచెదరుగా పడి ఉన్న ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులు, స్పూన్లు కనిపించాయి. తులికాతో ఉన్న తన పిల్లలు ''అమ్మా ఇలా ప్లాస్టిక్ పడేయడం పర్యావరణానికి మంచిది కాదు, దీనిని నియంత్రించడానికి పరిష్కారమే లేదా?'' అని తల్లిని ప్రశ్నించారు. అప్పుడు ఆ ప్రశ్నకు తులికా దగ్గర సమాధానం లేదు. కానీ డిస్పోజబుల్ ప్లాస్టిక్‌ను నియంత్రించే మార్గాలు ఏవైనా ఉన్నాయా అని రోజుల తరబడి ఆలోచించసాగింది.

కొన్నిరోజుల తర్వాత తన మదిలో మెదిలిన ఐడియానే 'క్రోకరీ బ్యాంక్'.

ఎవరికీ నమ్మకం కుదరలేదు..

తనకు వచ్చిన క్రోకరీ బ్యాంక్ ఐడియాను తన స్నేహితులతో చెప్పింది తులిక. ''బ్యాంక్ ఆలోచన బావుంది కానీ ఎవరు పాటిస్తారు. బ్యాంక్ ఏర్పాటు చేయడానికి చాలా స్థలం, డబ్బులు కావాలి'' అన్న వారే తప్ప సాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తన బ్యాంక్ ఆలోచన కార్యరూపం దాల్చడానికి తన భర్త సాయం తీసుకుంది. ఆయన వెన్నుతట్టి ప్రోత్సహించడంతో.. తాను దాచుకున్న డబ్బులతో స్టీల్‌వి.. యాభై టిఫిన్ ప్లేట్లు, యాభై స్పూన్లు, యాభై భోజనం చేసే ప్లేట్లు, యాభై గ్లాసులు కొనింది. ఇవన్నీ పదమూడు వేల రూపాయల్లోనే వచ్చేశాయి. ఈ స్టీల్ సామాన్లతో 2018లో తనింట్లోనే 'క్రోకరీ బ్యాంక్'ను ఏర్పాటు చేసింది.

ఈ బ్యాంక్ గురించి తెలిసిన కొంత మంది తమ ఇళ్లల్లో జరిగే చిన్న చిన్న ఫంక్షన్లకు ఈ సామాన్లు తీసుకెళ్లేవారు. ఈ విషయం ఆనోటా ఈ నోటా సోషల్ మీడియాకు చేరడంతో చాలా మంది ఫంక్షన్లకు ఈ ఇక్కడి నుంచే సామాన్లను తీసుకెళ్లడం మొదలు పెట్టారు. కొంతమంది పర్యావరణవేత్తలు సైతం తులికాకు మద్దతు ఇవ్వడంతో క్రోకరీ బ్యాంక్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. చిన్నాపెద్దా పుట్టినరోజు వేడుకలు, కిట్టీపార్టీలు, కొన్ని ఆర్గనైజేషన్‌లలో జరిగే చిన్నపాటి ఈవెంట్‌లకు సైతం ప్లాస్టిక్ వాడకుండా ఈ బ్యాంక్ నుంచే సామాన్లు తీసుకెళ్తున్నారు. తులికాను చూసి ఫరీదాబాద్‌లో పదికి పైగా స్టీల్ క్రోకరీ బ్యాంక్‌లు ఏర్పాటయ్యాయి.



> నేను చాలా చిన్నమొత్తంతో క్రోకరీ బ్యాంక్‌ను ఏర్పాటు చేశాను. ఎవరైనా ఇలాంటి బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం పెద్ద కష్టం కాదు. నాలా మరి కొంతమంది పూనుకుంటే ప్లాస్టిక్ కాలుష్యం తగ్గుముఖం పడుతుంది. దీని ద్వారా 2018నుంచి ఇప్పటిదాకా ఐదులక్షల డిస్పోజబుల్ ప్లాస్టిక్‌ను నియంత్రించగలిగాను. భవిష్యత్‌లో మరింత పెద్ద సంస్థను ఏర్పాటు చేసి భారీస్థాయిలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రిస్తాను.
>
> – తులికా

• కళ

బొమ్మలు చెప్పే పాఠాలు

మన జానపద కథల్లో బొమ్మలు ఎన్నో కథలు చెబుతాయి. బెంగళూరుకు చెందిన డెబ్బై రెండు సంవత్సరాల లతా శఠగోపన్ తయారు చేస్తున్న బొమ్మలు కథలు చెప్పడంతో పాటు పాఠాలు కూడా చెబుతాయి. పర్యావరణ సంక్షోభం నుంచి రాకెట్ సైన్స్ వరకు తాను తయారు చేసిన బొమ్మల ద్వారా ఎన్నో విలువైన విషయాలు చెబుతుంది స్టోరీ టెల్లర్, ఫ్రీలాన్స్ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ లతా శఠగోపన్...

లతమ్మను చూడగానే పిల్లలు పరుగెత్తుకు వస్తారు. ఆమె చుట్టూ కూర్చుంటారు.







పాఠాలు చెప్పడానికి బొమ్మలు తయారుచేస్తున్న లతా శఠగోపన్

పిల్లల పుస్తకాల నుంచి ఒక టాపిక్‌ను తీసుకొని దానికి సంబంధించిన బొమ్మలు అక్కడికక్కడే తయారు చేస్తుంది. ఆ బొమ్మలతో వారికి సులభంగా అర్థమయ్యేలా పాఠం చెబుతుంది. ఆ పాఠాన్ని బొమ్మలాటలా మలుస్తుంది. అందులో పిల్లలను కూడా భాగస్వాములను చేస్తుంది.

జంతు సంక్షేమానికి సంబంధించి పాఠం చెప్పాల్సి వస్తే కాగితాలతో రకరకాల బొమ్మలు తయారుచేస్తూ వాటి గురించి ఆకట్టుకునేలా, సరదాగా చెబుతుంది. పాటలు కూడా ఉంటాయి. 'హెల్త్ సైన్స్' సబ్జెక్ట్ కోసం క్లాత్ పప్పెట్స్ తయారుచేస్తుంది. స్క్రిప్ట్ రాసుకోవడంలో భాగంగా వైద్యుల సలహాలు కూడా తీసుకుంటుంది.

కామెర్ల నుంచి కలరా వరకు ఎన్నో అంశాల గురించి పిల్లలకు లోతుగా అర్థమయ్యేలా చెబుతుంది.

స్పేస్ సైన్స్‌లో భాగంగా 'రాకెట్ లాంచ్' కోసం లతమ్మ ప్రదర్శించే బొమ్మలాట అంటే పిల్లలకు ఎంతో ఇష్టం.

'బొమ్మలాట'తో పాఠాలు చెప్పడంతో పాటు పిల్లలను 'విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నొలాజికల్ మ్యూజియం'కు తీసుకువెళ్లి మరింత అవగాహన చేయిస్తుంది.

'ఇలాంటి ప్రయోగాల వల్ల పిల్లలు సులభంగా పాఠాలు నేర్చుకోవడానికి వీలవుతుంది. గ్రామీణప్రాంతాలలోని పిల్లలకు వేస్ట్ మేనేజ్‌మెంట్ గురించి బొమ్మలను ఉపయోగిస్తూ సరదాగా చెప్పాను. ఉపన్యాస ధోరణిలో చెబితే ఎలా ఉండేదో తెలియదుగానీ బొమ్మల ద్వారా చెప్పడం వారికి సరదాగా అనిపించింది. నెల రోజులు తరువాత వెళితే నేను చెప్పిన ప్రతి మాటను నాకే చెప్పి ఆశ్చర్యపరిచారు' అంటుంది లతమ్మ.



• లతా శఠగోపన్

టీచర్‌గా పనిచేస్తున్న రోజుల్లో బొమ్మల తయారీ ప్రారంభించింది.

'ఈ బొమ్మలతోనే పాఠాలు చెబితే ఎలా ఉంటుంది' అనే ఆలోచన ఆమెను మరింత ముందుకు తీసుకువెళ్లింది.

మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న బొమ్మల ప్రయాణంలో లతా శఠగోపన్ ఎన్నో అనుభవాలను మూటగట్టుకుంది. దేశ విదేశాల్లో గుర్తింపు పొందింది. విద్యార్థులే కాదు ఉపాధ్యాయుల కోసం కూడా బొమ్మల తయారీలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది.

బొమ్మల్లో ఎన్నో రకాలు ఉన్నాయి.

'గ్లోవ్ పప్పెట్స్' లతమ్మ ప్రత్యేకత. దీనివల్ల బొమ్మలు ఆడించే వారికి సౌకర్యవంతంగా ఉంటుంది.

'అప్పుడు అలా తయారు చేశాను' అంటూ అదే ఫార్ములాను అనుసరించడం కాకుండా ఎప్పటికప్పుడూ బొమ్మల తయారీలో, చెప్పే విధానంలో కొత్తదనం కోసం ప్రయత్నిస్తుంది. ఎంతో పరిశోధన చేస్తుంది.

సోషల్ మీడియా ద్వారా తన కళ మరింత విస్తృతంగా పిల్లలకు చేరువయ్యేలా చేస్తోంది.

> బొమ్మలు నా జీవితానికి ఒక అర్థాన్ని ఇచ్చాయి. నా ఇష్టాన్ని ఇతరులతో పంచుకునేలా చేశాయి. పిల్లలకు బొమ్మలు చూపెట్టగానే సరిపోదు. మనం చెప్పే మాటలు బొమ్మలు చెబుతున్నట్లుగా ఉండాలి. రకరకాల భావోద్వేగాలు వినిపించాలి. దీనికి కొంత సాధన అవసరం. రికార్డింగ్ వాయిస్ ఉపయోగిస్తే యాంత్రికంగా ఉంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే మ్యూజిక్ విషయంలో మాత్రం లైవ్ ఆర్కెస్ట్రాను ఉపయోగిస్తే బాగుంటుంది. బొమ్మలు అంటే బొమ్మలు మాత్రమే కాదు. కొన్నిసార్లు అవి మనుమలు చేయలేని పనులు కూడా చేస్తాయి.
>
> – లతా శఠగోపన్

సైబర్ టాక్

రేటింగ్ మోసం

సినిమాలు రిలీజ్ అవుతూనే సమీక్షలు, రేటింగ్స్ సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా వస్తుంటాయి. ఆ రేటింగ్స్‌ను బట్టి జనం సినిమాలకు వెళుతుంటారు. అయితే, సమీక్షలు లేదా రేటింగ్‌లు తారుమారు చేసే మోసపూరిత పద్ధతి మొదలైంది ఇప్పుడు.

సినిమాలను ప్రచారం చేయడం, ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయడం, భిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చడం ఏమీ నేరం కాదు. కానీ, మోసపూరిత కార్యకలాపాల ద్వారా కృత్రిమంగా రేటింగ్‌లు పెంచడం లేదా తగ్గించడం వల్ల వీక్షకులను తప్పుదారి పట్టించవచ్చు. వార్నర్ బ్రదర్స్, మార్వెల్ స్టూడియోస్ మొదలైన ప్రముఖ సంస్థల వలె స్కామర్లు నటించడానికి కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటారు. ఉదాహరణకు http://www.alamorate.com, https://www.alamotop.com , https://alamo-top.com, https://www.alamozone.com .. వంటి వెబ్‌సైట్‌లలో రేటింగ్ స్కామర్ల గురించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో తమ అకౌంట్లను క్లోజ్ చేస్తారు. తిరిగి గంటలోపు కొత్త వాటిని సృష్టిస్తారు. మోసగాళ్లు సులువుగా డబ్బు సంపాదించడానికి ఇదో మార్గంగా ఎంచుకుంటున్నారు.



కొన్ని సాధారణ పద్ధతులు

- వ్యక్తులు లేదా గ్రూప్స్ అభిప్రాయంతో సంబంధం లేకుండా సానుకూల లేదా ప్రతికూల సమీక్షలు రాయడానికి నగదు చెల్లిస్తుంటాయి. ఇది కృత్రిమంగా విస్తృతమైన ప్రజల మద్దతు లేదా విమర్శలను సృష్టించగలదు.
- సినిమా వెబ్‌సైట్‌లు లేదా ప్లాట్‌ఫారమ్‌లలో రేటింగ్‌లు, రివ్యూలను మార్చేందుకు మోసగాళ్లు వివిధ పద్ధతులను ఉపయోగిస్తారు. వారు సానుకూల లేదా ప్రతికూల సమీక్షలను సమర్పించడానికి నకిలీ ఖాతాలను ఉపయోగించుకుంటారు. మొత్తం రేటింగ్‌ను కృత్రిమంగా పెంచడం లేదా తగ్గించడం చేస్తారు.
- మోసగాళ్లు ఇతర వ్యక్తులు లేదా సమూహాలతో సానుకూల సమీక్షలను మార్పిడి చేసుకునే పరస్పర ఏర్పాట్లలో పాల్గొంటారు. ఇది అనుమానం రాకుండా సానుకూల రేటింగ్‌ను కొనసాగించడంలో సహాయపడుతుంది.
- అసలైనదిగా కనిపించే సమీక్షలను పోస్ట్ చేయడానికి నకిలీ వినియోగదారు ఖాతాలు సృష్టిస్తారు. దీనివల్ల వీక్షకులలో విస్తృత ఏకాభిప్రాయం, భ్రమను సృష్టించడమే ఉద్దేశ్యం.
- ఒక ఉద్దేశంతో తరచుగా నడపబడే అనేక ప్రతికూల సమీక్షలతో సినిమా రేటింగ్ పేజీని నింపడానికి ప్రయత్నం చేస్తారు.

సంపాదనే ధ్యేయం

- **1వ దశ:** బాధితులకు వాట్సప్, సోషల్ మీడియా మెసెంజర్‌లలో మెసేజ్ వస్తుంది 'మీరు హాయిగా మీ ఇంట్లో కూర్చొని సంపాదించవచ్చు. మీరు చేయాల్సిందల్లా సినిమాలకు రేటింగ్‌లు ఇవ్వడమే. ఇందుకు గాను రూ. 2,500 నుంచి 5,000 మధ్య రోజువారీ సంపాదన' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది.
- **2వ దశ:** బాధితులను టెలిగ్రామ్ సమూహంలో చేరాలని, నకిలీ వెబ్‌సైట్‌లోకి సైన్ ఇన్ అవమని సలహా ఇస్తారు. డబ్బు సంపాదించడానికి రివ్యూలు రాయడం ప్రారంభించండి' అని కోరుతారు.
- **3వ దశ :** రేటింగ్ ఇచ్చే ముందు కమిషన్ లేదా బోనస్ పొందడానికి సినిమాను చూడమని చెబుతారు. ఒక సినిమా రేటింగ్ కోసం రూ. 2,500 నుండి రూ. 5,000 వరకు కమీషన్ ఉంటుంది, నగదు మీ బ్యాంక్ ఖాతాలలో జమ చేయబడుతుంది. హిందీ, ఇంగ్లిష్, భారతీయ సినిమాలకు కమీషన్ మారుతూ ఉంటుంది' అని చెబుతారు.
- **4వ దశ:** ఎలాంటి డబ్బు చెల్లింపు లేకుండా బోనస్ ఇచ్చి, బాధితులను బాగా ఆకట్టుకుంటారు. టెలిగ్రామ్ గ్రూప్‌లో చాలా మంది సభ్యులు ఉంటారు కాబట్టి, డబ్బు పెట్టుబడి పెట్టి 2 నుండి 5 సార్లు చెల్లింపుల ద్వారా భారీ మొత్తంలో సంపాదించినట్లు మెసేజ్‌లు పోస్ట్ చేస్తూనే ఉంటారు.
- **దశ 5:** బాధితులు 2,5000 నుండి లక్ష రూపాయల వరకు చెల్లించడం ప్రారంభిస్తారు. సినిమాలు చూడటం, సమీక్షలు రాయడం మొదలుపెడతారు. వారి కమీషన్ వాలెట్‌లో కనిపిస్తుంది కానీ, దానిని తీసుకోలేరు.
- **6వ దశ:** బాధితులు వాలెట్‌లో కనిపించే డబ్బుకు సమాన మొత్తంలో పెట్టుబడి పెట్టాలని, ఇతర సమీక్షలను చూడటం, రాయడం ఎలా చేయచ్చో సలహా ఇస్తారు. దీని కోసం బాధితుడు వాలెట్‌లో డబ్బును పెట్టుబడిగా పెడతాడు.
- దశ 7 : బాధితులు తమ వాలెట్ల నుండి నగదు మొత్తాలను తీసుకోవచ్చని భావించి పెట్టుబడులు పెడుతూనే ఉంటారు. కొంత మొత్తాన్ని పన్నుగా చెల్లిస్తే, బాధితుల ఖాతాలో డబ్బు జమ అవుతుందని స్కామర్లు వాగ్దానాలు కూడా చేస్తారు.
- **8వ దశ:** కొన్ని చెల్లింపు పనుల తర్వాత, బాధితులు అది మోసమని గ్రహించి సహాయం కోసం సైబర్ పోలీసులను సంప్రదిస్తారు. ఎందుకంటే డబ్బు వాలెట్‌లో మాత్రమే కనిపిస్తుంది కానీ వారు దానిని విత్‌డ్రా చేయలేరు.

కొన్ని భద్రతా చిట్కాలు

త్వరగా డబ్బు సంపాదించాలనే జనం ఆశను స్కామర్లు దోపిడీ చేస్తారు. ఈ మోసాల బారిన పడకుండా ఉండటానికి, కొన్ని ముఖ్యమైన అంశాలు..

- వాట్సప్, టెలిగ్రామ్ లేదా సోషల్ మీడియా మెసెంజర్‌ల వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సులభంగా డబ్బు లేదా అధిక సంపాదనలను వాగ్దానం చేసే మెసేజ్‌లు లేదా ఆఫర్‌లకు ఎప్పుడూ సభ్యత్వాన్ని పొందవద్దు.
- ఏదైనా వెబ్‌సైట్ లేదా ప్లాట్‌ఫారమ్‌లో సైన్ అప్ చేయడానికి ముందు, అది విశ్వసనీయమైనదని నిర్ధారించుకోవాలి. అధికారిక వెబ్‌సైట్‌ల కోసం తనిఖీ చేయాలి. వారి ఆధారాలను, సంప్రదింపు సమాచారాన్ని నిజమో కాదో నిర్ధారించుకోవాలి.
- వివిధ రకాలుగా డబ్బు సంపాదించడం గురించి మాట్లాడే ఏ అవకాశానికైనా ముందస్తు రుసుము చెల్లించవద్దు.
- బ్యాంకు ఖాతా వివరాలు, క్రెడిట్ కార్డ్ నంబర్లు లేదా గుర్తింపు పత్రాలు వంటి సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులకు లేదా సురక్షితం కాని వెబ్‌సైట్‌లకు ఎప్పుడూ అందించవద్దు.
- సినిమా సమీక్షలు లేదా రేటింగ్‌లను పరిగణనలోకి తీసుకున్నప్పుడు వాటి మూలాలపై దృష్టి పెట్టండి. తెలియని లేదా అనుమానాస్పద ప్లాట్‌ఫారమ్‌లో యూజర్ రూపొందించిన సమీక్షలపై మాత్రమే ఆధారపడవద్దు.
- మీరు సినిమా సమీక్ష/రేటింగ్ మోసాన్ని అనుమానించినట్లయితే, హెల్ప్‌లైన్ 1930కి కాల్ చేయండి, ప్రత్యామ్నాయంగా httpr://cybercrime. gov.in/లో రిపోర్ట్ చేయండి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



నజ్ముల్ సెంచరీ: బంగ్లాదేశ్ 362/5

అఫ్గానిస్తాన్ జట్టుతో బుధవారం మొదలైన ఏకైక టెస్టులో తొలి రోజు బంగ్లాదేశ్ భారీ స్కోరు సాధించింది. మిర్పూర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 79 ఓవర్లలో 5 వికెట్లకు 362 పరుగులు చేసింది. నజ్ముల్ హుస్సేన్ షాంతో (175 బంతుల్లో 146; 23 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కాడు. మహమూదుల్ హసన్ జాయ్ (76; 9 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. ముష్ఫికర్ రహీమ్ (41 బ్యాటింగ్; 3 ఫోర్లు), మిరాజ్ (43 బ్యాటింగ్; 7 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.

క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ



రోత్స్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో రెండో సీడ్ సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. నాటింగ్‌హామ్ లో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ జోడీ 6-7 (6/8), 6-1, 10-5తో ల్యూక్ సావిల్లె (ఆస్ట్రేలియా)-యు సియు సు (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. ఇదే టోర్నీలో ఆడుతున్న అనిరుధ్ చంద్రశేఖర్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది.

39 ఏళ్ల తర్వాత...

- టాప్-3లో ఒకే దేశానికి చెందిన ముగ్గురు క్రికెటర్లు
- ఆసీస్ క్రికెటర్లు లబుషేన్, స్మిత్, హెడ్ ఘనత
- ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్



హెడ్, లబుషేన్, స్మిత్

దుబాయ్: భారత జట్టుతో జరిగిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో సెంచరీలతో రాణించి ఆస్ట్రేలియా విజయంలో కీలకపాత్ర పోషించిన స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ పురోగతి సాధించారు. బుధవారం విడుదల చేసిన టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో స్మిత్ (885 రేటింగ్ పాయింట్లు) ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌కు చేరుకోగా... ట్రావిస్ హెడ్ (884 రేటింగ్ పాయింట్లు) మూడు స్థానాల పురోగతి సాధించి ఆరు నుంచి మూడో స్థానానికి చేరుకున్నాడు. టాప్ ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియాకే చెందిన లబుషేన్ (903 రేటింగ్ పాయింట్లు) తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ఫలితంగా 39 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత... ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఒకే దేశానికి చెందిన ముగ్గురు క్రికెటర్లు వరుసగా తొలి, రెండు, మూడు స్థానాలను ఆక్రమించారు. చివరిసారి 1984లో వెస్టిండీస్ క్రికెటర్లు గార్డన్ గ్రీనిడ్జ్, క్లయివ్ లాయిడ్, లారీ గోమ్స్ వరుసగా తొలి మూడు ర్యాంకుల్లో నిలిచారు. గత డిసెంబర్‌లో కారు ప్రమాదానికి గురై కోలుకుంటున్న భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ పదో ర్యాంక్‌లో, కోహ్లి 12వ ర్యాంక్‌లో, రోహిత్ శర్మ 13వ ర్యాంక్‌ల్లోనే కొనసాగుతున్నారు. ఆస్ట్రేలియాతో డబ్ల్యూటీసీ ఫైనల్లో అర్ధ సెంచరీలు చేసిన అజింక్య రహానే 37వ ర్యాంక్‌కు చేరుకోగా... శార్దుల్ ఠాకూర్ ఆరు స్థానాలు మెరుగుపర్చుకొని 94వ స్థానంలో నిలిచాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆడే అవకాశం రాకపోయినా భారత మేటి స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా రెండు స్థానాలు పడిపోయి ఎనిమిదో స్థానానికి చేరుకోగా, రవీంద్ర జడేజా తొమ్మిదో ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు.

సౌత్ జోన్ కెప్టెన్‌గా విహారి



చెన్నై: దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్ జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. భారత టెస్టు జట్టు వికెట్ కీపర్, ఆంధ్ర జట్టుకే చెందిన కోన శ్రీకర్ భరత్, పేసర్ కేవీ శశికాంత్, బ్యాటర్ రికీ భుయ్ కూడా సౌత్ జోన్ జట్టులో ఉన్నారు. హైదరాబాద్ నుంచి యువస్టార్ ఠాకూర్ తిలక్ వర్మ మాత్రమే ఈ జట్టులో స్థానం దక్కింది. మయాంక్ అగర్వాల్ (కర్ణాటక) వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సాయి సుదర్శన్, సాయి కిశోర్, వాషింగ్టన్ సుందర్, ప్రదోశ్ రంజన్ పాల్ (తమిళనాడు), సమర్థ్, వైశాఖ్, విద్వత్ కావేరప్ప (కర్ణాటక), సచిన్ బేబీ (కేరళ), దర్శన్ మిసాల్ (గోవా) జట్టులోని ఇతర సభ్యులు. ఆరు జోన్ జట్ల మధ్య ఈనెల 28 నుంచి జూలై 16 వరకు బెంగళూరులో దులీప్ ట్రోఫీ టోర్నీ జరగనుంది.

సెమీస్‌లో భారత్



చెన్నై: ప్రపంచకప్ స్క్వాష్ టీమ్ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన పూల్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-0తో దక్షిణాఫ్రికా జట్టును ఓడించింది. తొలి మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 7-4, 7-2, 3-7, 7-2తో హేలీ వార్డ్‌పై... రెండో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 7-6, 7-4, 7-1తో డెవల్డ్ నీకెర్క్‌పై గెలిచారు. మూడో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 7-4, 7-3, 3-7, 7-1తో లిజెల్ ముల్లర్‌ను ఓడించడంతో భారత విజయం ఖరారైంది. చివరిదైన నాలుగో మ్యాచ్‌లో అభయ్ సింగ్ 7-4, 3-7, 7-6, 7-5తో జీన్ పియరీ బ్రిట్స్‌పై నెగ్గడంతో భారత్ విజయం పరిపూర్ణమైంది. నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు పూల్ 'బి' టాపర్‌గా నిలుస్తుంది.

శ్రీకాంత్ ముందుకు...



- ప్రపంచ 13వ ర్యాంకర్‌పై విజయం
- లక్ష్య సేన్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో బుధవారం పురుషుల సింగిల్స్ విభాగంలో బరిలోకి దిగిన ముగ్గురు భారత క్రీడాకారులు ముందంజ వేశారు. కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్ తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న క్రీడాకారులను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు. ప్రియాన్షు రజావత్‌కు ప్రపంచ మూడో ర్యాంకర్ కున్లావుత్ వితిడ్‌సర్న్ (థాయ్‌లాండ్) నుంచి వాకోవర్ లభించడంతో అతను కోర్టులో అడుగుపెట్టకుండానే ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. ప్రపంచ 13వ ర్యాంకర్ గ్వాంగ్ జు లూ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 22వ ర్యాంకర్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ శ్రీకాంత్ 21-13, 21-19తో గెలుపొందాడు. 46 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో శ్రీకాంత్ 4-0తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ తొలి గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్‌కు ప్రతిఘటన ఎదురైంది. అయితే స్కోరు 19-19 వద్ద శ్రీకాంత్ వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు గ్వాంజ్ జు లూపై వరుసగా ఐదో విజయాన్ని సాధించాడు. ప్రపంచ 11వ ర్యాంకర్, ఆసియా చాంపియన్ లీ జి జియా (మలేసియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-17, 21-13తో గెలిచాడు. 33 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌లో స్కోరు 17-17 వద్ద వరుసగా నాలుగు పాయింట్లు గెలిచాడు. రెండో గేమ్‌లో స్కోరు 5-3 వద్ద లక్ష్య సేన్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఏడు పాయింట్లు నెగ్గి 12-3తో ఆధిక్యంలోకి వెళ్లి వెనుదిరిగి చూడలేదు. మరోవైపు మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణి ఆకర్షి కశ్యప్‌నకు నిరాశ ఎదురైంది. ప్రపంచ 43వ ర్యాంకర్ ఆకర్షి తొలి రౌండ్‌లో 10-21, 4-21తో ప్రపంచ రెండో ర్యాంకర్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో లక్ష్య సేన్‌తో శ్రీకాంత్; ఎన్జీ కా లాంగ్ అంగుస్ (వియత్నాం)తో ప్రణయ్; ఆంథోనీ సినిసుక జిన్‌టింగ్ (ఇండోనేసియా)తో ప్రియాన్షు రజావత్; తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో పీవీ సింధు తలపడతారు.

వింబుల్డన్ ప్రైజ్‌మనీ పెంపు

సింగిల్స్ విజేతల ఖాతాలో రూ. 24 కోట్ల 43 లక్షలు

లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ చాంపియన్‌షిప్-2023 ప్రైజ్‌మనీ వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. జూలై 3 నుంచి 16 వరకు జరిగే ఈ టోర్నీలో ఈసారి పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 24 కోట్ల 43 లక్షలు) చొప్పున లభిస్తాయి. గత ఏడాది సింగిల్స్ విజేతలకు 20 లక్షల పౌండ్లు చొప్పున అందజేశారు. ఈసారి 3 లక్షల 50 వేల పౌండ్లు ఎక్కువగా ఇవ్వనున్నారు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ఓడిన క్రీడాకారులకు 55 వేల పౌండ్లు (రూ. 57 లక్షల 18 వేలు) దక్కుతాయి. క్వాలిఫయింగ్‌లో తొలి రౌండ్‌లో ఓడితే 12 వేల 750 పౌండ్లు (రూ. 13 లక్షల 25 వేలు), రెండో రౌండ్‌లో ఓడితే 21 వేల 750 పౌండ్లు (రూ. 22 లక్షల 61 వేలు), మూడో రౌండ్‌లో ఓడితే 36 వేల పౌండ్లు (రూ. 37 లక్షల 42 వేలు) లభిస్తాయి. పురుషుల సింగిల్స్‌లో జొకోవిచ్ (సెర్బియా), మహిళల సింగిల్స్‌లో రిబాకినా (కజకిస్తాన్) డిఫెండింగ్ చాంపియన్స్‌గా బరిలోకి దిగనున్నారు.

జ్యోతి సురేఖ బృందానికి కాంస్యం

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీ


పర్ణీత్ కౌర్, జ్యోతి సురేఖ, అదితి స్వామి

మెడెలిన్ (కొలంబియా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నమెంట్‌లో మహిళల, పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత జట్లు కాంస్య పతకాలు సాధించాయి. బుధవారం జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు 'షూట్ ఆఫ్'లో మెక్సికో జట్టును ఓడించింది. నిర్ణీత నాలుగు రౌండ్ల తర్వాత రెండు జట్లు 232-232 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించడానికి 'షూట్ ఆఫ్' నిర్వహించారు. 'షూట్ ఆఫ్'లోనూ రెండు జట్లు 29-29తో సమంగా నిలిచాయి. అయితే భారత జట్టు కొట్టిన మూడు షాట్‌లలో ఒకటి 'బుల్స్ ఐ' షాట్ ఉండటంతో కాంస్య పతకం ఖరారైంది. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత జట్టు 2119 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. నాకౌట్ దశలో తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత్ క్వార్టర్ ఫైనల్లో 230-223తో ఎల్ సాల్వడార్ జట్టును ఓడించింది. అమెరికాతో జరిగిన సెమీఫైనల్లో స్కోరు 232-232తో స్కోరు సమమయ్యాక 'షూట్ ఆఫ్'లో భారత జట్టు 28-29తో ఓడిపోయింది. క్వాలిఫయింగ్ వ్యక్తిగత రౌండ్‌లో 16 ఏళ్ల అదితి 711 పాయింట్లు స్కోరు చేసి టాపర్‌గా నిలిచింది. ఈ క్రమంలో అండర్-18 విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది.

మరో కాంస్యం...

మరోవైపు అభిషేక్ వర్మ, ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టుకు కూడా కాంస్య పతకం లభించింది. కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ 236-228తో కొలంబియా జట్టుపై గెలిచింది. అంతకుముందు భారత్ తొలి రౌండ్‌లో 237-228తో చిలీపై, క్వార్టర్ ఫైనల్లో 237-223తో స్లొవేనియాపై గెలిచింది. అయితే మెక్సికోతో జరిగిన సెమీఫైనల్లో 237-237తో స్కోర్లు సమమయ్యాక... 'షూట్ ఆఫ్'లో భారత్ 27-29తో ఓడిపోయింది.

ఇంట్లో ఇంగ్లండ్‌తో... బయట ఆస్ట్రేలియాతో!

కొత్త డబ్ల్యూటీసీలో భారత సిరీస్‌లు



న్యూఢిల్లీ: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో వరుసగా రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు కోసం 2023-25 డబ్ల్యూటీసీ సిద్ధంగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిబంధనల ప్రకారం రెండేళ్ల వ్యవధిలో భారత్ 6 టెస్టు సిరీస్‌లు ఆడనుంది. ఇందులో 3 స్వదేశంలో, 3 విదేశాల్లో ఉంటాయి. వచ్చే నెలలో జరిగే వెస్టిండీస్ పర్యటనతో భారత్ ఈ పోరును మొదలు పెడుతుంది. ఆ తర్వాత ఈ ఏడాది చివర్లో టీమిండియా దక్షిణాఫ్రికాలో పర్యటిస్తుంది. అనంతరం సొంత గడ్డపై వరుసగా 3 సిరీస్‌లు ఆడుతుంది. ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీస్‌లో, బంగ్లాదేశ్‌తో, ఆ తర్వాత న్యూజిలాండ్‌తో 3 టెస్టుల సిరీస్‌లో తలపడుతుంది. చివరగా ఐదు టెస్టుల బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ఆడేందుకు ఆస్ట్రేలియాకు వెళుతుంది. ఈ సిరీస్‌లలో ప్రదర్శన ఆధారంగా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత్ అర్హత సాధిస్తుందా లేదా అనేది ఆసక్తికరం.

రెండేళ్లు, నాలుగేళ్ల ముందుగా...

2025 జూన్‌లో భారత జట్టు ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ తలపడుతుంది. దీనికి సంబంధించిన వేదికలను ఈసీబీ అప్పుడే ప్రకటించడం విశేషం. లార్డ్స్, ఓవల్, ఎడ్జ్‌బాస్టన్, హెడింగ్లీ, ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానాల్లో ఇరు జట్లు ఐదు టెస్టులు ఆడతాయి. 2029లో కూడా భారత జట్టు ఇంగ్లండ్ పర్యటిస్తుంది.

సినిమా

కాంబినేషన్ కుదిరింది



● మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి

హీరో విజయ్ దేవరకొండ – డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో వచ్చిన 'గీత గోవిందం' (2018) సినిమా సెన్సేషనల్ హిట్ అయిన విషయం తెలిసిందే. ఈ కాంబినేషన్‌లో రెండో సినిమా బుధవారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. 'దిల్' రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం జరిగింది. ఆ వార్త నిజమే. విజయ్-మృణాల్ కాంబో కుదిరింది. ఈ చిత్రం తొలి సీన్‌కి ఫైనాన్షియర్ సత్తి రంగయ్య కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, గోవర్ధన్ రావు దేవరకొండ గౌరవ దర్శకత్వం వహించారు. ''రెగ్యులర్ షూటింగ్ త్వరలో మొదలవుతుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీ సుందర్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసు వర్మ.


లుక్స్ అదుర్స్


● 'గుంటూరు కారం'లో శ్రీలీల


● 'ఆదికేశవ'లో....

'పెళ్లిసందడి' (2021) సినిమాతో తెలుగు పరిశ్రమకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు కన్నడ బ్యూటీ శ్రీలీల. ప్రస్తుతం తెలుగులో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న ఆమె బర్త్ డే జూన్ 14. ఈ సందర్భంగా శ్రీలీలకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ, ఆమె నటిస్తున్న పలు చిత్రాల్లోని లుక్స్‌ని విడుదల చేశారు మేకర్స్. ట్రెడిషనల్‌గా, మోడ్రన్‌గా అదిరే లుక్స్‌తో శ్రీలీల స్పెషల్ ట్రీట్ ఇచ్చారు. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'గుంటూరు కారం'లో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు శ్రీలీల. ఈ సినిమా నుంచి లంగా ఓణీలో కాలికి నెయిల్ పాలిష్ వేసుకుంటున్న ఆమె లుక్‌ని రిలీజ్ చేశారు. అలాగే బోయపాటి దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో రామ్‌కి జోడీగా నటిస్తున్నారీ బ్యూటీ. ఈ మూవీ నుంచి మోడ్రన్ డ్రెస్‌లో ఉన్న శ్రీలీల లుక్ రిలీజైంది. అదే విధంగా వైష్ణవ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'ఆదికేశవ'లో కథానాయికగా నటిస్తున్నారు శ్రీలీల. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నుంచి ఓ గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్‌లో పసుపు రంగు చీరలో మెరిశారు శ్రీలీల. ఇంకా నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలోని లుక్ రిలీజైంది.

పదునైన కళ్లు


● దిశా పటాని

హీరో ప్రభాస్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా ఫిల్మ్ 'ప్రాజెక్ట్ కె'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌కి జోడీగా దీపికా పదుకోన్ నటిస్తున్నారు. వైజయంతీ మూవీస్‌పై అశ్వినీ దత్ నిర్మిస్తున్న ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, దిశా పటాని కీలక పాత్రలు చేస్తున్నారు. కాగా మంగళవారం (జూన్ 13) దిశా పటాని పుట్టినరోజు. ఈ సందర్భంగా పదునైన కళ్లతో ఆమె ప్రీ లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ''ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్‌గా 'ప్రాజెక్ట్ కె' రూపొందుతోంది. వైజయంతీ మూవీస్ ఈ గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. 2024న సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమాని విడుదల చేస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

మహిళల నేపథ్యంలో...


● విశ్వ కార్తికేయ, ఆయుషీ పటేల్

విశ్వ కార్తికేయ, ఆయుషీ పటేల్ జంటగా దర్శకుడు రమాకాంత్ రెడ్డి ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. కె. చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వర రెడ్డి, కాటం రమేష్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత కేఎస్ రామారావు క్లాప్ కొట్టారు. డైరెక్టర్ నీలకంఠ గౌరవ దర్శకత్వం వహించగా, నటుడు సుమన్ స్క్రిప్ట్‌ని అందించారు. ''స్త్రీలకు తల్లవ్వడం అనేది అదృష్టం. ఆ లక్‌ని సరిగ్గా వినియోగించుకోకపోతే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది కథ'' అన్నారు. ''జూలైలో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు చంద్ర ఓబుల్ రెడ్డి, రమేష్. ఈ చిత్రానికి కెమెరా: చరణ్ మాధవనేని, సంగీతం: అజయ్ అరసాడ.

ఎనిమిదేళ్ల తర్వాత అవతార్ 5





- వాయిదా పడ్డ 'అవతార్' సీక్వెల్స్.. మార్వెల్ చిత్రాలు

ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లిన హాలీవుడ్ 'అవతార్', సూపర్ హీరోని చూపించిన మార్వెల్ చిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. అందుకే ఇటు 'అవతార్' సీక్వెల్స్ అటు 'మార్వెల్' ఫ్రాంచైజీల కోసం ఫ్యాన్స్ ఎదురు చూస్తుంటారు. ఈ రెండు భారీ ప్రాజెక్ట్స్‌ని హాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ రాజీపడకుండా నిర్మిస్తుంటుంది. దర్శకుడు జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' తొలి భాగం 2009లో రాగా, రెండో భాగం రావడానికి పదమూడేళ్లు పట్టింది. గత ఏడాది 'అవతార్ 2' విడుదలైంది. మూడు, నాలుగు, ఐదో భాగం కూడా ఉంటాయని చిత్ర యూనిట్ ప్రకటించి, విడుదల తేదీలను కూడా ప్రకటించింది. అయితే తేదీలు వాయిదా పడ్డాయి.

ఇక 'మార్వెల్' ఫ్రాంచైజీలను ఒకే దర్శకుడు కాకుండా వేరు వేరు డైరెక్టర్లు తెరకెక్కించే విషయం తెలిసిందే. ఈ చిత్రాల విడుదల తేదీలు కూడా వాయిదా పడ్డాయి.

2031లో ఫైనల్ అవతార్

తొలుత 'అవతార్' మూడో భాగాన్ని 2024లో, నాలుగో భాగాన్ని 2025లో, ఐదో భాగాన్ని 2028లో విడుదలకు మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే వాయిదా వేశారు. ఈ విషయాన్ని వాల్ట్ డిస్నీ సంస్థ బుధవారం ప్రకటించింది. మూడో భాగాన్ని 2025 డిసెంబర్ 19న, నాలుగో భాగాన్ని 2029 డిసెంబర్ 21న, ఐదో భాగాన్ని.. అంటే ఫైనల్ 'అవతార్'ని 2031 డిసెంబర్ 19న విడుదల చేయనున్నట్లు తెలియజేసింది. ''ఒక్కో 'అవతార్' సినిమా ఒక్కో అద్భుతం. ఆ అద్భుతాన్ని ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టు ఇవ్వడానికి ఫిలిం మేకర్స్‌గా మేం తగినంత కృషి చేస్తున్నాం. నాణ్యత విషయంలో రాజీపడేది లేదు. 2025లో థియేటర్స్‌లో పండోరా ప్రపంచాన్ని చూపించడానికి యూనిట్ హార్డ్‌వర్క్ చేస్తోంది'' అని చిత్ర నిర్మాతల్లో ఒకరైన జాన్ లాండవ్ అన్నారు.



ఏడాదికి రెండు మార్వెల్ చిత్రాలు

వాల్ట్ డిస్నీ ఓ నిర్మాణ సంస్థగా వ్యవహరిస్తున్న మార్వెల్ చిత్రాలు చాలా ఫేమస్. ఇప్పటికి దాదాపు 30 చిత్రాలు రాగా, మార్వెల్ ఫ్రాంచైజీలో మరో 10 చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. కాగా... ఇప్పటికే విడుదల తేదీ ప్రకటించిన చిత్రాల కొత్త విడుదల తేదీలను నిర్మాణ సంస్థ ప్రకటించింది. మార్వెల్ ఫ్రాంచైజీలో వచ్చే ఏడాది మే 3న 'డెడ్ పూల్ 3' విడుదల కానుండగా అదే తేదీన విడుదలకు షెడ్యూల్ అయిన 'కెప్టెన్ అమెరికా: బ్రేవ్ న్యూ వరల్డ్' జూలై 24కి వాయిదా పడింది. కాగా, 'థండర్ బోల్ట్స్'ని జూలై 24న విడుదల చేయాలనుకున్నారు కానీ, డిసెంబర్ 20కి వాయిదా వేశారు. వచ్చే ఏడాది ఆరు నెలల గ్యాప్‌లో ఈ రెండు చిత్రాలు వస్తాయి. ఇక 2025లో కూడా రెండు మార్వెల్ చిత్రాలు రానున్నాయి. 'బ్లేడ్'ని 2025 ఫిబ్రవరి 14న, అదే ఏడాది మే 2న 'ఫెంటాస్టిక్ ఫోర్'ని, 'ఎవెంజర్స్: ది కాంగ్ డైనాస్టీ'ని 2026 మే 1న, 'ఎవెంజర్స్: సీక్రెట్ వార్స్'ని 2027 మే 7న విడుదల చేయనున్నారు.

లియోకి వాయిస్


● కమల్‌హాసన్

ఇళయ దళపతి విజయ్ అభిమానులకు లోక నాయకుడు కమల్‌హాసన్ ఓ స్వీట్ షాక్ ఇవ్వనున్నారని కోలీవుడ్ ఫిల్మ్ సర్కిల్ అంటోంది. వార్తల్లో ఉన్న ప్రకారం విజయ్ నటిస్తున్న 'లియో' చిత్రం టీజర్‌కి కమల్ వాయిస్ ఓవర్ ఇచ్చారట. ఈ నెల 22న విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఓ మంచి యాక్షన్ టీజర్‌ని రెడీ చేస్తున్నారట చిత్రదర్శకుడు లోకేష్ కనగరాజ్. విజయ్ పాత్ర పరిచయంతో ఈ టీజర్ సాగుతుందని, ఈ పరిచయం కమల్ మాటల్లో వినబడుతుందని భోగట్టా. కమల్ డబ్బింగ్ చెప్పేశారని, ఆ వాయిస్‌తో టీజర్ రెడీ చేసే పని మీద చిత్ర యూనిట్ ఉందని టాక్. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్ విలన్ పాత్ర చేస్తున్నారు. అక్టోబర్ 19న ఈ చిత్రం విడుదల కానుంది.

మనసు మాట వినదే...


● నాగార్జున, రోహిత్, అపర్ణ

రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ జంటగా డీవై చౌదరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లవ్ యూ రామ్'. డైరెక్టర్ కె. దశరథ్ ఈ చిత్రానికి కథ అందించడంతో పాటు ఓ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డీవై చౌదరి, కె. దశరథ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కె. వేద స్వరపరచిన ఈ చిత్రంలోని 'మనసు మాట వినదే..' అంటూ సాగే పాటని హీరో నాగార్జున విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు. వరికుప్పల యాదగిరి రాసిన ఈ పాటను దివ్య మాలిక పాడారు. ''హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన 'మనసు మాట..'ని చక్కని మెలోడీగా కంపోజ్ చేశారు వేద'' అని యూనిట్ పేర్కొంది.

నవ్వుల ఇంద్రజాలం

'శాసనసభ' ఫేమ్ ఇంద్రసేన హీరోగా 'ఇంద్రజాలం' సినిమా షురూ అయింది. జై క్రిష్ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. పూర్ణాస్ మీడియా సమర్పణలో నిఖిల్ కె. బాల స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి న్యాయమూర్తి ఆర్. మాధవరావు కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా ఇంద్రసేన మాట్లాడుతూ– ''శాసనసభ' నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ సినిమా చూసిన నిఖిల్‌గారు 'ఇంద్రజాలం'కి చాన్స్ ఇచ్చారు'' అన్నారు. ''క్రైమ్ థ్రిల్లర్‌తో కూడిన ప్రేమకథ ఇది. వినోదంతో పాటు ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా స్క్రీన్‌ప్లే ఉంటుంది'' అన్నారు దర్శక-నిర్మాత నిఖిల్ కె. బాల. చిత్ర సహ నిర్మాత పూర్ణ శైలజ, సంగీత దర్శకుడు ఎం.ఎం. కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: అమర్ కుమార్.


● జై క్రిష్, ఇంద్రసేన

సాక్షి బిజినెస్

గురువారం
15-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	85	63,229
నిఫ్టీ ▲	40	18,756

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.00 గంటలకు)

నాస్‌డాక్	13,592	▲	19
డోజోన్స్	34,052	▼	160
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,602	▲	8
డాక్స్	16,312	▲	90
షాంఘై	3,229	▼	5
నికాయ్	33,502	▲	484

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,264	▼	592
బంగారం (99.5 స్వచ్ఛత)	59,027	▼	589
వెండి (కిలో)	72,105	▼	1,064

ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు ప్రయాణం

వోల్వో నుంచి కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ | సీ40 రీచార్జ్ ఈవీ విడుదల | 27 నిముషాల్లో 80% చార్జింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న స్వీడన్ సంస్థ వోల్వో తాజాగా భారత మార్కెట్లో పూర్తి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ సీ40 రీచార్జ్ ఆవిష్కరించింది. ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. ట్విన్ మోటార్స్, 408 హెచ్‌పీ పవర్‌తో 78 కిలో వాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 4.8 సెకన్లలో చేరుకుంటుంది. 27 నిమిషాల్లో 80 శాతం చార్జింగ్ పూర్తి అవుతుంది. కారుకు కావాల్సిన విడిభాగాలను భారత్‌కు దిగుమతి చేసుకుని బెంగళూరు ప్లాంటులో అసెంబుల్ చేస్తారు. సెప్టెంబర్ నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయి. ఎలక్ట్రిక్ విభాగంలో భారత్‌లో సంస్థకు ఇది రెండవ మోడల్. ఇప్పటికే ఇక్కడి విపణిలో పూర్తి ఎలక్ట్రిక్ ఎక్స్‌సీ40 రీచార్జ్ కారును గతేడాది ప్రవేశపెట్టింది. అంతర్జాతీయంగా 2030 నాటికి పూర్తి ఎలక్ట్రిక్ కార్ కంపెనీగా అవతరించాలన్నది వోల్వో లక్ష్యం. భారత్‌లో 2025 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించింది.

ఈవీలదే కీలక పాత్ర..

వోల్వో 2022లో దేశవ్యాప్తంగా సుమారు 1,800 యూనిట్లను విక్రయించింది. ఇప్పటి వరకు కంపెనీ నుంచి గరిష్టంగా 2018లో 2,600 కార్లు రోడ్డెక్కాయి. ఏటా ఇక్కడి మార్కెట్లో ఒక ఎలక్ట్రిక్ కారును ప్రవేశపెట్టాలని సంస్థ నిర్ణయించింది. ఈ ఏడాది భారత్‌లో రికార్డు స్థాయిలో అమ్మకాలు సాధించే ప్రయత్నంలో ఎలక్ట్రిక్ కార్లు కీలక పాత్ర పోషిస్తాయని వోల్వో కార్ ఇండియా ఎండీ జ్యోతి మల్హోత్రా తెలిపారు. '2023 చాలా ఆశాజనకంగా ప్రారంభమైంది. గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే 2023లో మరింత మెరుగ్గా రాణిస్తామని నమ్ముతున్నాం. మహమ్మారి కారణంగా మార్కెట్ కొంచెం నెమ్మదిగా ఉంది. అలాగే సరఫరా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ సమస్య ఇప్పటికీ ఉంది. గరిష్ట స్థాయి అమ్మకాలను సాధించిన 2018 స్థాయికి ఈ ఏడాది చేరుకుంటాం. మొత్తం విక్రయాల్లో ఈవీల వాటా 27 శాతం ఉంది' అని వివరించారు. కంపెనీ భారత్‌లో ఎక్స్‌సీ90, ఎక్స్‌సీ60, ఎక్స్‌సీ40 ఎస్‌యూవీలు, ఎస్90 సెడాన్‌ను సైతం విక్రయిస్తోంది.

సీడీఎస్‌ఎల్‌లో బీఎస్‌ఈ వాటాల విక్రయం

రూ. 468 కోట్లకు 4.5% అమ్మకం



న్యూఢిల్లీ: సెంట్రల్ డిపాజిటరీస్ సర్వీసెస్ ఇండియా (సీడీఎస్‌ఎల్)లో స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్‌ఈ మరో 4.5 శాతం వాటాలను విక్రయించింది. ఈ డీల్ విలువ రూ. 468 కోట్లు. షేరు ఒక్కింటికి సగటున రూ. 985.98 రేటు చొప్పున ఓపెన్ మార్కెట్లో 47,44,000 షేర్లను బీఎస్‌ఈ విక్రయించింది. ఎలక్ట్రానిక్ విధానంలో షేర్ల లావాదేవీల నిర్వహణ తదితర సర్వీసులను సీడీఎస్‌ఎల్ అందిస్తోంది. దేశీయంగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన ఏకైక డిపాజిటరీగా కొనసాగుతోంది. సీడీఎస్‌ఎల్ 2017లో లిస్టయ్యింది. అప్పట్లో బీఎస్‌ఈకి కంపెనీలో 50.05 శాతం వాటాలు ఉండేవి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం డిపాజిటరీల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలకు 24 శాతానికి మించి వాటాలు ఉండకూడదు. దీంతో నిబంధనలకు అనుగుణంగా ఐపీవో కింద కొన్ని షేర్లను విక్రయించడం ద్వారా బీఎస్‌ఈ తన వాటాను తగ్గించుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) మార్గంలో 2.5 శాతం వాటాలను విక్రయించింది.

ఎన్‌ఎస్‌ఈలో సీడీఎస్‌ఎల్ షేరు బుధవారం 3% క్షీణించి రూ. 1,018 వద్ద క్లోజయ్యింది.

కంటి సమస్యలకు 'లీ' ఔషధం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చూపు మందగించడం, కంటికి వచ్చే అంటువ్యాధులకు పరిష్కారంగా ఫార్మా కంపెనీ లీ హెల్త్ డొమెయిన్ 'డీ–మాక్యులా' పేరుతో సహజ సిద్ధ ఔషధాన్ని అందుబాటులోకి తెచ్చింది. అశ్వగంధ, బోస్విల్లా శరాషియో, జీగ్జాంథిన్, త్రిఫల, బిటా కెరోటిన్, కుంకుమ పువ్వును దేశీయ ఆవు నెయ్యిలో మరిగించి సేకరించిన రసాయనంతో డీ–మాక్యులా సాఫ్ట్‌జెల్ క్యాప్సూల్ తయారైందని కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. కంటి మంట, పొడిబారడం, హానికర నీలి కాంతికి వ్యతిరేకంగా పోరాడడానికి, డయాబెటిక్ రెటినోపతి చికిత్సలో సహాయకారిగా ఉంటుందన్నారు. అమెజాన్, లీహెల్త్‌డొమెయిన్.కామ్ ద్వారా కూడా లభిస్తుంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-6-2023	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490-00
విజయవాడ	490-00
రిటైల్ ధర (డజను)	72.00
14-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

నష్టాల్లోంచి లాభాల్లోకి...

- తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ
- ఫెడ్ వడ్డీరేట్ల ప్రకటన ముందు అప్రమత్తత
- ద్వితీయార్ధం నుంచి కొనుగోళ్లు
- రాణించిన మెటల్, ఇంధన షేర్లు
- సూచీలు మూడో రోజూ ముందడుగే



ముంబై: మిడ్ సెషన్ నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఇంట్రాడే నష్టాల నుంచి కోలుకున్న సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. మెటల్, కమోడిటీ, ఇంధన షేర్లు రాణించడంతో పాటు టోకు ద్రవ్యోల్బణం ఏడున్నరేళ్ల కనిష్టానికి దిగిరావడం ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చాయి. ఉదయం సెన్సెక్స్ 28 పాయింట్ల నష్టంతో 63,115 వద్ద, నిఫ్టీ 28 లాభంతో 18,744 వద్ద మిశ్రమంగా మొదలయ్యాయి. తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం, అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల వెల్లడి(బుధవారం రాత్రి)కి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 260 పాయింట్లు పరిధిలో 63,014 వద్ద కనిష్టాన్ని, 63,274 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 85 పాయింట్లు బలపడి 63,229 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80 పాయింట్ల రేంజ్ కదలాడింది. రోజంతా 18,690 – 18,770 శ్రేణిలో ట్రేడైంది.ఆఖరికి 40 పాయింట్లు పెరిగి 18,756 వద్ద నిలిచింది. మెటల్, ఇంధన, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లు లాభపడ్డాయి. విస్తృత స్థాయి మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.42%, 0.20శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు బ్యాంక్స్, మీడియా, ఫైనాన్స్, ఐటీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,715 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.655 కోట్ల షేర్లను విక్రయించాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 82.10 వద్ద స్థిరపడింది. ఫెడ్ రిజర్వ్ ప్రకటన వెల్లడి ముందు ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లభాల్లో ట్రేడవుతున్నాయి. ''ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు కారణాలతో దేశీయ ఈక్విటీ మార్కెట్లో ఇప్పటికీ సానుకూలత సంకేతాలు నెలకొని ఉన్నాయి. ఈసీబీ, బ్యాంక్ ఆఫ్ జపాన్‌లు నేడు(గురువారం) పాలసీ విధాన వైఖరిని ప్రకటించనున్నాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను పెంచకుండా యథాతథ కొనసాగింపునకే మొగ్గుచూపితే సూచీలు ఆల్‌టైం హైని పరీక్షించవచ్చు'' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

టోకు ధరలు దిగివచ్చాయ్..!

- మేలో ఏడున్నర ఏళ్ల కనిష్టానికి డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం
- పెరుగుదల లేకపోగా 3.48% క్షీణత
- ఆహార, తయారీ, ఇంధన ధరల తగ్గుదల కారణం



ప్రతి ద్రవ్యోల్బణం... వరుసగా రెండో నెల

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మే నెల్లో పెరుగుదల లేకపోగా 3.48 శాతం (క్షీణత) తగ్గింది. గడచిన ఏడు సంవత్సరాల్లో (2015 నవంబర్‌లో మైనస్ 3.7 శాతం) ఈ స్థాయిలో టోకు ధరలు నమోదుకావడం ఇదే తొలిసారి. హైబేస్ ఎఫెక్ట్‌తోపాటు (గత ఏడాది మే నెల్లో భారీ టోకు ద్రవ్యోల్బణం నమోదుకావడం) సూచీలో మూడు ప్రధాన విభాగాలైన– ఆహార, తయారీ, ఇంధన ధరలు పూర్తిగా అదుపులోనికి వచ్చాయి. 2022లో మే నెలలో 16.63 శాతం టోకు ద్రవ్యోల్బణం (హై బేస్) నమోదుకావడం ఇక్కడ గమనార్హం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం మేనెల్లో 25 నెలల కనిష్టం 4.25 శాతంగా నమోదయిన సానుకూల ఫలితం నేపథ్యంలోనే టోకు ధరలకు సంబంధించి కూడా ఎకానమీకి ఊరటనిచ్చే తాజా ఫలితం వెలువడింది. వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ విడుదల చేసిన తాజా గణాంకాలను పరిశీలిస్తే...

- ఏప్రిల్‌లో ఫుడ్ ఆర్టికల్స్ ధరల 3.54 శాతం తగ్గితే (వార్షికంగా పోల్చి) తాజా సమీక్షా నెల్లో తగ్గుదల 1.51 శాతంగా ఉంది. కూరగాయల ధరలు 20.12 శాతం తగ్గాయి. ఆలూ ధరలు 18.71%, ఉల్లిధరలు 7.25% తగ్గాయి. అయితే పప్పు దినుసుల ధరలు మాత్రం 5.76 % ఎగశాయి. గోధుమలకు సంబంధించి ద్రవ్యోల్బణం కూడా 6.15%గా ఉంది.
- ఇంధనం, విద్యుత్ బాస్కెట్ ద్రవ్యోల్బణం మేలో 9.17 శాతం (మైనస్) తగ్గింది. ఏప్రిల్ నెలలో 0.93 శాతంగా ఉంది.
- తయారీ ఉత్పత్తుల ధరలు ఏప్రిల్‌లో మైనస్ 2.42 శాతంగా ఉంటే, మేలో మైనస్ 2.97 శాతంగా నమోదయ్యింది.


ద్రవ్యోల్బణం మైనస్ లోకి వెళ్లడాన్ని... సాంకేతికంగా ప్రతి ద్రవ్యోల్బణం అని పిలుస్తారు. ఈ ప్రాతిపదికన ప్రతి ద్రవ్యోల్బణం నమోదుకావడం వరుసగా ఇది రెండవనెల. ఏప్రిల్‌లో టోకు ద్రవ్యోల్బణం మైనస్ 1.51%గా నమోదయ్యింది. రానున్న నెలల్లో కూడా ఇదే ధోరణి కొనసాగితే, బ్యాంకులకు ఆర్‌బీఐ ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపో 2023లో యథాతథంగా కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు. 2022 మే తర్వాత 2.50% పెరుగుదలతో 6.5 శాతానికి చేరిన రెపో రేటును గత రెండు ద్వైమాసిక సమీక్షల సందర్భంగా ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపులోనికి రావడమే దీనికి కారణం.

భవిత

డీఆర్‌డీవో సైంటిస్ట్.. నెలకు లక్ష వేతనం

దేశ రక్షణకు సంబంధించిన కీలక పరిశోధనలు సాగించే.. డీఆర్‌డీఓలో అడుగుపెట్టే అద్భుత అవకాశం! బీటెక్, ఎమ్మెస్సీ అర్హతలతో.. గేట్ స్కోర్ ఆధారంగా.. ఈ ప్రతిష్టాత్మక సంస్థలో సైంటిస్ట్ పోస్టు సొంతం చేసుకోవచ్చు!! ఇటీవల డీఆర్‌డీఓ 181 సైంటిస్ట్-బి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందు కోసం.. డీఆర్‌డీఓకు చెందిన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్.. నియామక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. డీఆర్‌డీఓ సైంటిస్ట్-బి పోస్టుల వివరాలు, ఎంపిక విధానం, భవిష్యత్తు కెరీర్ తదితర అంశాలపై విశ్లేషణ..

» సైంటిస్ట్-బి హోదాలో 181 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» బీటెక్, సైన్స్ పీజీ, గేట్ స్కోర్‌తో దరఖాస్తుకు అర్హత


డీఆర్‌డీఓ జాబ్స్

మొత్తం పోస్టుల సంఖ్య: 181

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్.. డీఆర్‌డీఓ. ఈ సంస్థ.. మొత్తం 181 సైంటిస్ట్-బి పోస్టుల భర్తీకి నియామకాలు చేపడుతోంది. ఇందులో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్-49 పోస్టులు, మెకానికల్ ఇంజనీరింగ్-44, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-34,ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-5, మెటీరియల్ ఇంజనీరింగ్ /మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/మెటలర్జికల్ ఇంజనీరింగ్-10, ఫిజిక్స్-10, కెమిస్ట్రీ-5, కెమికల్ ఇంజనీరింగ్-13, ఏరోనాటికల్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్-7,మ్యాథమెటిక్స్-2, సివిల్ ఇంజనీరింగ్-2.

అర్హత

- సంబంధిత ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో ప్రథమ శ్రేణిలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు గేట్(గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్)లో సంబంధిత పేపర్‌లో స్కోర్ సాధించాలి.
- మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు సంబంధించి సంబంధిత సబ్జెక్ట్‌లో ప్రథమ శ్రేణిలో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆగస్ట్ 31 నాటికి సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది.
- **వయసు:** దరఖాస్తు చివరి తేదీ నాటికి.. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు ఉండాలి.

గేట్ స్కోర్

అభ్యర్థులు సంబంధిత బీటెక్, పీజీ కోర్సులు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు తాము దరఖాస్తు చేసుకునే విభాగానికి సంబంధించిన గేట్ సబ్జెక్ట్‌లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది. గేట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. ఆయా విభాగాలకు సంబంధించి.. గేట్ స్కోర్ ఆధారంగా.. ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున(1:10 నిష్పత్తిలో) పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు.

ఇంటర్వ్యూ ఇలా

ఇంటర్వ్యూలో అభ్యర్థులకు పరిశోధనల పట్ల ఉన్న ఆసక్తిని, రక్షణ రంగంలో పరిణామాలపై అవగాహనను పరిశీలిస్తారు. సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్తల బృందం ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. కాబట్టి అభ్యర్థులు దేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఇటీవల కాలంలో జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలపై పట్టు సాధించాలి.

వెయిటేజీ విధానం

సైంటిస్ట్-బి పోస్ట్‌లకు సంబంధించి నియామకాలను ఖరారు చేసే క్రమంలో.. వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. గేట్ స్కోర్‌కు 80 శాతం, ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు. అంతిమంగా ఈ రెండింటినీ క్రోడీకరించి తుది విజేతలను ప్రకటిస్తారు.

శిక్షణ

సైంటిస్ట్-బి హోదాలో నియామకం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ముందుగా.. అయిదు నెలలపాటు శిక్షణనిస్తారు. పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలో ఈ ట్రైనింగ్ ఉంటుంది. ఈ సమయంలో వీరిని ఆఫీసర్ ట్రైనీగా పిలుస్తారు. దీనినే ఇండక్షన్ ప్రోగ్రామ్‌గానూ వ్యవహరిస్తారు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. డీఆర్‌డీఓ సైంటిస్ట్-బిగా ఉజ్వల కెరీర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

రూ.లక్షకు పైగానే వేతనం

'సైంటిస్ట్-బి' హోదాతో..గ్రూప్-ఎ టెక్నికల్ స్థాయిలో ఉద్యోగంలో చేరిన అభ్యర్థులు..తమ పనితీరు, ప్రతిభ ఆధారంగా.. భవిష్యత్తులో డిఫెన్స్ ఆర్ అండ్ డీ సెక్రటరీ, చైర్మన్‌ల స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. వీరికి తొలుత సైంటిస్ట్-సిగా పదోన్నతి లభిస్తుంది. ఆ తర్వాత సైంటిస్ట్- డి, ఈ, ఎఫ్, జి స్థాయిలకు చేరుకోవచ్చు. అనంతరం సైంటిస్ట్-హెచ్ హోదాతో ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్‌గా ఉన్నత స్థాయి అందుకోవచ్చు. ఈ హోదాలో చూపిన ప్రతిభ ఆధారంగా డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్, ఆ తర్వాత డిఫెన్స్ ఆర్ అండ్ డీ సెక్రటరీ, చైర్మన్ స్థాయి వరకు ఎదగొచ్చు. సైంటిస్ట్-బి కొలువులో చేరిన వారికి ప్రారంభంలోనే రూ.56,100 -రూ.1,77, 500 వేతన శ్రేణిలో నెలకు రూ.లక్ష వేతనం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ అందుబాటులోకి రానుంది.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ అందుబాటులోకి వచ్చిన 21 రోజుల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rac.gov.in

సశస్త్ర సీమాబల్‌లో 1656 కొలువులు

కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సశస్త్ర సీమాబల్ 1656 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనుంది. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్షలో ప్రతిభ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులను దేశంలో ఎక్కడైనా లేదా దేశం వెలుపలా నియమించే అవకాశం ఉంది. ఆయా పోస్టులకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ వివరాలు..

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 1656
- **పోస్టుల వివరాలు:** సబ్-ఇన్‌స్పెక్టర్ పోస్టులు-111 , అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (పారామెడికల్)-30, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టెనోగ్రాఫర్)-40, హెడ్‌కానిస్టేబుల్ -914 , కానిస్టేబుల్ పోస్టులు-543 తోపాటు అసిస్టెంట్ కమాండెంట్(వెటర్నరీ) 18 పోస్టులు ఉన్నాయి.

సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు-అర్హతలు

- **సబ్ ఇన్‌స్పెక్టర్(పయనీర్):** సివిల్ ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. వయసు 30 ఏళ్ల లోపు ఉండాలి.
- **సబ్ ఇన్‌స్పెక్టర్(డ్రాఫ్ట్స్‌మెన్):** మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల ఐటీఐ నేషనల్ ట్రేడ్స్‌మెన్ సర్టిఫికెట్ ఉండాలి. ఆటోక్యాడ్‌లో ఏడాది సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయాలి లేదా ఆటో క్యాడ్‌లో ఏడాది అనుభవం ఉండాలి. డ్రాఫ్ట్స్‌మ్యాన్‌షిప్‌లో ఏడాది అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **సబ్ ఇన్‌స్పెక్టర్(కమ్యూనికేషన్):**ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేయాలి. గరిష్ఠ వయసు 30ఏళ్లు.
- **సబ్ ఇన్‌స్పెక్టర్(స్టాఫ్‌నర్స్) ఫిమేల్:** సైన్స్ సబ్జెక్టుతో 10+2/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. జనరల్ నర్సింగ్‌లో మూడేళ్ల డిప్లొమా పూర్తి చేయాలి. సెంట్రల్/స్టేట్ కౌన్సిల్‌లో తప్పనిసరిగా రిజిస్టరై ఉండాలి. రెండేళ్ల అనుభవం తప్పనిసరి. వయసు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వయసు:** ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు 3 ఏళ్లు, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు 5 నుంచి 10 ఏళ్ల మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం

ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్ఈ), రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సబ్-ఇన్‌స్పెక్టర్(కమ్యూనికేషన్) పోస్టుకు మాత్రమే పీఈటీ నిర్వహిస్తారు. 1.6 కిలో మీటర్ల పరుగును పురుష అభ్యర్థులు 6 నిమిషాల 30 సెకన్లలో ముగించాలి. మహిళా అభ్యర్థులు 800 మీటర్ల రేసును 4 నిమిషాల్లో ముగించాలి. ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పీఈటీ లేదు. వీరు పీఎస్‌టీ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌లకు హాజరుకావాలి.

రాత పరీక్ష ఇలా

పీఈటీ, పీఎస్‌టీ టెస్టులో అర్హత సాధించిన అభ్యర్థులను రాత పరీక్ష(కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు ఎంపిక చేస్తారు. దీన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. రాత పరీక్ష రెండు పార్ట్‌లుగా 150 ప్రశ్నలకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **పార్ట్-1:** ఈ పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్, మ్యాథమేటిక్స్, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్ /జనరల్ హిందీ 50 మార్కులకు ఉంటాయి.
- **పార్ట్-2:** ఈ పార్ట్‌లో టెక్నికల్ సబ్జెక్టుకు 100 మార్కులుంటాయి.

రాత పరీక్షకు సంబంధించి జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులు 50 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 45 శాతం మార్కులు పొందాలి. రాత పరీక్షలో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణలోకి తీసుకుంటారు.

తుది ఎంపిక

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్టులను నిర్వహిస్తారు. పోస్టుల సంఖ్యకు మూడు రెట్ల మంది అభ్యర్థులను డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌కు పిలుస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగానే తుది ఎంపిక చేస్తారు.

ప్రిపరేషన్ ఇలా

తొలుత పరీక్ష విధానంపై అవగాహన పెంచుకోవాలి. దానికి అనుగుణంగా టైమ్ టేబుల్ ప్రిపేర్ చేసుకోవాలి. టెక్నికల్ సబ్జెక్టుకు 100 మార్కులు కేటాయించారు. కాబట్టి అభ్యర్థులు తాము ఐటీఐలో చదివిన టెక్నికల్ అంశాలపై పట్టు సాధించాలి. ప్రశ్నల సరళిని తెలుసుకునేందుకు గత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. అలాగే వీలైనన్నీ ఎక్కువ మాక్‌టెస్టులను రాయాలి. తద్వారా వేగం, టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది.

హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు

- **అర్హతలు:** పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.


పోలీస్ జాబ్స్

- **వయసు:** హెచ్‌సీ(మెకానిక్) పోస్టుకు 21-27 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు 3 ఏళ్లు, డిపార్ట్‌మెంట్ అభ్యర్థులకు 40 నుంచి 45 ఏళ్ల వరకూ మినహాయింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

పోలీస్ కానిస్టేబుల్

- **అర్హతలు:** డ్రైవర్ పోస్టుకు పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వయసు 21-27 ఏళ్ల మధ్య ఉండాలి. వెటర్నరీ పోస్టుకు సైన్స్ ప్రధాన సబ్జెక్టుగా పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వెటర్నరీ హాస్పిటల్‌లో ఏడాది పనిచేసిన అనుభవం ఉండాలి. వయసు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, పెయింటర్ పోస్టులకు పదోతరగతి/తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి. లేదా ఏడాది వ్యవధి ఉన్న ఐటీఐ సర్టిఫికేట్ కోర్సు పూర్తి చేయాలి. లేదా రెండేళ్ల ఐటీఐ డిప్లొమా ఉండాలి. ట్రేడ్ టెస్టులో తప్పనిసరిగా అర్హత సాధించాలి. వాషర్‌మ్యాన్, బార్బర్, సఫాయివాలా, టైలర్, గార్డెనర్, కోబ్లర్, కుక్ అండ్ వాటర్ కేరియర్ పోస్టులకు టెన్త్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. రెండేళ్ల పని అనుభవం/ఐటీఐ ఏడాది సర్టిఫికేట్ కోర్సు చేసి ఉండాలి. లేదా రెండేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. ట్రేడ్ టెస్టులో తప్పనిసరిగా అర్హత సాధించాలి. మల్టీస్కిల్డ్ వ్యక్తులకు ప్రాధాన్యమిస్తారు.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

పీఈటీలో అర్హత సాధించిన అభ్యర్థులను పీఎస్‌టీకి ఎంపిక చేస్తారు. ఇందులోనూ అర్హత పొందిన వారికి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సీఈటీ) నిర్వహిస్తారు. వ్యవధి రెండు గంటలు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, మ్యాథమెటిక్స్, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్ /జనరల్ హిందీ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 18.06.2023
- **వెబ్‌సైట్:** http://ssbrectt.gov.in

● అద్దె గదిలో పాఠశాల..



మొండిగోడలతో దర్శనమిస్తున్న పాఠశాల. (ఇన్‌సెట్) అద్దె ఇంట్లో ఏర్పాటు చేసిన పాఠశాల

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని గండికామారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అద్దె ఇంట్లో నడుస్తోంది. పదేళ్ల కిందట పాఠశాల భవన నిర్మాణం ప్రారంభించినా.. కాంట్రాక్టర్ వెనక్కి తగ్గడంతో పనులు ఆగిపోయాయి. పాఠశాల 'మన ఊరు–మన బడి'కి కూడా ఎంపిక కాలేదు. నామమాత్రంగా ఉన్న తరగతి గదులపై కప్పులు కూడా నిరుడు కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమయ్యాయి. దీంతో గత విద్యా సంవత్సరం నుంచి ఓ అద్దె ఇంట్లో పాఠాలను బోధిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనా పాఠశాలనెవరూ పట్టించుకోలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించిన వెంటనే మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– భూపాలపల్లి అర్బన్

● పెన్‌గంగలో హైటెక్ ఇసుక దోపిడీ!



ఆదిలాబాద్ జిల్లా పెన్‌గంగ నదిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డీజిల్ బోట్ల ద్వారా నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తోడేస్తున్నారు. పైపుల ద్వారా ఒడ్డుకు చేర్చిన ఇసుకను పొక్లెయిన్ల సాయంతో వాహనాల్లోకి ఎక్కించి తరలిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో జైనథ్ మండలం డొల్లార వద్ద నదిలో కనిపించిన దృశ్యమిది. 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న వంతెనను ఆనుకునే బహిరంగంగా ఇసుక తవ్వకాలు సాగుతున్నా సంబంధిత శాఖల అధికారులకు కనిపించకపోవడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఒక ధరణి.. 46 సమస్యలు!

పోర్టల్ తెచ్చి ఐదేళ్లవుతున్నా పూర్తిస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు

ప్రజావాణిలో భూసంబంధిత అర్జీలే ఎక్కువగా వస్తున్న వైనం

పాత రికార్డులు అప్‌లోడ్ చేసే ముందు జాగ్రత్త పడలేదన్న విమర్శలు

తప్పులు సవరించేందుకు లేని అవకాశం

మొత్తం 46 రకాల తప్పులు గుర్తించిన భూ పరిపాలన నిపుణులు

కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతూనే ఉన్న రైతులు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

భూ హక్కుల చరిత్రలో తెలంగాణది ఓ ప్రత్యేక స్థానం. సాయుధ రైతాంగ పోరాటం నాలుగువేల గ్రామాల్లో కౌలుదార్లను పట్టాదారులుగా మారిస్తే.. భూమి కోసం రక్తతర్పణం వద్దు.. ఇదిగో.. తీసుకోండి భూమి అంటూ ఉదారంగా భూదానం చేసిన చరిత్రా తెలంగాణదే. ఇప్పటివరకు దేశంలో నిరుపేదలకు పంచిన మొత్తం భూమిలో 14 శాతం రాష్ట్రంలోనే పంపిణీ జరిగింది. అయినా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 56 శాతానికి పైగా కుటుంబాలకు భూమి లేదు. ఇక భూమి ఉన్న వారికి గుంటకో సమస్య అన్నట్లు పరిస్థితి ఉంది. డెబ్బై ఏళ్ల క్రితం నాటి సర్వే లెక్కల కారణంగా ఏర్పడ్డ చిక్కుముడులను ధరణి పోర్టల్ ఇంకా పూర్తి స్థాయిలో విప్పలేకపోతోంది. అవినీతికి అవకాశం లేని రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల భూ పరిపాలన లక్ష్యంగానే సర్కార్ ధరణిని తీసుకువచ్చి ఐదేళ్లవుతున్నా..ఇంకా అడుగులు తడబడుతూనే ఉన్నాయి. సమస్యలకు పరిష్కారం చూపటంలో యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లలో జరిగే ప్రజావాణికి వస్తున్న అర్జీల్లో అత్యధికం భూ సంబంధమైనవే ఉంటున్నాయి. ఉదాహరణకు సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొత్త కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 122 అర్జీలువస్తే, అందులో 109 దరఖాస్తులు భూ సంబంధమైన సమస్యలే కావటం ధరణి కష్టాలకు అద్దం పడుతోంది.

తెలంగాణలో డెబ్బై ఏళ్లుగా సమగ్ర భూ సర్వే జరగలేదు. ఫలితంగా భూ హద్దులు మారి ఒకరి భూముల్లో మరొకరు చేరిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. రికార్డుల్లో భూమి ఉన్నా, అనుభవంలో లేని అంశాలు ధరణి ఉనికిని ప్రశ్నిస్తున్నాయి. వాస్తవానికి ధరణి సైట్‌లో పాత రికార్డులు అప్‌లోడ్ చేసే ముందే విస్తృత ప్రచారంతో గ్రామసభలు నిర్వహించి, అందరి ఆమోదంతో రికార్డులు సరిచేయాల్సి ఉన్నా..పట్టించుకోకుండా ధరణిని ఆరంభించడం కష్టాలను తెచ్చిందనే విమర్శలున్నాయి.


పాత సర్వే, రికార్డులతోనే అవస్థలు

ధరణిలో దొర్లిన తప్పులను సవరించేందుకు అనువైన ఆప్షన్లు లేకపోవటంతో ఏండ్ల తరబడి రైతులు కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్లకు ధరణి నిర్వహణపై పూర్తి స్థాయి సాంకేతిక అవగాహన లేక ఆపరేటర్లకు పాస్‌వర్డ్‌లు ఇస్తున్న తీరు పలు జిల్లాల్లో అక్రమాలకు తెరలేపుతోంది. కొన్నిచోట్ల ఉన్నత స్థాయి యంత్రాంగం ఒత్తిడితో, మరికొన్ని చోట్ల లాలూచీతో నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఇతర పేర్లపైకి బదిలీ చేయటం, కొన్నిచోట్ల పట్టాదారు బతికుండగానే చనిపోయినట్లు చూపి భూ బదిలీలు చేయడం లాంటివి చోటు చేసుకున్నాయి.



ఇవీ ధరణి లోపాలు..

పలువురు న్యాయ, భూ పరిపాలన నిపుణులు గ్రామాల్లోకి వెళ్లిన సందర్భంలో ధరణికి సంబంధించి 46 లోపాలను గుర్తించారు. అందులో పాత పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్నా, కొత్త పుస్తకం ఇవ్వలేదు, ఆర్‌వోసీ ఉన్నా పాస్‌పుస్తకం కాలేదు, వ్యవసాయ భూమి నాలా (వ్యవసాయేతర భూమి)గా నమోదై ఉండటం, ఒక సర్వే నంబర్‌లో కొంత భూమి నిషేధిత జాబితాలో ఉంటే మొత్తం భూమిని బ్లాక్ చేయడం, ప్రభుత్వ భూ సేకరణలో పోయిన భూమి కంటే ఎక్కువ భూమిని రికార్డుల నుండి తొలగించటం, వ్యవసాయ భూమిని ఇంటి స్థలంగా నమోదు చేయటం, వాస్తవంగా ఉన్నభూమి కంటే తక్కువ భూమిని నమోదు చేయటం, పట్టాదారు పేర్లు తప్పుగా ఉండటం, భూమి స్వభావం, వర్గీకరణ తప్పుగా నమోదు కావడం లాంటి అంశాలను గమనించారు. భూమి సంక్రమించిన విధానం తప్పుగా ఉంటం, ధరణి కంటే ముందు అమ్మిన వారి పేర్లే పోర్టల్‌లో ఉండటం, పట్టాదారు చనిపోతే మిగిలిన వారసులకు తెలియకుండా ఒక్క వారసుని పేరుతో భూ బదిలీ చేయటం, భూ యజమానికి తెలియకుండానే భూ మార్పిడి చేయటం, గ్రామాల్లో చాలా సర్వే నంబర్లు అప్‌లోడ్ కాకపోవటం, తప్పుల సవరణ కోసం ఎలాంటి కాల పరిమితి లేకపోవటం వంటి అంశాలను కూడా గుర్తించారు.



30 ఏళ్ల క్రితం అమ్మిన వారి పేరుతో పాస్‌బుక్

ఇతని పేరు పోతుగంటి గంగాధర్. నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లి మండలం రాజరాజేశ్వరనగర్‌కు చెందిన నాతో పాటు నా తల్లి రాజుబాయి, మామ కొత్తపల్లి రాజేందర్ పేరు మీద సర్వే నంబర్ 654, 656లలో 3.5 ఎకరాలు ఉంది. 30 ఏళ్ళ క్రితం ఈ భూమి కొని సాగు చేస్తున్నాం. అయినా ధరణి పాస్‌బుక్ 30 ఏళ్ల క్రితం అమ్మిన వారి పేరుతో వచ్చింది. మా భూమిపై వాళ్ళు బ్యాంక్ రుణం తీసుకున్నారు. మూడేళ్లుగా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్నా. ఇప్పటివరకు న్యాయం జరగలేదు.



-పోతుగంటి గంగాధర్, నిజామాబాద్ జిల్లా

రికార్డుల్లో మాయం చేశారు..

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మల్యాలకు చెందిన పోతిరెడ్డి రాజుకు 428 సర్వేనంబర్‌లో 4.22 ఎకరాల భూమి ఉన్నా.ధరణిలో నమోదు కాలేదు. 'మా భూమి మేమే సాగు చేస్తున్నా రికార్డుల్లో మాయం చేశారు. మా చుట్టుపక్కల వారందరికీ ధరణి పాస్‌బుక్స్ వచ్చాయి. మూడేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా మా సమస్య పరిష్కారం కాలేదు..' అని రాజు వాపోతున్నాడు.



మూడేళ్లుగా తిరుగుతున్నా..

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పిచ్చుగుంట్ల నర్సింలు. సంగారెడ్డి జిల్లా లక్డారం గ్రామం. మరణించిన తన తల్లి పేరుతో ఉన్న ఒక ఎకరం 32 గుంటల భూమి (సర్వే నంబర్ 738/200/1)ని ధరణిలోకి ఎక్కించాలని మూడేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి, ఆర్డీఓ కార్యాలయానికి, కలెక్టరేట్‌కు ఇప్పటివరకు ముప్పై సార్లు తిరిగానని నర్సింలు చెప్పాడు.



సంబంధం లేని మహిళ పేరుతో భూమి

ధరణి రాకముందు మా తండ్రి రాయపరెడ్డి పేర మూడెకరాల భూమి ఉండేది. ఆ భూమిలో మా ముగ్గురు అన్నదమ్ములం కలిసి సాగు చేస్తున్నాం. ధరణి వచ్చాక పాస్ బుక్కులు చూస్తే సాగులో మా ప్రాంతంలోనే లేని వేరే మహిళా రైతు పేర ఒక ఎకరం 32 గుంటలు నమోదైంది. మరో ఎకరం 8 గుంటలు తొలగింపు లిస్టులో ఉంది. వారసత్వంగా మాకు దక్కాల్సిన మూడు ఎకరాల భూమి కోసం రెండేళ్లుగా తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం దొరకటం లేదు.



- తుమ్మ రాజారెడ్డి, జనగామ జిల్లా

సరిచేస్తే సూపర్ హిట్టే..

భూమి రికార్డుల కంప్యూటరీకరణ, ఆపై ఆన్‌లైన్ లావాదేవీలు, రికార్డులు ట్యాంపర్ చేయడానికి అవకాశం లేకుండా ధరణి తీసుకురావటం మంచిదే. అయితే ధరణి అమలు కంటే ముందు తీసుకోవాల్సిన పలు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అన్నీ సరిచేస్తే ధరణి సూపర్‌హిట్ అవుతుంది.

- ఎం.చంపాలాల్, రిటైర్డ్ ఐఏఎస్





సమగ్ర సర్వేతోనే శాశ్వత పరిష్కారం

భూ చిక్కులు లేని తెలంగాణ కావాలంటే సమగ్ర సర్వే చేయాల్సిందే. ఇప్పటికే ఏపీ, రాజస్తాన్‌లు టైటిల్ గ్యారంటీ చట్టాన్ని రూపొందించాయి. తెలంగాణలో ఇంకా ఆ పరిస్థితి రాలేదు. వీలైనంత త్వరగా భూ సర్వే, రికార్డుల సవరణ చేయాలి. ఏభూమి రికార్డు ఆ ఊరిలో బహిరంగపర్చాలి.

- భూమి సునీల్, భూచట్టాల నిపుణుడు

సైబర్ 'రీల్' పెట్టు.. బహుమతి పట్టు!

సైబర్ అవగాహనపై రీల్స్(వీడియోలు)పోటీకి ఎంట్రీలు ● కేంద్ర హోంశాఖ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: స్మార్ట్ ఫోన్లలో ఇంటర్నెట్ వినియోగంతోపాటు సైబర్ నేరాలు అనూహ్యంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల దోపిడీ లెక్కలు చూస్తే ..రోజుల్లోనే రూ.కోట్లు కొల్లగొడుతున్న పరిస్థితి ఉంది. సైబర్ మోసాలకు గురవడానికి ప్రధాన కారణాల్లో అవగాహన లేమి ప్రధాన కారణం. ప్రజల్లో సైబర్ మోసాలపై అవగాహన పెంచేందుకు, మోసపోతే బాధితులు పోలీసులను ఎలా సంప్రదించి న్యాయం పొందాలన్న అంశాలపై విరివిగా అవగాహన కలిగించేందుకు కేంద్ర హోంశాఖ ఓ వినూత్న పోటీకి ఆహ్వానం పలుకుతోంది. టెక్నాలజీపై అవగాహన, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత ఉన్న యువతను సైబర్ అవగాహనపై రీల్స్ (వీడియోలు) చేయాలని ఆహ్వానిస్తోంది. ఉత్తమ రీల్స్ చేసిన వారికి రూ.20వేల బహుమతి సైతం ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రీల్స్ చేసే వారు రిజిస్టర్ చేసేందుకు mygov.in/task/-cyberreelలో రిజిస్టర్ చేసుకోవాలని ఆ శాఖ అధికారులు సూచించారు. జూన్ 30 వరకు ఈ రీల్స్‌ను పంపేందుకు సమయం ఉన్నట్టు తెలిపారు.

ఇవీ రీల్స్ చేయాల్సిన అంశాలు..

- హెల్ప్‌లైన్ నంబర్ 1930
- ఎన్‌సీఆర్‌పీ– www.cybercrime. gov.in
- కంట్రిబ్యూషన్ ఆఫ్ ఎ సైబర్ వలంటీర్
- స్టే సేఫ్ వైల్‌షాపింగ్ ఆన్‌లైన్
- సోషల్ మీడియా ప్రైవసీ

50 మంది ఖైదీల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు

- జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ జితేందర్
- చంచల్‌గూడ జైలులో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న 50 మంది ఖైదీల పిల్లలకు జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జితేందర్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ఖైదీలకు వడ్డీలేని రుణాలను అందించారు. బుధవారం చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు క్రీడలు, పాటల పోటీలు నిర్వహించి అందులో గెలిచిన వారికి జితేందర్ బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖైదీల సంక్షేమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో మెరిట్ సాధించిన ఖైదీల పిల్లల్లో టెన్త్ విద్యార్థులకు రూ. 3 వేల చొప్పున, ఇంటర్ ఆపైన చదువుతున్న వారికి రూ.15వేలు అందిస్తున్నామన్నారు. అలాగే ఖైదీలకు రూ. 25వేల నుంచి రూ. 50వేల వరకు వడ్డీ రహిత రుణాలు అందజేస్తున్నామని వెల్లడించారు. మహిళా ఖైదీల పిల్లలకు న్యూట్రిషన్ కిట్లు ఇస్తున్నామన్నారు. జైళ్ల శాఖ ఐజీ వై.రాజేశ్, డీఐజీలు మురళీబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

76 మంది గిరిజన గురుకులాల విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ నుంచి 76 మందికి ఎంబీబీఎస్‌లో సీట్లు దక్కే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. సొసైటీ నుంచి నీట్ పరీక్ష రాసిన అభ్యర్థుల ఫలితాలను పరిశీలించిన అధికారులు.. ర్యాంకుల ఆధారంగా సీట్లు వచ్చే తీరును అంచనా వేశారు. ఇందులో 76 మందికి సీట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 64 మంది లాంగ్‌టర్మ్ విభాగానికి చెందిన వారు కాగా, మిగతా 12 మంది రెగ్యులర్ బ్యాచ్ విద్యార్థులు. యూజీ నీట్–2023 కౌన్సెలింగ్ తరువాత కేటాయింపులను బట్టి మరింత ఎక్కువ మందికి సీట్లు వచ్చే అవకాశం ఉంటుందని సొసైటీ అధికారులు భావిస్తున్నారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

సాక్షి, హైదరాబాద్: నేడు (15న) టీఎస్ లాసెట్, పీజీ లాసెట్–2023 ఫలితాలు విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో చైర్మన్ ప్రొ.లింబాద్రి, ఇతర అధికారులు ఫలితాలను విడుదల చేస్తారు. ఫలితాలను https:// lawcet. tsche. ac. in, www. sakshieducation. com వెబ్‌సైట్స్‌లో చూడొచ్చు.

5 కట్టడాలకు గ్రీన్ యాపిల్ పురస్కారాలు

- లండన్‌లోని ది గ్రీన్ ఆర్గనైజేషన్ ప్రకటన
- 16న పురస్కారాల ప్రదానం
- హర్షం వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్
- రాష్ట్రంతో పాటు దేశానికి గర్వకారణమని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఐదు కట్టడాలకు ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డులు లభించాయి. నూతన సచివాలయం, యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, మొజంజాహీ మార్కెట్‌లకు లండన్‌లోని 'ది గ్రీన్ ఆర్గనైజేషన్'ఈ పురస్కారాలను ప్రకటించింది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని కట్టడాలకు గ్రీన్ యాపిల్ అవార్డులు లభించడంపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డులతో దేశంతో పాటు రాష్ట్ర ఖ్యాతి పెరిగిందన్నారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా రాజీపడకుండా ప్రపంచస్థాయి ప్రమాణాలతో పర్యావరణ నియమాలకు అనుగుణంగా కొత్త కట్టడాల నిర్మాణం, పునరుద్ధరణ చేపట్టామన్నారు. ఇందుకు కృషి చేసిన ఆయా శాఖల మంత్రులను, ఉన్నతాధికారులను, సిబ్బందిని సీఎం అభినందించారు. లండన్‌లో ఈ నెల 16న పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ ఈ పురస్కారాలను అందుకోనున్నారు. యాదాద్రి దేవాలయానికి గ్రీన్ యాపిల్ అవార్డు రావడంపై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కబాలి నిర్మాత కేపీ చౌదరి అరెస్టు

డ్రగ్స్ విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు

- 82.75 గ్రాముల కొకైన్, బెంజ్‌కారు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం
- సెల్‌ఫోన్లలో సినీ ప్రముఖుల ఫొటోలు, పార్టీల వీడియోలు





ఎడ్విన్ నూన్‌తో కేపీ చౌదరి. చౌదరి కారునుంచి స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలు

సాక్షి, హైదరాబాద్: రజినీకాంత్ హీరోగా తెరకెక్కిన కబాలీ తెలుగు సినిమా నిర్మాత సుంకర కృష్ణప్రసాద్ చౌదరి (కేపీ చౌదరి)ని మాదక ద్రవ్యాల విక్రయం కేసులో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. గోవా నుంచి హైదరాబాద్‌కు కొకైన్‌ను తీసుకొచ్చి మంగళవారం కిస్మత్‌పూర్ క్రాస్‌రోడ్డు వద్ద విక్రయిస్తున్న క్రమంలో.. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు మాదాపూర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ), రాజేంద్రనగర్ పోలీసులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చౌదరి నుంచి రూ.2.05 లక్షల నగదుతో పాటు 82.75 గ్రాముల కొకైన్, బెంజ్ కారు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం ..

గోవాలో సెలబ్రిటీలతో డ్రగ్స్ పార్టీలు..

సినీ పరిశ్రమలో పెద్దలతో ఏర్పడిన సత్సంబంధాలు ఆసరాగా చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కేపీ చౌదరి నిర్ణయించుకున్నాడు. 2021లో గోవాలో ఓహెచ్‌ఎం పేరుతో క్లబ్‌ను ప్రారంభించాడు. తర్వాత గోవాలో డ్రగ్స్ దందాలో కింగ్‌పిన్ అయిన నైజీరియాకు చెందిన ఎడ్విన్ న్యూన్, పెటిట్ ఎబుజెర్ అలియాస్ గాబ్రియెల్ అనే వారితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి గోవాకు సెలబ్రిటీలను, ప్రముఖులను తీసుకెళ్లి డ్రగ్స్ పార్టీలు నిర్వహించడం మొదలుపెట్టాడు. అయితే గోవా ప్రభుత్వం గతేడాది అక్రమ నిర్మాణం పేరిట ఓహెచ్‌ఎం క్లబ్‌ను కూల్చివేసింది. దీంతో చౌదరి మళ్లీ ఆర్థికంగా కుంగిపోయాడు.

బెంజ్ కారులో తిరుగుతూ కొకైన్ సరఫరా..

ఈ ఏడాది ఏప్రిల్‌లో గోవా నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. కిస్మత్‌పూర్‌లోని అద్వైత విల్లాస్‌లో అద్దెకు దిగాడు. డ్రగ్స్ పెడ్లర్లతో ఉన్న పరిచయాలతో బెంజ్ కారు (డీఎల్2సీఏటీ4503)లో గోవాకు వెళ్లి డ్రగ్స్ కొనుగోలు చేసి నగరంలోని సెలబ్రిటీ కస్టమర్లకు సరఫరా చేయడం మొదలుపెట్టాడు. ఇదే క్రమంలో నగరంలోని రాయదుర్గంలో పీఎస్‌లో నమోదైన మాదక ద్రవ్యాల కేసులో పరారీలో ఉన్న, ప్రస్తుతం గోవాలో ఉంటున్న గాబ్రియెల్ నుంచి 100 ప్యాకెట్ల (82.75 గ్రాములు) కొకైన్‌ను కొనుగోలు చేశాడు. ఇందులో 10 ప్యాకెట్లు కేపీ చౌదరి స్వయంగా వినియోగించాడు. మిగిలిన వాటిని స్థానిక కస్టమర్లకు విక్రయించేందుకు కిస్మత్‌పూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోకిరాగా ముందుగా అందిన సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. రాజేంద్రనగర్ కోర్టులో అతన్ని హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో కేపీ చౌదరిని చర్లపల్లి జైలుకు తరలించారు.

సెలబ్రిటీలకు నోటీసులు!

కేపీ చౌదరి సెల్‌ఫోన్ల నుంచి కాల్ రికార్డులు, ఫొటోలు, వీడియోలు పోలీసులు సేకరించారు. డ్రగ్స్ కింగ్‌పిన్ ఎడ్విన్ న్యూన్స్‌తో పాటు పలువురు తెలుగు సినీ పరిశ్రమకు చెందిన సినీ ప్రముఖుల ఫొటోలు, పార్టీ వీడియోలు వాటిల్లో ఉన్నట్లు గుర్తించారు. మరింత సమాచారం కోసం కేపీ చౌదరిని మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించాలని నిర్ణయించామని శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు న్యాయస్థానంలో పిటిషన్‌ను దాఖలు చేశారు. కేపీ చౌదరి కస్టడీ అనంతరం, అతన్నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసిన సెలబ్రిటీలకు సైతం నోటీసులు జారీ చేసి విచారించనున్నారు.

ఇంజనీరింగ్ చదివి.. సినీ పరిశ్రమకొచ్చి..

కేపీ చౌదరి స్వస్థలం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయన్నపేట. బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తయ్యాక పుణేలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డైరెక్టర్ (ఆపరేషన్స్)గా ఉద్యోగంలో చేరాడు. సినిమాలపై ఆసక్తితో 2016లో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. పుణేలో ఉన్నప్పుడు తమిళ సినీ దర్శకుడు, నిర్మాత కలైపులి ఎస్ థానుతో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కబాలీ తెలుగు సినిమాకు నిర్మాతగా వ్యవహరించాడు. ఆ తర్వాత సర్దార్ గబ్బర్‌సింగ్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, కనితన్ (తెలుగులో అర్జున్ సురవరం) వంటి చిత్రాలకు డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించాడు. అయినా నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా పెద్దగా సక్సెస్ కాకపోవడంతో నష్టాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

డీఈసెట్ ఫలితాల విడుదల

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ప్రీ–స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఈ), డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీఎస్ డీఈసెట్ ఫలితాలను విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. ఈ పరీక్షకు మొత్తం 6485 మంది దరఖాస్తు చేసుకోగా, 5150 మంది హాజరయ్యారు. వారిలో 3975 మంది పాసయినట్టు డీఈసెట్ విభాగం తెలిపింది. ఫలితాల కోసం http:// deecet. cdse. telangana. gov. in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వాలని సూచించింది.

అంధులు, బధిరుల పాఠశాలల్లో పోస్టుల భర్తీ

సాక్షి, హైదరాబాద్: అంధులు, బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో ఎస్‌జీటీ, టీజీటీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు బి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చని, మరిన్ని వివరాలకు www. wdsc.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

టీ హబ్‌లో సాంకేతిక, అభివృద్ధి కేంద్రం

టీ హబ్, ఆర్‌ఎన్‌టీబీసీఐ మధ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఆవిష్కరణల వాతావరణానికి దిక్సూచిగా ఉన్న టీ హబ్‌తో రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ ఇండియా(ఆర్‌ఎన్‌టీబీసీఐ) బుధవారం వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా అంతర్జాతీయ సాంకేతిక, అభివృద్ధి కేంద్రం టీ హబ్‌లో ఏర్పాటవుతుంది. ఈ భాగస్వామ్యం ద్వారా దిగ్గజ సంస్థలకు చెందిన నిపుణులతో స్టార్టప్‌లను అనుసంధానం చేయడం లక్ష్యంగా 'కార్పొరేట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్'ను నిర్వహిస్తారు. ప్రస్తుత ఆవిష్కరణల వాతావరణంలో భారతీయ సాంకేతిక స్టార్టప్‌ల సృజనాత్మక నైపుణ్యాన్ని వెలికి తీసి, వాటి ఫలితాలను ఉపయోగించుకునేందుకు టీ హబ్, ఆర్‌ఎన్‌టీబీసీఐ భాగస్వామ్యం దోహదం చేస్తుంది. స్టార్టప్‌లు తమ ఉత్పత్తుల నాణ్యతను పెంచుకోవడంతోపాటు వినియోగదారులు, పెట్టుబడిదారులను ఆకట్టుకునేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుంది. గురువారం టీ హబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో టీ హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు, ఆర్‌ఎన్‌టీబీసీఐ ఎండీ దేబాషిష్ నేగి, టీ హబ్ సీఐఓ సుజిత్ జాగిర్దార్ పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.